భారతి

మాస పత్రిక

*

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

*

సెప్టెంబరు 1977

సంపుటము : 54 సంచిక : 9

విడిపత్రిక వెల రూపాయి న్నర

విదేశాలకు వెళ్తానంటోన్న కొత్తడిజైన్

టక్ టక్ టక్ టక్ టక్ టక్‌ల ... ...

పడుగూ, పేకా అదిరిపడుతూ, కదురు అటూయిటూ మళ్లుతూ-దారు తన నెంబరు మరచి కొత్త డిజైన్‌గా సుళ్లు తిరుగుతూ విదేశాలకు వెళ్తానంటోంది.

ఈ ఒక్కటీ పూర్తయితే చెలమయ్య సరుకు మూటగట్టి సహకారా సంఘం ఆఫీసుకు పోవచ్చునుకుంటున్నాడు.

ముప్పయ్యేళ్లుగా యీ చేత్తో ఎన్నో నేశాడు. గతంలో ఎప్పడూ గానుగెద్దు జీవితమే. ఇప్పుడు తన చేనేత బతుకు పండింది.

రాష్ట్ర వస్త్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ వివిధ జిల్లాల్లో వున్న 9 కేంద్రల్లో 3 వేల మంది చేనేత పనివారికి ఉపాధి కల్పిస్తూంది.

చేనేత రంగంలో సహకార విప్లవం వచ్చింది.

30 లక్షల మంది శ్రామికులకి కొత్త జీవితాన్నిచ్చింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధశాఖ డైరెక్టరుచే ప్రకటితము

11/77-78

విషయానుక్రమణిక

సెప్టెంబరు 1977

ఆవకాయ సీసాలు	శ్రీ బులుసు వేంకటేశ్వరులు	4
సూర్యద్విజము	శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం	5
వెన్నెలస్నానం	డా. తంగిరాల	5
విశ్వనాథ — చలం	డా. సి. ఆనందారామం	6
దాశరథి కవితాదర్శనం	శ్రీ మాదిరాజు రంగారావు	11
విమర్శకాహంకారం !	శ్రీ పాకాల వెంకట కృష్ణయ్య	13
—	శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి	15
ఏరు ఎండిపోయింది !	శ్రీ మేకా మన్మథరావు	16
ఆంధ్రమహాకావ్యాల గురించి ఆంగ్లంలో ...	శ్రీ సోమసుందర్	18
శివపూజ	శ్రీ పులికంటి కృష్ణారెడ్డి	23
దారి	శ్రీ తిరునగరి	28
విద్యానగర (విజయనగర) స్థాపనకు ప్రేరకులు — కాశీవిలాస క్రియాశక్తి దేవులా ? ?	శ్రీ షడ్దర్శనం సోమసుందరశర్మ	29
అక్షరధార	శ్రీ తిరునగరి	36
వ్యవసాయం	డా. బి. ఆర్. కె. రావు	37
వెళ్లిగా నేస్తం !	శ్రీ మల్లాప్రగడ రామారావు	44
నగ్నరాత్రి	శ్రీ కలువకొలను సదానంద	45
బోనసుపై కొన్ని ఆలోచనలు	శ్రీ ఐ. సత్యసుందరం	54
ప్రాంతీయ భాషా రచయితలు—వారి సమస్యలు	శ్రీ విరించి	58
క్షోభ	కేవీస్వీ	61
వ్లాడిమర్ నబొకొఫ్	శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం	63
రొమాంటిసిజం	శ్రీ సర్దేశాయి తిరుమలరావు	68
చెమట బిందువూ—కాంతి బిందువూ	డా. నాయని కృష్ణకుమారి	69
కలగూరగంప		72
గ్రంథవిమర్శలు		77

ఆవకాయ సీసాలు

శ్రీ బులుసు వేంకటేశ్వరులు

సీ. అమృతంబు కంటెను అధరామృతము కంటె
అతి రుచ్యమైనది ఆవకాయ
షడ్రసోపేత భోజనమున కంటెను
అతి రుచ్యమైనది ఆవకాయ
పిండివంటల కంటె కండ చక్కెర కంటె
అతి రుచ్యమైనది ఆవకాయ
అప్పడంబుల కంటె పప్పు బెల్లము కంటె
అతి రుచ్యమైనది ఆవకాయ
అమల రసభరితంబయి అద్వితీయ
వాసనా వాసితంబయి వాసవాది
దేవతా ప్రీతికరమైన దావకాయ
ఆవకాయ మహాదేవతా ! నమస్సు.

సీ. వాతపిత్త శ్లేష్మ బహురోగ వితతికి
అతి భయంకర శత్రు వావకాయ
జఠర మాంద్యములకు సర్వవిధా జీర్తి
కరయౌ పాశుపతంబె ఆవకాయ
నజ్జు రోగములకు మజ్జ దోషములకు
అరయఁ జింతామణి ఆవకాయ
అన్నికాలమ్ముల కన్ని తత్త్వములకు
అనువైన యౌషధ మావకాయ
అందు భేదము లెన్నియో అన్నిరుచులు
ఏది రుచియన్న నడుగనౌ నేది కాదొ
ఒక్కదానిని మించిన దొక్కటి కన
ఆవకాయను మించున దవని లేదు.

సీ. కనులారఁ జూతమా కన్నుల పండుగ
అతిరక్తవర్ణ శోభాన్వితమయి
వాసన చూతమా నాసికాపర్వము
ఘుమఘుమంఘుమ లీను కోటి గతుల
రుచిచూతమా నాల్క సచరా చరంబగు
జగతి నింతటి రుచి నెగడ దెందు
విందమా తత్కీర్తి వీనుల విందుగా
నోరూరు నెంతటి వారికైన
అమృత మమృత మటందు రాయమరు లొక్క
సారి రుచి చూచిరా వీడఁజాల రింక
ఆవకాయకు సాటిరా దమృత మందు
రనుభవైకవేద్యము దీని యద్భుత రుచి.

సీ. ఎవ్వాడు కనిపెట్టె ఈ ఆవకాయను
అతఁడు ''పద్మశ్రీ''కి అర్హుఁడు కద!
దీని పాళ్ల నెఱింగి తెలిపిన యాతండు
''భారతరత్న'' కుఁ బాత్రుఁడు కద!
సేతువు మొదలుగ శీతాచలముదాఁక
ఎవఁడు తద్వ్యాప్తికి హేతువతఁడు
బహు బహుమానముల్ పడయంగ నర్హుఁడు
సకల సన్మానార్హ జనుఁడతండు
తీవ్రపరిశోధనల్ చేసి తేల్పవలయు
ఆవకాయ సృష్టించిన యతఁడెవండొ
వార్షికోత్సవములు చేయవలయునతని
కాంధ్రుఁడే యాతఁడౌట సత్యముగఁదోఁచు.

సీ. శ్రీకృష్ణదేవుండు చెలికాండ్రతోఁ జల్ది
ఆవకాయను గల్పి ఆరగించె
శ్రీరామచంద్రుండు సీతతోఁగూడను
ఆవకాయతొ విందు లారగించె
అష్టదిగ్గజముల కావకాయ యటన్న
కృష్ణరాయలవలె నిష్టముకడు
అందుచేతనె వారి కత్యద్భుతంబగు
కవితా ప్రవాహంబు కలిగెనంద్రు
ఆవకాయను మెచ్చని ఆంధ్రుఁడెవఁడు ?
ఆవకాయను గొల్వని యతఁడెవండు ?
ఆవకాయకు దిగ్విజయంబు గాఁగ
ఆవకాయ సీసాలైదు నలరె నిట్లు.

సూర్య ద్విజము

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

నేను దుఃఖాన్నై నీ గుండెలో గూడు కట్టుకున్నాను
నులివెచ్చని నిద్రలో అంధకారంలో నేను పొదిగిన ఆత్మ
కోరికల స్వప్నాల యింద్రియాల నిర్మాణంతో
పక్షినై మెదిలి తరుణారుణ చంచువుతో
లోకావృతిని బ్రద్దలుకొట్టి
తొలి ప్రభాతంలా నిలుచున్నది

క్షుధార్తినై లోక చక్షువునై
విశ్వాంతరాళంలోకి దృష్టి సారించాను
ఆకలి తప్ప ఆహారం కనిపించలేదు
నా యెదనే నా ముక్కుతో చీల్చి
కవోష్ణ రక్తంతో ఉగ్గు పెట్టాను
అన్నప్రాశన చేశాను

ఎర్రని సంజ నా అంతిమ ఘడియ
నా కదే పునర్జన్మ —
నైరాశ్య నీలిమ పండి ఎర్రవారిన
మలి ప్రభాతంలో నేను ద్విజత్వాన్ని పొందాను
నేను ఆత్మనైనాను.

కాంతి నేత్రాలతో నవ్వి
పువ్వుల ముద్దులు కురిపించి
అనంతాకాశ స్వచ్ఛంద పరిష్వంగంలో
నన్నమరుణ్ణి చేశావు — నా కాకలి దప్పులు తే[illegible]
ప్రేయసీ, దేవీ, వరవర్ణినీ, ప్రకృతీ
నన్ను నీలో లీనం కానివ్వు —
నేను పరమాత్మ నౌతాను.

వెన్నెల స్నానం

డా॥ తంగిరాల

నేను
ఏకాకిగా
ఎండలు మండుతున్న ఎడారిలోపడి
పోతున్నప్పుడు —
ఇసుక తిప్పల నిప్పుల పెనంమీద
నా అడుగులు
చురచురా కాలిపోతున్నప్పుడు —
నా పాదాలక్రింద సౌజన్య హిమానీ
నదాలు పుట్టించావు !
నాదారిలో
అచ్చమైన చెలిమితో
అడుగడుగునా
చలిపందిళ్ళు కట్టించావు !
నా చుట్టూ
బుసలు కొట్టే కోడెనాగులు
కాలకూట విషం క్రక్కుతున్నప్పుడు—
నీ
సుధా మధుర
వచోరంఛోళి నెమలిపింఛాలే
నాకు వజ్ర కవచాలుగా కప్పించావు !

ఎటుచూసినా
చిమ్మ చీకట్ల చురకత్తులు
మెత్తటి నా గుండెల్లో
కసుక్కున గ్రుచ్చుకుంటున్నప్పుడు—
చల్లని వేయి శరత్తులు పుక్కిలించే
వినిర్మలమైన నీ నవ్వుల వెన్నెట్లో
నన్ను ముంచెత్తి
హాయిగా స్నానం చేయించావు !!

డా॥ సి. ఆనందారామం

విశ్వనాథ-చలం

ప్రాచ్య సంస్కృతికి పట్టుకొమ్మగా నిలిచినవారు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ. పాశ్చాత్య సంస్కృతి వెల్లువలో ఊగిపోయినవారు శ్రీ గుడిపాటి వేంకటచలం. తూర్పు—పడమరలలా వీరిద్దరూ నిస్సంశయంగా ఒకరికొకరు ఎదురెదురే! అయితే, ధ్యేయం వేరయినా, ఫలితాలు వేరువేరయినా, ఉభయ సంధ్యలలోనూ అరుణరాగాల అందాలలో సామ్యమున్నట్లు ఈ ప్రతిభాశీలుర శిల్ప సౌందర్యంలో నాకు తోచిన సామ్యాల ఫమీక్షే, ఈ వ్యాసం.

జీవితానికి ధ్యేయం ఏమిటి ? దేనిని సాధించినపుడు మానవుడు తన జన్మ సార్థకం చేసుకోగలుగుతున్నాడు? రంభాద్యప్సరసలతో కూడిన స్వర్గ సౌఖ్యాలన్నీ అత్యంత ప్రాథమిక దశలోని మానవుల ఊహాసౌధాలు. ఆనాడు, ఈనాడు, పరిణత మనస్కులెవరూ స్వర్గప్రాప్తినే జన్మసార్థక్యంగా భావించలేదు.

''అంతయు దుఃఖమయమైన య్యాశ్రుతులలో వెనుక నొక మాధుర్యమునందు పర్యవశించినట్లు సర్వదుఃఖము, నమూహితమైన యొక శాంత భావమునందు పర్యవసించుచుండెను. ఆ! ఆ! ఆశాంతిని పట్టుకొనవలయును'' అని నిజమైన స్వర్గాన్ని నిరూపిస్తున్నారు, శ్రీ విశ్వనాథ, ''స్వర్గానికి నిచ్చెనలు''లో ...

కళాత్మకమైన ప్రతిభ దుఃఖమయమైన శ్రుతులలో సహితం మాధుర్యాన్నే పలికించినట్లు, సృష్టిలో దోబూచులాడే దివ్యత్వాన్ని గ్రహించగలిగే మనసు సుఖ దుఃఖాల నన్నిటినీ శాంత భావంలో పర్యవసింపచేసికోగలుగుతుంది. ఇదే స్వర్గం శ్రీ విశ్వనాథ దృష్టిలో—

''శాంతము లేక సౌఖ్యములేదు'' అని శ్రీ త్యాగరాజు గానం చేసిన ఈ శాంతినే చలం కూడా ''జీవితాదర్శం''గా అంగీకరిస్తున్నారు, తమ ''జీవితాదర్శం'' నవలలో...

జీవితాన్ని మథించి తాను సాధించిన శాంతితోనే ''దేశికాచారి'', ''లాలస''ను జయించి స్త్రీత్వపు మాధుర్యాన్ని తన శాంతి మయ జీవితంలో ఒక భాగంగా చేసుకోగలిగాడు. ''జీవితాదర్శం'' నవలలో ''దేశికాచారి'', ''లాలస'' అనే పేర్లు సాభిప్రాయాలు, సార్థకాలు.

ఈ శాంతి సాధనకు స్వేచ్ఛా ప్రణయమే సాధనమన్నారు శ్రీ చలం. ఇక్కడ స్వేచ్ఛాప్రణయమంటే, కొందరు భ్రమపడుతున్నట్లు విశృంఖల ప్రణయ కలాపంకాదు. ఇచ్చిపుచ్చుకోవటాలు, కృతజ్ఞతాబంధాలు, సాంఘిక నిర్బంధాలు, ఇలాంటివేమీ లేకుండా, ప్రేమించకుండా నిలవలేని మహత్తర ప్రణయంతో స్వేచ్ఛగా ప్రేమించటం...

విశ్వనాథ, చలం ఇద్దరూ జీవితాన్ని సమర్థంగా దర్శించారు, ప్రదర్శించారు. ఇద్దరూ కాల్పనిక వాదులే! అంటే వాస్తవిక దృక్పథం లేకుండా రచనలు చేసినవారనికాదు. ఇద్దరూ సమకాలిక సాంఘిక సమస్యలనే చర్చించారు. అయితే, ఆసమస్యల చిత్రీకరణలో, పరిష్కార సూచనలో ఇద్దరూ ఎవరి కనుగుణమైన కాల్పనిక జగత్తును వారు సృష్టించుకొన్నారేకాని, సమస్యలను అన్ని కోణాల నుండీ, ప్రయోజనాత్మకంగా పరిశీలించలేదు.

ఆ కాలంలో తలఎత్తి ఈ నాటికీ సమాజాన్ని కల్లోల పరుస్తోన్న సమస్యలు—వితంతు వివాహాలు, వర్ణాంతర వివాహాలు, స్త్రీ స్వాతంత్ర్యము—మొదలైనవి.

వీటన్నిటినీ మించి అసలు వివాహ వ్యవస్థ ఉండాలా, వద్దా అనేది ఆనాటినుంచి ఈనాటివరకూ అనేక విధాలుగా వాదవివాదాలకు లోనవుతోన్న అంశం. వివాహ వ్యవస్థ ప్రాధాన్యాన్ని గురించి సాంఘిక శాస్త్రంలో ఎందరో మేధావులు ఎన్నో విధాలుగా చర్చించి, సమాజంలో ఈ వ్యవస్థ సుస్థిరత్వాన్ని నిర్ధారించారు. మరి, ఎప్పటికప్పుడు ఈ వాదోప వాదాలు ఎందుకు తలఎత్తుతున్నట్లు ?

మానవ స్వభావం సహజంగా చంచలం.

వ్యక్తిగత సంబంధాలు వ్యవస్థాబద్ధం కావటం సమాజానికి శ్రేయస్కరమని నిర్ణయించినా, వ్యక్తుల బలహీనతలు వ్యవస్థను అర్థరహితమయ్యేలా అస్తవ్యస్తం చేసేస్తున్నాయి.

ఏది ఎలా ఉన్నా, వ్యవస్థను మన్నించి తీరాలంటారు, విశ్వనాథ. వ్యవస్థ విచ్ఛిన్నం కావలసిందేనని వాదిస్తారు చలం.

విశ్వనాథవారి ''చెలియలికట్ట'' చలంగారి ''మైదానం'' నవలలు ఆయా దృక్పథాలను వివరిస్తాయి. రెండు నవలలూ తమ పేర్లలోనే హద్దుల నతిక్రమించిన ఇతివృత్తాలను సూచిస్తున్నాయి. రెండు నవలలోనూ హద్దుల నతిక్రమించిన కథానాయికలకు మరణమే శరణ్యం కావటం గమనార్హం. అది అనివార్యమైన సాంఘిక సత్యం. దానిని కాదనలేకపోయినా, తమ తమ పాత్రలను మలచుకొన్న రీతిలో వీరి దృక్పథాలలో వైరుధ్యం స్పష్టమవుతుంది.

మానవుని మూలతత్వానికీ, అతని అంతరంగానికీ ఉండే వైరుధ్యమే లోకంలోని వినోదాలకూ, విషాదాలకూ మూలం...

రత్నావళి పాత్ర ఇలాటి సజీవ సంఘర్షణతో కూడిన పాత్ర. ఆమె అంతరంగం వ్యవస్థను గౌరవిస్తోంది. ఆమె సహజతత్వం సుఖలాలసకు మొగ్గింది. అంచేతనే సంఘర్షణలో నలిగి, విద్యావంతు

రాలై, విజ్ఞానాన్ని పెంపొందించుకొన్నాక అంతరంగాన్ని అందుకోవటానికే ప్రయత్నించి, తన బలహీనతకు పరిష్కారంగా ఆత్మ బలిదానం చేసుకుంది—

'మైదానం'లో రాజేశ్వరి కూడా మరణించింది. అదీ, ఆత్మ బలిదానమే! ఈ ఆత్మబలి కూడా అంతరంగంలోని సంఘర్షణల ఫలితమే! ఒక్కటే భేదం! ఈ సంఘర్షణ వ్యవస్థకూ, వ్యక్తి వాంఛకూ నడుమకాదు. స్త్రీ సహజమైన ఆర్ద్ర ప్రవృత్తికీ, సాధారణ సాంఘిక నీతికీ నడుమ జరిగే సంఘర్షణ.

విశ్వనాథవారి నవల లన్నింటిలోనూ మానవుల మూల తత్వానికీ, అంతరంగానికీ సంఘర్షణ ప్రధానంగా కనిపిస్తుంది.

అలాగే చలంగారి రచనలలో స్త్రీ తనకు సహజమైన ఆర్ద్ర ప్రవృత్తితో తనకు తానే సంఘనీతికి బలికావటం కనిపిస్తుంది.

వ్యవస్థాబద్ధంకాని ప్రణయం అర్థ్యమా? లేక గర్హ్యమా? అనే అంశాన్ని విశ్వనాథ ''ఏకవీర''లోనూ, చలం ''దైవమిచ్చిన భార్య''లోనూ చర్చించారు.

ఇక్కడ కూడా రెండు నవలలోని కథానాయికలూ ఆత్మహుతి చేసుకున్నారు.

ఏకవీర, పద్మావతి, ఇద్దరూ అతిగాఢంగా ఒకరిని ప్రేమించి మరొకరిని వివాహం చేసుకున్నారు.

ఏకవీర వివాహం కాగానే ధర్మబద్ధమైన ప్రణయాన్నే స్వీకరించాలనుకొంది. కానీ, విధి అందుకు అనుకూలించలేదు. ఆ కారణం చేత ఆమెకు తెలియకుండానే ఆమె మనసు తొలి ప్రణయంవైపు మళ్ళింది.

అక్కడితో సంఘర్షణ ప్రారంభమయింది.

''మొదటి ధనను మధుర ప్రేమమయమైనది. రెండవ ధనము ధర్మప్రేమమయమైనది. తనకు దూరములైన ఈ రెంటిలో నేది మనస్సున నిల్పుటకు యోగ్యమైనదో, ఆమెకు దెలియలేదు. తెలివికలది రెండవ దానిని మనస్సున నామె నిలుపును. తనకుం దెలియకుండ మొదటిది తాను వచ్చి తన మనసావరించును. ఆయా వృత్తి యామెకు దెలిసి తెలియనట్లుండును'' అని 'ఏకవీర' స్థితిని వర్ణిస్తారు విశ్వనాథ.

ఆ సమయంలో కూచిపూడి భాగవతులు రావటం, ఏకవీర మీనాక్షి ఇంటికి వెళ్ళటం, అక్కడ వీరభూపతి ఏకవీరను పరిష్వంగం చేసుకోవటం జరిగింది.

ఏకవీర చేసింది దోషమా? అప్పటివరకూ ఏకవీరకు కుట్టానుతో ఏ విధమయిన సంబంధమూలేదు. అయినా మీనాక్షి ఇంటి నుండి వచ్చాక ఏకవీరను చూసి ''సూర్యభగవాను డెఱ్ఱని నిప్పులు క్రక్కుచున్నాడు'' అని వర్ణించారు, విశ్వనాథ. కర్మసాక్షి నిప్పులు కక్కుతున్నాడంటే, అది దోషమని నిర్ధారించటమే కద! అంతేకాక ''ఏకవీరకు భయమై కనులు మూసుకొన్నది'' అంటారు. భయం దేనికి? ''తప్పుచేసాను,'' అనే కారణంచేత—కుట్టాన్ ఏకవీరను అందుకోవాలని ప్రయత్నించినపుడు ఏకవీర ''నా యెడల నొక మహాఘమున్నది. అది కడుగుకొనుటకు పోవుచున్నాను'' అంటుంది.

వీరభూపతి పరిష్వంగాన్ని ''మహాఘము'' అని ఎందుకు భావించాలి ఏకవీర? ఎంత పవిత్ర ప్రణయమయినా, వ్యవస్థాబద్ధం కాకపోతే అది మహాఘమే, విశ్వనాథ దృష్టిలో...ఈ సంఘర్షణకే ఏకవీర ఆహుతి అయిపోయింది.

పద్మావతి పాత్ర సృష్టి ఇందుకు పూర్తిగా వ్యతిరేకం—ఆవిడ వివాహితురాలయినా, మొదట తాను ప్రేమించిన రాధాకృష్ణను ఆహ్వానిస్తుంది. అతనికోసం భర్తను ధిక్కరిస్తుంది. కానీ బలవత్తరమైన సాంఘిక నీతి తనను లోబరచుకొన్నప్పుడు, తన కారణంగా తాను ప్రేమించిన రాధాకృష్ణ సర్వనాశనం కాబోయే పరిస్థితి ఏర్పడినప్పుడు, ఆత్మాహుతి చేసుకుని, రాధాకృష్ణని కాపాడుతుంది.

సమాజంలో వితంతు వివాహాలు అప్పుడప్పుడే ప్రారంభమవుతున్నాయి. కానీ, అవి సఫలం కావటం లేదు. ఎందుచేత? వితంతు వివాహం ఘోరపాపమన్న ఉద్దేశం మనుష్యుల మనసులలో ఉండటల వల్ల —

విశ్వనాథవారి ''స్వర్గానికి నిచ్చెనలు'' నవలలో వసుందర, చలంగారి 'బ్రాహ్మణీకం' నవలికలో సుందరమ్మ—ఇద్దరూకూడా వితంతువివాహం చేసుకుని ఆ తరువాత అది దోషమన్న భావనలో నలిగిపోయినవారే !

''ఎంతో జాగ్రత్తతో, ధైర్యంతో, విజ్ఞానంతో యోచించిన వారి మనసులలో తప్ప సాధారణ ప్రజల నీతి అభిప్రాయాలన్నీ హేతువాదంమీద ఆధారపడివుండవు. చిన్నప్పటినుండీ గౌరవనీయులైన వారు ఏ విధంగా తలుస్తున్నారో, దండిస్తున్నారో ఆ పద్ధతులమీద నీతిని గురించిన అభిప్రాయాలేర్పడతాయి''అంటారు చలం.

వసుంధర మూర్ఖురాలు కాదు. చదువుకుంది. బాల్య వితంతువు. అన్న రెండవ పెళ్ళి చేసాడు. ప్రత్యేకమైన ఇష్టమేదీ లేకుండానే రెండవపెళ్ళి చేసుకుంది వసుంధర. అప్పుడు మొదటి భర్త పిశాచమై సాక్షాత్కరించాడు. ఈ భర్త పిశాచం వసుంధర రెండవపెళ్ళి చేసుకున్న తరువాతనే ఎందుకు కనిపించాలి? ముందుగానే కనిపించి వసుంధర రెండవ వివాహం చేసుకోకుండా అడ్డుపడవచ్చును గదా, అన్న ప్రశ్నకు సమాధానం—రెండవ పెళ్ళి చేసుకున్నాకకాని, వసుంధర మనసులో సంఘర్షణ ప్రారంభం కాలేదు. అలాంటి సంఘర్షణ వసుంధరలో ప్రారంభమయ్యాక కాని భర్తృ పిశాచానికి వసుంధర ముందు నిలిచేశక్తి కలగదు. ఇక్కడ ఇతివృత్త కల్పనలో, పాత్ర పోషణలో విశ్వనాథ చూపించే ప్రజ్ఞ అనన్య సామాన్యం. వసుంధర రెండవ భర్తను ప్రేమించి పెళ్ళి చేసుకోలేదు. పెళ్ళి జరిగిన తరువాతనయినా వాళ్ళిద్దరిలో ప్రేమానురాగాలు అల్లుకోలేదు. ఆ కారణంచేత వసుంధర మనసును భర్తృ పిశాచం అతి తేలికగా ఆవహించగలిగింది. ఇక పిశాచపాత్ర సృష్టిలో, విశ్వనాథ తీసుకొన్న శ్రద్ధ గమనార్హం. వసుంధర అపమార్గాన పోతుండగా భర్తృ పిశాచం ఆమెను చక్కదిద్ది సవ్యమార్గాన పెట్టినట్లు వ్రాయవచ్చు. కానీ విశ్వనాథ అలా వ్రాయలేదు. ఎందుకంటే అది పిశాచం. పిశాచానికి దివ్యభావాలు రావు. కానీ ఆ పిశాచం పండితుడు. అతని సంపర్కంచేత వసుంధర

మనసు వికసించింది. తనకు తానే నిజమైన స్వర్గమేదో గుర్తించ గలిగింది.

అయితే, విశ్వనాథ ఈ నవలలో ఏ విధంగానూ సమకాలీన సమాజాన్నిగాని, వితంతువివాహాలవల్ల సమాజంలో ఎదుర్కోవలసి వచ్చే సమస్యలనుకాని, చిత్రించలేదు. అసలీ నవలలో సమగ్రమైన జీవిత చిత్రణ లేదు. భర్తృ పిశాచం ప్రదర్శించిన అద్భుతాలూ, నరహరి ప్రదర్శించిన ఇంద్రజాలిక విద్యలూ మొదలయిన వాటితో, ఇది అద్భుత రసంతో కూడిన కల్పనగా తేలింది.

చలంగారి ''బ్రాహ్మణీకం'' లో ఆనాటి సమాజం ఆయా వ్యక్తుల మానసిక ప్రవృత్తులు, స్పష్టంగా కనిపిస్తాయి. సుందరమ్మ బ్రాహ్మణ యువతి. ఎంతో ఉత్తమురాలు. ఆవిడ మొదటి నుండీ తన భర్తనే ఎంతో గాఢంగా ప్రేమించింది. చంద్రశేఖరం మీద ఆవిడకెలాంటి మమకారమూ లేదు. కేవలం అతని ఆవేదన చూసి,సహించలేని ఆర్ద్రితతో అతనికి లొంగిపోయింది. ఆ కారణం చేత అతణ్ని విధిగా పెళ్ళి చేసుకోవలసివచ్చింది. వితంతు వివాహం ఘోరపాపమనే భావంతో భార్య—తన కర్మకాలి వెధవముండని పెళ్ళి చేసుకోవలసి వచ్చిందనే భావంతో భర్త, —అదీ ఆ సంసారం—. తన బిడ్డకి ఏ కాస్త జబ్బు చేసినా తన అపరాధానికి దేవతలు శిక్షిస్తున్నారనే అనుమానిస్తుంది సుందరమ్మ. చివరకు గవళ్ళ రామయ్యని డాక్టరనుకొని అతనికి లొంగిపోవటం ఆవిడ అజ్ఞానానికి పరాకాష్ఠ. ఆ రకంగా తన అజ్ఞానానికి తనే ఆహుతి అయి పోయింది. ఎంతో ఉదాత్తమయిన ప్రకృతి అజ్ఞానం కారణంగా ఎలాంటి అధఃపాతాళాలకు కృంగిపోవలసి వస్తుందో చూపించారు, చలం ఈ నవలలో సమర్థంగా—

ఏది ఏమయినా వ్యవస్థను కాదనటానికి వీల్లేదనే విశ్వనాథ, వ్యవస్థతో నిమిత్తంలేని ప్రణయాన్ని చూపించారు ''తెఱచిరాజు'' లోని వాసంతిలో —

వ్యవస్థను ధిక్కరించి తీరాలనే చలం, స్త్రీ నిస్సహాయంగా వ్యవస్థముందు ఎలా తల ఒగ్గుతుందో చూపించారు ''వివాహం''లో.

''వాసంతి'' పాత్ర ఒక ప్రత్యేకసృష్టి. విశ్వనాథ వారి మాటలలో చెప్పాలంటే ''శరీరము రసమార్గానుభూతి పొంది ముక్తికి సోపానముగా నేర్పరచిన పరమేశ్వర సంకల్పము''లోని పరమార్థాన్ని అనుభవంలోకి తెచ్చుకో గలిగిన ప్రణయిని.

వాసంతి ప్రణయం శారీరకం కాదనటానికి వీల్లేదు. స్పర్శాసౌఖ్యం అనుభవించింది కనుక,—శారీరకమే అనటానికీ వీల్లేదు. లౌకికమయిన శృంగార లీలా విలాసాదులు లేవు కనుక—శారీరకమైన స్పర్శాసౌఖ్యం ఆధారంగా సృష్టిశక్తిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించింది.

''అందరివలె నేను పశువును కాను. నేను మానవురాలను. నా కొక్కడే భర్త. లోకములో స్త్రీ పురుషులు వ్యభిచరింతురు. నిజమయిన శరీర సౌఖ్య మెట్లుండునో, నా యొక్కతెకే తెలియును—'' అని వాసంతి నోట పలికించారు. అంటే, వ్యవస్థను ఇంతగా సమర్థించే విశ్వనాథ వ్యవస్థ పేరిట చలామణి అవుతోన్న దాంపత్యాలలో జరుగుతున్నది వ్యభిచారమే, అనేస్తున్నారు!! నూటికి నూరుపాళ్ళూ చలంగారి సిద్ధాంతం, ఇది!

అంతటితో ఆగలేదు. లోకంలో ఇంతమంది సంసారాలు చేసుకొంటున్నారు కదా, వాళ్ళంతా సుఖంగా లేరా? — అనే ప్రశ్నకి సమాధానంగా — ''గడ్డి తినుచున్నచో అదియు అలవాటగును!'' అని ఈసడించి పారేసారు !

కానీ, ఈ నవలలోకూడా విశ్వనాథ వ్యవస్థను కాదనలేక పోయారు. కిరీటిని వివాహం చేసుకున్న వాసంతి సారథి స్పర్శ సోకగానే, రంగస్థలంమీదనే మరణించింది.

చలంగారి నవలల్లో ఒక్క ''వివాహం'' లో మాత్రమే స్త్రీ వ్యవస్థకు తలవంచి అంగీకరించింది. అందరిచేతా అపరూపంగా చూడబడే అద్భుతమైన వ్యక్తి రమణ. అందరూ చిన్నచూపు చూసే అల్పుడు గోపాలరావు. అలాంటి గోపాలరావు రమణకు భర్త అయినంత మాత్రాన ఆవిడమీద తనకు సర్వాధికారాలు వచ్చాయను కొని తనకు చేతనయినంతవరకూ హింసించి చివరకు రమణను 'వెధవముండ' ని చెయ్యటంకోసం చద్దామనికూడా ఆలోచిస్తాడు. అలాంటి అసలు సిసలైన భర్త అతడు—అతణ్ని ధిక్కరించటానికి అన్ని అవకాశాలూ ఉన్నా ''మీ పాదాల దగ్గిర పడి ఉండనీయండి'' అని దాసోహమంటుంది. ఎందుకు? కేవలం గోపాలం దురవస్థ చూడ లేక—అతనిమీది సానుభూతితో—స్త్రీ సహజమయిన ఆర్ద్రతతో — ఎంతటి హైన్యాన్నయినా సహించి స్త్రీ వ్యవస్థకి బద్ధురాలయి ఉంటున్నది. నిస్సహాయురాలు కావటంవల్ల మాత్రమే కాదు — తనకు సహజమయిన ఆర్ద్రస్వభావం కారణంగానే అంటున్నారు, చలం ఈ నవలలోకూడా —

విశ్వనాథ, చలం, ఇద్దరూ తమ భావాలకు ప్రతీకలుగా పాత్రలు సృష్టించి రచనలు చేసారు. చలంగారి 'అరుణ' లో అరుణ సృష్టిలోని స్త్రీ సౌందర్యానికీ, స్త్రీత్వపు మాధుర్యానికీ ప్రతీక. పురుష ప్రపంచమంతా ఆ సౌందర్య మాధుర్యాలకు దాసోహం చేస్తూ ఆ శక్తిచుట్టూ ప్రదక్షిణాలు చేస్తుంది. సర్వప్రపంచాన్నీ తన చిటికెన వేలు చుట్టూ త్రిప్పుకోగల అద్భుతశక్తి వ్యవస్థకు దాస్యం చేస్తోందని వాపోయారు చలం, 'అరుణ'లో—

''అమీనా'' లో అమీనా చలం అంతరంగానికి ప్రతీక — ఆ నవలలో రచయిత అమీనాను అందుకోవాలని ప్రయత్నించి విఫలుడవుతాడు. తన అంతరంగాన్ని తానే అందుకోలేక పోతున్న చలం ఆత్మ విమర్శ అడుగడుగునా కనిపిస్తుంది ఈ రచనలో —

విశ్వనాథ ''వేయి—పడగలు'' లో సృష్టించిన పాత్రలు చాలవరకు ప్రతీకలే! ప్రధాన పాత్రలయిన అరుంధతీ, ధర్మారావులు దాంపత్యధర్మానికి ప్రతీకలు. ఆకారణంగానే ''ఈ దేశమున పతివ్రత చావదు. స్వామి ఒక్క పడగతో నుండడు'' అంటూ చిన్న అరుంధతిని ధర్మారావుకు భార్యగా చేసారు.

రచయిత కొన్ని భావాలకు ప్రతీకలుగా పాత్రలనుసృష్టించినప్పుడు ఆ రచనను ఆ దృష్టితోనే చూడాలి కాని, కేవలం కథా దృష్టితోచూసి విమర్శకు పూనుకోకూడదు.

మంగమ్మ మనసుకు ప్రతీకగా వాలి (కోతి)ని సృష్టించారు. చివరకు మంగమ్మ కోతిని బంధించిందని వ్రాసి తన మనసును నిగ్రహించుకో గలిగిందని సూచించారు.

వ్యవస్థలో దంపతులు ధర్మాన్ని అనుసరించటం లేదు గనుక వ్యవస్థ నిరర్ధకమవుతోంది. అలా కాక ధర్మాన్నే అనుసరిస్తే సార్థకమవుతుంది. అంచేత లోపం వ్యక్తులది కాని, వ్యవస్థదికాదని వ్యవస్థను సమర్థిస్తున్నారు విశ్వనాథ.

అయితే, ఇవే వాక్యాలు స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతాన్ని సమర్థించటానికీ ఉపయోగించుకోవచ్చు. స్వేచ్ఛాప్రణయ సిద్ధాంతాన్ని రాధాపతిలాంటి కొందరు మూర్ఖులు స్వార్థానికి అనుగుణంగా వ్యాఖ్యానించుకోవటంతో, అది వ్యభిచారానికి మరోపేరుగా తయారవుతోంది కాని, సిద్ధాంతరీత్యా, అది వ్యవస్థకు కట్టుబడటంకంటె మరింత క్లిష్టమైనదీ, పవిత్రమైనదీ అని చెప్పవచ్చు. చలం ఇదే చెప్పారు, 'జీవితాదర్శంలో'. లాలస లక్ష్మణసింగ్ భార్య. మాల్వంకర్‌తో లాలసకున్న అనుబంధం అందరికీ తెలిసింది. లక్ష్మణ సింగ్‌కీ తెలిసింది. లక్ష్మణసింగ్ లాలసను వదలుకోలేడు. కాని "నువ్వు నా దగ్గరేఉండాలి. ఎక్కడికి వెళ్ళటానికీ వీల్లేదు" అని నిర్బంధించలేక పోయాడు. ఎందుకంటే, లోక నిందను భరించే నిబ్బరం అతనికి లేక పోయింది. అంచేత "స్త్రీలకు స్వాతంత్ర్యం ఇయ్యాలి" అనే ఉదారాశయపు ముసుగులో లాలసను పంపేసాడు. నిజంగా అతని ఆశయం అంతటి ఉదారమైనదే అయితే, లాలస కష్టంలో ఉన్నప్పుడు సహాయం చెయ్యాలి. అలా చెయ్యలేదు. ఎదురు "చేసిన పాపాలకు ఫలితం అనుభవించవలసిందే?" అనుకున్నాడు. దేశికాచారిదగ్గిర లాలసను చూసినప్పుడుకూడా తన భార్య మరోకరితో సుఖపడటం ఏమిటనే భావంతోనే తనతో రమ్మన్నాడు. ఆ కారణంచేతనే లాలస— అంటే—స్త్రీత్వపు మాధుర్యం—అతనికి అందలేదు. దేశికాచారి అలాకాక లాలసకు స్నేహితుడై ఆదుకున్నాడు. ఆమె సుఖంకోరి సంపూర్ణమైన స్వేచ్ఛ నిచ్చాడు. అంచేత—లాలస—అంటే—స్త్రీత్వం—అతనికి వశమయి అతని శాంతిమయ జీవితంలో ఒక భాగంగా లీనమయింది.

"స్త్రీ స్వాతంత్ర్యం"లాంటి భావాలను పురుషులు ఎలా తమ స్వార్థానికి ఉపయోగించుకొంటున్నారో, ఇద్దరూ చమత్కారంగా చూపించారు.

"స్త్రీ స్వాతంత్ర్యాన్ని పురుషుడు ఆమోదిస్తున్నాడు. కానీ, ఆస్వాతంత్ర్యం పరస్త్రీలలో ఉండాలంటాడు—"అంటున్నారు చలం.

''వెయిపడగలు''లో వదినగారికి స్వాతంత్ర్య భావాలు నేర్పిన రంగడు తన అక్క సత్యవతి నుద్దేశించి రత్నావళి ''ఎవరినో ప్రేమించుటకు వెళ్ళియుండును'' అనగానే ''ఛీ!'' అని చీదరించు కొంటాడు. ఈ అభ్యుదయవాదుల అభ్యుదయం ఇంతటిదని విశ్వ నాథ హేళన—

విశ్వనాథ, చలం, ఇద్దరూ వ్యక్తులుగా సిద్ధాంత ప్రతిపాదన దృష్టితో పరస్పర విరుద్ధమైన భావాలనే ప్రకటించారు. కళా స్రష్టలుగా ఇద్దరూ సార్వకాలిక జీవిత సత్యాలనే తమ సాహితీ జగత్తులో ప్రదర్శించారు.

సిద్ధాంతరీత్యా వర్ణ వ్యవస్థను బలపరుస్తారు విశ్వనాథ. కానీ ''స్వర్గానికి నిచ్చెనలు'' నవలలో, బ్రాహ్మణి వసుందర కబ్బని యోగసిద్ధిని హరిజన బాలిక శశి అందుకో గలిగింది.

''వేయిపడగలు''లో రామేశ్వరి శాస్త్రి బ్రాహ్మణ ధర్మపత్ని సావిత్రమ్మ కీయని ప్రాధాన్యం, క్షత్రియకాంత రంగాజమ్మ కిచ్చారు; ఆవిడ సతీత్వం ప్రణయభావ సమ్మిశ్రితం కనుక!

''నీచ స్త్రీ అనగా నీచకుల సంజాత అనికాదు. అనభిజ్ఞాత రసభావయని...'' అంటున్నారు ''తెఅచి రాజు''లో.

సిద్ధాంతరీత్యా స్త్రీ విద్యను నిరసిస్తారు. మంగమ్మ ''నేను చదువుకొనని వారి యింట నేల పుట్టవలె?''అని బాధ పడుతుంది. ఆవిడ చదువుకొని విద్యావంతురాలయిన తరువాతనే, ఆవిడలో నిజ మయిన పరివర్తన ప్రారంభమవుతుంది.

అలాగె రత్నావళి నుద్దేశించి ''మొదటనే ఆమె చదువుకొని యుండినచో, ఇట్టి అకార్యముచేసి యుండెడిదికాదు'' అంటాడు సత్యవతి కొడుకు.

తన చుట్టూ మొగవాళ్ళను తిప్పుకుంటూ, ఎవరికీ అంద కుండా, స్వతంత్రంగా జీవించ గలిగిన బిజిలీని చూపించారు ''వేయిపడగలు''లో.

సిద్ధాంతరీత్యా బాల్యవివాహాలను సమర్థించారు. ''శారదా చట్టము వచ్చిన తరువాత ఇంకను పాతివ్రత్య మేమిటీ?'' అని హేళన కూడా చేసారు.

కానీ, ''ముక్కుపచ్చలారనప్పుడు, భర్తయనగా నేమిటో తెలియనప్పుడు, తన్ను పురస్కరించుకొని జరుగు సుత్సవముయొక్క సంపూర్ణమయిన సంతోషము తామెఱిగి యనుభవించలేనపుడు, వివాహమేమిటీ?'' అని ఆలోచిస్తుంది వసుంధర ''స్వర్గానికి నిచ్చెనలు''లో.

సిద్ధాంతరీత్యా వితంతు వివాహాలను నిరసించారు. కానీ ''బ్రతికి యున్నవారనేకులు వసుంధర మరల వివాహమాడి సుఖపడుచున్నదనుకొను చుండగా, భర్తృభూత మామె చెడి పోయిన దనుకొనుటయేమి? తానిప్ప డామెను చేసిన బాగేమి?'' అని విచికిత్సలో పడ్డారు ''స్వర్గానికి నిచ్చెనలు''లో.

సిద్ధాంత ప్రతిపాదనలో వ్యవస్థను తీవ్రంగా ధిక్కరించిన చలం తన సాహిత్యంలో అడుగడుగునా వ్యవస్థ వ్యక్తికి కల్పించే భద్రతను కాదనలేకపోయారు.

''నా ధీరత్వమా, నా విజ్ఞానమా, ఏది ప్రోత్సహించింది ఆ మాటని! స్త్రీకి నరకంగావున్నా సంసారమే స్వర్గమని! ఎంత యముడైనా భర్తకన్న మిత్రుడులేడని!'' అని ఆలోచనలో పడ్డారు, ''అరుణ''లో.

''మంచి అంటే ఏమిటి? మంచి ఏమిటి?

ఎప్పుడు? దేనికి ? ఎవరికి ?

ఎవరికి తెలుసు ? అని తర్జన భర్జనలు చేసుకున్నారు ''అమీనా''లో.

''అరుణ''లో స్త్రీ సౌందర్యాన్ని దర్శిస్తూనే ''జీవితంలో యీ దేహానికీ, నా శృంగార భావాలకీ యెట్లా స్వర్గద్వారాలు తెరి చిందో, అట్లానే నా ఆత్మకీ, నా ఆధ్యాత్మిక సందేహాలకీ, ఎప్పుడో ఏ ఆశ్రమంనించో స్వర్గద్వారాలు తెరుస్తుందని నా నమ్మకం'' అంటూ సౌందర్యారాధనను తత్వాన్వేషణకు ఉపకరణంగా చేసుకోవ టానికి ప్రయత్నించారు.

చలం, విశ్వనాథ— ఇద్దరిలో ఏ ఒక్కరూ ప్రేమ కేవలం శారీరకావసరమని అనలేదు.

తమ సహజశక్తుల్ని ప్రయోగంలో దించటానికి ప్రేమ అవ సర మన్నారు చలం.

''తెలివి తేటలు కలిగియుండుట యొక చెడ్డ గుణము. ఎప్పుడును ఆ తెలివితేట లుపయోగించుటకు వీలైన పరిస్థితి కోసమే మనస్సెదురు చూచుచుండును. ఒక తెలివి గలిగిన స్త్రీ, తెలివిలేని పురుషులతో, తెలివిగలిగిన పురుషుడు తెలివిలేని స్త్రీతో కలిసియుండలేరు'' అంటున్నారు విశ్వనాథ 'బద్దన్న సేనాని' లో.

పామరదశనుండి పురుషోత్తమత్వాన్ని అందుకోవటానికి ప్రయత్నించే సంఘర్షణే సార్వకాలికమయిన మానవ జీవితం...

విశ్వనాథ, చలం ఇద్దరి రచనలలోనూ ఈ సంఘర్షణ కని పిస్తుంది.

సంస్కరణకు ఏ మాత్రం అవకాశమివ్వకుండా సనాతన సంప్రదాయాలనే అనుసరించి తీరాలనే విశ్వనాథ సిద్ధాంతాలను అంగీకరించటం ఎంత కష్టమో, దైనందిన జీవితాని కన్వయించని, సాధారణుల కంతుపట్టని, చలం సిద్ధాంతాలను ఆచరణలో పెట్ట టమూ అంతే కష్టం.

లౌకిక నీతి సూత్రాల కందని ప్రత్యేక వ్యక్తిత్వం కల పాత్ర లను ఇద్దరూ సృష్టించారు.

ఆత్మౌన్నత్యంతో వ్యవస్థను ధిక్కరించలేక, తమను తాము సంఘానికి బలి చేసుకున్నాయి విశ్వనాథ పాత్రలు.

ఆత్మవంచన కంగీకరించలేక తనను ధిక్కరించిన చలం, పాత్రలను సంఘం బలితీసుకుంది.

మనసు ప్రధానం. మనసు చలించినపుడు శరీరాన్ని నిగ్ర హించుకొని ప్రయోజన మేమిటని సంఘ నీతిని ధిక్కరించారు చలం.

మనసు వేరు, బుద్ధి వేరు. చాంచల్యం మనసుకు సహజ లక్షణం. బుద్ధి బలంతో దాన్ని నియమించుకోవాలి. అదే నాగర కత — అని సంఘనీతిని సమర్థించారు విశ్వనాథ.

శ్రీ మాదిరాజు రంగారావు

దాశరథి కవితాదర్శనం

స్వాతంత్ర్యానంతరం వెలువడిన స్వేచ్ఛాకవిత్వంలో అగ్రస్థానంలో నిలచే కవితా సంపుటి పునర్నవం. జాతీయం, అంతర్జాతీయం, కాల్పనికం, వైయక్తికం, విశ్వజనీనం మొదలుగా బహుముఖీన కవితాస్వరూపాన్ని ఆవిష్కరించేది. ఇది కలిగించే అనుభవం ప్రగతిశీలమూ, కాల్పనికమూ ఐంది. ఏ ఇజాల బరువూ మనపై దించకుండా, ఏ తత్వాల డొంకల్లోనూ మనల్ని త్రిప్పకుండా, సూటిగా మానవతా సీమాంచలాల్లో సంఘర్షణ, అశాంతి, పరివర్తనం నుండి శాంతిచ్ఛాయల్లోకి స్వేచ్ఛగా ప్రయాణింపజేసేది. ఇంతకుముందున్న ఆధునిక కవుల అసాధారణమైన ప్రభావానికి సుదూరంగా నిలువగలిగిన దాశరథి వ్యక్తిత్వం సహృదయుల మనస్సుపై ప్రస్ఫుటమైన ముద్రను వేసేది. సామాజిక స్పృహ, అనుభూతి స్పందనం, రచనాశిల్పం అన్న మూడు లక్షణాలూ సుసంయోజితమైన కవిత్వం ఇతనిది. ఈ సంపుటిలో ఉషస్సంధ్యతోపాటు మరికొన్ని మస్తిష్కంలో లేబొరేటొరీ, కిరణశకలం, యుగాంతర రేఖలు, కాంతి ఝంఝ, మొదలైనవి దాశరథి సామాజిక అవగాహనతోపాటు విశ్వజనీన దృక్పథాన్ని ప్రతిబింబింపజేసేవి.

ఉషస్సు తమస్సు రెండూ, అనాదిగా వస్తూన్న వర్ణనా జగత్తులోని అంశాలే. మన ప్రాచీన సాహిత్యంలో ఉషస్సు—సూర్యుడు చుట్టూ ఎంతో తత్త్వమూ, కవిత్వమూ ప్రకాశించింది. ప్రపంచ సాహిత్యంలోని అత్యంత ప్రాచీనమైన ఋగ్వేదంలో ఉషస్సు ఎంతో మనోజ్ఞంగా వర్ణితమైంది. ఇది ఆకాశాన్ని దీపితం చేసేది. స్వర్గద్వారాలు తెరచేది. సూర్యుడు ప్రయాణించడానికి దారులు చూపేది.

> వ్యూ వ్రజస్య తమసోద్వారో [1]
> చ్ఛన్తీరవ్రఞ్ఛుచయః పావకాః.
>
> [వి|(ఊం ఇతి) | వ్రజస్య| తమసః| ద్వారా|
> ఉచ్ఛన్తీః| అవ్రన్| శుచయః| పావకాః]

తూర్పున చీకటి తలుపులు తెరచి ఉజ్వలంగా శుభ్రంగా వెలిగే ఉషస్సు వర్ణితం. ఇక్కడ ఉషస్సు జ్ఞానస్ఫూర్తికీ, తమస్సు అజ్ఞాన రూపానికీ ప్రతీకలు.

> "ఉషస్సు కిర్మీర కవాటం తోస్తూ
> ఒక్కమారు చూచిందటు
> తమస్సు పాషాణ కిరీటం తీస్తూ
> ఒక్క పరుగు తీసిందటు." [2]

ఇవి 'ఉషస్సంధ్య'లో ఆరంభ పంక్తులు. కవి మనోఽంతరాళంలో సుప్తమైన ఉత్తమ సంస్కారం సృజన సందర్భంలో ఒకపుడు భావనాలోకాన్ని వెలిగిస్తుంది. మఱొకపుడు ప్రాకే తీగెకు ఆధారంవలె నిలుస్తుంది. ఈ ప్రభావం ఎలాంటి కళాకారుని సృజన రూపంనుండీ పరిహరింపరానిది. ఈ స్ఫూర్తి విశేషం దాశరథి కల్పించిన ఉషస్సంధ్యలో చూడవచ్చు. ఇక ఆలోచనాక్రమం అనుభూతివలయంనుండి, కల్పనతో మొదలై సామాజిక ఆదర్శాన్ని అందుకునేదిగా కన్పిస్తుంది.

కవిత్వం ఏ భాషకు చెందినదైనా, కొన్ని 'Cyclic patterns' సంకేతింపబడి ఉంటాయి. ఉదాహరణకు భారతీయ సాహిత్యంలో ఋతువులు; వయోఽవస్థలు, రోజుకు సంబంధించిన ఉషస్సంధ్య, సాయంసంధ్య, పగలు, రాత్రి—దశలు. ప్రస్తుతానికి 'ఉషస్సంధ్య' లోని 'Symbolic action'లో cyclic pattern తమస్సు—ఉషస్సు. అయితే ఇందులోని Social design రాజరికం—ప్రజాస్వామ్యం. ఉషస్సు రోజుకు ఆరంభదశ. తమస్సు అంత్యదశ. కాలగతిలో కన్పించే ప్రధానమైన పరివర్తనా సమయం.

ఈ గీతం సమాజ జీవితంలో వేగవంతమైన మార్పును సూచించేది. ఇది ఇంచుమించు 1950 ప్రాంతాల్లో వ్రాయబడినట్లు గుర్తు. (ఈ సంపుటిలో వ్రాసిన కాలం ఇవ్వబడలేదు). తెలంగాణా విముక్తస్థితి; స్వాతంత్ర్యం సిద్ధించి నా భారతదేశం సంపూర్ణంగా సువ్యవస్థితంకాని స్థితి; అంతర్జాతీయ రంగంలో కొరియాయుద్ధం మొదలైన విషాద ఘటనల పరిణామాలనుండి బయట పడనిస్థితి; కవి మనస్సులో చారిత్రక యాథార్థ్యాన్నీ, ఆదర్శతత్వాన్నీ ప్రేరేపించి ఉండవచ్చు. ఈ ప్రేరణలో కవి ఊహ నిరంకుశత్వంనుండి ప్రజాస్వామ్యానికీ; కలనుండి వాస్తవానికీ, అశాంతినుండి శాంతి పథానికి ఉన్ముఖీకృతమైంది.

ఈ దృక్ప్రసారంలో ఈ కవితను విలోకించవలసి ఉంది. ఇక్కడ ఉషస్సు ప్రజాస్వామ్య వ్యవస్థకూ, తమస్సు నిరంకుశమైన రాజరిక వ్యవస్థకూ ప్రతీకలు. తమస్సు ఉషస్సు రెండూ ప్రకృతిలోని పరస్పర విరుద్ధమైన లక్షణాలుగల దృశ్యరూపాలు. ఇక్కడ సమాజపరంగా ప్రతిబింబ (Image) రూపంలో కవితా నిర్మితి జరిగింది. చీకటినుండి వెలుగులోకి చేసే ప్రయాణరూపమే ఈ గీతం. స్థూల ప్రకృతిలోని కఠినమైన వస్తురూపం పాషాణం. లోకంలో అలంకార యోగ్యమైందీ; అధికార సూచకమూ కిరీటం. ఇక్కడ పాషాణం కిరీటం అన్న రెండు పదాల ఎన్నిక విలువైంది. సమాసమూ విచిత్రమైనది. స్వర్ణకిరీటం, మణికిరీటం మొదలైనవి

లోకంలో వాడుకలోనివి. అయితే పాషాణ కిరీటమేమిటి? ఇదెలా? కవితా జగత్తులోనే సాధ్యం! ఇక్కడ పాషాణం అసాధారణమైన కఠోర ప్రవృత్తికీ; కిరీటం నిరంకుశమైన రాజరిక వ్యవస్థకూ ప్రతీకలు.

కిర్మీరం వివిధ వర్ణ సప్తహార చిత్రం. సమాజ పరంగా వివిధ జాతుల భాషల మతాల సామరస్య సంధానకమైంది. ఆశావహమైంది. పైన పేర్కొన్నట్లు, బాధ్యతాయుతమైన ప్రజా స్వామ్యానికి వ్యవస్థలో పరివర్తనం సూచితం. కవాటం తీయడం; వెలుగు ప్రసరించడం; బంధన నుండి విముక్తినీ, స్వేచ్ఛా ప్రభాతాన్నీ విలసితం చేసేవి. ఈ విధంగా ప్రకృతి పరమైన కల్పన సమాజ సంస్థితికి యోజితమయింది. ఇక్కడ ఇంతకు ముందు చెప్పినట్లు చారిత్రకంగా తెలంగాణా విముక్తి లేదా విశేష పరివర్తనను స్ఫూర్తి కట్టించే ఏ సందర్భమైనా కావచ్చు. ఏదో ఒక ఘటనను ప్రత్యేకంగా ఆశ్రయించకపోవడంతో, ఇక్కడ ఆలోచనా విధానంలో రచన సీమల్ని అతిక్రమించిన అతీత లక్షణాన్ని పొందుతూంది.

తమో నిష్క్రమణంతో నిరాశా వృతమైన ఒక ఘట్టం పరిసమాప్తి నొంది; ఉష ఆగమనంతో ఆశా బంధురమైన క్రొత్త ఘట్టం ఆరంభమౌతూంది. ప్రకృతి పరమైన కిర్మీరమూ, పాషాణమూ క్రమంగా కవాటమూ, కిరీటమూ నిర్దేశించే ప్రతీకాంశ **(Symbolic Element)** లో గాఢత్వాన్నీ ఆకర్షణనూ సంతరించిపెడుతున్నాయి. ఉషస్సు కిర్మీర కవాటంతోసూ చూడడం, తమస్సు పాషాణ కిరీటం తీసూ పరుగిడడం, కవి ఆశించిన భావ చిత్రానికి కల్పనలో పుష్టి; గతిలో వేగం సాధిసూ రామణీయకతను సిద్ధింపజేసూంది.

తమస్సు ఉషస్సు రెండు వ్యవస్థలకు ప్రతీకలు. మొదటి దాని విలయ తాండవానికి గురియైన సమాజం తీరు; రెండవ దానిపై తిరుగుబాటు జరిగినప్పటి సమాజం తీరు తరువాత వర్ణితమైంది. మొదటి వ్యవస్థ శిథిలమై, దాని స్థానంలో క్రమంగా రెండోది అవతరించే చారిత్రక సత్యం ఉద్ఘాటితమైంది. [3]

''అటు జీర్ణాలయ రూపమ్ములు
శిథిల వనాంతర కూపమ్ములు'' గాలి వెలుగూ సోకని ఈ శిథిల కూపాల్లో ప్రజల స్థితి దుర్భరం. రాజులు, రాచరికాలు, శాసనాలు, చట్టాలు, జైళ్ళు, పాలకుల క్రౌర్యం, కౌటిల్యం, కసి, మారణాయుధాలు మంటలు మసి, క్షుధార్తులు, భూమందులు.

''సిండికేట్లు మూగ్నేట్లు సేట్లు
నిరుపేదలకు మూసినగేట్లు''—అటు వ్యవస్థ ఇది. దీనిపై తిరుగుబాటు: రక్తపాతం! జలపాతం!

''ఇటు జలపాతానికి నాంది
విద్యుదగ్ని ప్రభవించక ఏముంది ?''

జలపాతం వేగంగా వచ్చే సామాజిక పరివర్తననూ; విద్యుదగ్ని ప్రజల్లోని చైతన్య శక్తినీ సూచిస్తాయి. ఇన్నేళ్ళుగా పేరుకొన్న ''కుళ్ళిన సమాజపు దుర్గంధం'' కొట్టుకపోవడం అనివార్యం. ఇన్ని ''శతాబ్దాలుగా గొంతు దాటి పలుకని శబ్దాలు,'' ఇపుడు గర్జా బంధురాలయ్యాయి. సంఘర్షణలో చనిపోయిన, 'యోధులగుండెలు', తరుణ పయోజాల దండలై ఆశాస్ఫూర్తిని నిలుపుతున్నాయి. ఈ భాగం రెండు వ్యవస్థల మధ్య సంఘర్షణలో ప్రజల త్యాగ నిరతి, అచంచల విశ్వాసం, ఆదర్శం చిత్రితం. ఇది అంత సులభంగా తుదిముట్టే ఘట్టం కాదు. ఈ సందర్భంలో దుష్టులతో తర్జన భర్జన; ప్రజాగళ గర్జనతో వాతావరణం నినదించే శిఖర భూతమైన దశ నుండి తమస్సు స్థానంలో 'ప్రభ'దర్శనమిస్తుంది. గతం నుండి విడివడి భవిష్యత్తులోకి ప్రయాణించే, ఆలోచనా తరంగం ప్రజాశక్తి మయంగా తీర్చబడింది. ఇక్కడ దాశరథి అవలంబించిన రచనా శిల్పం పేర్కొదగింది. ఒక శబ్దం వెనుక నుండి ఒక సంఘటనను స్ఫురింపజేయడం. ఇందులో వాక్య నిర్మాణం పూర్తిగా ఉండదు. కొన్ని శబ్దాల ఉల్లేఖనంతో ఆయా సందర్భాల్లోని సామాజిక స్థితి, ఘర్షణ, పరివర్తనం పాఠకుని మనస్సుకు రూపు కడుతుంది. 'ఇందులో తప్పని సరిగా చారిత్రక గతిని చూపే సంఘటనల క్రమం ఉంటుంది. అటు ఇటు (ప్రగతి నిరోధకులు, ప్రగతి శీలురు) ఇరు పక్షాల మధ్య జరిగిన సంఘర్షణలో ఇరువురినే ఉన్నచోటే నిలిపే రేఖ చెదరడంతో అనిశ్చయమైన స్థితి అంతరించింది. చిరకాలంగా పీడించే వారివల్ల భరింపరాని అన్యాయాలకు గురియై చివరకు విజయం సాధించి నూత్న వ్యవస్థకు పునాదులు వేయడం ఇందులోని మౌలికమైన అంశం. [4]

క్షోభ, ఉద్వేగం రెండూ ఇతని కవిత్వానికి ప్రధానమైన మనస్తత్వ భూమికలు. ఇవే ఇందులో ప్రతి స్థితికీ గాఢమైన రూపాన్నీ, వేగమైన గతినీ ప్రసాదిస్తున్నాయి.

''ఎత్తండి కాంతి పతాకాలు
ఒత్తండి శాంతి బాకాలు
పదండి ఆగామి పథమ్ముల
పాడండి అందాల పదమ్ముల.'' [5]

ఆద్యంతమూ సామూహిక లేదా సామాజిక చైతన్యశీలం **(group or Socialconsciousness)**లో **Poetic action** ప్రచలితం చేయడం ఇతని ప్రత్యేకత.

తమో నిర్గమనంతో ప్రభాతోరణాలతో, పూర్వం తప్పని సరియైన పీడకలలు విస్మరించి చివరకు జాతి సమైక్యంగా ఆశా పథంలో ప్రయాణింపజేసే ప్రయత్నం ఉంది. ఇది పైన పేర్కొ

(మిగతా 28 వ పేజీలో)

శ్రీ పాకాల వెంకట కృష్ణయ్య (సమీక్షా సమీక్ష)

విమర్శకాహంకారం!

పువ్వునకు పరిమళం అబ్బి, దాని సౌందర్యాన్ని ఇబ్బడించినట్లు, "ఈక్ష" శబ్దానికి "సమ్" అనే ఉపసర్గ చేరి దాని అర్థాన్ని సువ్యక్తం చేస్తున్నది. ఒక కళారూపాన్ని పరామర్శించి దాని సిసలైన తత్వాన్ని నిరూపించి చెప్పటమే సమీక్ష. అయితే ఈ పని అర్థం చెప్పగలిగినంత లేదా నిర్వచింపగలిగినంత తేలికైంది మాత్రం కాదు.

విమర్శ, సమీక్ష రెండూ సమానార్థకాలే అయినా, వాటి స్వభావంలోను, స్వరూపంలోను ఈషద్భేదం లేకపోలేదు. విమర్శ ఒకానొక కళావస్తువును ఆమూలాగ్రం చూడంగా పరికించి, అందులో నిగూఢ నిక్షిప్తమై ఉండే అందాన్ని ప్రదర్శిస్తుంది; పాఠకుడు అందుకోజాలని ఆనందానుభూతులను అందిస్తుంది. అంటే — విమర్శ పఠితల బుద్ధి హృదయాలకు వన్నె పెడుతుంది—వికాసాన్ని ఇస్తుంది. దీని పరిధి విస్తృతమైంది.

సమీక్ష కళా రూపాన్ని సమగ్రంగానే పరిశీలిస్తుంది. కాని సంగ్రహంగా ప్రదర్శిస్తుంది. మంచిసెబ్బర్లను స్థాలీపులాక న్యాయ రీతితో నిరూపించి, చాలాభాగాన్ని పాఠకుల ఊహాపోహలకు, ప్రజ్ఞా ప్రాభవాలకు విడిచిపెడుతుంది. ఇది చదువరులకు ఉత్తేజాన్ని ఇస్తుందే తప్ప వికాసాన్ని ఇవ్వదు. అంటే — సత్సమీక్ష చదువరిని తప్పకుండ ఉత్తేజ పరచాలన్నమాట. ఆ ఉత్తేజంతోనే తత్సమీక్షిత గ్రంథాన్ని చదవడానికి పూనుకొంటాడు. ఈ రెండింటి మధ్యా ఇప్పుడు నేను చూపిన తేడాలు వాటి స్వరూప స్వభావాలకే పరిమితం. ఈ పనులను [సమీక్ష, విమర్శ] చేసేవాళ్ల చిత్త వృత్తులకు ఈ పట్టింపులు పట్టవు.

విమర్శకుడు, సమీక్షకుడు ఇద్దరూ ఒక్కరే — అవిభాజ్య అభేదమనస్కులు — అసాధారణ ప్రాగల్భ్య దురంధరులు. సమీక్ష గాని, సవిమర్శనం గాని రెండూ చేసేది విమర్శకుడే. కాబట్టి ఇక్కడ నేను ఏ పదం వాడినా, ఎవరిని పేర్కొన్నా ఇబ్బందిలేదు.

కవికి అవశ్యమైన ప్రతిభావ్యుత్పత్తులు విమర్శకుడికి గూడ అత్యంత ఆవసరం. ఒక్క "సాధికారం" మాత్రమే చాలదు; "సహృదయత" విమర్శకుడికి ఊపిరి. ఈ "సహృదయత" అనేది పారిభాషికం అని నా అభిప్రాయం. ఈ ఒక్క పదంలో విమర్శకుడుకి ఉండవలసిన లక్షణాలన్నీ ఇమిడి ఉన్నాయి. కాబట్టి "సహృదయత" అంటే ఏమిటో మనవి చేస్తాను.

విమర్శకుడు తన చిత్తంలో ఏవిధమైన కశ్మలానికి చోటివ్వకూడదు. మనస్సు పొరల చాటున ఏమూలనైనా మత్సరం మాటు వేసుకొని ఉందేమోనని ముందుగా ఆత్మావలోకనం చేసుకోవాలి.

దృష్టి నిశితము, నిష్పాక్షికము కావాలి. చూపులో ఏ మాత్రం ఏమరుపాటు ఉన్నా దృష్టిదోషం కొట్టి విమర్శ అభాసుపాలవుతుంది. ధ్వనికి ప్రతిధ్వని పుట్టినట్లుగా, కవి హృదయస్పందనకు అనువుగా స్పందించగలిగే నిర్మల హృదయం కావాలి. కవి ఊహించిన భావ సౌందర్యాన్నీ, అర్థ గాంభీర్యాన్నీ పట్టి ప్రదర్శించగలిగే చిత్త సంస్కారం ఉండాలి. హృన్మఃదృక్కులనే ఈ మూడు అంగాలను పరిపూతంగా ఉంచుకోవాలి.

విమర్శను ఒక శాస్త్రంగా అభ్యసించినా, దాన్ని ఒక కళగానే ఉపాసించాలి. ఎందుకంటే — శాస్త్రం దేశకాలబద్ధమైంది; కాగా, కళ దేశ కాలాలకు అతీతమైనది— అది విశ్వజనీనం — విశ్వవ్యాప్తం కాబట్టి శుష్క శాస్త్ర ప్రసంగాలు కట్టిపెట్టి, విశుద్ధ కళా మనస్కతను వెల్లడించే నేర్పరితనముండాలి. ఇవన్నీ కలసి సహృదయత అనిపించుకొంటుంది.

ఇక ఉపోద్ఘాతం కట్టిపెట్టి అసలు విషయానికి వస్తాము. ఈనెల [ఫిబ్రవరి '77] 'భారతి'లో నన్ను ఆశ్చర్యచకితుణ్ణిగాచేసినవి — ఆవేదనాభరితుణ్ణిగా చేసినవి — రెండే రెండు అంశాలు. మొదటిది శ్రీ మరుపూరు కోదండ రామరెడ్డి "కవితాలత" సమీక్ష; రెండవది డా. మురళీధర్‌గారి లేఖ.

మురళీధర్‌గారు కవిని కానివాడి క్రింద జమకట్టి, విమర్శకుణ్ణి అయినవాణ్ణిగా చేసుకొన్నాడు. కాకుంటే ఒకరికి ఆకులో వడ్డించి మరొకరికి కంచంలో వడ్డిస్తారా? ఎందుకో ఇంత వలపక్షం?

అహంకారం అనేది ఒక దుర్గుణం అయినప్పుడు, అది కవికి పనికి రాకుండాపోయి, విమర్శకుడికి మాత్రం ఎట్లా పనికివస్తుంది? కవికైనా, విమర్శకుడికైనా ఉండవలసిందీ, ఉండతగినదీ ఆత్మప్రత్యయం; అహంకారం ఉభయత్ర పరిత్యాజ్యమే. కవి రాసిన పుస్తకాన్ని సమీక్షిస్తున్నంత మాత్రాన విమర్శకుడు కవి కన్న ఎక్కువ దౌలతు వెలగబెట్టే వ్యక్తి కానేరడు. '76అక్టోబరు నెల 'భారతి' నావద్దలేదు. నేను దాన్ని చదవనూలేదు. కాబట్టి "తోటి—తోడి" శబ్దాలపై నాగరాజుగారు చేసిన చర్చ ఏమిటో, కోదండరామ రెడ్డిగారి సమీక్ష ఏ తీరున సాగిందో నాకు తెలియదు. అయినా, కోదండ రామరెడ్డిగారి సమీక్ష ఎంత అధమ స్థాయిలో ఉందో నిరూపించడానికి ముంజేతి కంకణమే [కవితాలత సమీక్ష] ఉంది. ఇక అద్దమెందుకు?

"మగవాళ్ల తప్పేదు గులకరాళ్లలో ఈ గబ్బేదు పుణులు చాలవా ఏమి?" డాక్టర్ జి. వి. సుబ్రహ్మణ్యంగారు "రచయిత్రులే

గాని కవయిత్రులు తక్కువ'' అన్న మాటకు రెడ్డిగారు చేసిన దుర్వ్యాఖ్యానం ఇది. ''మగ మహాకవికి ఈ పైట నోటనుండి బయటకు రానిమాట.'' అని ఇంకొకచోట అసందర్భము, అనుచితము అయిన ప్రసక్తి. ఎవరి ప్రస్తావనకైనా సమయం, సందర్భం ఉండాలి కదా !

కవయిత్రుల కవితల్లో గుణం ఉంటే మెచ్చుకోవచ్చు. కాని ఇక్కడ ''మగవారి'' గాని ''మగ మహాకవి'' యొక్కగాని ప్రసక్తి ఎందుకు ? సమీక్ష అంటే తులనాత్మక పరిశీలనమా ? ఆయన కవయిత్రులపై కురిపించిన ''మెప్పు''ల వర్షంలో ''దెప్పు''ల వడగళ్ళు కుప్పలు కుప్పలు. అర్థం పర్థంలేని సవరణలు, ఆకుకు అందని, పోకకు పొందని నిరర్థక, నిర్హేతుక శాబ్దిక చర్చలు, సందర్భ శుద్ధిలేని ఉటంకింపులు, ఉపదేశాల ఊదరతో నిండిపోయింది సమీక్ష.

కొన్నిచోట్ల ''కవి హృదయమే'' శ్రీ రెడ్డికి అవగత మైనట్లులేదు. కనుకనే వక్ర భాష్యాలు చోటు చేసుకొన్నాయి. ''అమ్మాయీ ! ఎద జాగ్రత్త; పయ్యెద జాగ్రత్త !'' ఈ కాలపు అమ్మాయిల ప్రేమకలాప వైఫల్య జనిత దుర్భర శోకమయ జీవితాలను దృష్టిలో ఉంచుకొని కవయిత్రి ఆవేదనతో చెప్పిన కవితా వాక్కు. ''ఎద, పయ్యెద''అనే అల్పాక్షర విన్యాసంలో అనల్పార్థం లాస్యం చేస్తున్నది. శబ్ద సౌందర్యమూ, అర్థ గౌరవమూ, పరస్పరం పందెం వేసుకొని, మనోజ్ఞ భావాన్ని వెలారుస్తున్నాయి. తొందరపడి ఏ ''అయ్య'' కైనా హృదయం అర్పిస్తావేమో ? ఒకవేళ అర్పించినా, ఆ''అయ్య'' బుద్ధీ, గుణమూతెలుసుకోకుండా, వాడి బులిపింపులకు మోసపోయి, ఆవేశానికిలోనై సౌశీల్యాన్ని పాడు చేసుకొంటావేమో ? అన్న హెచ్చరిక కవితా రూపంలో సాక్షాత్కరిస్తూంది.

ఎవరో సినిమా కవి, ఏదో సినిమాలో ''పిల్లా ! రెండూ జాగరత — ఆ రెండూ జాగరత !'' అన్నాడు. కాని సినిమాపాటలో పోకిరితనమేగాని పదాల పొంకంలేదు. మొరటుతనం తప్ప సున్నితం లేదు. కొంటెతనమేగాని కవిత్వం కనబడదు. ఈ అవలక్షణాలన్నిటిని తొలిగించి సలక్షణమైన శబ్దాలకూర్పుతో ఔచిత్యాన్ని పోషించిన కవయిత్రి నిజంగా ప్రశంసార్హమే. ఇంతటి మనోజ్ఞ శబ్దార్థ భావ సౌందర్యాన్ని రెడ్డిగారు ఏదో ''మానా'' క్రింద జమకట్టి ఒక ప్రశంసాపత్రం ఇచ్చినట్టు భ్రమింపజెయ్యడం శోచనీయం. భావసౌందర్యం ''మానా'' అయితే, కావ్యం ఎక్కాల పుస్తకం కావొద్దూ ? ఏమాట కామాటే చెప్పుకోవాలి. రెడ్డిగారు ''ముని పత్నుల ఉపదేశంలా'' ఉందన్న ''మనవు జాగ్రత్త, మనుగడ జాగ్రత్త'' అన్న పాదం నిష్కర్షగా భావ పునరుక్తి. కాబట్టి నిస్సంశయంగా దోషమే.

ఇంకొక అసందర్భ ప్రసంగం ఏమిటంటే — రెడ్డిగారు అన్నారే ''మానా'' — ఆ ''మానా'' కు తిక్కన స్త్రీపర్వంలోని ''మగవారిని చిత్రంలో చూడగానే పైట సవరించుకొనే రాణివాసపు స్త్రీ పోలికలని విలాపాలకు'' పోలిక చెప్పడం — ఇది పీర్లపండుగకు అమావాస్యకు ఉన్న పోలిక లాంటిదే! ఇటువంటి పోలికల పేలికలు ఎందుకు ? నేను స్త్రీ పర్వం చదివానని మనకు చెప్పకోడానికేనా? పాపం శ్రీ శ్రీ ఎంత అమాయికుడండీ — భారతం 18 పర్వాలను తాను చదవలేదని కంఠోక్తిగాచెప్పి, ఒప్పేసుకొన్నాడు.

ఇక రెడ్డిగారు ''ఎత్తిన మడుగుల'' సంగతి పరికిస్తాం. గురజాడ సత్యకుమారి ''బాధలకు మడుగు లొత్తారి'' అన్నదట. ఆడగూతురు గదా హడలగొట్టడం తేలిక అనుకొన్నట్లుంది. అంతే అమాంతం దాన్ని పట్టుకొని సారహీనమైన ఒక శాబ్దిక చర్చ చేశాడు. ''మడుగులు ఉతికి చలువ చేసిన వస్త్రములు.'' పాపం— సత్యకుమారికి ఈ అర్థం తెలియదు కాబోలు !

''ఇవి వేసి నడిపించి ఎత్తి మరల ముందు పరచి పెద్దలను పేరంటాళ్లను నడిపిస్తారు. కాబట్టి ఇది ఎత్తడంగాని ఒత్తడం గాదు'' అని రెడ్డిగారి ఆక్షేపణతో కూడిన సవరణ.

చదవకముందు ''పెసలు'' అంటున్నవాడు చదివిన తర్వాత ''పిసలు'' అన్నాడట. రెడ్డిగారి పాండిత్యపు వెర్రి ముదిరి పిచ్చిగా మారుతూంది. ''అడుగులకు మడుగు లొత్తడం'' అనేది అప్పట మైన జాతీయం. ''దాస్య వృత్తిని భజించటం'' అని అర్థం. ఆంధ్రదేశంలో ఏ మూలకు వెళ్ళినా, ఏనోట విన్నా ''మడుగు లొత్తు'' అనే వాడుక. ఊరందరిదీ ఒకదారి ఉలిపికట్టె దొకదారి అన్నట్లు రెడ్డిగారు మాత్రం ''ఎత్తు'' అనాలంటున్నాడు. వ్యవహార ప్రతీతమైన ఒక జాతీయాన్ని, అట్లగాదు ఇట్ల అని సవరించే హక్కుగాని, శాసించే అధికారంగాని రెడ్డికిలేదు. అడుగులు + ఒత్తు=అడుగులొత్తు. ''ఒత్తు'' అనే ధాతువుకు ''చేర్చు'' అనే అర్థం కూడ ఉంది. అట్లా మడుగులను చేర్చి, పరచి ఎత్తేవాడు ఒకడే — చాకలి. ఇది రెడ్డిగారికి తెలియకపోతే లోకమంతటికి తెలియనట్లేనా?'' ''మడుగులొత్తు'' అనేదే సరియైన రూపం.

ఈ ''తింటోంది'' వర్తమానమో, భవిష్యత్తో తెలియక మా ప్రాంతం వారిని కొంత తికమక పెడుతుంది. నాదీ నెల్లూరు జిల్లాయే. నాకు అటువంటి ''తికమక'' కలగడంలేదు. అది వర్తమానకాల క్రియ అని స్పష్టంగా తెలుస్తూంది. సుమిత్రాదేవి ''పగలంతా నిద్రతోటె'' ''తోటె గాదు తోడె'' అని దోష నిరూపణం. ఏం ? ఎందువల్ల 'తోటె' కాకూడదు?

డా. మురళీధర్‌గారన్నట్లు అనుచిత పద ప్రయోగాన్ని సవరించే హక్కు విమర్శకుడికి ఉంది. కాని అతడు సూచించిన పదం సందర్భానికి చక్కగా ఇమిడి, కవి వాడిన పదంకన్నా అర్థవంతమూ, ఔచిత్య వంతము అయినదిగా ఉండాలి. కాని ఈ న్యాయం సమానార్థకాలు, అందునా అవ్యయాలు అయిన ''తోడె— తోటె'' వంటి శబ్దాలకు చెల్లదు. వ్యవహారంలో ''తోటె'' అనే రూపం ఉంది. కవయిత్రి వాడింది రెడ్డిగారికి ఇష్టం లేకపోతే మించిపోయింది లేదు. విమర్శకుడు తన అభిరుచులను ప్రీత్య ప్రీతులను కాదు చెప్పవలసింది; అనుభూతి విశేషాన్ని విశ్లేషించాలి.

20వ శతాబ్దంలో బ్రతుకుతున్న కవులకు 11వ శతాబ్దం నాటి భాష, దాన్ని వ్యాకరించిన చిన్నయసూరి మాత్రమే ప్రమాణం

వీణ తీగలు మ్రోగుట మాని నపుడు
 మెదలు అల్లన ఎద ఎదో మధుర రవము
రజము, దళములు ధూళిలో రాలిపడిన
కదలు మదిలో గులాబుల కమ్మ తావి !

ఆమె లేదిపుడైన ఆ అమరలలిత
శోణ సుషమాధరోదిత శుభ్రహాస
చంద్రికా హిమానీ శీత సారమటులె
ఈ హృదంత రాళములో చలించు సతము !

ఆమె మోహన లోల నేత్రాంత చలిత
రమ్య పుష్కరణీ గభీరతలు నేడు
నాదు చూపుల కందకున్నను మదీయ
హృదయ వీథుల నిరతము కదలు అటులె !

తీయనగు ఆమె ఎలుగులో కోయిలముల
కుహూకుహూలు, పావురముల కూజితములు,
తుమ్మెదల ఝుమ ఝుమలు నిత్యమ్ము నాదు
గుండెలో ప్రతిధ్వనితముల్ కోమలముగ !

ఇచట ఈ శేషవేళ ఈ ఇరులలోన
ఒంటరిగ ఉన్న నా మ్రోడుటుల్లమందు
ఆరటము దీర్చి ఓదార్చు అమృతస్మృతులు :
పల్లవించును లే సుప్రభాతమనుచు—

మరల ఆ హాస మానీలిమలు మనోజ్ఞ
మా గళము హిమ బిందువులందు, కొలను
లోతులను, శకుంతాళుల గీతములను
స్ఫురిత మౌనులే అనుచు ... ...

శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి

విమర్శకాహంకారం!

కాజాలరు. భాషాయోషను ''గోషాబూబు''గా కాక, ప్రజాముఖ ఆరామ సీమల్లో హాయిగా, స్వేచ్ఛగా విహరించే దివ్యసుందరిగానే దర్శిస్తారు. ఆ వాగ్దేవి అపురూప పదవిన్యాస లాస్యాలకు తమ కావ్యాలను రంగస్థలంగా చేస్తారు. ''కాదన్న మాదన్న''లను కాలం ఖాతరు చెయ్యదు.

నెల్లూరి మాండలికాలకు ఒక నిఘంటువునే తయారుచేసిన పెద్దమనిషి ''తింటోంది'' అనే వేరొక మాండలికాన్ని ఎగతాళి చేస్తున్నాడు. చేసిన పనికి చెప్పే మాటకు పొత్తు లేకపోతే చిత్తశుద్ధి లోపముకాదా? కవులు మాండలికాలు వాడటంలో ఉద్దేశం ఏమిటి ? వాటికి — ప్రాంతీయ సంకుచితత్వం సమసిపోయి, విశాలాంధ్రత్వం వొంటబట్టాలనే సదుద్దేశమే కదా ! ''తింటోంది'' అనేమాటను నెల్లూరువాళ్లు హేళనచేస్తే, ''యాడికి బోతా ఉండావో'' అనే మా యాసను బాసను కృష్ణా, గుంటూరీయులు ఎద్దేవా చెయ్యరా? విమర్శకుడిలో ఔదార్యం సానుభూతి లోపించినపుడు పరిహాసధోరణి పండ్లికిలిస్తుంది.

''ఇట్టివి ఛందోబద్ధమై ఉంటే సూక్తి రత్నాలు కావా?' అని ఒక ఉపదేశం. ఏం చేస్తాం ? ఇది గద్యపు ఏలాపు వెర్రికాలం గదా!'' అని ఇంకొక ఆక్షేపణ.

చెప్పదలచుకొన్న భావాన్ని పద్యంలో చెప్పాలా లేక గద్యంలో చెప్పవలెనా — అనేది కవి ఇంగితానికీ, స్వేచ్ఛకు సంబంధించిన విషయం. ఈ స్వేచ్ఛను కాదనే హక్కుగాని, ఆక్షేపించే అర్హతగాని విమర్శకుడికి లేదు. ఇటువంటి ఉపదేశాలు, ఆక్షేపణలు అహంకార జనితాలు. ఈ అహంకారం విమర్శకుడికి ఉండవచ్చని మురళీధర్ గారు వకాల్తా పుచ్చుకొంటున్నాడు. ఇక మన సాహిత్యాన్ని దేవుడే రక్షించాలి ! విమర్శకుడు ఉపదేష్టగా వేషం మార్చుకొంటే సాహిత్యానికి అంతకన్న అనర్థం ఇంకొకటి లేదు.

విమర్శకుడికి, అనుచిత పద ప్రయోగాన్ని పరిహరించి ఉచిత పదాన్ని సూచించే అధికారం ఉందనుకొన్నాం. అది ఎట్లాంటిదో - రెడ్డిగారు తన సమీక్షలో వాడిన ఒక వాక్యాన్ని తీసుకొని— మనవి చేస్తాను. చిత్తగించండి. ''ఇట్లాంటి పుస్తకాలు విసుగు లేకుండా పఠనాసక్తిని కలిగిస్తవి. ఇవి రుచులూరే ఏటి చలమలు''. అన్నారు రెడ్డిగారు. రుచులూరేది ఏటిలో కాదండి, మన నోటిలో! కాబట్టి దాన్ని ''రుచులూరించే'' అని ప్రేరణార్థకం చేస్తే అనే అర్థవంతం, ఔచిత్యవంతం. ''తెలియనివన్ని దిట్ట తనాన'' అది చాటు పద్యాన్ని రామకృష్ణుడే చెప్పినాడో, కాక ఇంకెవరైనా చెప్పినారో కాని, అది అన్ని కాలాలకు అప్పటంగా అతికిపోతూంది.

ఎట్లయితేనేం? ''మహిళామణులచేత కాలి తన్నులు తప్పించుకొని చేతి తాకుడు చేతనే ప్రఫుల్ల నవళ సురభిళ సుమాలను పూచిక'' ''కవితాలత'' రెడ్డిగారి కర్కశపాదతాడనాలను మాత్రం తప్పించుకోలేకపోయింది. అయ్యో, కవితాలతా ! !

ఏరు ఎండిపోయింది!

శ్రీ మేకా మన్మధరావు

నీరింకిపోయి, నేడు
ఏరు ఎండిపోయింది!
లంగరేసిన పడవలా
ఆ యేటి ఒడ్డునే మా వూరు!
మా వూరి వాకిట ఆ యేరు
తెగిన పూల పేరు!!

నిన్న మొన్నటి వరకూ
ఎడ తెగక పారిన ఆ యేరు —
చెట్లు పరచిన నీడల చాపపైన
పసిపిల్లలా తృళ్ళింతలాడేది!
గట్లు రెప్పల నడుమ కలలా సాగేది
కట్ట పెదవి పైని పాటలా మ్రోగేది!
చిల్లులు బడ్డ బీళ్ళ గుండెలను
పిల్లన గ్రోవి చేసి
సస్య శ్యామల గీతాలను పాడించేది!
అలల మువ్వలు కాళ్ళకు కట్టుకొని
పరుగులెత్తే యేటి నవ్వులు —
గట్టు ఒడిని పువ్వులు ... పిట్టగొంతున పాటలు!

నీరింకిపోయి, నేడు
ఆ యేరు ఎండిపోయింది!
ఎండిపోయిన యేటి శరీరంలోని
అలల జాడల బొమికలు
స్పష్టంగా అగుపిస్తున్నాయి!
ఇంకిన కళ్ల గోతుల లోతుల నుండి
తొంగి చూచే పీడ కలలవలె
ఏటి బొరియల్లోంచి తొంగిచూచే పీతలు!
సిరివి కోల్పోయిన కారణంగా
స్నేహితుని విడిచిపెట్టే కృతఘ్నునిలా —
యేరు చేతులమీద ఈత నేర్చిన నత్తలూ
యేరు గుండెలమీద గంతులు వేసిన కప్పలూ
ఎండిన ఆ యేరు విడిచి
ఉండిన నీటి కొరకు వలసపోయాయి!

రెక్కల తెరచాపలు విప్పి
యేటి యెదపైన ఎగిరే పిట్టల పడవలు
చెట్ల కొమ్మలపైన మొగ్గలైనాయి!
ముఖాలను త్రిప్పుకొన్నాయి!!

ఆత్మీయత చంపుకోలేని చేపలు కొన్ని
అక్కడే ఆత్మబలి గావించుకున్నాయి!

కార్చ కన్నీరైనా లేని యేరు
నిర్వాంతపోయి నిలుచుండిపోయింది!
యేటి చెవిజేరి కీచురాళ్లు, ఈ వేళ
రామ మంత్రాన్ని చదువుతున్నాయి!
ఎండిన గుండె పూవును దోసిలిలో నింపి
యేటి కాళ్లవద్ద నిలచిందో పిచ్చిమొక్క!!

శ్రీ సోమసుందర్

ఆంధ్రమహాకావ్యాల గురించి ఆంగ్లంలో...

[గ్రంథసమాలోచన]

ఆంధ్ర మహాకావ్యాల గురించి ఆంగ్లంలో రచించబడిన లఘు వ్యాసాలగురించి ఆంధ్రంలో రాస్తున్న సమీక్ష యిది! ఈ లోకంలో ఎన్నెన్ని వ్యత్యాసాలు సంభవించడంలేదు? అట్టిమాదిరి గానే ఇదీ ఒక పేరడాక్సే!

సుప్రసిద్ధులూ,వయోవృద్ధులూ, వెనకటితరం మహాకవులకు మిత్రులూ శ్రీఆచంట జానకిరామ్‌గారు''Glimpses into Telugu classics'' అనే గ్రంథనామంతో (డెమ్మీ ఆక్టోవ్ సైజులో 78+4+4+10 పుటల) ఆంగ్ల వ్యాసాలను సంకలించారు. శ్రీమతి దుర్గాబాయ్ దేశముఖ్ గారికి అంకితమిచ్చారు. దీనిని వారు హైదరాబాద్—ఆంధ్రమహిళాసభ పక్షాన ప్రచురించారు. ప్రఖ్యాత విద్యావేత్త శ్రీ ఎమ్. వి. రాజగోపాల్‌గారు దీనికి పదిపుటల ఉపోద్ఘాతం రచించారు. వ్యాసకర్త స్వయంగా నాలుగు పుటల గ్రంథ ప్రవేశిక రచించారు.

ఈ గ్రంథంలో బమ్మెర పోతనామాత్యుని శ్రీ మదాంధ్ర మహాభాగవతం గురించి ఆరున్నర పుటలలోనూ, శ్రీనాథుని శృంగార నైషథం గురించి ఆరున్నర పుటలలోనూ, అల్లసాని పెద్దన్న మను చరిత్రగురించి ఏడుం పాతిక పుటలలోనూ, నంది తిమ్మన్న పారి జాతాపహరణం గురించి తొమ్మిదిన్నర పుటలలోనూ, శ్రీకృష్ణదేవ రాయని ఆముక్తమాల్యద గురించి ఏడున్నర పుటలలోనూ, ధూర్జటి విరచిత శ్రీ కాళహస్తిమాహాత్మ్యం గురించి తొమ్మిదిన్నర పుటల లోనూ, పింగళి సూరన్న కళాపూర్ణోదయ ప్రభావతీ ప్రద్యుమ్నాల గురించి ఏడున్నర పుటలలోనూ, చామకూర వెంకటకవి విజయ విలాసం గురించి ఐదున్నర పుటలలోనూ శ్రీ జానకిరామ్ వ్యాసాలు రచించారు.

చక్కని ముఖపత్రంతో విలువైన కాగితంపై ముచ్చట కొలిపే అచ్చులో ముద్రింపబడింది. ఐనా మూడురూపాయలకే అందివ్వగలగడం సాహసోపేతమైన గొప్ప పని! ఇదీ ఈ గ్రంథ భౌతిక స్వరూప ప్రదర్శనం!

2

ఒక రచయిత ఒక రచననుగాని, ఒక గ్రంథాన్ని రచిస్తున్నపుడు,—ముఖ్యంగా ప్రచురిస్తున్నపుడు—దానికి పాఠకు లెట్టివారో నిర్దిష్టంగా ఒక స్థూలస్వరూపాన్ని మనసులో ఏర్పరచుకోవాలి. తెలుగు మహాకావ్యాల గురించిన ఈ గ్రంథం తెలుగువారికే ఆంగ్లంలో చెబుతున్నారనుకుందామా అంటే—ఇందలి విషయ విశ్లేషణం సామాన్య పాఠకుని జ్ఞానపరిధికి మించలేదు. పోనీ కేవలం ఆంగ్ల భాషతో మాత్రమే పరిచయమున్న ఆంధ్రేతర పాఠకులకు దీనిని నిర్దేశించారందామా—వ్యాసం మధ్య మధ్య తెలుగు లిపిలో తెలుగు పద్యాలు ఉల్లేఖితం కావాల్సిన అవసరమూలేదు. పైగా ఇంతటి లఘుపరిచయాలవల్ల ఆంధ్రేతర కవితాభిమానులకు మన అలఘు కావ్యాల గురించి చేకూర్చే జ్ఞానసంపదా ఇంచుమించు మృగ్యమే అవుతుంది. ఇంతకీ పిండితార్థం ఏమంటే—ఈ గ్రంథంద్వారా రచయిత సాధించదలచిన ప్రయోజన మేమిటో దాదాపు అనిర్దిష్టంగానే ఉండిపోయింది.

పోతే శ్రీ జానకిరామ్‌కు ఆంధ్రమహాకావ్యాలతో ఈషన్మాత్ర పరిచయం కలదనీ, వారు ఆంగ్లంలో కూడా వ్యాస రచన చేయగల రనీ మాత్రం (పూర్ తెలుగు పీపుల్!) తెలుసుకుందుకు ఉపయుక్తమవుతుంది! అంతకన్న అధికంగా ఈ గ్రంథం సాధించే పరమ ప్రయోజనమేదో ఎంత తల బాదుకున్నా ఈ వ్యాసకర్తకు కిట్టుబాటు కాలేదు! పైగా తెలుగు పద్యాలలో కోయిల అనే పదం ఎక్కడ ప్రయుక్తమైనా—దానిని వివరించవలసివచ్చినా—ఈ రచయిత కుండలీకరణంలో 'Akin to the Skylark'అని అర్థం చెబుతూ ఉంటారు. దీనినిబట్టి యూరోపియన్ దేశాలలోగల ఆంధ్ర భాషాభిమానుల కోసం ఈ గ్రంథం ఉద్దేశింపబడి ఉంటుందన్న సదభిప్రాయం కలగడం సబబే! కాని ఇదీ కేవలం భ్రమేనని నాలుగు పుటలు క్షుణ్ణంగా చదివినవారికి తెలిసిపోతుంది. తెలుగు కోయిల గురించి స్కైలార్క్‌వంటి పక్షి అని వివరించడం పిల్లి అంటే మార్జాలం అని అర్థం చెప్పడం వంటిదేకదా! పోతే యూరోపియన్ దేశాల, ఇతరేతర ప్రపంచదేశాలగల ఆంధ్రేతరులు మన

మహత్తరమైన ఆంధ్ర సాహిత్యంకోసం తహతహలాడిపోతూ ఈ గ్రంథంకోసం అర్రులు సాచుకుని ఉరకలిడతా రనడానికి సముచిత సాక్ష్యాధారాలు లభించవు. ఆధునిక నాగరక భాషలలో నేడు ప్రవర్థిల్లుతున్న వైమర్శిక దృక్పథంగాని, ప్రవర్తిల్లుతున్న ఫక్కీగాని శ్రీ జానకిరావ్ ఈ రచనలో అవలంబించలేదు. ఆధునికాంగ్ల సాహిత్యంతోనూ, ఆంగ్లంలో వెలువడుతున్న వైమర్శిక గ్రంథాలతోనూ ఏమాత్రం పరిచయం ఉన్నవారికేనా ఈగ్రంథం పేలవ మనిపించక తప్పదు! పైగా రచయిత చాలా సీరియస్గా చెబుతున్న అంశాలు ఎంత శ్రుతపాండిత్యపు హోయలో అవగతమై లోలోపల నవ్వు పుట్టిస్తాయేతప్ప సహృదయ పాఠకునికి జ్ఞానదాయికగా నిలవలేవు!

3

ఈ గ్రంథాన్ని శ్రీమతి దుర్గాబాయ్ దేశముఖ్ గారికి అంకితం చేయడం చాల గొప్ప సంగతి! హృద్యమూ అనవద్యమూ అగు సన్నివేశం. ఆమె యావదాంధ్రులకూ పూజనీయ వ్యక్తి! ముఖ్యంగా మాకు మరీ సన్నిహితారాధ్య! అంకితమిస్తూ శ్రీ జానకిరావ్ రాసినట్లు—శ్రీమతి దుర్గాబాయ్ ఆశయాలకూ, ఆచరణకూ, మధ్య అగడ్తలు నిల్పుకొన్నవారు కాదు. ఆమె వ్యక్తిత్వం తేజస్వంతం; శక్తి సంధానమూను! ఆమె బాధిత మానవశ్రేణిని ఉన్నతోన్నత పథాల నిల్పకలిగిన మహావ్యక్తి! యుగపురుషుడు శ్రీ వీరేశలింగం పంతులు తర్వాత అనాథ స్త్రీ జనోద్ధరణకు, ఇంత నిర్దిష్ట పథాలను ఇంత విస్తృత పథకాలుగా నిర్మించిన వ్యక్తి మరొకరు కానరారనడం అతిశయోక్తి కాదు. అట్టి ఉదాత్త వ్యక్తికి ఎన్నో ఉదాత్త గ్రంథాలు అంకితం కావలసి ఉండగా, ఈ గ్రంథమంకితం కావడమే దీని కబ్బిన ప్రాముఖ్యత!

ద్వంద్వ నీతులలో కునారిల్లుతూ వచ్చిన మన సాంఘిక దురాచారాలపై ఎత్తిన కుఠారధారగా ప్రతి సన్నివేశంలోనూ శ్రీమతి దుర్గాబాయ్ ఆచరణ ధ్రువపరిచింది. సాంఘిక విషమ నియమాల నుల్లంఘించి ఆమె పసినాడు కాకినాడ కాలేజీలో చదువుకుందుకు చేరి, అప్పటి సైన్సు ఉపన్యాసకులూ, అభ్యుదయవాదీ శ్రీ గోపరాజు రామచంద్రరావుగారి ఆధ్వర్యంలో మొదటి వనితగా సైకిలు త్రొక్కడం నేర్చుకొన్నది లగాయతు — హైదరాబాద్లో నేడు ఆంధ్రమహిళా సభ వంటి మహోత్తమ సంస్థను స్థాపించే వరకూ ప్రతి చారిత్రక సన్నివేశంలోనూ ఆమె ఆచరణ మూఢాచారాలపై ఎత్తిన రక్త ధ్వజమే! శ్రీమతి దుర్గాబాయ్ గారిది అనుల్లంఘనీయ వ్యక్తిత్వం! అట్టివారికి అంకిత మీయ బడిన గ్రంథంగా దీనికొక కృతార్థత చేకూరింది. అస్మదాదుల వ్యాస పీఠంపై కెక్కగలిగే అర్హతను సముపార్జించుకోగలిగింది.

4

శ్రీ రాజగోపాల్ విపులంగా రచించిన పీఠికలో ఆంధ్ర సాహిత్య చరిత్రను స్థాలీపులాకంగా సమీక్షించారు. వారికిగల పరిధికి అతీతమే అయినా—తెలిసినది కడుపులో యిముడక, ఎప్పుడో పరాస్తమైన కాలదోషం పట్టిన ఆముక్తమాల్యద కర్తృత్వ సమస్యను అనుచితంగా స్పృశించారుకూడా! మర్శించమంటే స్పృశించకుండా విడువలేరు కొందరు. కాని సాహిత్యంలో ఇలాంటి అంశాలగురించి ఎత్తుకుంటే కూలంకష చర్చ చేయక స్పర్శా మాత్రంగా తడివి విడిచిపెట్టడం వల్ల మొత్తం తెలుగు జాతికీ, తెలుగు భాషకీ ప్రమాద మొకటి కలిగే అవకాశముంది. తెలుగు సాహిత్యంతో లోతైన పరిచయంలేని ఇతర దేశీయులకు మన సాహిత్యంపై, మన వాళ్ల నైచ్యంపై ఏహ్య భావమే వృద్ధిపొందే అవకాశముంది తప్ప మేలేమీ జరుగదు.

పైగా వీరు—శ్రీకృష్ణదేవరాయల కవితా యుగమని చారిత్రకంగా సంబంధంలేని ఇతర కవులను కూడ కొండ గుర్తుగా విజయనగర ఆస్థాన కవులుగా పేర్కొన్నారు. ఇది వీరికి సాహిత్యంలో గల ప్రాథమిక పరిచయాన్ని మాత్రమే తెలుపుతుంది. దురదృష్టవశాత్తూ ఈ దేశంలో గత దశాబ్దద్వయంలో పండిత ప్రోక్తమైన భువన విజయం అనే ఒక ఫార్సు అమలులోకి వచ్చింది. ఈ పగటి వేషగాళ్ళకు ఏవో సాహిత్యపు మాటలను, మేథానూ ప్రదర్శించి పొట్ట పోసుకోడానికొక తమాషా లభించింది. ఆ భువన విజయంలో శ్రీకృష్ణ దేవరాయల వేషధారి అనే వాడొకడుంటూ ఉండేవాడు. వాడు అక్షరాస్యుడైనా కావచ్చు, లేదా నిరక్షరకుక్షి అయినా ఫరవాలేదు. వారి ఆస్థానానికి సంబంధం ఉన్నా లేకపోయినా పదిహేను పదహారు శతాబ్దాలకు చెందిన ప్రముఖ కవులందరినీ కట్టకట్టి అష్ట దిగ్గజాలుగా పేర్కొనడం ఒక సంప్రదాయిక మూఢ విశ్వాసంగా పరిఢవిల్లుతూ వచ్చి వచ్చి ఇటీవలనే కాలం చేసింది! దిక్కులేని ప్రేక్షకులను రెండున్నర గంటలకాలం ఈ పండితమ్మన్యులైన పగటివేషగాళ్లు బోర్ కొట్టడం తప్పింది! ఈ మేజువాణీకి ప్రేక్షకుల మూజువాణీ అసమ్మతి అందిందో ఏమో మోజు తగ్గిపోయింది. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే—అట్టి సంప్రదాయక మూఢ విశ్వాసమే పీఠికాకారుని క్షుణ్ణంగా బంధించింది. పెద్దన్న, తిమ్మన్న, ధూర్జటి, పింగళి సూరన్న, రామరాజభూషణ కవీశ్వరులంతా శ్రీకృష్ణ దేవరాయల ఆస్థాన కవులేనన్న సూత్రబద్ధంచేయడం జరిగింది. ఈ వ్యాసకర్త స్పృశించకపోవడంవల్లకాబోలు—పీఠికలో తెనాలి రామకృష్ణకవి విడిచిపెట్టబడి బ్రతికి పోయాడు!

5

ప్రాచీనాంధ్ర సాహిత్యంలోని మహాకావ్యాల గురించి ఆధునిక దృక్పథంతో సద్విమర్శలు రచించుకోవలసిన అవసరం మనకెంతో వుంది. ఆ సత్కార్యం సోదరకవి శ్రీ ఆరుద్ర తన 'సమగ్రాంధ్ర సాహిత్యం'లో నెరవేరుస్తాడని ఆశించిన అస్మదాదులకు ఆశాభంగమే అయింది.

ఆధునిక సద్విమర్శ రచించేందుకు ఒక రచయితకు ఆధునిక దృక్పథం పుష్కలంగా ఉండాలి. ఆధునిక దృక్పథం అంటేనే

విశ్వాసం కాదనీ వివేకమనీ అర్థం. హేతువాద సంబుద్ధితో వాస్తవి కాధారాలపై నెలకొన్న తర్కంతో ఆధునిక విమర్శ సాహితీ వ్యాఖ్యానంగా సాగవలసి వుంది. అది లేనివారు చర్విత చర్వణంగా ఆంధ్ర మహాకావ్యాలగురించి ఆంగ్లంలో రాసినా లేక రష్యన్‌లో రాసినా ఫలితం ఒక్కటే. పిష్టపేషణానికి కూడా విలువ కట్టే షరాబు లెవరైనా ఉంటారేమో వెదకడం మంచిదే !

వ్యాసమహర్షి భారతం చెబుతూ ఉండగా గణపతి తన తుండం చూపుకు అడ్డుపడకుండా ప్రక్కకు తొలగించి బుద్ధిగా కూర్చుని రాశాడనే మూఢ విశ్వాసాన్ని పునరుద్ఘాటించే దేవానాం ప్రియులకు ఆధునిక దృక్పథం ఉందనడానికి సాక్ష్యాధారాలు లభించవు. అట్టి 'నేత్ర' కుసుమ భూషణులు మన ప్రాచీన మహా కావ్యాల గురించి చేసిన విమర్శ ఉన్నతలోకాల విహరించగల దనుకోవడం దురాశ ! ఈ గ్రంథకర్త రచించిన నాలుగు పుటల పరిచయ వ్యాసంనిండా హేతువాదానికి నిలవని మూఢ విశ్వాసాలు అసంఖ్యాకంగా పునరుద్ఘాటితమయ్యాయి! వివేకమూ, హేతువాద దృక్పథమూ ఉండడానికి నాస్తికులో గతి తార్కిక భౌతిక వాదులో కావాలన్న షరతు ఎక్కడా లేదు. ఆధునికాంగ్ల సాహిత్య విమర్శకు నూత్న దృక్కోణా లెన్నో కూర్చిన టి. ఎస్. ఎలియట్ తన్ను తాను మతంలో ఆంగ్లోకేథలిక్‌ననీ, రాజకీయంగా ప్రభుభక్తి పరాయణుడననీ, సాహిత్యపరంగా క్లాసిసిస్టుననీ తెల్పుకున్నాడు. ఐనా విమర్శలో ఎక్కడా సంప్రదాయవాదాన్ని అంగీకరించలేదు. అలాగే ఎడిత్ సిట్వెల్ ! ఈమె మధ్య యుగాల మహాకవి ఎలెగ్జాండర్ పోప్ గురించి ఒక చక్కని గ్రంథం రచించింది. ఆ గ్రంథం చదివిన వారికి క్లాసిక్సు గురించి ఆధునికులు వహించవలసిన దృక్పథం ఎట్టిదో తప్పక బోధపడుతుంది. **"Arnold's poetry has tlittle technical interest. It is academic poetry in the best sense"** అని పూర్వకవుల గురించి ఖచ్చితంగా అనగలిగిన హృదయ దార్ఢ్యం ఎలియట్‌వంటి ఆధునికాంగ్ల విమర్శకుల కుంటుంది. అంత నిర్మొహమాటంగా ఎవరిగురించైనా తెలుగులో అన్నామా దానిని నిందగా జమకట్టి వీలయితే ఉరిశిక్ష వేసే ప్రయత్నం చేస్తారు మన సాహిత్యాధికారులు ! (ఈ దేశాన్ని అధికార సాహితీపరులు, సాహిత్యాధికారులు అనే రెండు అరిష్టవర్గాలు పీడిస్తున్నాయి !] నిజాయితీ, త్రికరణశుద్ధీ పాశ్చాత్యుల జీవ లక్షణాలు. ఒకరి ప్రీత్యర్థం నీళ్ళ నమలడమో, ఇష్టం లేని దానిపట్ల ఇష్టమున్నట్లో, తెలియనిదానినిగురించి తెలిసినట్లో దొంగనటనలు చేయడం, చిరకాల బానిసలుగా బ్రతికిన ఈ దేశవాసుల లక్షణం. సదరు అవాంఛిత లక్షణాలన్నీ మన విమర్శకమ్మన్యులకూ అబ్బాయి. నిజాయితీ ఉంటేనే ప్రాచీన కావ్యాలపట్లగాని, సమకాలీన కావ్యాలపట్లగాని, ఆధునిక కావ్యాలపట్లగాని, ఒక విమర్శకుడు నిగ్గుతేల్చగలడు. ప్రాచీన మహాకావ్యాలను ఆధునికులు విమర్శించేటపుడు గతానుగతిక సంప్రదాయబద్ధబుద్ధితోగాక హేతుబద్ధమైన ఆధునిక దృక్పథంతో విమర్శ సాగించడమే సృజనాత్మకమవుతుంది. లేకపోతే చర్వితచర్వణాలైన ఆనుపూర్వీక మూఢ విశ్వాసాలు ఏకరువు పెట్టడమే సాహిత్య విమర్శగా భ్రమించబడుతుంది. శ్రీ జానకిరావ్‌గారికీ వ్యాస రచనలో అలాంటి దోషదృక్ ఏర్పడటం దురదృష్టం ! నిజానికి గ్రంథాన్ని విమర్శ అనకూడదు. ప్రాచీనాంధ్ర మహాకావ్యాలలోనికి ఆంగ్లభాషా పరంగా కావించిన తొంగి చూపు మాత్రమే ! కనుకనే వారొసగిన గ్రంథనామం సరైనదే !

6

ఆంధ్ర మహాభాగవత అవతరణ గురించి రాస్తూ, బమ్మెర పోతన్న గోదావరీ పుణ్యోదక స్నాతుడై బయటకు వస్తూండగా శ్రీరామ చంద్రుడు సాక్షాత్కరించి భాగవతం రచించమని ఆదేశించినట్లున్నూ, ఆ ఆనతి బడసిన నాటినుంచి శ్రీరాముడే స్వయంగా పోతన్నతో సహవాసం చేయగా ఆ మహాకార్యం నిర్వర్తించినట్లున్నూ విశ్వసించబడుతున్న జానపద గాథను శ్రీ జానకిరావ్ 5వ పుటలో పునరుద్ఘాటించారు. ఇలాంటి పుక్కిటి పురాణాలను ఆధారం చేసుకోవడం ఆధునిక విమర్శ నేత్రానికి సహకరించదు. దాని కాధారమంటూ ''పలికెడిది భాగవతమట !'' అనే పద్య పాదాలను ఉల్లేఖించారుకూడా ! భాగవత ప్రాశస్త్యాన్ని తెలుపుతూ వీరు — **"It serves as a store-house of spiritual as well as secular knowledge guiding one to live a purposeful life and kindness to all"** అని 7వ పుటలో ఉద్ఘాటించడం కూడా అనూచాన విశ్వాసానికి సంబంధించిందే తప్ప ఆధునిక దృక్పథాన్ని ప్రోదిచేసేది కాదు. పైగా వీరు పై వాక్యంలో **'secular'** అనే పదాన్ని ఎలా ప్రయుక్తం చేశారో తెలియదు. వైదిక మత పునరుద్ధరణ కోసమూ, దేవేంద్రపదవిని సుస్థిరం చేసేందుకూ మాత్రమే భాగవత రచన సాగింది. అది దాని ప్రయోజనం కాకపోతే బలిచక్రవర్తివంటి శిష్టసుకృతిని వధించడానికి వామనావతారం ఎత్తడంలో ప్రయోజనమే లేదు. వీరి వ్యాసంలో 'మందారమకరంద' వంటి ప్రఖ్యాత పద్యాలను మూడో నాలుగో ఎత్తివ్రాసి వాటికి ఆంగ్లంలో భావార్థం రాసి తమ విమర్శ వ్యాపారం ముగించుకొన్నారు. గజేంద్రమోక్ష ఘట్టంలోని 'సిరికిన్ చెప్పడు...' అనే పద్యానికి ఆంగ్లంలో భావార్థం మాత్రమేరాశారు. మూలంలో లేని పమిట అనే ప్రయోగం ఒకటి చేసి దానికి ఆంగ్లంలో అర్థ వివరణ చేశారు. పయ్యెద, పైట అనే ప్రయోగాలే తప్ప తెలుగు భాషలో పమిట అనే ప్రయోగం ఎక్కడా కనిపించదు. ఈ సందర్భంలో అసలే లేదు.

శ్రీనాథుని శృంగారనైషధ కావ్యం గురించిన వ్యాసం కొంత మెరుగే. కారణమేమంటే తదాదిగా వీరు ఆంధ్ర మహాకావ్యాల మూలకథను చక్కని ఆంగ్లంలో సంగ్రహంగా రాసి యెడ నెడ నచ్చిన పద్యాలు ఉల్లేఖించి తమ పని ముగించుకొన్నారు. కాని మూలంలోని పద్యాలను ఉల్లేఖించేటపుడు గణ యతి భంగాలు ఎందుకు వాటిల్లాయో అంతుపట్టదు. వారు చూపిన పద్య స్వరూపమిది :

'కనకశైలంబు డిగ్గియాకశాన సింధు
సలిలము దోగి మిగులంగ చల్లనైన'

పై పద్య ప్రథమ పాదంలో 'యాకశాన సింధు' అన్నచోట గణ భంగమే కాక యతి భంగంకూడా వాటిల్లింది. అలాగే ద్వితీయ పాదంలో 'సలిలము దోగి' అన్నప్పుడు కూడా గణ భంగమే. ఇలాంటి స్వల్పదోషాలు వాటిల్లకుండా జాగ్రత్తపడకపోవడం న్యాయంకాదు. పై విదంగానే మరో పద్యం ''నందనోద్యాన వీధికాంతారములందు'' అన్నచోట కూడా అనవసరంగా ల వచ్చి చేరి గణభంగం చేసింది. దీనికి ప్రధాన కారణం వీరికి ఛందస్సు గురించిన ప్రాథమిక అవ గాహన లేకపోవడమే తప్ప అన్యంకాదు. పెద్దన్నగారి ప్రఖ్యాత పద్యం 'అట జని కాంచె...' కూడా విశేష దోషభూయిష్టంగానే ముద్రిత మైంది. నైషధాది మహాకావ్యాల గాథలను వీరు అభిరుచిదాయక మైన ఆంగ్లంలో క్లుప్తంగా చెప్పడం ప్రాథమిక సాహిత్యాభిలాషకు దోహదం చేయగలదనడం నిర్వివాదమే !

7

ఆముక్తమాల్యద గురించిన ఎనిమిది పుటల వ్యాసాన్ని ముగిస్తూ, కర్తృత్వ వివాద సమస్య నుటంకించి ఒక పేరా రాశారు. (46వ పుట) కృష్ణదేవరాయల పరిపాలనానంతరం తలలెత్తిన అల్ప కవులు ఈ మహాకావ్య కర్తృత్వాన్ని పెద్దన్నగారికి అంటకట్టారనీ, అది అసత్యంగా ఆధునిక విమర్శకు లసంఖ్యాకులు ధ్రువపరిచారనీ చెప్పి ముగించారు. క్రీడాభిరామం కర్తృత్వ మీమాంసలో వల్లభ రాయ శ్రీనాథులమధ్య వివాదం ఏర్పడటానికి, క్రీడాభిరామంనిండా బహుళంగా శ్రీనాథుని శైలీ విన్యాసమైనా కనిపించి ఉత్తరసాక్ష్యం పలుకుతుంది. కొన్ని పద్యాల ఎత్తుగడ—శ్రీనాథునికి తప్ప యితరులు మరెవ్వరికీ సాధ్యంకాని వ్యక్తిత్వ ముద్రతో భాసిస్తుంది. లోకవృత్త ప్రదర్శనలో శ్రీనాథునిదైన నిశితబుద్ధి ద్యోతకమవుతుంది. మంచన శర్మ శ్రీనాథునికీ, టిట్టిభుడు అవచి తిప్పయ్యశెట్టిగారికీ మారు పేర్లు కావుకదా అనే అనుమానం అడుగడుగునా కలుగుతుంది. ఇన్ని పోలికలున్నా యిక్కడే మరోతిరుగుడు లేకపోలేదు. అచ్చుమచ్చుగా శ్రీనాథుని ప్రతిబింబాలే నెలకొల్పిన వల్లభరాయలవంటి అనుకరణ శీలుడైన అల్పకవి తన స్వీయకర్తృత్వ ప్రకటనకు ముఖం చెల్లక తానుగా అది శ్రీనాథుని కృతమేనని కూడా ప్రచారంచేయడానికి అవకాశం లేకపోలేదు. నవీన కాలంలో సెట్టి లక్ష్మీనరసింహం శ్రీకృష్ణ శతకం అనే బూతుకావ్యం రాసి తన పేరు పెట్టుకోలేక శ్రీనాథుని పేర చలామణీ చేయడం సాహితీ పరులందరూ ఎరిగినదే కదా ?

కాని శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో ప్రదర్శించిన శైలికీ, పెద్దన్న మను చరిత్రలో ప్రదర్శించిన శైలికీ లోకవృత్త ప్రదర్శనకీ ఎక్కడా పోలికే దొరకదు. అలాంటిది ఆముక్తమాల్యద కర్తృత్వం పెద్దన్నగారికి ఏ దుర్బుద్ధితో అంటకట్టారో దుర్మా ర్గులు! సాహిత్య లోకంలో కూడా లఘుపతనకుల జాతి వారు సర్వ కాలాలలోనూ ఉంటారు.

ఈ గ్రంథంలోనే 27వ పుటలో తిమ్మన్నగారి పారిజాతాప హరణ ప్రస్తావనలో ఉటంకించిన సీసపద్యం— ''నీలమేఘము డాలు డీలు సేయగ జాలు మెరుగు జామనచాయ మేనితోడ'' ప్రభృతి నాలుగు పాదాలూ ఒక్క అక్షరమైనా మార్పులేకుండా యథాతథంగా ఆముక్తమాల్యద అవతారిక పద్యాలలో ఆంధ్రమహావిష్ణువు స్వప్న సాక్షాత్కారం కలిగించి ఆముక్తమాల్యదను రచింపుమని శ్రీకృష్ణ దేవరాయలకు తెల్పినట్లు వర్ణించిన పద్యంగా పునర్లిఖితమై 40వ పుటలో ఉల్లేఖితమైంది. ఎత్తుగీతమాత్రం పూర్తిగా మార్పు చెందింది. ఇది ఎలా చేరిందో, తిమ్మన్నగారి పద్యాన్ని దొంగిలించే నీచత్వానికి దేవరాయలను ఎవరు గురిచేశారో పరిశోధకులు విచా రించాల్సిందే !

ఏమైనా శ్రీ జానకిరావ్ ఆముక్తమాల్యద కర్తృత్వ వివాదం ప్రస్తావించకపోవడమే మేలుగా ఉండేది. తెలుగు సాహి త్యంతో గాఢ పరిచయంలేని ఇతరేతరులు ఈ గ్రంథం చదవడం తటస్థించితే—లేనిపోని శంకాకుల మానసులు కావడం తప్ప వేరే ప్రయోజనమేమీ ఇందువల్ల నెరవేరదు!

8

వీరు నిర్వహించిన ఆరవ మహా కావ్యం —ధూర్జటి విరచిత శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యం. దేవరాయలవారి ఆస్థానంలోగల అష్ట దిగ్గజాలలో ధూర్జటి ఒకరని వీరు నుడివారే తప్ప ఆస్థాన కవు లెవరో కేటాయించలేదు. సాంప్రదాయిక మూఢవిశ్వాసంతో పింగళి సూరన్ననీ, రామరాజ భూషణ కవినీ ఆ పట్టికలో చేర్చారు. ఆధు నిక పరిశోధనల ఫలితంగానూ, దరిమిలా లభించిన శాసనాల ఫలితం గానూ వీరిరువురూ కృష్ణదేవరాయల అనంతరం వారనీ, వీరసలా చక్రవర్తిని ఎరుగరనీ పరిశోధకులు తేల్చిన విషయం వీరి గమనానికి అందకపోవడం దురదృష్టం. కేంద్ర సాహిత్య ఎకాడమీకోసం స్వర్గీయ డాక్టర్ గిడుగు సీతాపతిగారు రచించిన 'ఆంధ్ర సాహిత్య చరిత్ర' అనే ఆంగ్ల గ్రంథం ముప్పయ్యవ పుటలో 'అష్టదిగ్గజాల గురించిన చర్చ' చాలా సోపపత్తికంగా జరిపి ఉన్నారు. కనీసం ఆ గ్రంథమైనా వీరు చూడకపోవడం శోచనీయమే !

ధూర్జటి సైతం రాయలవారి ఆస్థాన కవీశ్వరులలో ఉన్నాడో లేదో పరిశోధకులు దృఢ పరచవలసే ఉన్నదని ఈ సమీక్షా కర్త అనుమానిస్తున్నాడు. ధూర్జటి రాయల ఆస్థాన కవీశ్వరుడే అయితే—దాదాపు వీరశైవుడైన ఈ కవిని, విశిష్టాద్వైత మతావ లంబకుడగు చక్రవర్తి ఎంత పరమత సహిష్ణుతతో సమాదరిం చాడో అంచనా వేయడానికే అబ్బురం కలిగిస్తుంది. కాని రాయల వారి కావ్యం ఆముక్త మాల్యద మాత్రం ఈ పరమత సహిష్ణుతకు సాక్ష్యాధారాలు నెలకొల్పడం లేదు. పైగా పరమతాలన్నిటినీ చిత్తు చేయడానికి స్వయంగా విష్ణువు కల్పించుకుని విష్ణుచిత్తుణ్ణి పంప డమే యిందులో ప్రధాన ఆధారకథ ! ఒక కావ్యగత కథ ననుసరించే కవిని మదింపు చేయబోతే ఎప్పుడూ సత్య సందర్శనం లభించదని ఈ సమీక్షకుడెరుగనిది కాదు. కాని ఆ కావ్యగత విచారధారమే రాయలవారి వ్యక్తిగత లక్షణ మనుకుంటే మాత్రం ఆయనకి ధూర్జటి ఆమడల దూరంలో ఉండవలసినవాడు. అందులో సందే హం లేదు.

పోతే—''అతులిత మాధురీమహిమ...'' అనేది ధూర్జటికి కితాబే అయితే, దాన్ని పరిపోషించిన పద్యంలో ప్రసర్శితమైన

కార్యకారణ సంబంధ విశ్లేషణం అశ్లీల భరమై సభ్యతాలోకానికి అసహ్యం కలిగిస్తుంది. ధూర్జటి ప్రదర్శించిన శివభక్తి పరాయణత్వానికీ, వ్యక్తిగతంగా వేశ్యాలంపట ప్రవృత్తికీ సంగతి లభించక ఆ కవి ప్రదర్శించిన విశ్వాసాలన్నీ నిరాధారమైనవనీ, కవి హృదయం ద్వంద్వ ప్రకృతి అనీ నిర్ద్వంద్వంగా ఆవిష్కృతమై కవిపట్ల పాఠకునికి ఏహ్యత కలుగుతుంది. ధూర్జటి రెండు కావ్యాలలోనూ గాఢంగా ప్రదర్శించిన శివభక్తి పరాయణత ఒక ఖేలావిలాస వైఖరిగా స్ఫురిస్తుంది. కవి మృషాజీవిగా సాక్షాత్కరిస్తాడు. తనకు జాతి కల్పించిన గౌరవస్థానాన్ని తానుగా వైదొలగించుకొన్న వాడవుతాడు. కనక ఇలాంటి శుష్కమైన కితాబులతో ఒక కవిని కొలవడం మానేస్తేతప్ప మన సాహిత్యానికి సద్గతి లభించదు. కట్టుకథలపై సాహిత్య పరిశోధన ఆధారపడకుండా గతితర్కబుద్ధితో పరిశీలన జరిపితేతప్ప మౌలిక సత్యాలు బయటపడవు.

ఈ ఘట్టంలో ఉల్లేఖించబడిన ప్రతి పద్యంలోనూ ముద్రణా స్ఖాలిత్యాలు కొల్లలు. మన తెలుగు ముద్రణ ప్రారంభమై దాదాపు శతాబ్దం పూర్తికావస్తోంది. అయినా ఇంకా ఎంత వెనుకపడిఉందో చూస్తే బాధ కలుగుతుంది. దీన్ని మెరుగుపరిచే సాంకేతిక పరిశోధనలు జరిపితే బాగుండును. అంతవరకూ ముద్రణా స్ఖాలిత్యాలను రచయిత అజ్ఞానబుద్ధితో చేసిన దోషాలుగా ఆపాదించే బుద్ధిమంతులైన విమర్శకులు వర్ధిల్లడం తప్పదు!

తరువాతి వ్యాసం పింగళి సూరన్నగారి కళాపూర్ణోదయమూ, ఏ, భారతీ ప్రద్యుమ్నాల గురించినది ప్రారంభిస్తూ—గ్రంథకర్త రాయల పరిపాలనా కాలానికి కొన్ని దశాబ్దాల తర్వాత ఈ కావ్యాలు రచించబడ్డాయన్నారు. అట్టి వీరే పింగళి సూరన్నని అష్టదిగ్గజాలలో ఒకరుగా ఎలా చేర్చారో అంతుచిక్కదు. వ్యాసారంభంలో కళాపూర్ణోదయకావ్యం గురించి మహాపండితుడు డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి గొప్ప ప్రామాణిక విమర్శ చేసిన సంగతి ప్రస్తావిస్తూ శ్రీ జానకిరావ్ ఇలా అంటారు: "Dr, Reddy was the product of the Oxford University. So, he examined this work minutely, using certain tenets of Western literary criticism, which do not really apply to an classies which are full of oriental structure" అంటూ ఒక తీర్పు చెప్పారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ విద్యార్థిత్వం అన్నదేదో అవగుణమైనట్లు! షెల్లీ మహాకవికి విద్యగఱపిన విశ్వవిద్యాలయమది! షెల్లీ నాస్తికత్వంపై ఒక వ్యాసం రాసినందుకు యూనివర్సిటీనుంచి బర్తరఫ్ చేశారన్న అంశంవేరు. ఆడెన్ మహాకవి కవిత్వాచార్యుడుగా చివరి దశాబ్దిలో ఉద్యోగంచేసిన విశ్వవిద్యాలయమది. ఎందరెందరో హేమాహేమీలా యూనివర్సిటీ ప్రోడక్టులేనన్న సత్యం శ్రీ రామలింగారెడ్డి విషయంలో ఒక గర్వకారణమే! పోతే ప్రాచ్యకావ్య విమర్శకు పాశ్చాత్యదేశాల విమర్శనా సూత్రాలు ఎలా సరిపడవో సోదాహరణంగా చూపవలసిన బాధ్యత విమర్శకుడైనవాడికుండితీరాలి. అది లేకుండా ఉత్తనే గాలికబుర్లు చెబితే చెల్లదు.

ఆధునిక విమర్శనా పద్ధతికి శ్రీకారం చుట్టిన మహనీయుడు శ్రీ కట్టమంచి. వారే దానికి ఆద్యులు కాదని ఎవరో ఈ మధ్య శుష్కపరిశోధనాపరులొక పొలికేక పెట్టడం వినిపిస్తోంది. ఇలాంటి వాటివల్ల సత్యాన్వేషణకాక మరేదో జరుగుతుంది. ముఖ్యంగా ఆధునికుడనని చెప్పకొనే శ్రీ జానకిరావ్‌వంటివారి నోటినుంచి రాకూడని మాట ఇది! పైగా కట్టమంచివారి వ్యాసాలు ఎందుకు చదవడం ముఖ్యమో వీరు సిపార్సు చేస్తున్న ధోరణి బహుచమత్కారంగా వుంది. 'మన మహాకావ్యాలగురించి మన దృక్పథం ఎంత విపరీత పరిణామం పొందిందో తెలుసుకుందుకే' చదవాలట! (పుట 57 మొదటి పేరా) ఎలా రాయకూడదో తెలుసుకుందుకు మనం మన ప్రాచీన కావ్యాలు చదవాలని శ్రీ శ్రీ గారు చెప్పిన శుష్కప్రియం వంటిదే ఇదీని! ఇక్కడ చెప్పవలసిన సంగతి ఒక్కటే—శ్రీ జానకిరావ్ రెండావులపాలు తాగే పెయ్య మాత్రమే నని!

9

ఇలా రాసుకుంటూ పోతే ఎంతగ్రంథమైనా సాగగలదు! ఇంతవరకూ రాసిన ఈ నవభాగ సమన్విత సమీక్షయే చాలు — ఈ గ్రంథ జాతకాన్ని గుణించడానికి! వీరు రచించిన ఈ గ్రంథం మన ప్రాచీన మహాకావ్యాల లఘుపరిచయం మాత్రమే. కాని వీరికి అలవికానివీ, అందనివీ అగు విమర్శనా పరిధులలోనికి అనవసరంగా మెడ సాచడమే చమత్కారంగా ఉంటుంది.

గత తరానికి చెందిన, నాకు సాహిత్యపరంగానూ, వ్యక్తిపరంగానూ ఎంతో గౌరవనీయులైన మహా వ్యక్తులకు శ్రీ జానకిరావ్ అనుంగుచెలికాడు! ఆకాశవాణిలో రెండు మూడు దశాబ్దాలపాటు అవిరళ కృషిసలిపి, సాహిత్య ప్రమోక్తగా ఆధునిక సాహిత్యం విపరీతవేగం పుంజుకొందుకు వీరొనర్చిన అమూల్యసేవ విస్మరణీయం కాదు. అన్నిటికీ మించి నాకు వ్యక్తిగతంగా గౌరవభాజనులైన మిత్రులు. మైత్రీబంధం సాహితీ సత్య సందర్శనకు నేత్రావరోధం కాకుండా ఉండేందుకు నేనీ సమీక్షలో సలిపినకృషి విజయవంతమైతేనే కృతార్థత!

ఈ సమీక్ష ముగిస్తూ ఒక సూచన చేయదలచాను. ఈ గ్రంథం మన ప్రాచీన మహాకావ్యాలపై ప్రాథమికులకు గౌరవపురస్సరమైన పరిచయాభినివేశాలు కలిగిస్తుందనడంలో నా కెట్టి సందేహమూ లేదు. పైగా 'డర్టీ తెలుగు' లో చదవడమేమిటన్న వెర్రి మోజులో ఏదైనా ఆంగ్లంలో తప్ప చదవని మన అధికారపు మనవాళ్ళయ్యలకు మన ప్రాచీన సాహితీ వైభవం ఈషన్మాత్రంగానైనా పరిచయమై గౌరవం కలిగించకపోదు. ముఖ్యంగా పొట్టచేత పట్టుకొని, వేలాది మైళ్ళకావలకు వలసపోయి, తరతరాలుగా జీవిస్తున్న ప్రవాసాంధ్రపుత్రులు తెలుగు సాహిత్య సంపదతో పరిచయం కలిగించుకుందుకు తహతహ లాడటం ఇటీవల ఎంతగానో ప్రదర్శితమవుతోంది. కాబట్టి మన ఆంధ్రప్రభుత్వ విద్యా సాంస్కృతిక శాఖ, ఆంధ్ర మహిళా సభవారు ప్రచురించిన ఈ గ్రంథం తాలూకు ప్రతులనన్నిటినీ సొంతంగా సముచితమైన ఖరీదుచెల్లించి తీసుకొని, మలేషియా, మారిషస్ దేశాల తెలుగు యువతీ యువకులకు పారితోషికంగా పంపడం ఎంతయినా మేలు చేకూర్చగలదు! ఆ మేరకు మన ప్రభుత్వం వారికిది సూచనగా కాక, హృదయపూర్వక అభ్యర్థనగా మనవి చేస్తూ, ఈ సమీక్ష ముగిస్తాను. ఈ సముచితచర్య తప్పకఉభయతారకమై భాసించగలదనివిశ్వసిస్తున్నాను.

శ్రీ పులికంటి కృష్ణారెడ్డి

శివపూజ

నేనూ శివుడు స్నేహితులం !

బొడ్డు కోసినపుడు వాడికి పెట్టినపేరు శివకుమార్!— ఆ తరువాత యింట్లోవాళ్ళు ఆ పేరునే రెండుగాకోసి రెండవ భాగాన్ని వదలిపెట్టి మొదటి భాగానికి ఆప్యాయతను, అనురాగాన్ని రంగరించి 'శివా!' అని ముద్దుగా పిలుచుకొనేవారు. కానీ నేను మాత్రం 'శివుడూ!' అంటుంటాను.

శివుడు నేనూ ఒక కంచములో తినలేదు. ఒక మంచములో పడుకోలేదు. ఒక బడిలో చదువుకోలేదు. ఒకచోట కలిసి ఆడుకోలేదు.

అయినా మేము స్నేహితులం !

ఏది వుండి యేది లేకున్నా కనీసం వయస్సులు లేదు అభిప్రాయాలైన కలిస్తే—సాధారణంగా స్నేహం కలవడానికి అవకాశాలెక్కువ. అవయినా వున్నాయా?—అంటే, అవీలేవు. నా బదుకులో పొద్దువాలితే వాడి బతుకులో పొద్దు మొలిచి యిప్పుడిప్పుడే బారెడెక్కింది. ఇక అభిప్రాయాలందామా?—ఊరుచూడమంటే ఉత్తరం చూస్తుంటాయి. ఉప్పును నిప్పుసు మతికి తెస్తుంటాయి.

అయినా మేము స్నేహితులం!

ఇది భిన్నత్వంలో ఏకత్వం !

దీనిని పూర్వజన్మ సుకృతమంటాను నేను. 'పూర్వజన్మము... సుకృతము...గాడిద గుడ్డూ—యేవీలేవు. ఇది కేవలం శాస్త్రం. వ్యతిరేక ధృవాలు ఆకర్షింపబడుతాయి. ఇది సహజం'—అంటాడు శివుడు. అది పూర్వజన్మ సుకృత ఫలమో? వ్యతిరేక ధృవాల ఆకర్షణ శాస్త్రమో? తెలియదు కానీ—

మేము మాత్రం స్నేహితులం !

ఆరేడు సంవత్సరాల క్రిందటిమాట. తిరుమల కొండమీద బంగళా తోటవద్ద నడుస్తున్నాను. ఆర్ష సదస్సునుండి శ్రావ్యమైన గాత్రం భక్తిగీతాన్ని ఆలాపిస్తూ వుంది. ఆ మధురిమలు కొండల్లో కోనల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. అనుభవిస్తూ నడుస్తున్న నా దృష్టిని ఓ కుర్రవాడు ఆకర్షించాడు.

పదహారు లేక పదిహేడేండ్లుంటాయి. ఓ పొట్టి నిక్కరు, చొక్కా తొడుక్కొన్నాడు. ఓ రావిచెట్టుక్రింద కూర్చుని ఆ బోడెకు చేరగిలబడి ఎటో చూస్తున్నాడు. ఆ బుల్లోడి వైఖరి గమనిస్తూంటే ఎవరో ఆరితేరిన వృద్ధుడు తీరుబాటుగా కూర్చుని జీవిత సత్యాన్వేషణలో మునిగి తేలుతున్నాడా? అనిపిస్తూ వుంది. చూడముచ్చట గొలుపుతున్నాడు. నిలబడి కాసేపు నిదానించి చూశాను. ఆశ్చర్యం!—నేనూ చిన్నప్పుడు అలానే వుండి వుంటానేమో? అన్న భావన మనసులో మెదిలింది. మనసు మరింత దగ్గరయింది. దగ్గరికి వెళ్ళాను. ఆ దారివెంబడి ఎందరో వస్తున్నారు, పోతున్నారు. ఎవరికీ, ఏమీ, పట్టనట్టుగా ఎవరిదారి వారిదిగావుంటే—నేను ప్రత్యేకించి ఆ కుర్రవాడి దగ్గర చేరానన్న భావనతోనేమో, ఎగిరిపడి లేచాడు. రెండుచేతులు జోడించి నమస్కరించాడు. వినయశీలత వినమ్రుణ్ణి చేసింది.

''ఏ వూరు బాబూ?''

''తిరుపతి''

''ఏం చదువుతున్నావు?''

''పదవ తరగతి పాసయ్యాను.''

''ఇక్కడ యిలా ఒంటరిగా కూర్చున్నావెందుకు?''— అలాంటి సమయాల్లో అలాంటి చోటుల్లో సరదాగా ఎవరైన కూర్చోవచ్చు. కానీ ఆ కుర్రవాడి వైఖరిలో ఏదో నిస్సహాయత కొట్టవచ్చినట్లు కనుపిస్తూంటే అడుగుదామని అడిగాను. ఒకసారి నావైపు చూశాడు దీనంగా. మళ్ళీ తలవాల్చుకొన్నాడు మౌనంగా!

''ఏం జరిగింది చెప్పుబాబూ!'' ఆప్యాయత ఉట్టిపడేలా అడిగాను.

మళ్ళీ ఒకసారి తలఎత్తి చూశాడు. కళ్ళనిండుకునీళ్ళు!—ప్రయత్న పూర్వకంగా ఆపుకొంటున్నట్లుంది. నా మనసుద్రవించింది. మరింత దగ్గరయ్యాను. భుజం తడుతూ బుజ్జగిస్తూ అడిగాను మళ్ళీ—ఏం జరిగిందో చెప్పమని!''

''గుళ్ళో ఎవరో జేబు కొట్టేశారుసార్!'' చాల బాధగా అన్నాడు.

''ఓస్! అంతేనా!'' నేను తేలికగా నవ్వేశాను.

ఆ కుర్రవాడు వింతగా చూస్తున్నాడు నావైపు.

ఏం బాబూ! అలా వింతగా చూస్తున్నావు?''

''జేబులు కొట్టడమంటే మీకు నవ్వులాటగా వుందని.''

''జేబులు కొట్టడం, బ్రదుకులు కొట్టడం, తలలుకొట్టడం—కొందరి అవసరానికీ, మరికొందరి ఆనందానికి తమ్ముడూ!.. ఈ వయస్సుకే యింత ఆలోచనలో పడితే యెలా?''

''అదిగాదు సార్! ఈఅడవుల్లో పులులు, సింహాలుంటాయి. అవి నోరులేని జంతువులు. అవి ఆహారంకోసమో, ఆనందం

కోసమో, యితర జంతువుల్ని చంపుతాయి కానీ, స్వజాతినిమాత్రం తాకడం లేదు. మరి మనిషి మనస్సుండి కూడా సాటిమనిషి నెత్తి మీదనే చెయ్యి బెట్టుతున్నాడే?''—

ఆ లేతహృదయములో పుట్టిన భావమో, లేక యే మహా కవి అభిప్రాయమో? తెలియదు. అవసరంలేదు. కానీ ఆలోచనా విధానానికి ముగ్ధుడినయ్యాను.

ఆనాటినుండి నేనూ శివుడు స్నేహితులం!

నా అభిప్రాయాలు వాడికి నచ్చవు. ఉపన్యాసాలమీద అసలు అభిప్రాయమే వుండదు. అయినా వాడు నన్ను 'గురువుగారూ!' అని సంబోధిస్తాడు.

ఆకాశంబుననుండి శంభుని శిరంబందుండి... అన్నట్లుగా ఆకాశమంత ఎత్తులో వుండిన ఈ గురుశబ్దము భూలోకములో పడి, అటుపై చిత్రసీమలో స్వైరవిహారంచేసి ఆ తరువాత బస్సు స్టాండులను ఆశ్రయించి అక్కడకూడా తలదాచుకోలేక పాతాళ ములో పడిపోయిన ఈ రోజుల్లో 'గురుశబ్దము' వెక్కిరింతగా విని పిస్తుంది—ఎవరైనా పలుకుతూంటే. అయితే శివుడి నోట్లో అలాగాదు. అది పరిమితము. మృదుమధురము. 'గురువుగారూ!' అని పిలుస్తూంటే ఎంతో యింపుగావుండి మరలా మరలా పిలి పించుకోవాలనిపిస్తుంది. అయితే అదే కుదరదు.

శివుడు చదువుకొంటున్నాడు. శివుడు తింటున్నాడు. శివుడు నిద్రపోతున్నాడు. శివుడేకాదు—దాదాపు వాడి వయసులో వున్న వారందరూ అదేపని చేస్తుంటారు. అయితే తీరికవేళల్లో వాడి వయసు కుర్రవాళ్ళు బజార్లమీద పడుతున్నారు. సినిమా హాళ్ళ మీద దాడిచేస్తున్నారు. గుళ్ళల్లో గుంపుచేరుతున్నారు. అవసరానవస రాలమాట అటుంచి కంపుచేస్తున్నారు. అందమైన అమ్మాయిలు కంటపడితే అంతకంటే అందమైన మాటలు గాలిపరం చేస్తు న్నారు. కళ్ళతో అందాన్ని తాగేయాలని తపనపడుతున్నారు. అది వాళ్ళ తప్పుగాదు. వయస్సులు అలాంటివి. అయితే శివుడుమాత్రం తీరిక దొరికితేచాలు నాతో కలసి తిరుగుతాడు. మేము కలసి తిరుగు తూంటే లోకం మాతో కలసి తిరుగుతుంది. ఊరకే తిరిగినా పరవా లేదు. నోరు పారేసుకొంటుంది. లోకం నోరు పారేస్తుంటే శివుడు నోరు చప్పరిస్తాడు. దాని తీరే అంత—అంటాడు.

అంత చిన్న వయస్సులోని వాడి వైఖరికి అబ్బురపడి అటుపై ఆలోచనలోపడి తరువాత అసూయపడడమే నా వంతు!

ఆ రోజు ఆదివారం. నిద్రలేస్తూనే నేను పూర్తిచేయా లనుకొన్న రచన 'హీరో కృష్ణ'గారి ఏకపాత్రాభినయం. పాపం కృష్ణ నాలుగైదు వారాలనుండి ఎదుటపడినప్పుడంతా నిలదీసి అడక్కపోయినా అడిగినంత పనిచేస్తున్నాడు. ఎక్కడో పోటీలట! నగదుబహుమతి మటి పెద్ద మొత్తములో వుందట!—

''చూడండిసార్! ఎన్నో పరిషత్తుల్లో పాల్గొన్నాను. ఎన్నో బహుమతులు లభించాయి. ఈ వెండి పై కప్పులకప్పులమీద మోజు తీరిపోయింది. దీనిని గ్రహించినట్లున్నారు పరిషత్తు నిర్వాహ కులు. ఏదో డబ్బుమోజు చూపుతున్నారు. అదీగాక నా బదుకును మీలాంటి రచయితల చేతుల్లోపెట్టి ఏకపాత్రాభినయంగా ఆడి ఆశ తీర్చుకోవాలన్న తపన సార్ తపన!''—అంటూ అదోరకంగా పెడతాడు మొగాన్ని. అదిచూస్తే 'అయ్యో! పాపం!' అనిపిస్తుంది. అందుకే అప్పటికే నాలుగైదు వారాలుగ వాయిదాపడిన రచన పూర్తిచేసి కానీ పైకిలేవగూడదనుకొన్నాను. అయితే ఎక్కడ ఎలా ఆరంభించి ఎలా ముగించాలో తోచక తికమకలు పడుతున్నాను.

''ఏం రాతలో నా తలరాతలు! ఆదివారం పూటయినా ఓ సినిమానా? పాడా? ఈ బతుక్కి ఓ పండగా పబ్బమా?... నేనూ చూస్తుండా ఈ యింట్లో అడుగుపెట్టింది మొదలు, అంత మంచి మొగానికి అర్ధసేరు పసుపా? అన్నట్లు సాగుతూంది నా బతుకు!''—

అయిదురోజులక్రితం జ్వరంతగిలి మంచంమీద పడివున్న ఆరవ 'అమ్మాయికి జావకాయడానికి నూకవిసరుతూ శ్రీమతి ఒక్కొక్క మాటగా విసురుతూవుంది. మంచంమీద అమ్మాయి మూలుగుతూ వుంది. కడగొట్టు నలుసు దేకుతూ దేకుతూ తల్లి ఒడి వరకు దేకి ఆపై రవికముడికై వెదకి, 'ఛళ్ళు'న చెంపదెబ్బ తిని ఆరున్నొక్క రాగాన్ని అందంగా ఆలాపిస్తున్నాడు. 'హీరో కృష్ణ' నన్ను వేధిస్తున్నాడు. కొంపలో జీవుల వేదన. నాలో జీవుని వేదన. ఈ వాతావరణాన్ని వదలి నిరుపహతి స్థలానికై అన్వేషణ సాగిద్దామంటే—వీళ్ళకంటే చురుగ్గా వున్నాడు సూర్యుడు. గుడి కంటే యిల్లే భద్రం ఈ రోజుల్లో. చతికిలబడి ఆమీద కాగితం మీద పడ్డాను.

ఎంతసేపు గడిచిందో తెలియదు. మంచంమీద మూలుగు తున్న అమ్మాయి మగత నిద్రలోవుంది. ఆ ప్రక్కనే కూర్చుని మంచంకోడుకు తల ఆనించి శ్రీమతి చిన్నకునుకుతీస్తూ వుంది. చెంపదెబ్బతిన్న చంటివాడు యేడ్చి యేడ్చి ఆమె తొడమీదనే ఒరిగి పోయాడు. నా చేతిలోని కాగితం ఎప్పు డెగిరిందో గాలికెగిరి మంచం కోడుకు తగులుకొని రెపరెపలాడుతూవుంది. అప్పటికి శాంతించింది పరిస్థితి. సూర్యుడు చురుకు తగ్గాడు. మురళి నా మనస్సులో మెదిలాడు.

మురళి ఓ చక్కని చిత్రకారుడు. చిత్రజగతిలో ఉన్నతుడు. ఈ జగతిలోమాత్రం మధ్యముడే! సామాన్య పరిస్థితులమధ్య అస మాన్యంగా నలుగుతున్నవాడే!—అయితే ఈమధ్యతానేదో సంస్థలో సభ్యుడుగా చేరాడట! ఆ సంస్థ ధ్యేయం ప్రార్థన. తద్వారా ప్రశాంతి. అక్కడ చేరింది మొదలు అతడు హాయిగా వున్నాడట! అది ఎలా సాధ్యపడిందో తెలుసుకోవాలని కుతూహలం. అతనిని కలుసుకోవాలనిపించింది. నేను మురళికోసం బయలు దేరుతూంటే శివుడు నాకోసం వచ్చాడు.

నేను ముందు, వాడు వెనుకగా బయలుదేరాము. వెంటపడి దూడలా రావడమే తన పని అన్నట్లుగా వుంటుంది వాడు ప్రక్కన

డుస్తూంటే! అవసరముంటేకానీ నోరు కదపడు. కానీ ప్రతి న్న సంఘటనను నిశితంగా గమనిస్తూ వుంటాడు.

''మనమిప్పుడు మురళి దగ్గరికి వెళ్ళాలి.''

శివుడు బదులు పలుకలేదు.

''ఎందుకని అడుగవేం?''—బదులురాదని తెలిసికూడా నేనే డిగాను.

''బొమ్మ గీయించుకోవడానికై వుంటుంది''

''కాదు''

''మరి''

''ప్రశాంతికోసం!''

''అతను అమ్ముతాడా?''

''మనిషి సాధించవచ్చునని నమ్ముతాడు.''

''ఆత్మవిశ్వాసముంటే మనిషి అన్నీ సాధించవచ్చు. దాని కతడే అవసరములేదు.'' చాల నిర్లక్ష్యంగా వుంది జవాబు.

కూత దవ్వులో మురళియిల్లు. మా మాటలు మావిగానే వుండగా మేము మురళియింట్లో అడుగుబెట్టాము. అడుగు అటూ యిటు కదపకుండా నిలబడి పోయాను. శివుడు నా ప్రక్కనే వున్నాడు.

గీస్తూ గీస్తూ వదలిన చిత్రం తాలూకు బోర్డు అలా పడి వుంది. రకరకాల కుంచెలు చిందరవందరగా పడి వున్నాయి. రంగులు కలుపుకొనే పింగాణిప్లేట్, సిరాబుడ్లు ఎక్కడివక్కడ పడివున్నాయి. స్టీల్ ఫ్రేములో ఓ క్యాబినెట్ సైజ్ ఫోటో ముందర వుంది. ఆ మహాత్ముడెవరో తెలియదు. రమణ మహర్షి ఛాయలు కనుపిస్తున్నాయి. పద్మాసీనుడై మురళి ఆ బొమ్మముందు బొమ్మలా కూర్చున్నాడు. కనులు మూతలుపడి వున్నాయి. ఏక ధారగా చెంపలమీదుగా కన్నీళ్ళు స్రవిస్తున్నాయి. అవి ఆనంద బాష్పాలో? దుఃఖాశ్రువులో తెలియదు! మూరాక అతని నిశ్చలతకు యే మాత్రం భంగం కలిగించలేకపోయింది. కాసేపు తదేకంగా అతనివైపు చూస్తూ నిలబడ్డాను.

బాహ్యస్మృతిని పూర్తిగా కోల్పోయి వున్నాడు మురళి. ఒక రకమైన తృప్తి—ఆ తృప్తినుండి పుట్టిన వెలుగు — అతని మొగంలో ప్రస్ఫుటంగా కనుపిస్తున్నాయి. అంతర్దృష్టితోనే ఏదో దర్శిస్తున్నట్లున్నాడు. ప్రార్థన ద్వారా అతడు సాధించిన యేకాగ్రతను, తద్వారా అనుభవిస్తున్న ప్రశాంతతను చూచి మనసు ఉప్పొంగింది. చేతులెత్తి నమస్కరిద్దామన్న తలంపు కలిగినా శివుడు ప్రక్కనుండగా ఆపని చేయలేక పోయాను. మురళి ప్రశాంతతకు భంగం కలిగించడం యిష్టం లేకపోయింది. అయిష్టంగానే అక్కడి నుండి తిరుగు ముఖం పట్టాము. శివుడూ నేను వీధిని పడ్డాము.

''చూశావా శివుడూ?—మురళి ప్రశాంతతను అమ్ముతున్నాడో? నమ్ముతున్నాడో?''

''అంతకంటే ఆత్మవంచన మరొక్కటిలేదు'' — శివుడు ఈ మాట అనడానికి తడుముకోలేదు. తడబడలేదు.

''ఏమంటున్నావ్?''

''అనవలసిన మాటే అంటున్నాను.''

''నువ్వు అనవలసిన మాటయినా, నేను వినవలసిన మాట గాదు.'' కటువుగా అన్నాను.

''గురువుగారూ!!'' —

అబ్బ! ఎంతకాలానికి శివుడి నోట్లో ఈ మాట వెలువడింది. ఎంత హాయిగా వుంది?... అనుభూతిలో ఒడలు పులకరించి శివుణ్ణి చూస్తూ ఒక్కక్షణం నిలబడ్డాను. శివుడు నన్ను చూస్తూ నిలబడ్డాడు. చిరునవ్వు వాడి పెదవులమీద చిందు లేస్తూవుంది.

''చిత్ర లేఖనము, నటన, రచన, ఆదిగా గల కళలు మనిషికి వరప్రసాదాలు. దైవ సృష్టిలో అవి యే కొందరికో పరిమితాలు. అందుకే వాళ్ళను కళాకారులన్నారు.''

వాడు చెబుతున్నాడు. నేను వింటున్నాను.

ప్రార్థన ఏకాగ్రతకు తద్వారా ప్రశాంతతకు సాధనమని మీ అభిప్రాయం. అవునా?''

''అవును.''

''అయితే అశాంతికి నిలయమైన మీ యింట్లో ఏకాగ్రత లేకనే మీరు రచనా వ్యాసంగం చేస్తున్నారా? ఏకాగ్రత లేకనే మురళి చిత్రాలు గీయగలుగుతున్నాడా? ఇంకొక్కడు నటించ గలుగుతున్నాడా?''

రెప్పవాల్చకుండా వింటూ ఆలోచిస్తున్నాను!

''ప్రార్థన ఏకాగ్రతకు సాధనమైతే కళారాధనలోనే ఏకాగ్రత యిమిడి వుంది. ఇక కళాకారులకు ప్రార్థన లెందుకు? ఆ సాకుతో అమూల్యమైన కాలాన్ని వృథా చేసే అధికారం కళాకారుడికి లేదు. చూడండి! మురళి బొమ్మ గీస్తున్నాడు. ఆ చిత్రం ఆత్మానందాన్ని కలిగించవచ్చు. విప్లవాన్ని రేకెత్తించవచ్చు. అదేవిధంగా ఒకరి రచన...మరొక్కరి నటనా!— అవి లోక కళ్యాణం కోసం. మరి లోకకళ్యాణాన్ని వదలిపెట్టి, చేస్తున్నపని అవతలపెట్టి ముక్కులు మూసుకొని కూర్చోవడం ఆత్మవంచన కాదంటారా?''

వాడి చిన్న బుఱ్ఱలోని వాడికి నా బుఱ్ఱ వేడెక్కింది.

''కళాకారులే కాదు. మడకపిడి పట్టి మన్ను దున్నేవాడైనా, కత్తి చేత బట్టి కట్టెలు కొట్టుకునే వాడైనా అంతే!... పనిలో లీన మవడమే ఏకాగ్రత. పనిని వదలి అదేపనిగా కాలయాపన చేయడం వృథా!...అది ఆత్మ వంచన!''...

ఆలోచించవలసిన విషయమే! దీనినే కర్మయోగమంటారు కాబోలు. శివుడి ఆలోచనల్ని నేను అనుసరిస్తున్నాను. వాడు నన్ననుసరిస్తున్నాడు. మేము ముందుకు వెళ్తున్నాము.

రైల్వేస్టేషను దాటితే అటుప్రక్కగా పెద్దసత్రం. దేవస్థానంవారు కట్టించిన సత్రాలలో అది రెండవది కాబట్టి దానిని రెండో సత్రమంటారు. కట్టిన కొత్తల్లో అక్కడ ఎక్కువరద్దీ వుండేదిగాదు. అప్పుడా సత్రం మధ్యభాగాన ఓ చక్కని తోట వుండేది. క్రొత్త ఒక వింతగా ఆ తోటను చాల జాగ్రత్తగా కాపాడారు దేవస్థానంవారు. 'పార్క్'కు నోచుకోని తిరుపతి పాటికి ఆ తోట ఓ చక్కని ఉద్యానవనం. సాయం సమయాల్లో మేధావులకు, న్యాయవాదులకు, రాజకీయవాదాలకు నిలయం. ఇప్పుడా వాతావరణం లేకపోయినా, జనసందోహంలో నిండివున్నా, అలవాటుపడ్డ ప్రాణులు అక్కడే చేరుతుంటాయి. ఇప్పుడు ఊరిని, రెండోసత్రాన్ని కలుపుతూ ఎత్తువంతెన నొకటి నిర్మించారు. ఆ ఎత్తువంతెన నెక్కి దిగితే రైల్వేస్టేషనుమీదుగా రెండో సత్రములో పడవచ్చు. మా గమ్యమూ అదే !

ఊళ్ళోవారిని రెండో సత్రానికి, రెండో సత్రములోని యాత్రీకులను ఊళ్ళోకి చేరవేయడానికి ఎత్తువంతెన దగ్గరిమార్గము. అడుక్కొని తినే అంధులకు, కామాంధులకు, పెద్ద రోగపీడితులకు, పెద్ద పెద్దమనుష్యుల స్వార్థాల తాడితులకూ, ఆధారము. ఆ వంతెన మెట్లెక్కుతున్నాను.

నలుగురు నాలుగు దిక్కుల్లో కూర్చున్నారు మెట్లమీద వారగా! ఒకడి నోట్లో బీడీ, మరొకడి నోట్లో సిగరెట్టు మంచి రసపట్టులో వున్నాయి. ఆకారాలమాట వదలి ఆ తలల్ని పరిశీలిస్తే నాలుగు కాకి గూళ్ళను ఒక్కచోట వ్రేలాడగట్టినట్లుంది. తలల్ని వదలి ఆకారాల్ని చూస్తే కాలీకాలక నిలిచిన తొర్రమానుల్లా వున్నాయి. పులిమేక ఆడుతున్నారు. అడుక్కొన్న డబ్బులు ఆటకు రక్తి కట్టిస్తున్నాయి. వాళ్ళకూ బాహ్యస్మృతిలేదు.

మరొక్క మూల మూడు ముక్కలాట మహాజోరుగా సాగుతూవుంది. అక్కడి వాతావరణం దీనికి భిన్నంగావుంది. బిచ్చగాళ్ళేకాదు—కాస్త పచ్చంగావున్నవాళ్ళూ అక్కడ నిలబడివున్నారు.

తనకు రావలసిన ధర్మం మరొక్కడు అడ్డందూరి తన్నుకపోతే, ఆ అధర్మంమీద ధర్మయుద్ధం కొనసాగుతూవుంది యిద్దరి ముష్టివాళ్ళమధ్య. ఒకడికి కాలు కుంటి. మరొక్కడికి చేయిమొండి. ధర్మయుద్ధంలో ప్రయోగింపబడుతున్న అస్త్రాలధాటికి ఆ దారిలో వెళుతున్న ఆడవాళ్ళు చెవులు మూసుకొంటున్నారు. మగవాళ్ళు మొగాలు చిట్లించుకొంటున్నారు.

మరొక్క నికృష్టుడు ముష్టిమెతుకులు తినడానికి కష్టపడుతున్నాడు. వాడికి సంక్రమించిన రోగంపేరు పెద్దరోగం. ఆ రోగం ఆకలితో అతని చేతివేళ్ళు తినివేస్తే—వేళ్ళు లేకుండా మిగిలిన అరచేత్తో ఆకలి బాపుకోవడానికి యాతనపడుతున్నాడు.

మెట్లు దిగుతున్నాము అవతలివైపున !

ఈలాంటి రోగగ్రస్థులే! ఓ గుంపు చేరారు. ఆ గుంపులో పాట!—అడుక్కొనేవాళ్ళు పాడేపాటగాదు. అది వేలంపాట. ఏమిటా వేలం?—అంటే, వారం చీటీ ఆట!—అడుక్కొన్న డబ్బులోవాళ్ళు ఓ వారంచీటి నడుపుతున్నారు. ఎవరిపాట ఎక్కువయితే వాళ్ళకు చీటీడబ్బు వస్తుంది. వాడు ఆ డబ్బుతోనే వడ్డీ వ్యాపారంచేస్తాడు వాళ్ళతోనే!—చిత్రంగావుంది ఆ రోగస్థుల వడ్డీరోగం.

ఈ ప్రక్కమెట్లెక్కి ఆ ప్రక్కమెట్లు దిగేలోపుగా బదుకుల్లో ఎన్ని ఎగుడు దిగుళ్ళు ఎదురైనాయి?— అందుకే 'ఏం బతుకులో?' అన్నాను నిస్పృహతో!

''ఏం బతుకులా?...నిలువునా నిలబెట్టి కాల్చవలసిన బతుకులు!'' కసిగా అన్నాడు శివుడు.

దిగువ మెట్టుమీద కాలు దిగువ మెట్టుమీదనే వుంది. ఎగువమెట్టుమీద కాలు నేసినట్లే వుంది. అలానే నిలబడిపోయాను ఆశ్చర్యంతో!

''అవును. ఈలాంటి నికృష్టజీవులందర్నీ నిలబెట్టి కాల్చి చంపాలసిందే! వీళ్ళవల్ల యేం లాభం?...భూమికి బరువు తప్పితే! ఏం? అలా భయపడుతున్నారు. తమవంటి కవులకు, రచయితలకు ఆమీదట కవితా వస్తువు కొరవడుతుందనా?''

నా నోరు మూతపడింది.

''నీ మట్టుకు నువ్వెంత రాస్తున్నావు! వేదికమీద అవకాశాలు దొరికితే ఎంతచక్కగా ఉపన్యాసాలు దంచేస్తున్నావు? రాతలకు చేతలకు సామ్యంవుంటే—యిలాంటి తలరాతలకు చోటుంటుందా?'' అని శివుడు నన్ను నిలదీసి అడుగుతున్నట్లుంది! 'ఆఁ ఊఁ!' అనకుండా ఆలోచిస్తూ నడుస్తున్నాను.

రెండోసత్రములో దీపాలు వెలిగాయి. యాత్రీకులు గుంపుగా చేరి ఒకచోట వండుకొంటూ, మరొకచోట గుంపుగాచేరి తింటూ, మరి కొందరు ఆరుబయట అలానే సొమ్మసిల్లి పడి దొర్లుతూ, గజిబిజిగా వుంది వాతావరణం. ఒకనాటి తోట ఛాయయిమాత్రం మిగిలిన తోటలో కూర్చుని వున్నాము. కూర్చున్నామన్న మాటేగానీ కుదురుగా కూర్చోలేకపోతున్నాను. శివుడు పక్కలో బల్లెంలా వున్నాడు—మాట్లాడకుండా కూర్చున్నా! రాతకు చేతకు సామ్యం వుందని నిరూపించాలని మనస్సు తాపత్రయ పడుతూవుంది. ఎలాగని ఆలోచిస్తూవుంది. అవకాశం రాకపోతుందా? అని మనస్సు తనంతట తాను సమాధానపడుతూ వుంది. అయినా నెమ్మదిగా కూర్చొనలేకపోతున్నాను. అందుకే బయలుదేరాను. నాతో కలిసి శివుడు బయలుదేరాడు.

అదే ఎత్తు వంతెనమీదుగా తిరిగి వస్తున్నాము. ఆ వంతెనమీద చెప్పుకోదగిన మార్పేమీ కనుపించలేదు. లేదంటే అక్కడ కూడా దీపాలు వెలిగాయి. కొంతమంది పడుకోవడానికి దుమ్ము దులుపుతున్నారా వంతెనమీద. రైల్వేస్టేషనువైపునుండి గబగబా మెట్లెక్కి వస్తున్నాడొక కుర్రవాడు. పది పన్నెండేండ్ల వయసుంటుంది. తెల్లటి పంచె గోచీపెట్టి కట్టాడు. ఒంటిమీదజందెము... నొసట అందంగా బొట్టు...చేతిలో ఒక బుట్ట...బుట్టలో వడలు... మురుకులు—చూడముచ్చటగా వున్నాడు. 'సార్! సార్! అని అరు

స్తున్నాడు. ఆగాను. పరుగెత్తుకొని దగ్గరకు వచ్చాడు. గసపోస్తూ నిలబడ్డాడు. వింతగా వాడివైపు చూస్తూ నిలబడ్డాను.

‘‘వడలు...మురుకులు—సార్!’’

‘‘కనబడు తున్నాయిగా!’’

‘‘ఫ్రెష్‌గా వున్నాయి సార్!’’

‘‘అయితే ఏం చెయ్యమంటావ్?’’

‘‘కొన్ని కొనుక్కోమంటాను సార్!’’

‘‘ఛీ ఛీ!’’

‘‘సార్!... సార్...! మేం బ్రాహ్మలం సార్. మా అమ్మ మడిగట్టుకొని చాలా శుభ్రంగా చేసింది సార్, అలా చూస్తారేం సార్?— అమ్మతోడు అబద్ధంగాదు సార్...రెండు కొనండి సార్! ’’

‘‘ఛీఛీ! నీకు బుద్ధుందా! అలగా జనం మాదిరి దారి తిండ్లు తినమంటావా? వద్దు పో!—’’

బయలుదేరబోయాను. అడ్డం పడ్డాడు కుర్రాడు.

‘‘సార్! మా నాన్న చచ్చి పొయ్యాడు. మా అమ్మ ఒక్కతే నలుగురి పిల్లల్ని సాకాలి సార్. నేనే పెద్దోడిని. మీలాంటి వాళ్ళు మాలాంటి వాళ్ళకు సాయం చెయ్యాలిసార్!’’ చెయ్యకపోతే యింకెవరు చేస్తారు సార్!’’ బ్రతిమలాడుతున్నాడు.

‘‘చూశావా శివుడూ!’’

‘‘చూస్తున్నాను.’’

‘‘వేలెడంత వెధవ! ఎంత చక్కగా చెబుతున్నాడు కథలు!’’

‘‘సార్! సార్! అమ్మతోడు—నేనబద్ధం ఆడడంలేదు సార్!’’

‘‘రేయ్. కథలు పలుకుతున్న వెధవాయ్! నీ చిలుక పలుకులకు మీ అమ్మతోడా?... వడలూ వద్దు, మురుకులూ వద్దు... వెళ్ళు’’. కసిరాను.

‘‘ఒరే నాన్నా! కథలు చెప్పకూడదురా! రాయాలి. రాస్తే నిన్ను రచయిత అంటారు. గౌరవిస్తారు. ఇక సభలు ... సన్మానాలూ వగైరా వగైరా! వద్దురా అంటే, అలా పీక్కుతింటావెందుకు? తప్పగదూ! వద్దంటూనే బుద్ధిగా వెళ్ళిపోతే మంచి కుర్రాడంటారు గురువుగారి లాంటి వాళ్లు! ఊఁ!’’ శివుడి మాటల్లో వ్యంగ్యం తొంగిచూస్తున్నట్టుంది. ఎలా విరుచుక పడతాడో యేమో? అని వాడి వైపు భిత్తరపడి చూస్తున్నాను.

‘‘ఇంతకూ బుట్టలో ఏమాత్రముంటాయి వడలూ, మురుకులూ?’’ శివుడడిగాడు.

‘‘బుట్టలోనా సార్!...ఇదోసార్! ... చెబుతాను సార్! ... నాలుగు...ఎనిమిది...పన్నెండు—ఆఁ! మొత్తం రెండు రూపాయల నలభై పైసలు కున్నాయి సార్!’’

‘‘ఊఁ! యిలా యివ్వు!’’ గద్దించాడు శివుడు. రెండు రూపాయల నలభై పైసలు వాడి చేత బెట్టి బుట్టందుకున్నాడు శివుడు. నేను మ్రాన్పడి నిలబడిపోయాను. వాడు నావంక చూడడం లేదు. కనీసం నే నక్కడవున్నట్లు కూడా వాడికి స్పృహ లేదు. తనపని తనదిగా ఆ వంతెనమీద వున్న నికృష్ట జీవులందరికి తల కొక్క మురుకు, వడవంతున పంచాడు. బుట్టఖాళీఅయింది. ఖాళీ బుట్టను ఆ కుర్రవాడి చేతికిచ్చాడు.

అప్పుడు చూడాలి ఆ కుర్రవాడి ఆనందం. ఆదరాబాదరా డబ్బులు పంచె కొనకొంగులో మూట కట్టుకొన్నాడు. బుట్టను అలా గాలిలో ఎగురవేసి పట్టుకొన్నాడు. నెత్తిన బోర్లించుకున్నాడు కిరీటంలా! నా వంక ధీమాగా చూశాడు రాజులా! అటుపై పరుగందుకొన్నాడు ఆనందానికే కాళ్ళుచేతులు వచ్చినట్లుగ!

పరుగెత్తుతున్న కుర్రవాడిని చూశాను, ప్రక్కనున్న శివుణ్ణి చూశాను. వంచిన తల ఎత్తకుండా ఒక్కొక్క మెట్టుగా కిందికి దిగుతున్నాను.

‘‘నమస్కారం సార్!’’

తలెత్తి చూశాను. నెత్తిమీద పెట్టె పడకా, ఒక భుజాన సంచి, ఒకచేత క్యారియర్, మరోచేత ఓ చిన్న సూట్‌కేస్—మోయలేక మోస్తూ వంతెన మెట్లెక్కుతున్నాడు హీరో కృష్ణ.

‘‘మా అయ్యగారు ఊరెళ్ళుతున్నారు సార్! బండెక్కించాలి సార్!.. సార్ సార్! నా ఏకపాత్రాభినయం...’’

నన్ను చూచి ఆగాడు కృష్ణ. నవ్వుతూ అడుగుతున్నాడు కృష్ణ. ఆలోచిస్తూ అతనివైపు చూశాను.

కృష్ణ శ్రమను చిరునవ్వుతో స్వీకరిస్తున్నాడు. తానొక జవానని బాధపడడంలేదు. తాను చేస్తున్న పనిని చులకన దృష్టితో చూడడంలేదు. కళాత్మకంగానే చూస్తున్నాడు. అలానే చేస్తున్నాడు. అది అతనిలో ప్రత్యేకత. అంతకష్టంలో కూడా తాను కళారాధకుడుగా కర్తవ్యాన్ని మరువలేదు. అతడు ఒక్కొక్క మెట్టుగా పైకెక్కుతున్నాడు.

నేను ఒక్కొక్క మెట్టుగా కిందికి దిగాను. తిరిగి చూశాను. కృష్ణ ఒక్కొక్క మెట్టుగా పైకెక్కుతూనే వున్నాడు. శివుడు వంతెనమీదనే నిలబడి ఎటో చూస్తున్నాడు.

ఇది భిన్నత్వం !

ఈ భిన్నత్వంలో ఏకత్వం సాధించాలంటే శివుడి ఎత్తుకు ఎదగాలి !

‘శివుడూ!’ అని పిలిచాను ఎలుగెత్తి.

‘గురువుగారూ!’ అన్నాడు అంత ఎత్తున నిలబడి!

‘గురువుగారు?’—ఈమాట అనవలసిందినేనా? వాడా?

అనుకొన్నది వాడంటున్నాడు. అనవలసింది నేను అనలేకపోతున్నాను.

అనవలసింది అనడం, అనింది చేయడమే ‘శివపూజ!’

అందుకే శివుడూ నేను స్నేహితులం!

దారి

శ్రీ తిరునగరి

ముందున్న ముండ్లను చూచి
చతికిలబడి కూర్చోకు
తగులుతున్న రాళ్ళను
కసిగా తిడుతూ నిల్చోకు

ముందు ముండ్లనేరు
రాళ్ళను పెకలించు
దారి అప్పుడే
సుగమం
సుఖానికి ముందే
పరిశ్రమం

ఇరువైపులా పెంచు
మర్రిచెట్లూ—మామిళ్ళు
చిరునవ్వుతో ఎత్తు
మట్టితట్టలూ—బండరాళ్ళు

తల కప్పడే
శీతలచ్ఛాయలు
నడక కుండవప్పుడే
ఎగుడు దిగుళ్ళు
దారి వేయరమ్మని
తమ్ములకోసంగొంతెత్తు

అందరిదీ పథమని
అందరికీ తట్టెత్తు
ఎంతశ్రమకోర్చియైనా
ఈ దారి నిర్మించుకో
ముందు తరాల కోసం
నీ తలపై బరువెత్తుకో
సుఖానికి ముందే
పరిశ్రమం

దారి అప్పుడే
సుగమం

దాశరథి కవితాదర్శనం

(12 వ పేజీ తరువాయి)

న్నట్లు ఈ కవి అంతస్సహజమైన క్షమాగుణం, శాంతి ప్రయత్నం, ఆవిష్కరించేది. "మనస్సు మనస్సుకూ మధ్య చుట్టరికం, మనిషికీ మనిషికీ మధ్య రాగబంధం" ఇతని, వ్యక్తిపరమైన అంతిమ లక్ష్యం. ఇది తత్కాలీనమైన సంకుచితమైన వలయాల నతిక్రమించే మానవతా మనోజ్ఞమైంది.

"వ్యక్తికీ సమాజానికీ గల చుట్టరికం, ప్రకృతికీ మనిషికీ గల బాంధవ్యం, నవ సృష్టికోసం కృషి" అనే వస్తు ప్రపంచంతో ఈ గీతం అనుభూతి నుండి ఆవిష్కృతమైంది. సామాజిక స్పందనతో, సంఘర్షణ, పరివర్తనం, ఆపైన సుస్థితి అన్న చారిత్రక పరిణామ చిత్రణతో రూపొందింది. ఈ రచన ఉషస్సంధ్యారేఖలతో దర్శనమిచ్చే అభ్యుదయ కళా రూపం.

సూచికలు

(1) ఋగ్వే – IV–51 – 2.

(2) పునర్నవం – పుట 27.

(3) **Conflict and change are arbiquitous throughout Social life – Social organisation – P. 52 Alfered N. white head.**

(3) **Conflict is a consequence as well as a cause of Social change. Conflict and change are intertwined in social life ibid. 164.**

(5) పునర్నవం పుట – 29.

శ్రీ షడ్దర్శనం సోమసుందరశర్మ

విద్యానగర (విజయనగర) స్థాపనకు ప్రేరకులు - కాశీవిలాస క్రియాశక్తిదేవులా??

1976 నవంబరు నెల 'భారతి'ని చూచుచుండగ, శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారు వ్రాసిన వ్యాసము "శ్రీ విజయనగర స్థాపనకు ప్రేరకులు శ్రీమత్ కాశీ విలాస క్రియాశక్తి దేవులా?" అను వ్యాసము పరికించుట తటస్థించినది. వ్యాస మామూలాగ్రము పఠించిన యనంతరము శ్రీ శర్మగారికి తోచిన సందియములే నాకు స్ఫురించినవి. అందుకై మరలా కొంత పరిశ్రమ చేసి నా నేర్చిన రీతిని, కాశీ విలాస క్రియాశక్తి దేవులుకాదు, అని ఘంటాపథముగ చెప్పవచ్చుననే భావనకు రాగల్గితిని. ఆ విషయములు యిందు పొందుపరచుచున్నాను. సహృదయులు చరిత్ర పరిశోధకులైన పెద్దలు పరికించి, అసత్య చరిత్రను సృష్టించువారికి నేత్రోన్మీలన మొనర్చుదురుగాకయని విన్నవింతును.

1975 నవంబరులో కర్ణాటక విశ్వవిద్యాలయమువారు "బళ్ళారి జిల్లెయ శివశరణురు" అను నొక గ్రంథమును ప్రచురించి యున్నారు. "శ్రీ శాన్తరసగారనువారు" బళ్ళారి జిల్లెయ శివశరణురు పై యుపన్యసించినారట! ఆ యుపన్యాసమును పై కర్ణాటక విశ్వవిద్యాలయమువారు తమ యుపన్యాస గ్రంథమాల 18 సంఖ్యగా ప్రింటు చేసి ప్రకటించినట్లున్నది. 71 పేజీల చిన్న పొత్తమైననూ, శివశరణురు ప్రభావాల వివరణమే ముఖ్యాతి ముఖ్యమైన గ్రంథమియ్యది.

బళ్ళారిజిల్లా పరిచయ ప్రభృతి—మల్లయ్య, సిద్ధ, రాచమల్ల, రాయరాజగురు కాశీవిలాస, లక్కణ్ణదండెశ, బసవ, బసవేశ్వర్, నీలప్ప, మరిస్వామి, కరెడప్ప, బసవలింగ, జడ సిద్ధ, మహాన్తయతి, ఎర్రిస్వామి, గార్లు బళ్ళారి జిల్లాలో వెలసిన వీరశైవ ప్రముఖ శివశరణురుగా రూపొంది వ్యాప్తి జెందిన చరిత్రను వివరించు, ఉపన్యాససారాంశ రూప గ్రంథమా "శివశరణు" గ్రంథము.

ఇందులో రాయరాజగురు "శ్రీమత్ కాశీ విలాస క్రియాశక్తి దేవరు" అనువారు హంపీ విద్యానగర తొలిపాలకులైన సంగమవంశ సంజాతులగు హరిహరరాయలకు రాయరాజ గురువుగా నుండిరట! ఈ రాజగురువుగారిని గూర్చి—ఈ గ్రంథమున నాలుగుం పాతిక పుటలలో సంక్షేపింపబడిన చరిత్రగా గలదు.

"శ్రీమత్ కాశీవిలాస క్రియాశక్తి దేవరు విజయనగర—సాంరాజ్య స్థాపకరాద సంగమవంశద దొరెగళ కులగురు, రాజగురు. సాంరాజ్య స్థాపనగే మూలప్రేరక. హరిహర బుక్క, మత్తు అవర తమ్మందిరిగె తన్నతపశ్శక్తి యింద, రాజకారణ నైపుణ్యదింద సకల విధద నెరవిత్తవను. తన్న మధురా విజయ సంస్కృత కావ్యదల్లి గంగాదేవి ఆతనన్ను భక్తి యిందస్తుతి సుత్తాళె"

"అసాధారణ సార్వజ్ఞం విలసత్ సర్వ మంగళం
క్రియాశక్తి గురుం వందే, త్రిలోచన మవాపరం"

అని యుండుటను బట్టియు యితనినిగూర్చి యున్న కొన్ని కన్నడశాసనములవలనను—ఇతను సాంరాజ్య స్థాపనకు ప్రేరకుడనియు, రాజ గురువనియు, శ్రీ శాంతరసగారి వాదము.

మఱియు "విద్యారణ్యరు ప్రేర కల్ల! అవరు రాజగురుగళల్ల తరువాయి కాలద కల్పిత గళెందు నీవు అవుగళన్న తళ్ళిహాకిబిడ బహుదు. ఆతన వ్యాపక వాద పాండిత్య మత్తు ప్రఖ్యాతి గళింద ప్రభావిత రాగి జన ఈవిషయ వస్సు ఆతన తలిగెకట్టిర బహుదెందు భావిసబహుదు!!

ఆహో వీరి విమర్శనా పరాకాష్ట! జనులు విద్యారణ్యునికి లేని ప్రఖ్యాతిని అంటగట్టినారట! ఎందు వీరి సంబంధము లేనే లేదట! క్రియాశక్తి రాయల గొప్పదనాన్ని విద్యారణ్యులాక్రమించిరి కాబోలు!!

గంగా దేవి—"క్రియాశక్తి గురుం వందే" అని చెప్పినది గాన—ఈ క్రియాశక్తి రాయలు రాజగురు వైరి కాబోలు!

"విజయనగర సాంరాజ్య స్థాపనేమీ సాంప్రదాయిక కాలవాద క్రీ-శ ౧౩౩౬ బళిక ఎరడు దశకగళుకళిద మేలె విద్యారణ్యర సంబంధ విజయనగర దొడ నెబళియతు ఎందు ఉపలబ్ధ విద్ద పురావెగళు తిళిసుత్తవె" అని విద్యానగర స్థాపనానంతరము, ఇరువది వత్సరాల పైన విద్యారణ్యులపేరు తెలియ బడుమన్నట్లున్నదట!!

వీరు—"అదోపులి యనిన, యిదో తోక" యను నానుడి చొప్పున, ఎవరో సంస్కృతం రానివారు, సంస్కృత గ్రంథాలు చదువని కట్టుకథల చరిత్ర సృష్టించినవారు వ్రాసిన వ్రాతల నాధారంగా గొని వ్రాసిన వ్రాతలను పురస్కరించుకొని యీ రీతిని, విద్యారణ్యులు విద్యానగర స్థాపన—ప్రేరణ చేసినవారు గారు. రాజగురువుగాదు. కాశీవిలాస క్రియాశక్తి దేవులు మేటియని, ప్రకటించిన కల్పిత చరిత్ర మయ్యాదియని యనకతీరదు.

ఏలయనగా — ఇతర చరిత్రకారులు వ్రాతలటు ప్రక్కన బెట్టుడు. నాలుగు వేదముల భాష్యములకు ప్రారంభమునగల పీఠికలు పరికించిన బుక్కరాయల ప్రేరణముచేతను యీ గ్రంథాలు వ్రాసినట్టు యున్నామని వ్రాసియున్నారు. ప్రతి యధ్యాయము చివరన—''ఆశ్వాశాన్త గద్యమువలె'' బుక్కరాయలకడ మహామంత్రియగు మాధవులు బుక్కరాయల ప్రేరణముచే వ్రాసినట్లు ఆ గ్రంథములు పరిశీలించిన తేటతెల్లము కాగలదు. మఱియు విద్యారణ్యులవారు కోకొల్లలుగా శాస్త్రగ్రంథములపై, వ్యాఖ్యలు వివరణములు, ప్రకరణములు, పరిశీలనములు, వ్రాసియున్నారు. వానిలోనెల్ల హరిహరులు బుక్కరాయల ప్రశంసలు విపులముగ చేసియున్నారు. వానిలో నెక్కడ ఈ క్రియాశక్తి రాయల ప్రశంసాదులు లేనేలేవు. ఇట్లు హరిహర బుక్కరాయలకడ తాను మహామంత్రిపదవి జేసినట్లు విద్యారణ్యుల గ్రంథాలెల్ల చాటుచుండ— డా. పి. బి. దేశాయ్‌గారనినారట. రెండు దశాబ్దాల అనంతరం విద్యారణ్యులకు విజయనగరంలో సంబంధం ఏర్పడిందట!! దీనికి ఆధారముగా శాసనాలా? గ్రంథాలా? ఓ దేశాయిగారు శెలవిస్తారా? యని ప్రశ్నించవచ్చునుగదా?

డాక్టరు సాలెటోర్‌గారు ''రాజధాని నిర్మాణంలో విద్యారణ్యుల సహాయం కట్టుకథట! ఈ సాలెటోర్ పలుకులు, యథార్థాలా? అనిన—కట్టుకథలు కావని నిరూపించగలరా? అని ప్రశ్నించవచ్చునే? ఏమందురు ?

గంగాదేవి — బుక్కరాయల పుత్రుడైన కంప రాయల భార్య. ఈమె, కంపరాయలు మధురా ప్రాంతముపై దండయాత్ర చేసిన చరిత్రను 'మధురా విజయను' పేర సంస్కృతమున వ్రాసిన కవయిత్రి. ఈమె తమ గ్రంథమున నాలుగవ శ్లోకంలో ''క్రియాశక్తి గురుం వందే'' యని స్తుతించినది. ఈ క్రియాశక్తి యీమెకు విద్యాగురువై యుండనోపు! ఎందుకనగా గురువును గూర్చి వారువారు వారివారి గ్రంథాలలో స్తుతించుట పరిపాటిగాన ఈమెకు విద్యాగురువై యుండనోపు! అంత మాత్రమున—కులగురువు—రాజగురువగునా ?

కులగురువనగా కులక్రమాగంతంగా, తాతల ముత్తాతలకాలం నుంచి, వచ్చుచుండిన వంశగురువుగదా! వీరా రీతిని హరిహర—బుక్కరాయలకుగాని, వీరి తండ్రి తాతలకుగాని గురువులుగా నుండినట్లు, ఏ కావ్యాలలోగాని, యితర గ్రంథాలలోగాని గలదా ? శాసనాలలో పొందుబరచి యున్నారా? వానిని లోకహితార్థమై ప్రకటించిన బాగుండునుగదా ?

మఱియు కులగురువనగా కులక్రమాగతంగా పౌరోహితులా ? విద్య నేర్పినవారా? మంత్రమును బోధించినవారా? ఏ కోవకు జెందిన కులగురువులగుదురు ?

ఇంక రాజగురువులట! అనగా రాజ్యపాలనాదులు నేర్పిన గురువనియా ? రాజుకు లోపాలోపాలు సవరించి పరితీర్చు గురువనియా? విద్య నేర్పినవాడనియా? ఏ రకంగా రాజగురు పదానికి నిర్వచనము? సప్రమాణంగా నిరూపించగలరు?

పై గంగాదేవి—తన కావ్యంలో క్రియాశక్తితో గూడ వ్యాస వాల్మీకులను స్తుతించినది—కాళిదాస—బాణ దండి—భవభూతులను ''తిక్కయస్యకవేఃసూక్తిః'' అని తిక్కననూ స్తుతించినది. అగస్త్య కవిని గంగాధర మహాకవిని—''విశ్వనాథః కవీశ్వరః—యస్య ప్రసాదాత్ సార్వజ్ఞం సమంథేమాదృశేష్వపి'' అని విశ్వనాథుని యనుగ్రహ ప్రసాదాదుల నభివర్ణించుటచేత—ఈయన గంగాదేవికి గురువా? యనియు తోచక మానదు. ఈయనే యగునేని, ముందు తెలిపిన క్రియా శక్తుల గతేమి ?

అరణ్య ప్రాంతమున రాజధాని నిర్మాణము—హరిహరుల పాలనము—అనంతరము బుక్కరాయల పాలనము. ఈకాలాన—పుత్రుడు కంపరాయలు మధురపై దండయాత్ర దానిని పురస్కరించుకొని గంగాదేవి రచనము. అందులో క్రియాశక్తి ప్రశంసయుండగా విద్యానగర సామ్రాజ్య కాలాన గంగాదేవి యుండినట్లేనా? నాడు క్రియాశక్తి రాజగురువు గాన దానిని గంగాదేవి ప్రశంసించినదనడం యుక్తియుక్తమా? పరిశీలించుడు ?—

విజయనగర స్థాపన కాలానికి మాధవాచార్యులేగాని విద్యారణ్యులు కాలేదు (అనగా సన్యాసం స్వీకరించిన మాధవులు, పేరు విద్యారణ్యులు) హరిహర రాజు కాలాన మహామంత్రి మాధవులేగాని విద్యారణ్యులు గాలేదు. బుక్కరాయల పాలనా కాలాన వేదభాష్యాది రచనలు సాగించిన కాలాన మాధవులేగాని విద్యారణ్యులు గాలేదు. బుక్కరాయల మరణానంతరము—రెండవ హరిహరరాయలు రాజ్య పాలనారంభకాలాన మాధవులు సన్యసించి, విద్యారణ్యులయినట్లు, అధర్వణ వేదభాష్య భూమికలో మాధవ విద్యారణ్యుల సోదరులు సాయణాచార్యులు సూచించిన సూచనమేరకు సుబోధక మగుచున్నది.

డాక్టర్ ఒకన్ జేకబ్ బర్నెల్ మొదలైన పలువురు పాశ్చాత్యులు — విద్యానగర స్థాపనము — మాధవ విద్యారణ్యుల యునికి—హరిహర బుక్కరాయలకడ ప్రధానమంత్రిత్వములపై పలు పరిశోధనలు చేసి కర్నాటక ప్రాంతాన్ని తుదముట్ట తిరిగి పలుశాసనాలు పరిశోధించి మాధవుల చరిత్రను కూలంకషంగా పరిశీలించినట్లు ఋగ్వేద భాష్య పీఠిక—లో పూనాలోని తిలక్ ఇనిస్టిట్యుట్‌వారు ప్రకటించియున్న పరిశోధనలేని పరిశీలించినచో క్రియాశక్తి దేవరు విద్యానగర స్థాపకులా? మాధవ విద్యారణ్యులు స్థాపనాచార్యులా ? యని తెలియగలదుగదా?

''నాగేష్వర్కే నియమితశకే శాలివాహస్య యాతే
ధాతర్య బ్దే సుగుణ సహితే మాసివైశాఖనామ్ని
శుక్లేపక్షే సురగురుయుతే సౌమ్య వారే సులగ్నే
సప్తమ్యాం శ్రీ విజయనగరం నిర్మమేదేశికేంద్రః॥

అను శాసనాధార శ్లోకము ననుసరించి, శాలివాహన శకము 1258కి తగిన ధాతు సంవత్సర, వైశాఖ శుద్ధ సప్తమి బుధవారము, గురువు లగ్న గతుడైన సులగ్నమున మాధవులు శ్రీ విజయనగర నిర్మాణము

చేసిరని గలదు. ఈ రీతిని క్రియాశక్తి దేవరు నిర్మించిన శ్లోక మొందేదేని చూపగలరా?

మైసూరు తామ్రశాసనములను పరిశీలించిన రైస్ దొర గారు (విద్యారణ్యుల) మాధవుల గురువు విద్యాతీర్థులని వ్రాసిరి.

''విద్యాతీర్థమునేః కృపాంబు దిశశీ భోగావతారోభవత్''

అను వాక్యమునకు విద్యాతీర్థులు మాధవుల గురువులు ఈ విద్యా తీర్థుల గురువర్యుని ప్రశంసయే వేద భాష్యములో తొలుత గలదు. ఋగ్వేద భాష్యమునను—యజుర్వేద భాష్యమునను సామ వేద భాష్యమునను— అథర్వణవేద భాష్యమునను విద్యాతీర్థుల గురువందనము మాధవులు సాయణులు చేసియున్నారు—

తొలుత యజుర్వేద భాష్యం సాయణులు మాధవుల ఆదేశం మేరకు బుక్కరాయల ప్రేరణచే వ్రాసిరి. అందులో

''యస్య నిఃశ్వసితం వేదా యో వేదేభ్యోఖిలం జగత్ |
నిర్మమే తమహం వందే, విద్యాతీర్థ మహేశ్వరం |
''యత్కటాక్షేణ తద్రూపం, దధత్ బుక్కమహీపతిః |
ఆదిశన్మాధవాచార్యం వేదార్థ స్యప్రకాశనే |
''స్రాహా నృపతిం రాజన్, సాయణార్యోమమానుజః |
సర్వం వేత్యేష వేదానాం వ్యాఖ్యాతృత్వే నియుజ్యతాం |
''ఇత్యుక్తో మాధవార్యేణ, వీరబుక్క మహీపతిః |
అన్వశాత్ సాయణాచార్యం, వేదార్థ స్యప్రకాశనే ''

అను పై యజుర్వేద భాష్య భూమిక ననుసరించి, వీరబుక్క మహీపతి, మాధవాచార్యులను వేదమునకు అర్థరూపమైన భాష్యము వ్రాయమని కోరిరి. మాధవాచార్యులు, సర్వజ్ఞుడైన తన సోదరుడు సాయణాచార్యులు గలరు. అతనిని వ్రాయ నియో గించమని సలహా యివ్వగా నా మేరకు బుక్కరాజు సాయణులను భాష్యరచనకు ప్రేరేపించిరి. దీనిచే రాజ్య నిర్మాణము—హరిహర రాజ పాలనము అనంతరము బుక్కరాజు పాలనము కాలాన మాధవ మంత్రియేగాని విద్యారణ్యులుగా సన్యసించి మారినట్లు లేనేలేదు. లేనితటని విద్యారణ్యులు లేరుగాన అనంతరం ఎన్నడో వచ్చినాడనడం, ఎంత న్యాయమో పాఠకులు పరిశీలింతురుగాక యని మనవిజేతును.

పరాశర ధర్మశాస్త్రమునకు మాధవాచార్యులు వ్యాఖ్యానం వ్రాసినారు. అందు తాను వీరబుక్క మహీపతికి ప్రధాన మంత్రిగ నుండినట్లు ఈ శ్లోకము గలదు --

''ఇంద్రస్యాంగిరసో, నలస్య సుమతిః
శైబ్యస్య మేధా తిథిః, ధౌమ్యో ధర్మను |
తస్య వైన్య నృపతేః స్వోజః, నిమే ర్గౌతమః |
ప్రత్యగ్దృష్టి రరుంధతీ సహచరో |
రామస్య పుణ్యాత్మనో యద్వత్ |
తస్య విభో రభూత్ కులగురుః మంత్రీ తథా మాధవః

అను ప్రమాణ శ్లోకరత్నము పరాశర మాధవీయంలో ప్రారంభం లోనే గలదు. ఈ మేరకు—మాధవులు బుక్కరాయలకు కులగురువు మంత్రిగ నుండిరని రూఢి యగుచున్నది.

(ఇంద్రునకు బృహస్పతి, నలమహారాజుకు సుమతి, ధర్మ రాజుకు ధౌమ్యులు, వైన్యమహారాజుకు స్వోజుడు, నిమచక్రవర్తికి గౌతముడు, శ్రీరామునకు వశిష్ఠుడు, మహామంత్రులుగ నెట్లు నెగడిరో, నా రీతిని మాధవులుగూడ బుక్కరాయలకు కులగురువు మంత్రిగ రాణించిరి.) ఇందు— పై తెలిపిన వాళ్లకు కులగురు స్థానములోను, మంత్రి స్థానంలోను బృహస్పతి, వసిష్ఠుడు, ధౌమ్యుడు, గౌతముడు మొదలైనవారు— మెలంగుచుండినట్లు వారివారి చరిత్రలు పరిశీలించిన తేటతెల్లము కాగలదు. ఆ మేరకు బుక్కరాయలకు కులగురు స్థానంలోను, మంత్రి స్థానంలోను, మాధవులు (విద్యారణ్యులు కాక పూర్వం అనగా సన్యాసం తీసికొనక పూర్వం గల పేరు మాధవులు) ఉంటూ యుండగ— రాజ గురువు కులగురువు క్రియాశక్తి దేవారుండునట్లు ఒక ప్రమాణ గ్రంథ ములోనైనా, శ్రీ శాంతరసగారుగాని, కర్ణాటక యూనివర్సటీ ధార్వాడవారుగాని చూపిన బాగుండునని కోరుతాను. మాధవులు తాము వ్రాసిన ప్రతిగ్రంథమురాజైన బుక్కరాయల ప్రేరణము చేతనే వ్రాసినట్లు ప్రతి గ్రంథాదిన గలదు. ఆ రీతిని క్రియా శక్తి దేవరు సర్వజ్ఞులు, కుల గురువులు,రాజ గురువులే యైనచో, నింతటి తపస్వి, ఇంతటి గురువర్యులు, ఏ గ్రంథాలైనా వ్రాసి నారా? వీనిని రాజైన హరిహరులుగాని, బుక్కరాయలుగాని ప్రోత్స హించినట్లుగాని, అంకితం బొందినట్లుగాని గలవా? ఉన్నచో లోకమున కెరుక బరిచిన, ఎంతో చరిత్రకు మేలు జేసినవా రగుదురే !

ఇంక మాధవులే, బుక్కరాయల ప్రేరణముచే, ఋగ్వేద భాష్యాన్ని వ్రాసినట్లు గలదు. ఆ భాష్య భూమికలో నిలాగలదు : పరిశీలించగోరెద.

''నిర్మమే తమహం వందే విద్యాతీర్థం మహేశ్వరం |''

అని విద్యాతీర్థ గురువర్యుల ప్రశంసగలదు. అనంతరము మాధవులను ఋగ్వేద భాష్యము వ్రాయమని శ్రీ వీరబుక్కరాయ లీరీతిని ప్రార్థించిరి.

''యత్కటాక్షేణ తద్రూపం దధత్ బుక్కమహీపతిః
ఆదిశన్మాధవాచార్యం వేదార్థస్య ప్రకాశనే ''

అని. శ్రీ విద్యాతీర్థులవారి కటాక్షాద్యనుగ్రహ విశేషణము లచే, రాజ్యపాలనా ధురంధరత్వమును బొందిన వీరబుక్క మహీ పతి వేదార్థమును ప్రకాశింపజేయ సమకట్టి మాధవాచార్యులనాదే శించెను. ఈ ప్రమాణభూత శ్లోకముచే, శ్రీ విద్యాతీర్థుల యను గ్రహ విశేషణముచే రాజ్యపాలనము గల్గినట్లు గలదు వీరబుక్క మహీపతికి. కానీ ''శాంతరస''రు గారనినట్లు కాశీ విలాస క్రియాశక్తి రాయల యను గ్రహ విశేషణముచే గల్గినట్లు లేదే!

అట్లు క్రియాశక్తి రాయల యనుగ్రహవిశేషణంచే రాజ్యాది లాభములు బొందియున్న వీర బుక్కమహీపతి తన కులగురువు రాజగురువనదగు క్రియాశక్తి దేవర ప్రశంస లేనిది యంగీకరించి యుండునా? క్రియాశక్తి దేవర ప్రోత్సాహదులే గల్గియున్నచో, విద్యాతీర్థుల యనుగ్రహ విశేషాల ప్రశంసకు రాజ్యాధిపతి సమ్మతించినచో, నా ప్రశంసను చూచిన క్రియాశక్తిదేవరు మిన్నకుండుదురా? అంతటి సర్వజ్ఞమూర్తి తపస్సంపన్నుడు, రాజగురువు కులగురువు అనదగిన సర్వశక్తిపరుని, ప్రశంస వీరబుక్కమహీపతి, ఎందైనా, ప్రశంసింపకపోయినచో కులగురువు రాజగురువుగారి సమర్థత యేమైనట్లు? శాంతరసగారు తెలివ్వగలరా??

సామవేద భాష్యకాలానికిగూడ విద్యాతీర్థుల గురువర్యులుండిరి. ''నిర్మమే తమహం వందే విద్యాతీర్థం మహేశ్వరం'' అనే గలదు భాష్య భూమికలో. మరియు ఋగ్వేదసులవలెనే సాయణాచార్యులను సామవేద భాష్య రచనకు వీరబుక్క మహీపతి ప్రోత్సాహాలు గలవు.

> ''తత్కటాక్షేణ తత్పాదం, దధత్ బుక్క మహీపతిః
> ఆదిశత్ సాయణాచార్యం వేదార్థ స్వప్రకాశనే
> కృపాలుః సాయణాచార్యః వేదార్థం వక్తు ముద్యతః
> సామవేదార్థ మేషోత్ర ప్రకాశయతి, సాదరమ్''

అని సామవేద భాష్యకాలానికి మాధవులు పదవివీడి, శృంగేరికి వెళ్ళి ఆశ్రమ స్వీకారాది కార్యములలో లీనమైనట్లున్నది, గాన ఇందు మాధవుల ప్రశంస లేదు. నేరుగ సాయణాచార్యుల వారినే బుక్కరాజు భాష్యరచన చేయుమని యాదేశించిరి.

అధర్వణ వేద భాష్యరచనా కాలానికి బుక్కరాజు లేడు. కుమారుడు గంగాదేవి భర్తయైన కృపరాయలు లేడు. ద్వితీయ పుత్రుడైన రెండవ హరిహరరాజు రాజ్యపాలకుడుగా నుండిరి. సాయణాచార్యులవారిని అధర్వణ వేద భాష్య రచన మొనర్ప నీ రీతిని సభా భవనమున ప్రశంసించిరి. ఈ కాలానికిగూడా విద్యాతీర్థ గురువర్యులుండిరిగాన—

''నిర్మమే తమహం వందే విద్యాతీర్థం మహేశ్వరం'' అని గురువందనము చేసిరి. ఈ కాలానికైన క్రియాశక్తి యున్నచో గురుష్వర్యులుగ గాని, రాజగురువుగాగాని, కులగురువుగాగానియున్నచో రెండవ హరిహరులైన ''క్రియాశక్తిం గురుం వందే'' అని వ్రాయించి యుండక బోయిరా?

ఈ యధర్వణ భాష్య రచనాకాలానికి బుక్కరాజు లేడు. మాధవులు సన్యసించి 'విద్యారణ్య'లను అపరనామధేయులైరి యని తోచుచున్నది. కాన, ఇందు విద్యారణ్యుల ప్రశంస నీ రీతినె గలదు.

> ''అవిద్యా భాను సంతప్తో విద్యారణ్య మహం భజే
> యదర్కకర తప్తానాం, అరణ్యం ప్రీతికారణమ్''

అను స్తుతి ఈ యధర్వణ భాష్య భూమికలో గలదు గాన, ఈ కాలానికి మాధవులు సన్యసించి విద్యారణ్యులైరని రూఢిగవచింపదగి యున్నది.

> తత్కటాక్షేణ తద్రూపం దధతో బుక్క భూపతేః |
> అభూద్ధరి హరో రాజా, క్షీరాబ్ధేరివ చంద్రమాః |
> విజితారాతి వ్రాతః వీర శ్రీహరిహర క్ష్మాధీశ్వరః |
> ధర్మబ్రహ్మాధ్వన్యః కలిం స్వచరితేన, కృతయుగం కురుతే |
> సాధయిత్వా మహీం సర్వాం, శ్రీమాన్ హరిహరేశ్వరః |
> భుంక్తే బహువిధాన్ భోగా ననక్తో రామవత్ సుధీః
> విజయీ హరిహర భూపః, సముద్వహాన్ సకల భూభారం
> షోడశ మన్తి దానాన్యనిశం సర్వహోస్తృప్తయే కుర్వన్ |
> తన్మూల భూతమాలోచ్య, వేదమాధర్వణాభిదం |
> ఆదిశత్, సాయణాచార్యం తదర్థ స్వప్రకాశనే ,
> వ్యాఖ్యాయ వేద త్రితయం, ఆముష్మిక ఫలప్రదం |
> ఐహికాముష్మిక ఫలం చతుర్థం, వ్యాచికీర్షతి |
> కృపాలుః సాయణాచార్యః వేదార్థం వక్తుముద్యతః ॥

అను అధర్వణ వేదభాష్య ప్రారంభమున తెలిపిన చరిత్ర సారాంశముచే, విద్యారణ్యులవారి ప్రశంసవలన మాధవులు, హంపీ విద్యానగర స్థాపనాచార్యులై, మొదటి హరిహరులు, పాలించిన కాలానికిని, వీరబుక్కరాయల పాలనా కాలానికిని, రాజగురువు, కులగురువు, ప్రధానమంత్రిగ నుండినట్లు వారి రచనలే ఆధారములని తెలియజేయుచున్నవి. వీరి యనుగ్రహ విశేషణములచే రాజ్యపాలన చేయుచుండినట్లు, వీరబుక్క మహీపతి ప్రశంసించినట్లు ''తత్కటాక్షేణ తద్రూపం దధత్ బుక్కమహీపతిః'' అను వాక్యము చాటుచున్నది.

అధర్వణ భాష్యరచనా కాలానికి, రెండవ హరిహరిహరులు గూడ, విద్యారణ్యుల కటాక్షణంచే రాజ్యభార ధురంధరుడైన బుక్కమహీపతి పుత్రుడైన తాను సకల భోగభాగ్యా లనుభవించుచుండియు, రాజ్యపాలన చేయుచుండియు, విద్యాతీర్థులను విద్యారణ్యులను ప్రశంసించిరి. సమస్త దానధర్మాలు ''సర్వస్తృప్తయే'' అను రీతిని సర్వులకు తృప్తికరంగా చేయుచు వీనికంతయు మూల భూతములైన, సర్వధర్మాలకు నిలయములైన వేదముల యర్థ ప్రకాశనార్థమై పరిశీలించి, ''తన్మూల భూతమాలోచ్య'' ఐహికాముష్మిక ఫలములకు నిలయములనదగిన, ''చతుర్థం వ్యాచికీర్షతి'' నాలుగవ వేదవ్యాఖ్యానానికి సాయణాచార్యులవారి నాదేశించిరి.

ఇట్లు సంగమవంశానికి హృదయప్రాయంగా, మాధవ విద్యారణ్యులవారు కులగురువు, రాజగురువు ప్రధానిగను ముప్పది వత్సరములుండి, దేశమును సుభిక్షము ధర్మవంతముగ, సుసంపన్నముగ స్థాపించిన కీర్తి మాధవ విద్యారణ్యులదేగాని యన్యులదని చెప్పడం అపచారమేగదా!

''మతి క్రియాశక్తి గురుంవందే''అని గంగాదేవి ప్రశంసించినదిగదా? యనవచ్చును. ప్రశంసించినదే! కాదనము. ఆనాటి కాలాన

వారి రాజ్యమున, ప్రజలందరూ గలరుగదా? శైవులు, వైష్ణవులు, జైనులు, స్మార్తులు, బ్రహ్మక్షత్రియాది సర్వజాతులు, సర్వతెగలు, సర్వమతములవారిని, సమదృష్టిని, సత్కరించి, సమ్మానించి, సర్వసుఖ భోగ భాగ్యములతో సుసంపన్నులై, రాగద్వేషములు లేక పాలించు సర్వసమర్థులు, హరిహర బుక్కరాయాది మహీపతుల ధ్యేయము. ఇందుకు ప్రధానమంత్రుల సహకారము, సహాయము, సలహాలు, రాజునకు, అండదండలై యుండినవిగదా!

తమ రాజ్యకాలమున తమ రాజ్యములోనున్న పండితులు, కవులు, మహనీయులు, సుసంపన్నులు, తపస్సంపన్నులు, యున్నచో వీరి నెల్ల రాజమంత్రులు గుర్తించి గౌరవించి సన్మానించడము రాజధర్మము. ఆ మేరకు పండితుడు—తపోవంతుడు, కాశీవిలాస క్రియాశక్తులు గూడ తమ రాజ్యమున నుండియుండవచ్చును. వీరి కడ గంగాదేవి విద్యాభ్యాస మేమేని చేసియుండవచ్చునేమో!! కాన, "క్రియాశక్తిం గురుం వందే," అని ఆమె గురువందనను చేసి యుండినచో దానిని పురస్కరించుకొని, రాజ్యనిర్మాత—రాజగురువు—కులగురువు అని, సంకలు కొట్టుకొనడము సబబేనా? సజ్జనులు సహృదయులు, సద్విమర్శకులు, సుచారిత్రకోవిదులు, సువిమర్శన మని భావింతురా?

తమ కోడలకు విద్యాగురువు అని భావించి, బుక్కమహీపతి క్రియాశక్తికి దానధర్మాలు చేసిన శాసనాలు, చూపి వీరివల్ల రాజ గురువనదగునా?

తిక్కన సోమయాజికి, ఏ శాసనాలు లేవుకాన, మనుమ సిద్ధికి మహామంత్రి కాదని, ఏ చరిత్రయైన సృష్టించవచ్చునే?

హేమాద్రి మహామంత్రిపేర శాసనాలు లేవుగాన దేవగిరి యాదవ రాజుల మంత్రి కాదనగలరా?

తిమ్మరుసుకు రాయ లే యగ్రహారాలు యివ్వలేదుగాన, కృష్ణరాయలకు మహామంత్రి కాదందురా?

ఆ రీతిని సర్వరాజ్య ధురంధరత్వ నైపుణ్యమును, హరిహర బుక్కరాయల కనుగ్రహించిన, మాధవులకు సాయణులకు అగ్రహారాలు లేవు. వీరు ఆశించిన యెన్ని తీసికొనిన, నడుగువారెవరి? కాన, వీరు యిప్పించే వారుగాని, గ్రహించేవారు గాదు. ఆ మేరకు కోడలికి గంగాదేవికి విద్యాగురువైన, కాశీవిలాస క్రియాశక్తి రాయలకును బుక్కరాయలుగాని పుత్రుడు కంపరాయలుగాని, కోడలి సిఫారస్సు మేరకు, దానధర్మాలు యిచ్చియున్న శాసనాలలోని ప్రశంశా పదాలకు డొంకతిరుగుడు, అన్వయాలు కల్పించి, రాజగురువు—కుల గురువనదగునా?

కులగురువనగా—తమ కుల శ్రేయస్సునకు తగిన, ధర్మాధర్మముల నిరూపించి, పౌరోహిత్యాది కార్యముల నిర్వర్తించి, మెలంగు వారికి కులగురువందురు. ఆ మేరకు క్రియాశక్తులు ఏమిచేసినది నిరూపించగలరా ?, రాజగురువనగా — రాజస్థాపనము, పరిపాలనా నైపుణ్యము క్లిష్టసమయాలలో రాజ్యరక్షణ ప్రభురక్షణ వంటి కార్యాలు చేపట్టడము రాజగురువు లక్షణము. ఆ మేరకు మాధవు లుండినట్లు పరాశర మాధవీయమున మాధవులు చెప్పియున్నారుగాని, క్రియాశక్తుల వారెందైనా చెప్పినారా? ఎవరైనా చెప్పినవ్రాతలేని గలవా ? శాంతరసగారు సప్రమాణంగా నిరూపించియుండిన బాగుండెడిది.

మఱియు, శాంతరసగారికి తెలియదేమోగాని, క్రియాశక్తుల ప్రశంసము — మఱియొక మాధవమంత్రి చేసియున్నారు. వీరు తమ గురువుగా గూడ పొగడినారు.

'సూత సంహిత' యను గ్రంథము వ్యాసులు రచించినారు. ఈ గ్రంథానికి మాధవమంత్రి యనునతడు, వ్యాఖ్యానము వ్రాసినారు. (ఈ మాధవమంత్రి గూడ — మాధవవిద్యారణ్యులేయని, కొందరికి భ్రాంతి గలదు.) ఈ 'సూతసంహిత'లోగూడా గంగాదేవి మధురావిజయములో ప్రశంసించినట్లే—

"శ్రీమత్కాశీ విలాసాఖ్య క్రియాశక్తీశ సేవినా।
శ్రీ మత్ర్యంబక పాదాబ్జ సేవానిష్ణాత చేతసా"

అను మంగళాచరణ శ్లోకమొండు కొన్ని గ్రంథాలలో గలదు, కొన్నింటిలో లేదు. ఉన్నదే యనుకొందాము. ఆ మేరకు మాధవమంత్రి క్రియాశక్తి శిష్యుడనదగును. కానీ—ఈ మాధవమంత్రియే

"ప్రణమామి పరం బ్రహ్మయతో వ్యావృత్త వృత్తయః।
అవిచార సహంవస్తు విషయీ కుర్వతేధియః।
నమః శ్రీ శంకరానన్ద గురుపాదాంబు జన్మనే।
సవిలాస మహామోహగ్రాసగ్రాసైక కర్మణే।
శ్రీమత్ర్యంబక పాదాబ్జం, నత్వామాధవ మంత్రిణా।
తాత్పర్య దీపికా సూతసంహితాయా విధీయతే.
క్రియతేతత్ప్రకరణ తాత్పర్య ప్రథ నపూర్వకం,విశదం
విషమపద వాక్య వివరణమహసూతప్రోక్త సంహితామధ్యే"

అనిరి. ఆ మేరకు, శంకరానంద గురుపాదాంబుజ సేవకులు మాధవ మంత్రియనిరేగాని, కాశీవిలాస క్రియాశక్తీశ సేవకులు, ఎట్లగుదురు?

మఱియు, ఈ సూతసంహిత, 1. శివమహాత్మ్య ఖండము, 2. జ్ఞానయోగ ఖండము, 3. ముక్తిఖండము, 4. యజ్ఞవైభవ ఖండము, 5. బ్రహ్మగీతా అని యైదు భేదములతో గూడిన భాగములుగల గ్రంథము.

మొదటిదైన శివమహాత్మ్య ఖండ చివరి భాగానగల గద్య లోను క్రియాశక్తి ప్రశంసలేదు—"శ్రీ స్కాందేమహాపురాణే, సూత సంహితాయాం శివమాహాత్మ్యఖండే, తీర్థమాహాత్మ్య ఖండనం నామత్రయోదశోధ్యాయః సమాప్తోయం" అని గలదు.

రెండవదైన జ్ఞానయోగ ఖండ చివరను "సూత సంహితాయాం, జ్ఞానయోగ ఖండే సమాధి విధిర్నామ వింశోధ్యాయః" అనే గలదు. మూడవదగు ముక్తి ఖండ చివరను "సూత సంహితా

యాం, ముక్తి ఖండే ఈశ్వర నృత్త దర్శనం నామ నవ మోధ్యాయః''అనే యున్నది. నాలుగవదగు యజ్ఞవైభవ ఖండ చివరన, ''యజ్ఞవైభవ ఖండే పూర్వ భాగే, భోగావశిష్ట స్వరూప పాపకథనంనామ సప్త చత్వారింశోధ్యాయః'' అనే గలదు.

ఇందు—ఇతి శ్రీమత్కాశీ విలాస క్రియాశక్తి పరమభక్త
శ్రీమత్ర్యంబక పదాబ్జ సేవా పరాయణే నోపనిష
న్మార్గ ప్రవర్తకేన మాధవాచార్యేణ విరచితా
యాం, సూత సంహితా తాత్పర్య దీపికాయాం,
యజ్ఞవైభవ ఖండే సప్తచత్వారింశోధ్యాయః''

అని గలదు.

ప్రతి ఖండ ప్రారంభముననూ, ''నమశ్శ్రీశంకరానంద గురుపాదాంబుజ జన్మనే'' అను ప్రార్థనమే గలదు. చివరన మాత్రము శ్రీమత్కాశీవిలాస క్రియాశక్తి పరమ భక్త అనిగలదు. దీనిచే శంకరానందులు విద్యాగురువులనియు, క్రియాశక్తులు, ఆశ్రయగురువు లేమో యనియు తోచకమానదుగదా!

మాధవ విద్యారణ్యుల గురువర్యులు, భారతీతీర్థులు, విద్యాతీర్థులనే ఇర్వురి పేర్లు గలవు. శాస్త్ర గ్రంథముల రచనాకాలానికి భారతీ తీర్థులు శృంగేరి పీఠాధీశులుండిరి. వీరే మాధవ విద్యారణ్యుల విద్యాగురువులుగా నుండిరిగాన వీరిని కొలచిరి. వేద భాష్య రచనా కాలానికి భారతీ తీర్థులు పరమపదించిరి. విద్యాతీర్థులు పీఠగురువులైరి. గాన వీరినే వేదభాష్య రచనలలో నుగ్గడించిరి.

ఈ 'సూత సంహిత'లో పొగడిన శంకరా నందులు, క్రియాశక్తులు, పైభారత—విద్యా తీర్థులకు భిన్నులుగాన, దీనిని రచించిన మాధవ మంత్రియు, భిన్నుడేగాని, మాధవ విద్యారణ్యులుగారు అని సర్వజన విదితము.

మఱియు మాధవ విద్యారణ్యుల గ్రంథాలలో తొలుత ''వాగీశాద్యాస్సుమనసః'' యను గణపతి ప్రార్థనముండును. బుక్కరాయల ప్రోత్సాహము, గురువందనము అను భాగత్రయముండును.

ఈ 'సూత సంహిత'లో, గణపతి ప్రార్థనలేదు. భారతీతీర్థులుగాని, విద్యాతీర్థుల గురుప్రార్థనము లేదు. శంకరానందుల ప్రార్థనము గలదుగాన, ఈ మాధవులు వేరు. ఈ సూత సంహితా వ్యాఖ్యాత మాధవమంత్రి, బుక్కరాయల సోదరుడైన ముద్దప్ప దండనాయకుని కడ మంత్రిగ నుండినట్లు చరిత్రకారు లందురు. అట్లగునేని పడమర తీరమనదగు కొంకణ ప్రాంతము గోవాతీరము స్వయముగ మాధవవిద్యారణ్యులు జయించి, ముద్దప్ప దండనాయకుని నియమించినట్లున్నది. ఇతనికడ విద్యావంతుడైన మాధవుని మంత్రిగ, మాధవవిద్యారణ్యు లేర్పాటు చేసియుండవచ్చును. ఆ గోవా ప్రాంతాన్ని మాధవ విద్యారణ్యులు స్వయముగ వెళ్లి జయించి నట్లు శాసనాలు గలవు. వానిని యిందు వివరించుట వ్యాస విస్తర భీతిచే చూపలేదు.

అట్టి గోవాప్రాంతాన, క్రియాశక్తులుండి యుండవచ్చు వారి కడ, గంగాదేవి, విద్యాభ్యాసం చేసియుండవచ్చు. యోగ్యురాలు గాన, తమ రాజు బుక్కరాయలకు చెప్పి, కంపరాయలకు వివాహం చేసి యుండవచ్చు. ఆ గంగాదేవి గురువైన, క్రియాశక్తిని ''గురుం వందే'' యని యుగ్గడించినంత మాత్రాన రాజగురువు—కులగురువగునా?

గంగాదేవివలెనే, పై మాధవ మంత్రియు క్రియాశక్తి నుగ్గడించిరి. వారికి గూడ ''శాంతరస'' గారనినట్లు రాజగురువు కులగురువే కావలసివచ్చును గదా??

విద్యావంతుడు యోగ్యుడు క్రియాశక్తి కావచ్చు. అట్టి వారిని బుక్కరాయలు మాధవమంత్రి గౌరవించి, దాన శాసనము వ్రాయించి యిచ్చిన రాజగురువగునా? ఆ రీతిని భావించినచో — నాచన సోమనాథునకు, బుక్కరాయలు అగ్రహారము లిచ్చినట్లు శాసనాలు గలవు. దీనిచే నాచనసోమ నాథుడు గూడ ఆస్థానకవి, రాజగురువు కులగురువు అని, చాటవచ్చునే? ఏమందురు?? రాజ ధర్మము గొప్పవారిని గౌరవించుట! ఆ మేరకు క్రియాశక్తిని గౌరవించి యుండవచ్చునే గదా?

ఈ కాశీ విలాస శ్లోకానికి రెండు అర్థములు గలవు.

(1) ''కాశీ విలాస'' యను పేరుగల వ్యక్తిని, క్రియాశక్తిని, ఈశ్వరుని, త్ర్యంబకులను గురువుల పాదములను భజించు వారని యొక యర్థము.

2. కాశీవిలాసుడు పేరుగల క్రియాశక్తికి, ప్రభువగు శివునకును, త్ర్యంబక గురుపాదములకు సేవజేయువారనియు రెండవ యర్థము. మఱియు గ్రంథాన్తమందు, ''శ్రీమత్కాశీ విలాస క్రియాశక్తి పరమభక్తి శ్రీమత్ర్యంబక పాదాబ్జ పరాయణేన'' అని గలదు. కాశీవిలాసపదము క్రియాశక్తి పదమునకు విశేషణమని, గద్యవల్ల తేలును. ఆ రీతిని మంగళాచరణ శ్లోకముననూ, కాశీ విలాస పదము క్రియాశక్తి పదమునకు, విశేషణమేయగును. అట్లైనచో శక్తికేశ్వరుడగు సాంబశివునకు, త్ర్యంబక గురువునకు స్తుతి చెప్పినట్లే యగునుగాని, వేరుగాదు. దీనిచే, త్ర్యంబక గురువునకు స్తుతి చెప్పినట్లగునేగాని, కాశీవిలాసులనువారుకి గాదని తోచెడిది.

వీనినెల్ల పరిశీలించుకొలది విజయనగర స్థాపనము మాధవ విద్యారణ్యులే చేసిరి గాని క్రియాశక్తి గాదు. హరిహర బుక్కరాయలకు, కులగురువు, రాజగురువు మాధవులేగాని, క్రియాశక్తిగాదు. బుక్కరాయల సోదరుడైన, ముద్దప్పదండనాథునికడగల, మాధవ మంత్రి స్తుతించిన క్రియాశక్తి గోవా ప్రాంతీయుడగుటచేత గంగాదేవియు నా ప్రాంతీయురాలై యుండియుండ గోవాను జయించిన యనంతరము బుక్కరాయలు తమ పుత్రునకు కంపరాయలకు గంగాదేవికి వివాహం జరిపించియుండవచ్చు. అట్లు కోడలైన గంగాదేవికి గురువైన క్రియాశక్తికి గురుదక్షిణగా, మామకు భర్తకు చెప్పి దానధర్మాలు యిప్పించి యుండవచ్చు. అట్లు వచ్చిన క్రియాశక్తిని, రాజగురువు—కులగురువనియు, వీరశైవమతస్థు

డనియు, వీరశైవాధిక్యతను చాటుకొనుటకై, "శాంతరస" గారు చెప్పిననూ - ధార్వాడ కర్ణాటక యూనివర్‌సిటీవారైన, యధార్థంగా వస్తుచున్న చరిత్రను కనుగప్పించు రచనలు ప్రోత్సహించుట, ప్రకటించుట వలదని విన్నవించుచు, పునఃపరిశీలనము యోగ్యులైన సుచరిత్ర కోవిదులచే చేయించి, యధార్థమును ప్రకటింతురుగాక యని విన్నవింతును.

అ ధో జ్ఞా పి క లు

1. శాంతరసగారి బళ్ళారిజిల్లె శివ శరణు.
2. 1976 నవంబరు 'భారతి'లోని జానమద్ది హనుమచ్ఛాస్త్రి గారి వ్యాసం
3. సూత సంహిత—మాధవమంత్రి వ్యాఖ్య.
4. ఋగ్వేద భాష్యభూమిక.
5. యజుర్వేద భాష్యభూమి.
6. సామవేద భాష్యభూమిక.
7. అధర్వణ వేదభాష్య భూమిక,
8. = పరాశర మాధవీయము.
9. ఇతర శాసనములుకొన్ని చారిత్రకులు నిర్ణయించిన ఈ కాలాలలో నెందేని, కాశీ విలాస క్రియాశక్తి దేవర పేరేని యెవరేని యెందేని స్మరించియున్నారా?? గమనింతురుగాక.

(1) మలిక్కాఫర్ తొలుత దేవగిరిపైన — కాకతీయులపైన తొలిముట్టడి 1310 ప్రాంతము.

(2) మరలా రెండవముట్టడి — దక్షిణా పథంపై 1312 ప్రాంతము.

(3) జంబుకేశ్వరయుద్ధము—1334 లో.

(4) విజయనగర ప్రాంతమున మాధవ విద్యారణ్యుల తపస్సు — 1334 లో.

(5) విజయనగర నిర్మాణము మాధవులు చేసినది 1335 to 36 ధాతు వైశాఖ శు 2 లు బుధవారము.

(6) సంగమవంశపు ప్రథమరాజు—హరిహరులు మాధవుల ప్రేరణ ప్రోత్సాహకులచే రాజై పాలించినది 1335 to 1343.

(7) బుక్కరాయలు రాజ్యపాలన కాలములు 1343 to 1379.

(8) మాధవ విద్యారణ్యులు సాయణులు గ్రంథ రచనలు ప్రారంభము 1350 to 1379.

9) వేదభాష్యాల రచనా కాలములు మాధవులు సాయణులు 1365 to 1379.

(10) బుక్కరాయల పుత్రుడు గంగాదేవి భర్త కంపరాయల నిర్యాణము 1375.

(11) బుక్కరాయల నిర్యాణము 1379లో

(12) మాధవులు సన్యసించి విద్యారణ్యులైన కాలము 1378 to 1379 లోపు.

(13) బుక్కరాయల ద్వితీయపుత్రుడు II హరిహరరాయలు రాజ్యకాలం 1379 to 1399.

(14) సాయణులు అధర్వణ వేదభాష్య రచనము 1385.

(15) II హరిహర రాయలు ఫిరోజీషాతో యుద్ధము 1398—99లో.

(16) II హరిహరుని యనంతరం పుత్రుడు II బుక్కరాయలు రాజ్యకాలం. 1399 to 1406.

(17) I దేవరాయలు రాజ్యకాలము 1406—1412.

అనగా 1335లో మహామేధావి మహాతపఃసంపన్నుడు సర్వజ్ఞమూర్తి మాధవ విద్యారణ్యులు స్థాపించిన విజయనగర సాంరాజ్యము—1398 వరకు నిష్కంటకముగా నిశ్శత్రుత్వముగ, నభివృద్ధి జెందినది. 1399లో ఫిరోజిషా దండయాత్రతో మరలా నప్పుడప్పుడు శత్రుబాధలకు లోనగుచునే వచ్చెను. మఱి ఇట్టి కాలములలో చరిత్రలో నెందేని నే విధముగగాని, తోడ్పడడముగాని, గ్రంథరచనఁచేసి లోకోపకారాదులకు తోడ్పడడంగాని, నెందేని నేరీతి నేని, క్రియాశక్తి దేవరకు, అవకాశాదులుండినవా?? చరిత్రను తెలిసిన పెద్దలే ఋజువు చేయగలరు?? నేను, నీవు వ్రాసిన వ్రాతలే యాధారాలు గావుగదా??

(18) I దేవరాయల పుత్రికను యిచ్చి వివాహం చేయమని, కోరి యుద్ధానికి వచ్చినది ఫిరోజిషా 1410 టు 12.

(19) వీరవిజయరాయల కాలము 1412 టు 1419.

(20) II దేవరాయల కాలము 1419 టు 1444. ఈలోపుగ 1423లో అహ్మద్‌షా యుద్ధం.

(21) నికొలోకోంటీయను పోర్చుగీసుని రాక 1420.

(21) సంగమవంశం తగ్గిపోగా సాళ్వ నరసరాయలకాలం 1490.

(22) తుళువ నరసరాయలకాలం 1490 టు 1508.

(23) కృష్ణరాయలు 1509 టు 1530.

(24) కృష్ణరాయలు తిమ్మరుసు పుత్రుని చంపించడం తిమ్మరుసు నేత్రములు తీయడం బ్రహ్మహత్యాది దోషములు. 1528 టు 1530.

(25) తళ్ళికోట యుద్ధంతో జనవరి 23—(23-1-1565)

అక్షరధార

శ్రీ తిరునగరి

నా కవితాగ్రజన్ముడు కాళిదాసు
నా పద్యానికి విజయరథ్య తెరచినవాడు తిక్కమంత్రి
నా భావానికి సంస్కరణ మంత్రోపదేశం చేసినవాడు వేమన్న
నా అక్షరాలను అభ్యుదయ రథానికి పూన్చినవాడు గురజాడ
కృష్ణశాస్త్రి నా 'తిమిర లతకు తారకా కుసుమములు'
పూయించాడు

శ్రీ శ్రీ నన్ను 'మహాప్రస్థానం' చెయ్యమన్నాడు
ఆరుద్ర తమ్ముడూ 'త్వమేవాహం' అన్నాడు
దాశరథి నా చేతికి 'రుద్రవీణ' నిస్తే
అదిగో మీటుకొమ్మని అనిసెట్టి 'అగ్నివీణ' నిచ్చాడు
'అమృతం కురిసిన రాత్రి' లో విహరిద్దాంరా అన్నాడు
బాలగంగాధరుడు

'సంఘర్షణ' సంగతేమిటని ప్రశ్నించాడు రెంటాల కృష్ణుడు
సోమసుందర్ పాత్ర నిండా 'సోమరసం' అందించి
'సుందర (కవితా) కాండ' నావిష్కరింపమన్నాడు
కుందుర్తి 'నాలో నినాదాలు' ముందు వినుమంటే
'అనాది కొసనుంచి అనంతత్వంలోకి' భీమన్న
అవలోకించమన్నాడు

నా గొడవ వింటే నీవందరినీ విన్నట్టే అని కాళోజీ
సోదరా మండే సూర్యుడు మనకుతోడు శేషేంద్ర ఉవాచ
మంటలూ—మానవుడూ, మన కావ్యవస్తువని సినారె
ప్రవచనం

జనతను మేల్కొలిపేందుకు జానపదమే శరణ్యమని
ముకురాల దరహాసం

ఎందరు కవితాను జన్మలు నాకు
ఎంతో విస్తృతమైంది నా కవితా కుటుంబం
వీళ్ళంతా వెన్నుతట్టి నన్ను నడిపిస్తూంటె
రసజీవినై ఆవిష్కరిస్తాను
రసవత్కవితా ఖండాలు
అవి సందేశ సౌరభాలను పంచి
వ్యాపించాలి దిగంతాలు
నా కవిత ఏనాటిది ?
కాళిదాసు నుంచీ వస్తున్నది
కమనీయ మకరంద ధారగా
అది అక్షయ ధార
అది అక్షర ధార

డాక్టర్ బి. ఆర్. కె. రావు

వ్యవసాయం

మానవుడు బ్రతకటానికి గాలి, నీరు, వేడి, ఆహారము అత్యవసరము. మానవజాతి తన మనుగడ ధారావాహికంగా సాగాలని ఆకాంక్షిస్తూ సంఖ్యా మాత్రంగా పెరుగుతూ పోతోంది. అయితే జన సంఖ్య పెరుగుతున్నకొద్దీ ఆహారం రాశ్యాత్మకంగాను, గుణాత్మకంగానూ పెరుగుతూ పోవలసిన అవసరముంది. విజ్ఞాన, సాంకేతికశాస్త్రాల అనువర్తింపుతో, మానవకృషి నిర్విరామంగా సాగి, ఆ ఫలితాన్ని వ్యవసాయరంగం ద్వారా పొందవలసి ఉన్నది. అందువల్ల మానవుని అస్తిత్వానికి వ్యవసాయము ప్రాతిపదిక అవుతోంది. తత్కారణంగా వ్యవసాయాభివృద్ధి తీరుతెన్నుల్ని పరిశోధనా దృష్టితో పరికించుతూ, తదభివృద్ధికి సంబంధించిన కారణాలను సమీకరించి, సహసంధానం చేసి వ్యవసాయాభివృద్ధిని సాధిస్తూ ప్రజలకు లోటు లేకుండా ఆహారాన్ని అందించి వారి అస్తిత్వాన్ని కాపాడుకుంటూ వెళ్ళాలి. అయితే భౌతిక వనరులను, సాధనాలను ఉపయోగించి వ్యవసాయాభివృద్ధిని సాధించేది మానవుడైన కర్షకుడు కాబట్టి, కర్షకుని కృషి ఫలితాన్ని అనుభవించి సుఖించేది వినియోగదారుడుకాబట్టి తత్కారణంగా కర్షకునకు వినియోగదారునకు మధ్య స్నేహపూర్వక సామరస్యం అవసరమౌతుంది. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన విషయాలను వివిధ కోణాలనుండి పరికించవలసిందిగా రైతుకు, వినియోగదారులైన పౌరులకు పదే పదే గుర్తుచేయడం జన కల్యాణ సాధనకు తోడ్పడుతుందని మేధావి ఆర్థిక శాస్త్రవేత్త ఆశిస్తాడు.

సూచకములు

వ్యవసాయాభివృద్ధి జరుగుతున్నట్టు తెలియజేసే సూచికము లీ విధంగా ఉంటాయి: (1) విస్తృత వ్యవసాయం జరగడము. ఇది వరకు సేద్యంలో లేని భూమి సాగుబడి క్రిందికి రావడము. ఎన్ని ఎకరాలు కొత్తగా సాగుబడిలోకి వస్తే అంత హెచ్చుగా వ్యవసాయాభివృద్ధి సాగుతున్నట్లు తెలిసికోవచ్చు. ఇది వరకు సాగుచేయబడి వదలివేయబడిన భూమి మరల సాగులోనికి రావడముకూడా విస్తృత వ్యవసాయమే అవుతుంది. (2) సేద్యంలో వున్న భూముల్ని సాంద్ర పద్ధతిలో సాగు చెయ్యడము వ్యవసాయాభివృద్ధి క్రిందికి వస్తుంది. ఆధునిక యంత్రాలను, రసాయనికాది ఎరువులను అనువర్తింప జేయడం మొదలైన పనులద్వారా హెచ్చు దిగుబడిని పొందడము పంట సంవత్సరంలో యిదివరకటి సంవత్సరంలో కంటె హెచ్చుపంటలను పండించడము, ఎక్కువ రకాల పంటలను పండించడము సాంద్ర వ్యవసాయమౌతుంది. నీటిని తగినంత హెచ్చుగా ఉపయోగించి, పెట్టుబడిని ఎక్కువగా పెట్టి వాతావరణానికి, భూసార లక్షణాలకు తగినట్లు పన్నెండు నెలలు పంటలు పండించడము సాంద్ర వ్యవసాయమౌతుంది. మనుష్యులకే కాక, పాడి పశువులకు, గ్రుడ్లను, మాంసాన్నిచ్చే పక్షులకు, అలాగే మాంసాన్నిచ్చే పశువులకు, అవసరమైన పంటలనుకూడా సాంద్ర వ్యవసాయం ద్వారా వచ్చే పంటల్లో చేర్చవచ్చు. (3) వ్యవసాయ పద్ధతుల్ని అనగా సేద్య పద్ధతుల్ని మార్చడం వల్ల, అనగా సాంకేతిక విజ్ఞానం సంభవం చేసిన నూతన పద్ధతుల్ని అనుసరించడం వల్ల ఎకరా రాలుబడి పెరుగుతుంది. (4) అదేవిధంగా సేద్యంలోకి వచ్చిన భూ విస్తీర్ణము, సాంద్రత పెరగడంవల్ల మొత్తం వ్యవసాయోత్పత్తి పెరుగుతుంది. (5) విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలు చేకూర్చిన సౌకర్యాల నుపయోగించడంవల్ల శీతోష్ణ పరిస్థితికి, భూసారాన్నిచ్చే వివిధ పదార్థాల అనుపాతాల కలయికకు అనుసారంగా పండించడానికి వీలైన పంటలన్నీ పండించబడతాయి. (6) ఎకరా రాలుబడి వెరశి వ్యవసాయోత్పత్తి, పంటల సంఖ్య పంటల రకాల సంఖ్య పెరగడంవల్ల, ప్రజలందరికిగాని, ప్రజలలోని అధిక సంఖ్యాకులకు గాని, ఆహారము సంతృప్తికరంగా సప్లయి చేయబడుతుంది. (7) ఆహారంలోని రాశ్యాత్మక, గుణాత్మక లోపం తొలగుతుంది. ఆహారోత్పత్తి పెరగడంవల్ల అల్పపోషణ లోటు తొలగుతుంది. వివిధ రకాల పంటల సంఖ్య, పాడి అభివృద్ధి చెందడం వల్ల గుణ వైశిష్ట్యం గల ఆహారం హెచ్చుమందికి లభ్యమై హీన పోషణ లోటు తొలుగుతుంది. తక్కువరాశి ఆహారంవల్ల, తక్కువ గుణం ఆహారంవల్ల వచ్చే 'అండర్ న్యూట్రిషన్', 'మాల్ న్యూట్రిషన్' లోపాలను తొలగించడానికి పాడిపశువుల వృద్ధి, గ్రుడ్లనిచ్చే పక్షుల వృద్ధి, మాంసాన్నిచ్చే పశుపక్ష్యాదులవృద్ధి, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుపోషణ మెరుగుచెందడంవల్ల మంచి పశువుల సంఖ్య వృద్ధి కావడము తోడ్పడతాయి. (8) అడవులనుండి లభ్యమయ్యే పండ్లను, మాంసాహారాన్ని తేనె మొదలైన వాటిని పూర్తిగా ఉపయోగించుకునేందుకు పద్ధతులు అమలు జరుపబడతాయి. అడవి నుండి పొందే యితర సంపదలను ఆర్థికాభివృద్ధికి పూర్తిగా ఉపయోగించుకోవడం జరుగుతుంది. (9) నదులు, కాల్వలు, చెరువులు, కొలనులు, గుంటలు, మొదలైనవాటినుండి చేపలను పట్టి ఆహారానికి హెచ్చుగా ఉపయోగించడం జరుగుతుంది. నిజానికి నీటిలో చేపల పెంపకం — అభివృద్ధి చేయబడుతుంది. సముద్రాల నుండి తీయడానికి వీలున్న ఆహార పదార్థాలను బయల్పరచడానికి పద్ధతులు పెంపొందించబడి, సముద్రాహారం బయటికి తీయబడి మానవోపయోగానికి అందించబడుతుంది.

అభివృద్ధి కారకాలు

వ్యవసాయాభివృద్ధికి అనేక కారకాలు, శక్తులు, పరిస్థితులు తోడ్పడతాయి. (1) వ్యవసాయ నిర్వహణ తమ జీవన విధానమని పూర్తిగా విశ్వసిస్తూ, ప్రజలు అనగా రైతులు మొదలైన గ్రామీణులు సేద్యాన్ని అత్యంత శ్రద్ధతో చేస్తారు. నిజానికి వ్యవసాయపు పని చెయ్యనిదే ప్రజలకు నిద్రపట్టదు. రాత్రింబవళ్లు నిరంతరాయంగా వ్యవసాయ సంబంధమైన కార్యకలాపాల్లో నిమగ్నమై, వాటిలో మునిగి తేలుతూ, ఆ కార్యకలాపాలకు సంబంధించిన ఉత్పత్తిని, సరఫరాను పెంచి, ప్రజలకు ఆహారాన్ని పుష్కలంగా అందించడమేగాక ఆహార వస్తువుల్ని హెచ్చుగా అమ్మి తమ ఆదాయాన్ని పెంచుకుంటారు. అదనపు ఆదాయంనుండి పొదుపును పెంచి, పెట్టుబడిని పెంచి తమ వ్యవసాయోత్పత్తి కార్యక్రమాలను విస్తృతము, సాంద్రముచేసి వ్యవసాయాభివృద్ధిని మరింతగా ముందంజ వేయిస్తారు. ఆచార సాంప్రదాయానుసారము మనిషి ప్రవృత్తి యిందుకు అనుగుణ్యంగా ఉంటుంది. (2) అలవాటు చొప్పున, వంశ పారంపర్యంగా వస్తున్న ఆచారానికి అనుకూలంగాను, పరిస్థితులనుబట్టి వ్యవసాయ నిర్వహణలో ప్రత్యేక అభిరుచి కల్గడంవల్ల, వ్యవసాయశాస్త్రంలో విద్యావిజ్ఞానాలు వెల్లివిరియడంవల్ల, వ్యవసాయాభివృద్ధి కార్యకలాపాలను అమలుజరుపుతూ, వ్యవసాయం మీద ఆధారపడి స్వతంత్ర జీవనాన్ని గడపాలని అటువంటి విధానమే ఉన్నత జీవన ప్రమాణాన్ని తమకు సమకూర్చగలదని నమ్ముతూ, ముఖ్యంగా గ్రామీణులు వ్యవసాయ విద్యా సముపార్జన చేసిన పట్టణ, గ్రామ యువ విద్యావంతులు జోరుగా వ్యవసాయ కార్యకలాపాలను నిర్వహించడము వ్యవసాభివృద్ధికి తోడ్పడుతుంది. (3) పై జెప్పిన పరిస్థితుల్లో వ్యవసాయకులు శ్రద్ధతో అమలు జరిపే చర్యలవల్ల ఎకరా రాలుబడి, వ్యవసాయ దిగుబడి పెరుగుతుంది. ఈ చర్యలన్నీ విజ్ఞానశాస్త్ర, సాంకేతిక శాస్త్రబద్ధంగాను, అనుభవాలు చెప్పే నీతికి అనుగుణ్యంగాను ఉండటంవల్ల లాభదాయకమైన రీతిలో వ్యవసాయం సర్వతోముఖవికాసం చెందుతుంది. (4) వ్యవసాయాన్ని పారిశ్రామిక, వాణిజ్య ప్రాతిపదికలమీద నిర్వహించడంవల్ల అధిక లాభాలు సంప్రాప్తమౌతాయి. ఉదరపోషణకు మాత్రమే ఉత్పత్తి చేయడంగాక, తగినన్ని రాశులలో ఉత్పాదక కారకాలను పెట్టుబడిచేసి, క్షీణ ప్రతిఫల ప్రక్రియ అమలు జరుగకుండాచేసి, పెట్టుబడి విలువను మించిన అధిక ఉత్పత్తి పొందడం ద్వారా సాధించాలి. అంతేగాక హెచ్చు ఉత్పత్తిని సాధించి మార్కెట్టుకు పంపి అమ్మి లాభాలు సంపాదించాలి. హెచ్చు ధరలకు అమ్ముడుపోయే పంటలను పండించి లాభాలు పొంది, తద్వారా సమకూడిన ఉత్సాహంతో మరింతగా వ్యవసాయ కార్యకలాపాలు సాగించి వ్యవసాయ పరిశ్రమను మరింతగా అభివృద్ధి చేయవచ్చు. (5) విస్తృతంగా కొత్తభూమిని సేద్యంలోకి తేవడానికి, బీళ్లను, గట్టి నేలను పగల దున్నడానికి, చదును చేయడానికి యంత్రాలను ఉపయోగించాలి. వేసవిలో సహితం సాగుచేయడానికి నూతులనుండి నీరు తోడటానికి మోటార్లను, వాటిని నడపడానికి విద్యుచ్ఛక్తిని ఉపయోగించాలి. అంతేగాక వ్యవసాయంనుండి వచ్చే పంటలను ముడిపదార్థాలుగా ఉపయోగించి వాణిజ్య వస్తువుల్ని తయారుచేసే పరిశ్రమలను నడపడానికికూడా విద్యుచ్ఛక్తిని ఉపయోగించవలసి ఉంటుంది. ఇలాంటి వ్యవసాయాధార పరిశ్రమలను జయప్రదంగా నడపడంవల్లనే వ్యవసాయోత్పత్తికి గిరాకీ పెరిగి, మంచి ధరలు లభ్యమై వ్యవసాయంలో పెట్టుబడి, ఉత్పత్తి పెరిగి వ్యవసాయాభివృద్ధి మరింతగా జరుగుతుంది. (6) వ్యవసాయ కార్యకలాపాలను ఆధునిక రీతుల్లో నిర్వహించడానికి హెచ్చు మూలధనం కావాలి. పాత పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్న సన్నకారు, మధ్యరకం రైతులు, చాలాతక్కువ భూవసతిగల రైతులు, నీటిపారుదల సౌకర్యాలులేకుండా వ్యవసాయంచేసే రైతులు తక్కువ ఆదాయాలు పొందడంవల్ల ఆధునిక పద్ధతికవసరమైన పెట్టుబడిని వ్యవసాయంలో పెట్టలేరు. ఇందు కవసరమైన మూలధనాన్ని సమకూర్చడానికి పరపతినిచ్చే ప్రభుత్వప్రయివేటు ద్రవ్యసంస్థలు, సహకార సంఘాలు, బ్యాంకులు, బ్యాంకింగ్ వ్యాపారంచేసే సంస్థలు తగినన్ని ఉన్నందువల్ల అప్పులు పుట్టి, పెట్టుబడి పెరిగి వ్యవసాయం పురోగమిస్తుంది. అప్పులు నగదురూపంలోగాని, వస్తురూపంలోగాని, అవసరాన్ని బట్టి, పరిస్థితులనుబట్టి, దుర్వినియోగం కాకుండా ఉండేరీతిలో అందడం అవసరం. (7) నీటిపారుదలకు కావలసిన జలాధారాలు పరిమితంగా ఉన్నాయి. అవికూడా పూర్తిగా క్రమబద్ధం చేయబడలేదు. వర్షాలు లేక ఒకప్రక్కన, వరదలవల్ల మరొక ప్రక్కన బాధపడుతున్నాము. ముందుముందు ప్రపంచమంతటా వర్షపాతం తగ్గే సూచన లున్నాయ్యని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఉన్న నీటిని ఇష తమ సిద్ధిమేరకు గాక, తక్కువగానో, ఎక్కువగానో వాడి పంటలను చెడగొడుతున్నాము. ఎర్రభూమి, ఇసుకభూముల్లో వదలిన నీరు త్వరగా ఆవిరైపోతోంది. అందువల్ల పరిమితంగా ఉన్న నీరుహెచ్చు రోజులు భూమిలో ఆవిరైపోకుండా ఉండేందుకు, పేడ, ఆకులు, వెంట్రుకలు మొదలైన సేంద్రియ ఎరువులు వేయడం అవసరం. పేడను 'గోబర్‌గ్యాస్' ప్లాంట్లద్వారా ఉపయోగించి వంటచేయడానికి గ్యాసును పొందాలేగాని, పిడకలుచేసి తగలబెట్టరాదు. పిడకలుచేసి తగలబెట్టడంవల్ల మంచి సేంద్రియ ఎరువు నాశనం కావడమేగాక, పొగవల్ల గాలి కాలుష్య పూరితమై ఆరోగ్యాలు చెడిపోతాయి. 'గోబర్‌గ్యాస్' ప్లాంట్లలో మురిగిన పేడనుండి 'మిథిలిన్ గ్యాస్' వంట చెరుకుగా తయారౌతుంది. పోగా పేడ మురగడంవల్ల ఎక్కువ సారంగల ఎరువుగా తయారౌతుంది. అయితే సేంద్రియ ఎరువులతోపాటు, రసాయనిక ఎరువులు కూడా తగుమాత్రలో కావాలి. వీటిని తయారు చేసేందుకు ఫ్యాక్టరీలు తగినన్ని నెలకొల్పబడాలి. భూసారంలోని లోటును తొలగించే గుణాలుగల పదార్థాలతోకూడిన రసాయనిక ఎరువులను ప్రతి సందర్భానికి పనికివచ్చే మిశ్రమాలుగా తయారు చేయవలసి ఉన్నది. అప్పుడే పంటలు హెచ్చుగా పండటానికి తగినట్లుగా సేంద్రియ, రసాయనిక ఎరువుల నుపయోగించి హెచ్చు ఆదాయాలను పొందవచ్చు. మంచి సేంద్రియ ఎరువును తయారు చేయడానికి 6 నుండి 8 అడుగుల లోతు గోయి తీసి అందులో పొరలు

పొరలుగా పశువులు తమ మలమూత్రాదులతో కలిపి తొక్కిన ఎండుగడ్డి, ఎర్రమట్టి, సున్నము, పొగాకు పొడి లేక పొగాకు కాడల ముక్కలు, పచ్చిఆకులు లేక పచ్చిగడ్డి, వేపాకు పంగాజిప్సమ్ పలచగా కాల్షియంనైట్రేట్, వెంట్రుకలను ఒకదానిమీద ఒకటి గోతి నిండా అయిదారు అంచెలుగా వేసి గోతిని నల్లమట్టితో కప్పి నెల కొకసారి నీరు పెట్టి ఆరునుండి ఎనిమిది నెలలైన తర్వాత తీసి భూమిలో వేసి పడ దున్ని నీరుపెట్టి కలిపి వేయవలయును. మినప, పెసర, వేరుశనగ పొట్టు, తుక్కుకూడా పొలాలకు మంచి ఎరువుగా పని చేస్తాయి. (8) మంచి విత్తనాలు, మంచి ఎరువులు తగినట్లుగా పనిచేసి రాలుబడి పెరగ డానికి తగినంత నీరు కావలెను. నీరు, నిజానికి ప్రాణాలతోకూడిన వ్యవసాయానికి ప్రాణము. అందువల్ల చిన్న, మధ్యరకం పెద్దరకం నీటి పారుదల ప్రాజెక్టులను, వనరులను పూర్తిచేయడము అవసరము. (9) వ్యవసాయాన్ని ఆధునికం చేయడానికి నీటి పారుదలకు కాల్వలను, బోదెలను త్రవ్వడానికి కొత్త భూమిని సాగులోకి తేవడానికి పాత సాగుభూమిన్నిసార్లు సాగుచేయడానికి ఉపయోగించే ఎర్త్ మువర్స్, ట్రాక్టర్స్ ఎక్కువగా తయారుచేయబడి రైతుల ఉపయోగానికి ప్రభుత్వ కార్యాలయాలద్వారాను, సేవా సహకార సంఘాలద్వారాను, వ్యక్తుల ద్వారాను తగిన మేరకు అందించబడాలి. (10) పండిన పంటలకు వివిధ ప్రాంతాలలో అమ్మడానికి హెచ్చు డిమాండ్‌ను, మార్కెట్లను ఏర్పర్చాలి. (11) ధర తక్కువై నిరుత్సాహంగాని, ఎక్కువై వినియోగదారులకు యిబ్బంది కల్గడంగాని జరగరాదు. తగిన ధరయిచ్చి వ్యవసాయాభివృద్ధిలో ఉత్సాహం పుట్టించాలి. కొన్ని సందర్భాలలో ప్రభుత్వం ధరల సపోర్టు, సబ్సిడీ యిచ్చి కొరత రాకుండా వుండేటట్లు పండించటానికి ప్రోత్సాహమివ్వాలి. ఆహార పదార్థాల దరలు పెరిగితే శ్రామికుల జీవన వ్యయం పెరిగి వేతనం హెచ్చించమంటారు. అప్పుడు శ్రామికులు తయారుచేసే వివిధ వస్తువుల ధరలు పెరుగుతాయి. ఈ వస్తువుల్ని శ్రామికులుకూడా వినియోగించడంవల్ల ఒక వస్తువు ధర తర్వాత మరొక వస్తువు ధర గొలుసుకట్టులో పెరిగి చక్రీయ పెరుగుదల స్థితి ఏర్పడుతుంది. అందువల్ల ధరలు పెరుగుతూన్నట్లయితే వాటిని కంట్రోలు చేయవలసిన అవసరంకూడా ఉన్నది. ధరలు ప్రజల అందుబాటులో లేకుండా పెరిగితే ద్రవ్యోల్బణము ఏర్పడుతుంది. ధరలు బాగా తగ్గితే ఆర్థిక తిరోగమనము, ఆర్థిక మాంద్యము, ఏర్పడతాయి. రెండు విధాల అర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది కాబట్టి వేతన—ధరల సామరస్యాన్ని ఏర్పర్చి, ఆ సామరస్యం ఉత్పత్తికి, వ్యవసాయాభివృద్ధికి, తద్వారా ఆర్థికాభివృద్ధికి దోహదం చేసేటట్లు చేయవలసి ఉన్నది. (12) పారిశ్రామికాభివృద్ధి జరుగుతూ వ్యవసాయోత్పత్తులకు—ముడి పదార్థాలకు, శ్రామికులకు కావలసిన అహార పదార్థాలకు మంచి డిమాండు ఏర్పాటుచేయవలెను. అప్పుడు వ్యవసాయానికి ఆదాయం చేకూరుతుంది. వ్యవసాయ రంగం వీటిని పారిశ్రామిక రంగానికి అందించడంవల్ల పారిశ్రామిక రంగం పెరిగి వ్యవసాయోత్పత్తులకు డిమాండ్ కలుగచేస్తుంది. (13) పారిశ్రామిక రంగం తగిన రీతిలో విస్తృతం చెందుతూ వ్యవసాయరంగానికి కావలసిన ఉత్పాదకాలను అందించడం వ్యవసాయాభివృద్ధికి తోడ్పడుతుంది. (14) ఏమైనా వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే ఆ కార్యభారాన్ని భుజస్కంధాలపైకి తీసుకుని నిర్వహించేవారు. నూతన పద్ధతుల్ని, నవకల్పనల్ని, అనుకరణను వ్యవసాయరంగంలో ప్రవేశ పెట్టే సాహసికులు హెచ్చుగా కావాలి. నిజానికి కోస్తాజిల్లా రైతులు తెలంగాణాకు, కర్నూలు, బళ్లారి, హోస్పేట్, గంగావతి, జిల్లాలకు తుంగభద్ర, మాలప్రభ (ధార్వార్ ప్రాంతము) నదుల ప్రాంతాలకు మధ్యప్రదేశ్‌లోని రాయపూర్, నాగపూర్, కట్నీ, బస్తర్ ప్రాంతాలకు, ఒరిస్సాలోని కోరాపుట్, రాయ్‌ఘడ్ ప్రాంతాలలోని మహానది ప్రాజెక్టు ప్రాంతాలకు పోయి వ్యవసాయాన్ని అభివృద్ధి చేశారు. శ్రీ మోహన్‌లాల్ సుఖాడియా ఆంధ్ర రైతులను తీసుకువెళ్ళి రాజస్థాన్ కాల్వక్రింద వ్యవసాయంలోకి దింపారు. సాహసంగల వ్యవసాయ ఉద్యమదారులు హెచ్చుగా ఉన్నపుడే వ్యవసాయాభివృద్ధి జరగడానికి వీలుంటుంది.

వ్యవసాయాభివృద్ధి అవసరము

(1) భారతదేశంలో ఏడు లక్షల గ్రామాలు ఉన్నయ్యి. మన అరవైకోట్ల భారత ప్రజల్లో 80.1 శాతం గ్రామాల్లో నివశిస్తున్నారు. 1969 నాటికి మొత్తం భారత జనాభాలో 218.3 మిలియన్లు (41.2శాతం) దారిద్ర్యరేఖక్రింద ఉన్నారు. గ్రామాల్లో శ్రీ బి. యస్. మిన్హాస్‌కు అనుసారంగా 1967–68లో 50.6 శాతము, శ్రీ పి. కె. బర్ధన్‌కు అనుసారంగా 1968–69లో 54 శాతము దారిద్ర్యరేఖ క్రింద ఉన్నారు. ప్రొఫెసర్స్ దండేకర్, రాత్‌లకు అనుసారంగా 1968–69లో 40 శాతం గ్రామ ప్రజలు, 50 శాతానికి కొద్దిగామించి పట్టణ ప్రజలు దారిద్ర్య రేఖక్రింద ఉన్నారు. నెలకు 42.6 రూపాయల తలసరి వినియోగం (1972–73 ధరల ప్రకారం) లేకుండా ఉన్నట్లయితే అటువంటి వినియోగదార్లంతా దారిద్ర్యరేఖక్రింద ఉన్నట్లే లెక్కవేయబడింది. గ్రామాల్లో వ్యవసాయ పరిశ్రమ గొప్పగా వికసించక పోయినా వికసించేటట్లు చేయబడటానికి వీలుగా గ్రామాల్లో ఉన్నది. ఈ వ్యవసాయాన్ని అభివృద్ధి చేసినట్లయితే గ్రామీణాభివృద్ధి జరిగి అనేక కోట్లమంది దారిద్ర్యంనుండి బయటపడటానికి వీలుంది. ఇదే గాంధిజీ, యితర మహానాయకులు వినోబా వంటివారు ఆర్థిక శాస్త్రవేత్తలు కోరుతున్నారు. (2) వ్యవసాయాభివృద్ధివల్ల పారిశ్రామికాభివృద్ధికి, కావలసిన ముడిపదార్థాలు శ్రామికులకు కావలసిన ఆహార పదార్థాలు ధారాళంగా అంది పారిశ్రామికాభివృద్ధి సాగి ఆర్థికాభివృద్ధికి సర్వతోముఖంగా తోడ్పడుతుంది. అంటే పారిశ్రామికాభివృద్ధి జరిగితే అది వివిధ రంగాల్లో ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని అర్థంచేసుకోవలసి ఉన్నది. (3) 80.1 శాతం ప్రజలు గ్రామాల్లో ఉన్నప్పుడు, గ్రామాల్లోనే వ్యవసాయం వున్నందువల్ల, దాని అభివృద్ధి జరుగుతున్నందువల్ల, యింత హెచ్చు శాతం ప్రజలకు పని, ఆదాయము సమకూరుతుంది. అంతేగాక యీపని, ఆదాయాలద్వారా వారు యితర రంగాలను అభివృద్ధి చేయడానికి తోడ్పడతారు. ఇందువల్ల ప్రజలందరికి మేలు కల్గుతుంది.

(4) వ్యవసాయం అభివృద్ధిచెంది 80 శాతం ప్రజలకు అదనపు ఆదాయాలు సమకూరడంవల్ల, పొదుపులు, మూలధనము పెరిగి, చాలామంది మూలధన ఏర్పాటుకు తోడ్పడడానికి వీలవుతుంది. తద్వారా భారతదేశంలో ఆర్థికాభివృద్ధి జరుగుతుందని పీపుల్స్‌ప్లాను, మొదటి పంచవర్ష ప్రణాళిక చెబుతున్నవి. భారతదేశంలో కొంతవరకైనా ఆవిధంగా జరుగుతోంది కూడా. (5) వ్యవసాయం ప్రాతిపదిక పరిశ్రమ. ప్రాతిపదిక అవసరమైన ఆహారాన్ని ఉత్పత్తిజేసి, అందించి, ప్రాణాలను నిలిపి దేశ జనాభా అస్థిత్వాన్ని కాపాడుతోంది. ప్రజలకు బట్ట రావడానికి కావలసిన దూదిని, ఇండ్లు కట్టడానికి కావలసినకలపను (అడవులనుండి) అందించుతోంది. తద్వారా ప్రజల ప్రాథమిక అవసరాలుతీర్చి వారి ఆర్థిక సాంఘిక సంక్షేమానికి తోడ్పడుతోంది. (6) ప్రజలకు ప్రాథమిక అవసరాలను అందించి వారిలో సంతృప్తిని ఏర్పర్చడంవల్ల వారికి ప్రజాస్వామిక వ్యవస్థలో తమకు కావలసిన మూడు ముఖ్యావసరాలు (కూడు, గుడ్డ, యిల్లు) అందుతున్నయ్యి. కాబట్టి వారు ప్రజాస్వామిక వ్యవస్థను బలపరుస్తారు. ఇందువల్ల రాజకీయ సుస్థిరత ఏర్పడి ఆర్థికాభివృద్ధి పురోగమనానికి తోడ్పడుతుంది. అంతేగాక వ్యవసాయాభివృద్ధివల్ల ఆహారోత్పత్తి బాగా జరిగి సైన్యానికి ఆహారం అందడంవల్ల దేశానికి బలీయమైన రక్షణ వ్యవస్థ లభ్యమై దేశంమీద శత్రువులు దాడిచేసి మన స్వాతంత్ర్యాన్ని హరించడానికి గాని, ఆర్థిక వ్యవస్థను విఛ్ఛిన్నం చేయడానికిగాని వీలుండదు. (7) ఆహారం బాగా లభ్యం కావడంవల్ల ప్రజల్లో అసంతృప్తి ఉండని కారణంగా, శత్రువులు దేశంలో అసంతృప్తిని రెచ్చగొట్టి పంచమాంగదళాన్ని ఏర్పర్చి దేశ సమైక్యతను స్వాతంత్ర్యాన్ని నాశనం చేయడానికి వీలుండదు. అందువల్ల విదేశీయులు మన ప్రభుత్వాలను పడగొట్టడానికి వీలుండదు. అందువల్ల దేశంలో ఏ విధమైన అస్థిరత్వం కూడా ఏర్పడటానికి వీలుండదు. (8) భారతదేశంవంటి ఆసియాదేశాలు ఆర్థికంగా వెనుకబడి వుండడమేగాక, అధిక జనాభా దేశాలుగాఉన్నయ్యి. ఇటువంటి అధిక జనాభాస్థితి మనకు వ్యతిరేకం కాకుండా చేయడానికి వారందరికి ఉద్యోగాలు కల్పించాలి. తక్షణము పని చూపాలంటే కళ్ల ఎదుటఉన్న వ్యవసాయాన్ని అభివృద్ధిచేసే గ్రామస్థులకు గ్రామాల్లోనే పనిజూపి, పట్టణాలకు తరలి వెళ్లకుండా చెయ్యవచ్చు. అందువల్ల పట్టణాలలో మురికివాడలు ఏర్పడే బాధగాని, యిందుకు సంబంధించిన బాధలను నివారించడానికి పట్టణాల్లో హెచ్చు పెట్టుబడిపెట్టే భారాన్ని మోయవలసిన ఆవశ్యకతగాని ఆర్థిక వ్యవస్థకు ఉండదు.

నూతన వ్యూహము : హరితవిప్లవము

ఎరువులు, నీరు, బాగా లభ్యమై మొక్కలు ముదురు ఆకుపచ్చలో వుంటాయి. లేత ఆకుపచ్చగాను, పసుపుగాను వుండవు. అందువల్ల హరిత విప్లవం అని చెప్పబడింది. వ్యవసాయాభివృద్ధి జరిగితేనే హరిత విప్లవం జరిగినట్లు అనగా హరిత విప్లవంద్వారా వ్యవసాయాభివృద్ధిని పొందవచ్చని స్పష్టమౌతోంది. అంటే హరిత విప్లవంవల్ల ఎకరా రాలుబడి మొత్తం వ్యవసాయ దిగుబడి పెరిగి, మంచి ఆదాయాలు సమకూరి రైతులు, వ్యవసాయకూలీలు, గ్రామీణులు సుఖంగా వుండడమేగాక, దేశంలోని యితర ప్రజలకు సుఖ, సంతృప్తిని కలుగచేయడానికి వస్తు సముదాయాన్ని, ఆర్థికాభివృద్ధి కవసరమైన మూలధనాన్ని అందించ గల్గుతారు. భారతదేశంలో ఈ హరిత విప్లవాన్ని సాగించి జయప్రదం చేయటానికొక నూతన వ్యూహం ఏర్పాటు చేయబడింది. ఈ వ్యూహం ప్రకారం హెచ్చు ఉత్పాదకత (HYV) నివ్వగల మెరుగుచేయబడినవిత్తనాలు, రసాయనిక ఎరువులు, క్రిమి సంహారకాలు, నూతన పరికరాలు, యంత్రాలు, వివిధరకాల పంటలను పండించడము, ఏటి పారుదల సౌకర్యాలు, వ్యవసాయబుణాలు, వ్యవసాయోత్పత్తికి తగిన ధరలు యివ్వడము సాధనాలుగా ఉపయోగించబడి హరిత విప్లవం విజయవంతం చేయబడుతుంది, అయితే యీ కార్యక్రమంలో ముఖ్యమైనవి కొత్తరకం విత్తనాలు, నీరు, రసాయనిక ఎరువులు కాగా కొంతవరకు క్రిమి సంహారక మందులకుకూడా మంచి ప్రాధాన్యత ఉంది. ఈ హరిత విప్లవం ''మనకాలంలో తప్పకుండా నమ్మదగిన గొప్ప విజయమని'' పియర్‌సన్ రిపోర్టు చెప్పగా ''ఇంతవరకు జరిగిన వ్యవసాయ కథనాల్లో అతి ఆశ్చర్యకరమైన గాథ'' అని రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ రిపోర్టు చెప్పింది. మనదేశంలో ఈ హరిత విప్లవం మొదట 1960–61లో మూడు జిల్లాలల్లో సాంద్ర వ్యవసాయజిల్లా కార్యక్రమంగా ప్రారంభమై తరువాత పదమూడు జిల్లాలకు వ్యాపించింది. 1964–65 లో యీ కార్యక్రమం మార్పు చేయబడి సాంద్రవ్యవసాయ విస్తీర్ణ కార్యక్రమంగా యితర ప్రాంతాల్లోకూడా అమలు చేయబడింది. ఈ రెండు కార్యక్రమాలను అప్పటికన్న విత్తనపు రకాలతో సాంద్ర వ్యవసాయాన్ని చేయడాని కుపయోగించగా, రసాయనిక ఎరువులు వేసినా పెద్దగా ప్రతిఫలం రాలేదు. 1960లో మొక్కజొన్న, జొన్నల్లో మేలురకం విత్తనాలను వాడి మంచి ఫలితాలు పొందాము. 1963 నుండి సంకరజాతి విత్తనాలు వాడగా మంచి ఫలితాలు వచ్చినాయి. 1963–64లో మెక్సికో పొట్టిగోధుమ విత్తనాలను వాడి మంచి ఫలితాలను పొందినాము. 1965 నుండి టియన్ — 1 వంటి మేలు రకపు వరివంగడాలు వాడి లాభాలు పొందాము. ఇప్పుడు జయ, హంస, రత్న, కావేరి, ఇ. ఆర్–20, 24 మషూర్‌వంటి మేలిరకం విత్తనాలు అనేకం వచ్చినాయి. 1966 ఖరీఫ్‌కాలం నుండి మంచి విత్తనాలు హెచ్చుగా వాడబడుతున్నాయి. ఈ హరిత విప్లవం విజయం పొందడానికి ఎరువులు, బుణాలు, నీటి సప్లయి, మందులు, పరికరాలు మొదలైనవాటి సప్లయిలోని లోటులు తొలగి అవి ఆటంకాలు లేకుండా సరఫరా చేయబడాలి. రివెన్యూ, వ్యవసాయశాఖల ఉద్యోగులు క్రియాశీలకంగా నైతిక ప్రవర్తనకల్గి, రైతులకు తోడ్పడాలి. ఇప్పటివరకు భారతదేశంలో గోధుమపంట యీ కార్యక్రమంలో భాగంగా కొంత మంచి విజయాన్ని సాధించింది. వరికూడా గొప్ప విజయాన్ని సాధించడము అవసరము. ఇందుకు నీటివనరుల్ని, విద్యుచ్ఛక్తిని పుష్కలంగా సప్లయి చేయడాన్ని ప్రభుత్వం తన మొదటి కర్తవ్యంగా పెట్టుకోవాలి. వ్యవ

సాయ ఖర్చులకు, ముఖ్యంగా కూలిరేట్లకు, వ్యవసాయోత్పత్తి ధర లకు మధ్య సామరస్యం ఏర్పర్చాలి. ఇందులో రాజకీయ కిటుకులు చేయడం పనికిరాదు.

శ్వేత విప్లవం లేక పాల విప్లవం హరిత విప్లవంలో ఒక భాగమే. పంటలు బాగా పండితే పశువులకు, మనుష్యులకు మంచి ఆహారం దొరకుతుంది. పశువులు బాగా వృద్ధి చెందితే చేలకు ఎరువు, మనుష్యులకు ఆహారము, పాలు బాగా దొరుకుతాయి. మని షికి బాగా ఆహారము, ఆదాయయ దొరికితే వ్యవసాయపరిశ్రమను, పాడిపరిశ్రమను బాగా అభివృద్ధి చేస్తాడు. కనుక యీ విప్లవాలు పరస్పరాధారాలు. పాలవిప్లవంతోపాటు నీలి విప్లవం లేక మత్స్య విప్లవం కూడా విజయవంతమైతే మనుష్యులకు పశువులకు మంచి ఆహారము, చేలకు మంచి ఎరువు లభ్యమౌతాయి.

పూర్వావసరాలు : ముందుజాగ్రత్తలు

హరిత విప్లవం విజయం పొందడానికి, అనగా వ్యవసాయాభి వృద్ధి జరగడానికి నీరు ప్రాణాధారమని యిదివరకే చెప్పాము. మన దేశంలో ఒకేసారిగా, త్రాగడానికి, విత్తనాలు వేయడానికి ఒక ప్రాంతంలో నీరు దొరకకపోవడము, మరొక ప్రాంతంలో వరదలు వచ్చి పంటలు కొట్టుకుపోవడము జరుగుతోంది. వర్షాలు క్రమంగా లేకపోవడము, యీ దుస్థితి నానాటికి హెచ్చుకావడము చాలా యిబ్బందులు కలుగజేస్తోంది. ఒకచోటనుండి మరొకచోటకైనా నీరు ప్రవహింపజేసే వసతిని కలుగజేస్తే యీ నీటికొరత యిబ్బంది తీరుతుంది. ఇందుకు భారతదేశంలోని నదులన్నిటిని కలపాలి. యీ పనినే ''రివర్ గ్రిడ్'' అంటారు. అలాగే నూతులనుండి నీరు తోడడానికి విద్యుచ్ఛక్తి కావాలి కాబట్టి ఒకచోటనుండి మరొక చోటకు విద్యుచ్ఛక్తిని ప్రవహింపజేయడానికి విద్యుచ్ఛక్తిని ''ఉత్పత్తిజేసే కేంద్రాలన్నింటిని కలపాలి. ఈ పనిని పవర్ గ్రిడ్'' అంటారు. 'రివర్ గ్రిడ్' వచ్చి, అన్నిచోట్లకు నీరు వెళ్ళితే జలపాతం వల్ల జనించే విద్యుచ్ఛక్తి ప్రతిచోట తయారుకావడానికి వీలుంది. అయితే దీనికి చాలకాలము, చాల మూలధనము కావాలి. అయినా వెంటనే పని ప్రారంభం కావాలి. ఇందుకు అవసరమైన యితర దేశాల సహాయాన్ని మన విదేశాంగ నీతి సాధించాలి. అయితే మంచి నీటి పారు దల సౌకర్యాలుగలచోట్ల వేసవిలో యీ సౌకర్యం లభ్యం కావడంలేదు. అందువల్ల యిటువంటిచోట్ల చిన్న, మధ్యతరహా నీటి ఆధారాలను అనగా నూతులను, చెరువులను ఏర్పాటు చేసినట్లయితే యిక్కడ కూడా పన్నెండునెలలూ పంటలు పండించవచ్చు. నీరు వృథాగా సముద్రంలోకి పోరాదు. చెరువులలోనికి మరల్చవలెను. చెరువులలో నీరువుంటే వాటిదగ్గరున్న బావులలోనికి నీరు ధారాళంగా వస్తుంది. ఇందువల్ల అన్ని కాలాల్లో పంటలు బాగా పండుతాయి. అయితే నూతులను, చెరువులను ఏర్పర్చడానికి, నీరుతోడే మోటార్లను, పంపుసెట్లను కొనడానికి ద్రవ్యసంస్థలు బాగా అప్పులనిచ్చి, పండిన పంటలను అమ్మగా వచ్చిన ఆదాయంనుండి అప్పులనువసూలుచేసుకో వచ్చు. ధరపల్కే పంటలను పండించడను అవసరము. ముఖ్యంగా

ఆహార పదార్థాల ఉత్పత్తిమీద దృష్టిని కేంద్రీకరించి దేశంలో ఆహార కొరతను తీర్చి, శాంతి సుస్థిరతను, అభ్యుదయాన్ని సమకూర్చవలెను. ఆహార ధాన్యాలతోపాటు, కూరగాయలను, పండ్లను కూడా ఉత్పత్తి చేయడం అవసరం. వీటితోపాటు పాల ఉత్పత్తి కూడా బాగా సాగాలి. అప్పుడే మంచి ఆదాయం, రైతుకు లభ్యమౌతుంది. పాలకు మంచి ధరపలికితేనే పాల ఉత్పత్తి బాగా సాగుతుందనే విషయాన్ని మర్చిపోరాదు. ఏమైనా మన దేశంలోని వివిధ రంగాలలోని ఉద్యోగులు, వారిపై అధికారం గలవారు నీతి నిజాయితీలు గల్గి తమ కర్తవ్యాన్ని సక్రమంగా నెరవేర్చి రైతాంగానికి, వినియోగదారులకు తోడ్పడితే మినహా ఫలితం సక్రమంగా అందజాలదు.

అన్నిటికంటె, హరిత విప్లవ విజయానికి, వ్యవసాయాభివృద్ధికి రైతుయొక్క సాహసాన్ని ప్రోత్సహించడం ముఖ్యం. సాహసికులసంఖ్య పెరిగితేనే, సాహస ఉద్యమం తన పనిని జయప్రదంగా నెరవేర్చగల్గుతుంది. ప్రభుత్వం రైతులు ప్రవాసంపోయి నూతన భూములను సాగుచేయడానికి ప్రోత్సహించడము అవసరము. వ్యవసాయ భూముల్ని జాతీయం చేస్తారనే అపోహను, భయాన్ని తొలగించాలి. వ్యవసాయం ప్రాణులతో కూడినది. మనిషి నిర్విరామ శ్రద్ధతో పనిచేస్తేనే వ్యవసాయం విజయవంతం అవుతుంది. భూమి తనదని రైతు భావించి నమ్మినపుడే యిట్టి అవిభాజ్య, నిర్విరామశ్రద్ధను వ్యవసాయానికి అనువర్తింపచేస్తాడు. అందువలన భూమిని జాతీయం చేయడము, సమష్టి వ్యవసాయాన్ని సాగించడమువంటి శుష్కప్రయోగాలను వదలుకోవడము మంచిది. అయితే ఆర్థిక సమత్వాన్ని స్థాపించడానికి, వ్యవసాయం శ్రద్ధతో సాగించడానికి, చిన్న కమతాలు బాగా తోడ్పడగలవు. జపాన్‌లో యీ విషయం ఋజువయ్యింది. కనుక భూస్వాములనుండి పై పరిమితి పైనున్న భూమిని తీసుకుని శ్రద్ధగా వ్యవసాయంచేసే రైతులకు యివ్వవచ్చు. మరీ చిన్నరైతులనుండి పన్నులు వసూలు చేయడము ఆపివేస్తే మంచిదే. కాని ప్రభుత్వ రాబడికి పన్నులు వేయడం తప్పనిసరి అని భావిస్తే మరీ చిన్న కమతాలమీద బహుతక్కువ రేట్లు గల పన్నులు వసూలు చేయవచ్చు. అదేవిధంగా చిన్న రైతులు, వ్యవసాయ కూలీలు చెల్లించవలసిన అప్పుల్ని రద్దుచేయడము చాల అవసరము.

అత్యధిక ప్రథమ ప్రాధాన్యత ఎందుకు?

వ్యవసాయాభివృద్ధికి, హెచ్చుగా పంటలు పండించడానికి ఆహారాన్ని బాగా సరఫరా చేయడానికి అత్యధిక ప్రథమ ప్రాధాన్యత **(Top Priority)** యిస్తేనే భారతదేశంవంటి అత్యధిక జనాభాగల వెనుకబడి వున్న దేశాలు బాగుపడతాయి. ఈ సూత్రాన్ని పాటించని దేశాలు చెడిపోతాయి. అయితే వ్యవసాయాభివృద్ధికి తప్పక తోడ్పడవలసిన పరిశ్రమలను కూడా ఏకోన్ముఖంగా అభివృద్ధి చేసినట్లయితేనే వ్యవసాయాభివృద్ధి విజయవంతంగా సాగుతుందనే విషయాన్ని మర్చిపోయినవారు తమకు తాము హాని చేసుకున్న వాళ్లవుతారు. (1) మనదేశం చాలా పెద్దదేశము. అధిక జనాభాగల దేశము. వీరిని తగిన రీతిలో పోషించడానికి, తద్వారా రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సుస్థిరతను సమకూర్చడానికి బాగా ఆహారం అందించాలి. అందుకు వ్యవసాయాభివృద్ధికి అత్యధిక ప్రథమ ప్రాధాన్యత నివ్వాలి. (2) మనదేశంలో వర్షపాతం చాలా ఎగుడుదిగుడుగా ఉన్నది. ప్రపంచంలో వర్షపాతం తగ్గే సూచనలున్నాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఆ స్థితిలో వ్యవసాయోత్పత్తిదెబ్బ తింటుంది. కనుక యిప్పటినుండి ప్రథమ ప్రాధాన్య కార్యక్రమంగా వ్యవసాయాన్ని అభివృద్ధి చెయ్యాలి. అంతేగాక ఉన్న నీటిని తగు రీతిలో, హెచ్చు తగ్గులు లేకుండా, పొలాలకుపెట్టాలి. ఇందుకు గాను నీటి ఉపయోగాన్ని చక్కగా జరపగల యాజమాన్య నైపుణ్యం కావాలి. (3) ఇంతవరకు మనం విదేశాలమీద ఆహార సరఫరాలకు ఆధారపడుతున్నాము. ఇందువల్ల మన స్వతంత్ర ప్రవృత్తికి, అంతర్జాతీయ రంగంలో స్వేచ్ఛగా ప్రవర్తించటానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. అందువల్ల స్వయం నిర్భరతను మనం ఏర్పాటు చేసుకోవాలి. అందుకుగాను ఆహార పదార్థాల విషయంలో స్వయం సమృద్ధిని, స్వయం సంపూర్ణతను సాధించాలి. అప్పుడే మనము అంతర్జాతీయరంగంలో విదేశ సహాయంపైన ఆధారపడకుండా ఉండగలము. విదేశసహాయంతో పని లేకుండా మనం బ్రతక గల్గిననాడే నిజమైన స్వతంత్రదేశంగా మనగల్గుతాము. అపుడే ప్రపంచశాంతికి, ప్రపంచ సహకారానికి, ప్రపంచ ఆర్థిక పురోగమనానికి మనం తోడ్పడుతూ మన మంచిని సమకూర్చుకోవడానికి మనం పని చేసుకోగలము. (4) మన ప్రక్కన బలమైన దేశాలున్నవి. ఇదివరకు వీరితో మనకంత సామరస్యం లేదు. వీరి ఆర్థిక రాజకీయ వ్యవస్థలకు, మన ఆర్థిక రాజకీయవ్యవస్థలకు తేడా ఉన్నది. మనపైన వీరు వ్యతిరేక ప్రచారాలు చేస్తున్నారు. అందువల్ల జీవనస్థాయిలో మెరుగుదల చూపడంలోను, ఆర్థికాభివృద్ధిని నిర్వహించడంలోను వారితో మనకు పోటీ ఏర్పడింది. ఈ పోటీలో జయం పొందడానికి మన ప్రజలు వారి దుష్ప్రచారానికి లొంగకుండా మనతో కలసి రావడానికి, మనం మన ప్రజానీకానికి లోటు లేకుండా ఆహారం అందించాలి. (5) భారతదేశ ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధి కార్యనిర్వహణ సమగ్ర ప్రజా స్వామికాభివృద్ధి ప్రపంచంలో తలపెట్ట బడిన ప్రథమ ప్రయత్నం. ఇందులో రాజకీయ, ఆర్థిక సాంఘిక, సాంస్కృతిక అభివృద్ధికి పూర్తిగా చోటు ఉన్నవి. అందువల్ల యిది సమగ్ర ప్రజాస్వామికాభివృద్ధి. ఇతర దేశాల్లో కొన్నింట రాజకీయ ప్రజాస్వామికాభివృద్ధికి, కొన్ని చోట్ల కేవలం ఆర్థికాభివృద్ధికి, మాత్రమే ప్రయత్నాలు జరిగి రెండూకూడా పరిపాలనా నియంతృత్వాలుగా మారిపోతున్నవి. అందువల్ల మన ప్రయోగాన్ని జయప్రదంచేసి ప్రపంచానికొక ఆదర్శాన్ని సృష్టించాలి. అయితే యీ ప్రయత్న విజయం ప్రజల సహకారంమీద, ప్రజల సహకారం ఆహార సరఫరామీద, ఆహారసరఫరా వ్యవసాయాభివృద్ధిమీద ఆధారపడి వున్నాయి. (6) మిత్రరాజ్య సమితికిచెందిన

ఆహార వ్యవసాయ సంస్థ మాజీడైరెక్టర్ జెనరల్ అడ్డెకె యీమధ్య ఇంగ్లండులో మాట్లాడుతూ, ఒక సంవత్సరం ఆహారపదార్థాలు మిగిలేటట్లు పండితే, ఎప్పుడూ మిగులు వస్తుందని ఆశిస్తూ నిద్రపోరాదని, అలా నిద్రపోతే ప్రపంచంలో ఆహారకొరత ఏర్పడి ఆహార సమస్యతో సతమతమౌతుందని, కాబట్టి ప్రతి సంవత్సరము, ప్రతి దేశము ముఖ్యంగా వెనుకబడి వున్న దేశాలు ఆహార పదార్థాల ఉత్పత్తికి బాగా కృషి చెయ్యాలని చెప్పాడు.

భారత పంచవర్ష ప్రణాళికల్లో వ్యవసాయాభివృద్ధి.

ప్రథమ పంచవర్ష ప్రణాళికలో మనం వ్యవసాయాభివృద్ధికీ, ఆహారోత్పత్తికీ, తదనుగుణమైన కార్యక్రమాలకు హెచ్చు ప్రాధాన్యత నిచ్చాము. పంటలు బాగా పండినాయి. ఆహార కొరత తాత్కాలికంగా లేకుండాపోయింది. వాతావరణం చాలా అనుకూలంగా వుండటమే—అనగా అతి వృష్టి అనావృష్టి లేకుండా వుండటమే—యిందుకు కారణము. కాని రెండవ మూడవ పంచవర్ష ప్రణాళికల్లో మొదటి ప్రణాళికలోకంటె వ్యవసాయంమీద హెచ్చుమొత్తమే పెట్టుబడి పెట్టినా, మొత్తం పెట్టుబడిలో అనుపాతంగా వ్యవసాయంమీద జరిగిన పెట్టుబడి తక్కువగానే ఉన్నది. అంతేగాక వాతావరణం సరిగాలేదు. యుద్ధాలు వచ్చినాయి. పంటలు దెబ్బ తిన్నాయి. ఆహార ధాన్యోత్పత్తి విషయంలో ప్రణాళికా లక్ష్యాలు నెరవేరలేదు. దేశంలో ఆహారకొరత ఏర్పడింది. ఆహార దిగుమతులకు విదేశ సహాయంమీద ఆధారపడ్డాము. ప్రజలు యిబ్బందులు పడ్డారు. విదేశాలు తగు సమయంలో ఆహార సరఫరా నాపి యిబ్బంది కలుగజేసినై. తరువాత మొదటి రెండు ఏకవర్ష ప్రణాళికల్లో కూడా ఆహారోత్పత్తి సరిగ్గా రాలేదు. మూడవ ఏకవర్ష ప్రణాళికలో ఆహారోత్పత్తి పుంజుకుంది. నాల్గవ ప్రణాళికా కాలంలో మెట్టసాగు పద్ధతులను మెరుగు పర్చడానికి, పరిశోధన సాగించడానికి, నూతన వ్యవసాయ వ్యూహాన్ని మెట్టసాగు భూములకు అనువర్తింపజేయడానికి ప్రయత్నాలు జరిగినవి. కొంతవరకు జయప్రదమైనవి. మొదటి రెండు సంవత్సరాల్లో వ్యవసాయాభివృద్ధి, అనుకున్న సాలీనా 5 శాతాన్నిమించి 5.2 శాతం వరకు వెళ్లింది. గోధుమపంటలో హరిత విప్లవం విజయవంతమైన కారణంగా మొత్తం దిగుబడి చెప్పతగ్గంతగా పెరిగింది. ఆహార ధాన్యోత్పత్తి నాల్గవ ప్రణాళిక మొదటి సంవత్సరంలో 99.6 మిలియన్ల టన్నులకురాగా, రెండవ సంవత్సరంలో 107.8 టన్నులకు వచ్చింది. సజ్జల పంట ప్రణాళికా లక్ష్యాలను యీ రెండు సంవత్సరాలు కూడా అధిగమించింది. 1965–66లో 72 మిలియన్ టన్నులున్న ఆహార ధాన్యోత్పత్తి 1970–71లో 107.82 మిలియన్లకు పెరిగింది. నాల్గవ ప్రణాళిక చివరకు 122నుండి 125 మిలియన్ టన్నులకు పెరుగుతుందని ఆశించబడింది. 1971–72లో ఆహారోత్పత్తి 105 మిలియన్ టన్నులకు 1972–73లో 97 మిలియన్ టన్నులకు తగ్గింది. కాని 1973–74లో 105 మిలియన్ టన్నులకు పెరిగి మరల 1974–75లో 101 మిలియన్ టన్నులకు దిగింది. అందువల్లనే యీ ఎగుడు దిగుడులు రాకుండా ధారావాహికంగా ఆహారోత్పత్తి పెరిగేందుకు కృషిచేయవలసి ఉన్నది. అయిదవ పంచవర్ష ప్రణాళిక ప్రాథమిక అవసరాలైన తిండి, బట్ట, ఇల్లు, పారిశుభ్రతలను, ఉద్యోగ వసతులను సమకూర్చి దారిద్ర్యాన్ని తొలగించడానికి పూనుకున్నది. అందువల్ల అయిదవ పంచవర్ష ప్రణాళిక ఆహారోత్పత్తికి, వ్యవసాయాభివృద్ధికి తగిన ప్రాముఖ్యత నిచ్చింది. పబ్లిక్ రంగంలో రు. 7411 కోట్లు, ప్రయివేటురంగంలో రు.2950 కోట్లు వ్యవసాయ, నీటిపారుదల అభివృద్ధికి ఖర్చుచేయబడతాయి. 1978–79 నాటికి 140 మిలియన్ టన్నుల ఆహారోత్పత్తి ఆశించబడుతోంది. వరదలు అనావృష్టి బాధలవల్ల పంటలు దెబ్బతింటున్నా, ధరలు పెరిగినా, కరువుమాత్రం యిదివరకటి వలె కన్పించుటలేదు. కొన్ని, తాత్కాలిక విజయాలు వచ్చినా "రివర్‌గ్రిడ్", "పవర్‌గ్రిడ్" తయారయ్యేవరకు, పెద్ద ఇరిగేషన్ ప్రాంతాల్లో కూడా చిన్న ఇరిగేషన్ వసతులు వచ్చే వేసవి పంటలు పండేవరకు, దేశంలో మెట్టసాగులో హరిత విప్లవం విజయవంతం అయ్యేవరకు ఆహార సమస్య పూర్తిగా తీరకపోవచ్చును. పెద్ద నీటిపారుదల సౌకర్యాలున్నచోట చెరువులు ఏర్పడితే పంటభూమి తరిగిపోతుందనే భయం ఉండవచ్చు. కాని, యీ చెరువుల్లో చేపలు పెరగడంవల్ల, యీ చెరువు నీటివల్ల కూరలు, పండ్లు, ఆహార ధాన్యాలు వేసవిలో కూడా పండటంవల్ల జరిగే నష్టానికంటె లాభం హెచ్చుగా ఉంటుంది. అంటే నష్టాన్ని కొట్టివేసి అధిక లాభాన్ని చూపించడానికి యీ చెరువుల ఏర్పాటు తప్పక తోడ్పడుతుంది. మనిషి, పశువు, పక్షి, భూమి, నీరు, విద్యుచ్ఛక్తి, పరికరాలు తమ మధ్య సామరస్యాన్ని ఏర్పరచుకొని ఒకరి అభివృద్ధి కొరకు తోడ్పడినపుడు ఆహార కొరత తీరుతుంది; మానవ సంక్షేమం పెరుగుతుంది. ఇందుకుతగ్గ పరిస్థితు లేర్పడడానికి ప్రజాసంస్థలు, ప్రభుత్వాలు తీవ్రంగా కృషిచేసి రెండువేల సంవత్సరంనాటికి అధిక జనాభావల్ల ప్రపంచంలో ఆహార కొరత ఏర్పడకుండా చూసినట్లయితే, ప్రపంచ విలయంనుండి మానవుడు తనను తాను కాపాడుకో గలడు.



వెళ్ళిరా నేస్తం!

శ్రీ మల్లాప్రగడ రామారావు

వెళ్ళిరా నేస్తం
అసలే సమయం పరిమితం
వీడ్కోళ్ళకూ, కన్నీళ్ళకూ
వ్యవధేదీ ?
మనల్ని కలిపిన కెరటం
కాలం
మరలా విడదీస్తే
ఏముందీ ఫిర్యాదుకి.
మనిషి, మనిషీ ఒక ద్వీపం
ద్వీపాలను కలిపే కేబుల్ స్నేహం
కాలాన్ని అనుభవాల కత్తెరతో విభజిస్తే
ఏ ఏ వేళల
ఏ ఏ ద్వీపాల నడుమ
కమ్యూనికేషన్లు వెలుస్తాయో
ఎన్నాళ్ళు నిలుస్తాయో
నికరంగా ఎవరం
ఎలా అంచనా వేయగలం.

కాలం పామై
మనిద్దరిమధ్యా ప్రవహిస్తే
నేను నిందించనూ లేను.
ఎందుకంటే

ఒక పడవై కొన్నాళ్ళైనా
మనల్ని ఒకచోట చేర్చింది తానే.

చెప్పొచ్చేదేమంటే
నువ్వూ, నేనూ కరిగిపోతాం
పదిలంగా మిగిలేవి
ఒకటో, అరో, అనుభూతులే.

కాలం మంచుపొరల వెనకాల
పొద్దు పొడవక ముందరి ఎఱుపు రంగులా
నిన్నలన్నీ కొద్దో, గొప్పో
కనబడుతూనే వుంటాయి.
అంతమాత్రానికే
నీ స్మృతి
శాశ్వతంగా నిలుస్తుందని
అనృతాలాడలేను
బహుశా
ఒంటరి నక్షత్రం
ఆకాశపు కాసారాన్ని
కాపలా కాస్తున్నపుడు
గుర్తొస్తావు నువ్వూ.
వెళ్ళిరా నేస్తం
అసలే సమయం పరిమితం.

శ్రీ కలువకొలను సదానంద

నగ్నరాత్రి

(గతసంచిక తరువాయి)

5

ఊరంతా నిద్రపోయినా — మెయిన్‌రోడ్డుమీద రైల్వేస్టేషన్ ఎదుటవున్న మూడురోడ్ల కూడలి మాత్రం అహర్నిశలూ మేలుకునే వుంటుంది.

రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద మసక నీడల్లో బిచ్చగాళ్ళు ముచ్చట్లు చెప్పుకుంటూ వుంటారు. బైరాగులు పదాలు పాడుకుంటూ వుంటారు.

కూడలిలో—రాత్రి తెల్లవార్లూ వ్యాపారం చేసుకుంటూ అఖండ జ్యోతుల్లా వెలిగే అంగళ్ళు కొన్ని వున్నాయి.

రెండు టీ కొట్లు, రెండు బీడీకొట్లు, ఒక కాకాహోటలు, ఒక సారాయి అంగడి, ఒక బ్రాందీషాపు, మిఠాయిలూ కారాలూ అమ్మే చక్రాల బండి ఒకటీ! నైట్ డ్యూటీలోవున్న పోలీసులూ, రైల్వే ఉద్యోగులు, దారినపోతూ అక్కడ ఆగే లారీలవాళ్ళు, సినిమాకు వచ్చిన పల్లెటూళ్ళవాళ్ళు, పక్కన మేడమీద గదిలో పేకాటలో కూర్చున్నవాళ్ళు ఆ అంగళ్ళను అజరామరంగా పోషిస్తున్నారు.

చేతిగాజులు ఘల్లుమనిపిస్తూ, మగవాళ్ళ గుండెలు ఝల్లుమనిపిస్తూ ఆ వెలుగునీడల్లో ఒకరిద్దరు నిశాచారిణులు ఒదిగి ఒదిగి తిరుగుతుంటారు.

మూలనున్న పాతమేడమీద గదిలో పేకాట సాగుతూ వుంటుంది.

కాఫీ టీలు, బీడీ సిగరెట్లు, కారం పప్పులూ, సారానీళ్ళూ మోసుకుంటూ—ఆమేడమెట్లమీద పైకీ కిందికీ తిరుగుతుంటాడు, పధ్నాలుగేళ్ళ కుర్రాడొకడు.

వాడే చక్రపాణి!

వారంలో ఓ రెండురోజులు జరుగుతుంది పేకాట. అక్కడ పేకముక్కలాడే వాళ్ళంతా సంఘం గుండెలు అదరగొట్టేవాళ్ళేగానీ, సంఘానికి భయపడేవాళ్ళు కాదు. అడివిలోంచి పారివచ్చి ఊళ్ళో విశృంఖల విహారం చేస్తున్న పులులూ, తోడేళ్ళూ, కొండ చిలువలూ—వాళ్ళే! వల్లకాటిలోంచి లేచివచ్చి వీధుల్లో సడయాడుతూన్న భూతాలూ, ప్రేతాలూ, పిశాచాలూ—వాళ్ళే! నీతీ నియమం, మానం మర్యాద, పరువూ ప్రతిష్ఠ, గుడ్డా గోచీ అన్నీ వొదిలేసి నడివీధిలో నుంచోమన్నా నుంచుంటారు, డబ్బుకోసం! వాళ్ళ దెబ్బంటే దేవుడికూడా హడలే!

పెళ్ళాం పక్కలో లేకపోయినా బెంగెట్టుకోరు గానీ, పేకాటలో కూర్చున్నది మొదలు పైకిలేచి బట్టలు దులుపుకునేవరకు ఆ రెండు రోజులూ అక్కడ చక్రపాణి లేకపోతే క్షణం గడవదు వాళ్ళకు.

చక్రపాణి నిత్యం పొగలోనే వుంటాడు. అయితే వాడెప్పుడూ బీడీలూ సిగరెట్లూ కాల్చలేదు.

తన చేతులమీదుగా ఎందరికో సారాగ్లాసులు అందించాడు, కానీ వాడెప్పుడూ తాగలేదు.

వ్యభిచరించడం వాడికి తెలీదుగానీ, వ్యభిచారమంటే ఏమిటో బాగా తెలుసు!

వాడికి వున్న వ్యసనం ఒకటే! బాగా తినటం! కోరినవన్నీ తింటాడువాడు. ఉన్నారుగా, పేకాటలో కూర్చున్న మహాప్రభువులు!

ఊడలమీదినుంచి జారే ఉడతలా మేడమెట్లు దిగివస్తున్నాడు చక్రపాణి. మెట్లు దిగేలోపలే, 'ఇదిగో పిళ్ళే! పదిటీలు! డబుల్‌స్ట్రాంగ్!' అని అక్కణ్ణించే కేకేశాడు. మరుక్షణమే రోడ్డు దాటి టీ కొట్లో దూరి బెంచీమీద పీఠంవేసి 'ఆ లోపల మన కో టీ కలుపు! డబుల్ లైట్!' అన్నాడు.

ముతకసింగారంతో లొడలొడ లాడుతూన్న వగలాడి ఒకతె టీ కొట్టు బయట కర్రచెక్కలను ఆనుకుని నిలబడి వుంది. చెక్కల సందుల్లోంచి లోపలికి చూపులు జొనిపి 'ఓ రందగాడా!' అంది ఊరగాయ ముక్కలా, పుల్లగా.

టీ గ్లాసు నోట బెట్టుకుంటున్న చక్రపాణి తిరిగి చూడకుండానే 'ఏమే?' అన్నాడు.

'అదృష్టం ఈ రోజు వద్దకు రానంటావుందిరా అల్లుడా! నువ్వయినా దయ బెట్టరాదూ?' అంటూ సరసమాడింది వగలాడి.

'నేనా!'

'నీకేంరా మామా! ఈతముల్లులా వున్నావు!'

'నీ యక్కా! ఇంకా మీసాలైనా రాలేదు కదే నాకు? అటొచ్చి ఆ పిళ్ళేను పట్టుకో పో! ఇందా!' అంటూ ఆమె చేతిలో పావలా పెట్టాడు చక్రపాణి.

పిళ్ళె పెదాలు నవ్వుతో సాగబారాయి.

'నువ్వెంతో ఆ పిళ్ళే అంతే!' అంటూ నవ్వుతూ 'ఓవర్ బ్రిడ్జి వైపు కదిలి వెళ్ళిపోయిందామె.

పది టీలూ పట్టుకుని మేడపైకి వెళ్ళాడు చక్రపాణి.

ఆ క్లబ్బు నడుపుతూన్న వాడు శేషఫణి. వారంలో రెండు రోజులు అతడు అక్కడే వుంటాడు. ఆ రెండు రోజుల్లో అతడికి వచ్చే మేజు మాత్రమే వెయ్యి రూపాయలుంటుంది. మేనేజరు తీసుకునే కమీషన్‌ని 'మేజు' అంటారు. అక్కడికక్కడే వచ్చే వడ్డీల మీద మరో వెయ్యి వస్తుంది. ఈ మొత్తం రాబడిలో భాగస్వాములు ముగ్గురు. శేషఫణి, అకిలాలీ, బసవరాజా! ఆ మేడ అకిలాలీది. క్లబ్బు నడిపేవాడు శేషఫణి. పైనుండి వచ్చే ప్రమాదాలను అడ్డుకునే వాడు బసవరాజా!

శ్రీ లక్ష్మీ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో భాగస్వామ్యాలుకూడా వాళ్ళవే!

వాళ్ళు ముగ్గురికీ ఇళ్ళున్నాయి, మేడ లున్నాయి, పొలా లున్నాయి, వ్యాపారాల్లో భాగాలున్నాయి.

డబ్బు సంపాదించటంలో వాళ్ళకు వాళ్ళే సాటి!

బ్రతుకులో, భాగ్యంలో ముగ్గురూ గొప్పవాళ్ళే అయినా — అకిలాలీ కంటే, బసవరాజా కంటే శేషఫణికి రెండాకులు తక్కువ! చాలా హీనస్థితినుండి పైకి ఎగబడి వచ్చినవాడు అతడు.

చక్రపాణి టీ గ్లాసులు పట్టుకుని పైకి వెళ్ళాడు.

కుంటికాలితో గెంతుతూ గెంతుతూ ఆ మూలనుండి ఈ మూలకు వచ్చికూర్చుంటున్న శేషఫణిని చూచి 'నాలుగో జాతివాడి నడకే నడక!' అంటూ వికవికా నవ్వుతున్నా డొకడు, కైపులో తేలిపోతూ.

శేషఫణి బతుకంతా తెలిసినవాళ్లు, అతడంటే లెక్కలేని వాళ్ళు పేకాటగాళ్ళలో కొందరున్నారు. వాళ్ళంతా శేషఫణిని నాలుగో జాతివాడనే అంటారు.

వాళ్ళు చెప్పుకునే వృత్తాంతమే యిది. ఎవరో కొజ్జాలు పెట్టిన పేరట అది! చాలాకాలం కిందట, పెళ్ళికాకముందెప్పుడో శేషఫణి గంజికి గతిలేనివాడట! ఊళ్ళో ఎక్కడ జేబుదొంగతనాలు జరిగినా పోలీసులొచ్చి అతన్నే పట్టుకు పోయేవాళ్ళట! ఊరంతా అతని మొహాన వుమ్మేవాళ్ళట! వీపుమీద తన్నేవాళ్ళట! అలాంటి రోజుల్లో ఒకనాడు సంతకెళ్ళాడు శేషఫణి. నలుగురు కొజ్జా వాళ్ళు చేతులు గలిపి చప్పట్లు వేస్తూ, పాటలు పాడుతూ అంగళ్ళ వెంట ముష్టెత్తుకుంటున్నారు. శేషఫణి వాళ్ళను అంటిపెట్టుకునే తిరిగాడు. వాళ్ళు ముష్టెత్తడం పూర్తయింది. ఆ ముష్టి డబ్బులన్నీ ఒక తిత్తిలో వున్నాయి. ఆ తిత్తి ఒకడి రొండిలో వుంది. శేషఫణి వున్నట్టుండి ఆ తిత్తి లాక్కుని పరుగు లంకించుకున్నాడు. అయితే కొజ్జాలు అతన్నివిడిచిపెట్టారా? లేదు! హాత్ హూత్ అంటూ కాకుల్లా వెంటబడ్డారు. తరిమి తరిమి పట్టుకున్నారు. జుట్టుపీకారు. ముఖంమీద రక్కారు. బట్టలన్నీ చింపి పోగెట్టారు. దబాదబా బాదారు. ధనాధనా తన్నారు. కాళ్ళకింద వేసి తొక్కారు. అప్పుడు విరిగిందేనట ఆ కాలు! కాలు పట్టుకుని కన్నీళ్ళు పెట్టుకుంటున్న శేషఫణిముఖాన తుపుక్కున వుమిసి యిలా అన్నారట ఆ కొజ్జాలు: 'ఒరే! భూమ్మీద వున్నవి రెండే రెండు జాతులు. ఆడా, మొగా! అటూ గాకుండా యిటూ గాకుండా మూడో జాతిగా పుట్టినవాళ్ళం మేము! మా ముష్టి డబ్బులు తినటానికి పుట్టావు చూడూ, నువ్వు నాలుగో జాతివాడివిరా!''

ఖాళీ గ్లాసులన్నీ అందుకున్నాడు చక్రపాణి.

''నాయాలా! చిల్లరేదిరా ఒరేయ్?'' అంది, పది మందికీ టీలు తెప్పించిన భూతం.

'చిల్లరేమిటి, చిల్లర!' అన్నాడు చక్రపాణి వెక్కిరింపుగా.

'నాయాలా ! పదిటీలు తెమ్మని రెండ్రూపాయలిస్తే, ఏం చిల్లరంటావా?'

'నాన్సెన్స్! చిల్లరడగటం కల్చర్ కాదు నాయుడూ!'

చక్రపాణి గుమ్మం వైపు నడుస్తూ శేషఫణి దగ్గర ఆగి, 'అంకుల్! టైమెంత?' అన్నాడు.

రిస్టువాచీ వైపు చూచి అన్నాడు శేషఫణి. 'పదింబావయింది. ఎందుకురా?'

అతడి ముఖంలోకి సూటిగా చూశాడు చక్రపాణి. వాడి కళ్ళలో అపహాస్యం! 'రాచకార్యం ఒకటుందిలే! అదంతా రహస్యం! చెప్పకూడదు.'

ఆ వెక్కిరింత శేషఫణికి అర్థమైనట్లు లేదు. 'మళ్లీ వొచ్చేయ్ తొందరగా!'

చక్రపాణి మేడమెట్లు దిగాడు. టీ కొట్లో గ్లాసు లిచ్చేశాడు. చిల్లర జేబులో వేసుకున్నాడు. వీధివెంట ఎక్కడికో నడిచి పోసాగాడు.

జీవితంలో నీ మొదటి కోరిక ఏమిటీ?

వాడి రోమాలు నిక్కబొడుచుకున్నాయి. పళ్ళు పటపట లాడాయి.

...గునపం తీసుకుని శేషఫణిగాణ్ణి తరుముకుంటాను. వాడు కుంటుతూ కుంటుతూ పరిగెడతాడు. గునపంతో రెండోకాలు విరగ్గొడతాను. కిందపడతాడు. వాణ్ణి కాలితో తొక్కిపట్టి రొమ్ముల్లో గునపం దిగేసి, నెత్తురు తాగుతాను...

...అయ్యో చక్రపాణీ, నన్ను చంపకు, నీ కాళ్ళు మొక్కుతాను, నన్ను చంపకు...

...సారీ అంకుల్, నిన్ను చంపకపోతే నా బతుకెందుకు? నీ ప్రాణం తప్ప యింకేమన్నా అడుగు...

శేషఫణిని చంపాలి. ప్రాణభయంతో నాడు గిలగిల తన్నుకోవడం కళ్ళారా చూడాలి.

ఎప్పుడు? ఇంకెన్నాళ్ళు? దిక్కులేనిచోట ఒంటరిగా దొరికినా, వాణ్ణి చంపగలడా తాను? అంత బలం తనకుందా?

బ్రతుకుమీద రోతతో డొంకదార్లు తొక్కాడు చక్రపాణి. శేషఫణిమీద కక్షతో అతడికి చేరువైనాడు.

తొమ్మిదో తరగతి పూర్తి కాకుండానే చదువుకు సున్న పెట్టాడు వాడు.

జీవితంలో కొండంత అసంతృప్తి! లేమిని గురించిన ఆలోచనలు బండెడు! ఇంట్లో సింహాసనం వేసుక్కూచున్న దారిద్ర్యం, తోడబుట్టినవాళ్ళ కళ్ళలో గూడుకట్టుకొన్న నైరాశ్యం, చీకటి గుండెల్లో చిరుదివ్వెనైనా వెలిగించుకోలేని తల్లిదండ్రుల వేడి నిట్టూర్పులు, చాలీచాలని మెతుకులు, వుండీ లేని బట్టలు, ముప్పూటలా వచ్చి దెప్పిపోయే అప్పులవాళ్లు, తీరని అవసరాలు, ఆరని ఆవేదనలు వాడి గుండెలమీది నివురును ఉఫ్ఫున వూదేశాయి. వాడిగుండె అగ్నిగోళంలా కణకణలాడింది.

ఏదీ కొరతలేకుండా బ్రతుకుతున్నారు కొందరు. అన్నీ కొరతగానే బ్రతుకుతున్నారు కొందరు. దుర్భర దారిద్ర్యానికి గురైన డొల్లబారిపోయిన వాడిగుండె ఈ సాంఘిక వ్యత్యాసాన్ని సహించలేక గిలగిలలాడి పోయింది. ఆకలి తీరని కడుపుతో, అసహ్యమైన బట్టలతో, నైరాశ్యం నిండిన కళ్ళతో, న్యూనత నిండిన మనస్సుతో వాడు బడికి వెళ్ళలేకపోయాడు. తిరుగుబాటు చేశాడు — తనమీద, తల్లిదండ్రులమీద, తన బ్రతుకుమీద!

అప్పట్లోనే కుమారి చచ్చిపోయింది.

అంతవరకూ వాడు తనను మాత్రమే అసహ్యించుకుంటూ వుండేవాడు. కుమారి కన్నెరికమూ, ఆ తరవాత ఆమె ప్రాణమూ పోవడంతో వాడి అసహ్యమంతా స్వార్థపరులపైకీ, దోపిడీగాళ్ళపైకీ, అవినీతి పరులపైకీ, అంతస్తుల బాల్కనీల్లో నుంచున్న వాళ్ళపైకి, వీళ్లందరికీ అభయహస్తమిచ్చి దీన బాంధవుడుగా చెలామణీ అవుతున్న దేవుడిపైకీ దాడిచేసింది.

వాళ్ళను అసహ్యించుకుంటూ వాళ్ళ పంచన్నే చేరాడు. వాళ్ళ బ్రతుకుల్ని పట్టిచూశాడు. డబ్బులో బతుకుతున్న దేవుడి అండ చూసుకుని వాళ్ళు ఒంటబట్టించుకున్న వ్యసనాలెలాంటివో చూశాడు.

తాగుడు! జూదం! వ్యభిచారం! విశృంఖలత్వం!

ఓసారి శేషఫణి తల తిరిగేదాకా తాగి, 'ఒరేయ్ చక్రపాణీ! నువ్వంటే నాకెంతో యిష్టంరా! నువ్వు గనక ఆడపిల్లయితేనా...' అన్నాడు.

'చంపేసి వుండేవాడివి!' అన్నాడు చక్రపాణి.

'ఛా! నేను చచ్చివుండేవాణ్ణి, నీకోసం!...అది సరే, మీ అక్కయ్య ఎందుకు చచ్చిపోయిందిరా?'

'ఎందుకో నీకు తెలీదా అంకుల్?'

'అబ్బే, నాకేం దెలుసు?'

'విషం తాగేసింది.'

'ఎందుకు చచ్చిందో చెప్పరా అంటే, ఎలా చచ్చిందో చెబుతావే!'

'కడుపులో ఏదో పుండు లేచిందట. పుండుతో బతకలేక విషం తాగేసింది.'

'అట్లాగా!' అంటూ మౌనంగా వుండిపోయాడు శేషఫణి.

'అంకుల్, నేనొక టడుగుతాను...'

'అడుగూ!'

'నీకు పిల్లల్లేరు కదా? ఇంకో పెళ్ళి ఎందుకు చేసుకోలేదు నువ్వు?'

దేవదాసులా నవ్వాడు శేషఫణి. 'తింటే గారెలే తినాలి, వింటే భారతమే వినాలి, కంటే నేనే కనాలి అంటుంది నాపెళ్ళాం. మనం సరే సరే అంటాం.'

శేషఫణి పెళ్ళాంపేరు శయనసుందరి. ఒంగోలు గిత్తలా అంతెత్తు వుంటుంది. ఒంటినిండా కండలే! ఆమెకు కొన్ని ముఖ్యమైన పనులు చేసిపెడుతూ వుంటాడు చక్రపాణి.

వాడు ఈ పూట బసవరాజాగారి యింట్లో పెండ్లిభోజనం తిన్నాడు. శయనసుందరి వాడికి అక్కడ కనిపించి 'పదిగంటలకు యింటి దగ్గిరికి రా చక్రపాణీ! పనుంది!' అంది.

అందుకే తానిప్పుడు వెళ్తున్నాడు.

ఎందుకు రమ్మంది శయనసుందరి?

అందుకే అయివుంటుంది. వాడో, లేకపోతే వీడ.

గేటు తోసుకుని లోపలికి నడిచాడు చక్రపాణి.

శయనసుందరి వాకిట్లోనే కూర్చుని వుంది, వాడికోసం ఎదురు చూస్తూ. గేట్లో వాడు కనిపించగానే 'ఇంత సేపా!' అంది.

'ఎంత సేపు?'అన్నాడు చక్రపాణి.

శయన సుందరి నవ్వింది.

'ఆయన క్లబ్బులోనే వున్నాడా?' అంది.

'నిక్షేపంగా! ఇక తెల్లవారేంతవరకు పైకి లేవడు'.

'అకిలాలీ దగ్గరికెళ్ళి, నేను రమ్మన్నానని చెబుతావా?'

'మధ్యలో నా కేం లాభం?'

'కొంటి వెధవా! ముద్దిమ్మంటావా?' నవ్వింది.

'నా కొద్దు బాబూ! దాని వెల కట్టిచ్చేస్తే చాలు!'

వాడి చేతిలో రూపాయికాగితం పెట్టిందామె. వాడు దాని వైపు చూసి 'నీ ముద్దు వెల రూపాయేనా? ప్చ్! చాలా చవక!' అంటూ బయటికి నడిచాడు.

అకిలాలీ చేసేది వడ్డీ వ్యాపారం. ఊళ్ళో అప్పు పుట్టని నిర్భాగ్యులు, ఆస్తి పాస్తులు లేని దరిద్రులు, రైల్వే ఉద్యోగులు, పాకీ వాళ్ళు అతడి దగ్గర అప్పులు చేస్తుంటారు. వడ్డీ నూటికి నెల ఒకటికి పదిహేను నుంచి ముప్పై రూపాయలదాకా వుంటూ వుంటుంది. ఈ వూళ్ళో అతని డబ్బు అరవై వేల రూపాయలు ఈ రేటుతో నెలనెలా పిల్లలు పెడుతున్నాయి. ఆస్తీ, అంతస్తూ— అంతూ పొంతూ లేకుండా పెరిగిపోతున్నాయి. స్థానికంగా వున్న రైల్వే ఆఫీసర్లు, పే క్లర్కులు — అకిలాలీ మచ్చిక చేసుకున్న అల్సేషియన్ కుక్కలు. జీతాలు రాగానే వడ్డీ, అసలు నయా పైసలతో సహా వసూలయిపోతుంది.

అప్పు తీర్చలేని వాడి నుండి ఆస్తి పోతుంది. పరువు పోతుంది. ఆస్తీ, పరువూ లేకుంటే—వయస్సులో వున్న — వాడి ఆడది అకిలాలీ యింటికి పోతుంది. అలా వచ్చిన వాళ్ళే అతడి పెళ్ళాలు. ఒకడి కూతుర్ని లాక్కొచ్చాడు. మరొకడి చెల్లెల్ని లాక్కొచ్చాడు. ఇంకొకడి పెళ్ళాన్ని లాక్కొచ్చాడు. రోదసీనౌక ఒక ఆకర్షణ పరిధిలోనుండి మరో ఆకర్షణ పరిధిలో ప్రవేశించినట్లు ఆ ఆడవాళ్ళంతా అతనికి అనుకూలవతులైపోయి, అతడితో సంసారం చేస్తున్నారు. అతడికి పిల్లల్ని కంటున్నారు.

ఆ యింట్లో ఇరవైమంది పిల్లలున్నారు. ఆ ఇరవై మందికీ తల్లులు వేరు వేరు. ప్రభుత్వ పశువైద్య శాలలో పశు గణాభివృద్ధి శాఖవారు కట్టేసిపెట్టిన జాతికోడెలా — తండ్రి ఒక్కడే !

చక్రపాణి వెళ్ళేసరికి, అకిలాలీ యింట్లోనే వున్నాడు. కాతా వున్న వాడెవడో వచ్చి వాకిట్లో నిలబడి పాతికో పరకో యిమ్మని బతిమాలుకుంటున్నాడు. అకిలాలీ వాణ్ణి దులిపి పారేస్తున్నాడు.

'పోరా సైతాన్ పో! నీకు డబ్బు తీసుకుపోవటం తెలుసుగానీ, నెలనెలా వడ్డీ సరిగ్గా తెచ్చియ్యటం తెలీదు. చిల్లిగవ్వ యివ్వను పో!'

'వొచ్చిన జీతం వొచ్చినట్లే మీ కిచ్చేశాను గదా బాబూ! ఇప్పుడు లేదంటే ఎలా?'

'ఏం, నీ అబ్బ సొమ్మా మ్మ యిచ్చావు?...నీకు జీతమొస్తే నా కెందుకూ, లాటరీ వొస్తే నా కెందుకు? నా సొమ్ము నా కివ్వటానికి నసుగుళ్ళెందుకురా?'

'అయ్యో, మీ సొమ్ము కాదని నేనన్నానా? అలా అని వుంటే, నా నాలిక పడిపోతుంది. పెళ్ళాం పిల్లలు పస్తున్నారు. మీరివ్వక పోతే యింకెవరిస్తారు?'

'ఛీఛీ! పెళ్ళాం పిల్లల పేరెత్తి నా నోరు మూయిస్తావురా? ఏం మనుషులా మీరు? మనుషులు కాదు మీరు! మృగాలు! సరే పో, తెల్లారి కొచ్చి చావు!'

బంగారుకొండ నెత్తినపడి, నరిగిచచ్చినంత సంతోషంతో సెలవు పుచ్చుకున్నాడు, పెళ్ళాం పిల్లల్ని పస్తులు పెడుతున్న వాడు.

''ఏం రా, చక్రం?' అన్నాడు అకిలాలీ చక్రపాణిని చూసి.

'శయనసుందరి రమ్మంటోంది.'

'ష్! మెల్లిగా! ఒకరు కాకపోతే ఒకరు వింటారు. మొగుడెక్కడున్నాడు? క్లబ్బులోనా ?'

'క్లబ్బులో గాకుండా యింట్లోనే వుంటాడనుకున్నావా?'

'వొస్తున్నా గానీ, నువ్వెళ్ళు!' అని మళ్ళీ వెనక్కి పిలిచాడు అకిలాలీ.

'ఇదిగో, నువ్వేం చేస్తావంటే, త్రిబులెక్స్ రమ్ పెద్దసీసా ఒకటి కొనుక్కుని, బిరియానీ పొట్లాలు నాలుగు కట్టించుకుని, అక్కడికే పట్రా. ఈ లోపల నేనూ వచ్చేస్తాను' అంటూ వాడి చేతిలో డబ్బు పెట్టాడు.

'మళ్ళీ చిల్లరకోసం చెయ్యి జాపడం కల్చర్ కాదు. ముందే చెబుతున్నా.'

'పదరా బాబూ' పద!

'అదీ కల్చర్ అంటే!' అంటూ చీడీలు దిగాడు చక్రపాణి.

6

పిచ్చి కుక్కలా కయ్‌కయ్‌మని మొరుగుతోంది ఫిడేలు.

గయ్యాళి పెళ్ళాం మొగుణ్ణి చేటతో బాదుతున్నట్లు దబ దబ మోగుతోంది తబలా.

హరికథ చెప్పాలనే పిచ్చితో హరికథ చెబితే ఎలా వుంటుందో అలాగేవుంది, దేవముని చెబుతున్న కథ.

అతడు చెబుతున్నది, 'కుంతీ కల్యాణం'.

కథా ప్రారంభంలోనే అతడు బసవరాజాగారి వంశాన్ని ఘనం కీర్తించాడు. లోక కల్యాణంకోసం బ్రతుకుతున్న పుణ్యపురుషుడు

ప్రెసిడెంటుగారే అని అన్నాడు. కుమారుడి వివాహ సందర్భంలో తనచేత హరికథ పెట్టించిన అతని జీవితమే ధన్యమన్నాడు. కవి, కథకుడు, నటుడు, గాయకుడూ అయిన తనను ఘనంగా సన్మానించటానికి పురప్రముఖులతో ఒక కమిటీ ఏర్పడిందనీ, ఆ సన్మాన సంఘానికి అధ్యక్షులు బసవరాజాగారేననీ చెప్పి, వారి ఉదాత్తతకు యింతకంటే దాఖలా యింకేం కావాలని ప్రశ్నించాడు. భగవంతుడు వారినీ, వారి కుటుంబాన్నీ......అంటూ దేవుడికి రికమెండ్ చేశాడు. దేవుడు తన అక్క మొగుడైనట్లు.

పందిట్లో కుర్చీవేసుకుని కాస్సేపు హరికథ వింటూ కూర్చున్నాడు బసవరాజా. దేవముని పొగడ్తలన్నీ విని అతడికి చాలా సంతోషం కలిగింది. మెచ్చుకుంటున్నట్లుగా చూశాడు దేవమునివైపు. ఆ మెచ్చికోలే చాలునన్నట్లు చూశాడు దేవముని.

కథనానికి అడుగడుగునా అడ్డంకులే! కథ చెప్పడం కంటే, కానుకలిచ్చినవాళ్ళను పొగడటం బాగా తెలుసు దేవమునికి. ఒక రూపాయి కూలీకి, రెండు రూపాయల కూలీకి మనుష్యుల్ని పొగడటానికే సరిపోతోంది, కాలమంతా. హరికథ కదా? అదంతేమరి!

'ఫలానా ధర్మాత్ములు హరిదాసును అభినందిస్తూ ఒక రూపాయి కానుకగా సమర్పించారు. కలియుగవైకుంఠంలో వేంచేసియున్న ఆ ఏడుగొండల వేంకటేశ్వరుడు ఆ ఫలానా ధర్మాత్ముణ్ణి పుత్రపౌత్రాభివృద్ధిరస్తుగా, ఆయురారోగ్య భోగభాగ్యాభివృద్ధిరస్తుగా ఆశీర్వదించి ఆదుకొనునుగాక!'

హరిదాసుకు ఒక్క రూపాయి కమీషన్ యిస్తే చాలు, దేవుడు మనపాలిట వుంటాడు! ఆ రూపాయి యివ్వడం మనధర్మం. దేవుణ్ణి మనం చంపకూడదు. దేవుడు చచ్చిపోతే, హరిదాసు చచ్చిపోతాడు పాపం!

కథ కుంటినడక నడుస్తోంది. సూర్యుడివల్ల తానుపొందిన సంతానాన్ని గంగపాలుచేస్తూ కుంతీదేవి 'ఎందుకయ్యా నవ్వుతావు? ఎవరు సుఖపడినారని?' అంటూ సినిమాపాట పాడుతోంది.

ఆ సమయంలో యింట్లోపనిపిల్ల గీత తిన్నగా బసవరాజా కూర్చున్న చోటికివచ్చి, అతడిమీదికి వంగి, చెవిలో ఏమిటో గుస గుస లాడింది.

అతడి కనుబొమలు రెండూ ముడిపడ్డాయి. విస్మయంగా పైకి లేచి ఇంటి లోపలికి దారితీశాడు బసవరాజా.

పందిరంతా చెవులప్పగించి హరికథ వింటూవుంది.

అయితే బసవరాజా యింట్లో అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నాయని మాత్రం ఎవరికీ తెలియదు. ఆ చప్పుళ్ళు బయటికి వినిపించకుండా లోపలే గింగుర్లు తిరుగుతూ వుండిపోయాయి. ఆ లావా బయటికి ప్రవహించకుండా లోపలే సుళ్ళు తిరుగుతూ వుండిపోయింది.

ఆ యింట్లో అగ్నిపర్వతాలు పేలి అతలా కుతలమైపోయిందనీ, హరికథ పూర్తయ్యేసరికి ఆ అగ్నితుఫాను చల్లారిపోయి మళ్ళీ ప్రశాంత వాతావరణం నెలకొన్నదనీ ముక్కంటికైనా తెలియదు.

ఇక్కడ కుంతీదేవి కర్ణుణ్ణి కంటున్న సమయంలో—అక్కడ మేడమీద శోభనం గదిలోకి పెళ్ళికూతుర్ని పంపించారు. పెళ్ళికూతురిపేరు కల్పలత. చపలకుమార్ ఆ కల్పలత నీడలో తన కోరికల్ని పండించుకుంటున్నాడనే అందరూ అనుకున్నారు.

కానీ, మేడమీదినుంచి కల్పలత ఆర్తనాదాలు వినిపించాయి. ఆమెను కన్నతల్లి అయ్యో, కుయ్యో అంటూ మేడమీదికి పరుగుదీసింది. గదిలోపల పెళ్ళికూతుర్ని చావబాదేస్తున్నాడు పెళ్ళికొడుకు. 'అమ్మో, నాయనో, చంపేస్తున్నాడు. ప్రాణాలు తోడేస్తున్నాడు' అంటూ కుయ్యోలిడుతోంది కల్పలత.

'కూతురా! ఏమైందే నీకు? నా తల్లీ! ... అల్లుడూ! కొట్టకు అల్లుడూ! నా కూతుర్ని చంపకు!...' అంటూ దబదబా తలుపులు బాదింది అత్తగారు. చపలకుమార్ తలుపులు తెరిచి, కల్పలత మెడమీద చెయ్యేసి 'పో, నా ముఖం చూడకు!' అని గెంటేశాడు. ఆమె తల్లిని కరుచుకుని 'అమ్మా...' అంటూ బావురుమంది.

బసవరాజా వెళ్ళేసరికి చపలకుమార్‌ని చుట్టుముట్టి వాడి మామగారు, బావమరదులు 'మా అమ్మాయిని ఎందుకిలా గొడ్డును బాదినట్లు బాదావు?' అని నిలదీసి అడుగుతున్నారు.

బసవరాజాను చూడగానే జెర్రిపోతులా అతడిమీదికి దూకాడు పెళ్ళికూతురి తండ్రి. 'నీ కొడుక్కి మతి సరిగ్గాలేదని మాకు ముందే చెప్పలేదేం?' అంటూ.

చపలకుమార్ రెచ్చిపోయి 'నిజమే! మాకు మతిలేదు. మతి సరిగ్గావుంటే రెణ్నెల్ల కడుపున్నదాన్ని తెచ్చిమెడకు తగిలించుకుంటామా? పొండి! మీ కూతురూ వద్దు, మీతోసంబంధమూ వద్దు' అన్నాడు.

ఆ మాట విని అందరూ ఆశ్చర్యపోయారు.

'నా కూతుర్నంటే కళ్ళు పోతాయి' అంది అత్తగారు

'మా అమ్మాయి సీతాదేవి' అన్నాడు మామగారు.

'మాటలు జాగర్తగా రానీ బావా! మా చెల్లాయి నిప్పులాంటిది' అన్నారు బావమరదులు.

'ఒకరిమీద లేని పోని మాటలు చెప్పాలని నాకేం కర్మ? అందులో నేను తాళి గట్టిన దానిమీద! చేసిన మోసం చాలు. ఎందుకలా బుకాయిస్తారు?' అన్నాడు చపలకుమార్.

బసవ రాజా కలగజేసుకున్నాడు. 'మావాడి మాటకూడా అంత తేలిగ్గా కొట్టిపారెయ్యటానికి వీల్లేదు బావగారు! డాక్టర్ల దగ్గిర అలాంటివి దాగుతాయా?'

తల్లి గుండెలకు అతుక్కుపోయి వెక్కిళ్ళు పెడుతున్న కల్పలత వైపు కదిలివచ్చాడు. ఆమె తండ్రి. పుస్తె కట్టించుకుని భంగపాటు తెచ్చుకున్న కూతురి ముఖంలోకి చూడగానే అతడి కంట్లో నీళ్ళు తిరిగాయి.

'ఏమమ్మా! ఈ మతిలేని వాళ్ళు చెప్పేమాట నిజమేనా!' అన్నాడు దీనంగా.

నోరు వెళ్ళబెట్టుకుని, పోటెత్తిన సముద్రంలా భోరున ఏడవ సాగింది ఆమె.

'ఏడుస్తావెందుకే? చెప్పు! ... 'అతడి కంఠంలో కత్తులు మెరిశాయి.

కల్పలత తెగిన తీగలా వాలిపోయి, మూర్ఛపోయింది.

వియ్యాలవారు కంగారు పడిపోయారు.

'అయ్యో, అభం శుభం ఎరగని పిల్లమీద అభాండాలువేసి చంపేశారే తల్లీ!' అంటూ రాగం అందుకొంది అత్తగారు.

బసవరాజా డాక్టర్ వైద్యలింగంగారికి ఫోనుచేసి వెంటనే రమ్మన్నాడు. పెరటివైపు వీధిలోంచి రమ్మన్నాడు.

మరుక్షణంలోనే వచ్చాడు వైద్యలింగం.

అమ్మాయిని పరీక్షించాడు. ప్రాణభయం ఏమీ లేదన్నట్లు వియ్యాలవారికి సైగ చేశాడు. లేచి నిలబడి అందరివైపూ పరకాయించి చూసి 'మీ కందరికీ తెలిసినట్లే వుంది. డాక్టరుగా నా నోట్లోంచి వినాలని చూస్తూ వుంటే, వినండి! అమ్మాయి గర్భవతి!' అన్నాడు.

వియ్యాల వారి నెత్తిన పిడుగుపడింది! గుండెల్లో రాయి పడింది!

'మా కడుపున చెడ బుట్టింది' అని తిట్టారు కూతుర్ని.

'ఈ సంగతే మాకు తెలియదు' అంటూ విస్మయం ప్రకటించారు.

'మా పరువు గంగలో కలిపారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని వున్నారు యిక్కడ? మీ కూతుర్ని తీసుకుని వెళ్ళిపొండి. ఈ పెళ్ళి జరగలేదనుకుంటాము' అంటూ తాడెత్తున ఎగిరాడు బసవరాజా.

'మీ రలా అంటే ఎలా బావగారూ! అమ్మాయిగతి ఏం కావాలి? మీరు కాస్త పెద్ద మనసు చూపాలి. తెలిసో తెలియకో తప్పుచేసింది కుర్రముండ. దాన్ని క్షమించి, ఈ యింట్లో దానికింత చోటివ్వండి బావగారూ!'

బసవరాజా ఒప్పుకోలేదు.

బావగారు బ్రతిమాలుకున్నారు. భంగపడ్డారు. గడ్డం పట్టుకున్నారు. కాళ్ళు పట్టుకున్నారు. ససేమిరా వీల్లేదన్నాడు బసవరాజా.

ఫలితం వుండదని తెలుసుకున్న బావగారు భంగపడటం మానుకున్నారు. ముఖం తుడుచుకున్నారు. మీసం దువ్వుకున్నారు. 'సరే బావగారూ! మీకు పరువే గొప్పదంటే, ఇంక మేమేం చేయ గలం? అంత అభిమానం మాకూ లేకపోలేదు. దాని కడుపు తీయించేసి ఎవడికో ఒకడికి ముడిపెట్టటం మాకూ చేతనవును. కో అంటే కోటిమందొస్తారు. మా పిల్లను తీసుకుని యిప్పుడే వెళ్ళిపోతాం మేము. ఆ అయిదెకరాల పొలం ఎలాగూ దానిపేరనే వుంది. మేమిచ్చిన ఆ యాభైవేలూ యిలా తెచ్చియ్యండి. మాదారి మేం చూసుకుంటాం.'

ఆవాక్కయి పోయి నుంచుండి పోయాడు బసవరాజా.

యాభైవేలు !

ఎంత ?

యాభై !

అమ్మాయి వెళ్ళిపోతే, ఆ యాభై వేలూ వెళ్ళి పోతుందా? అరెరే! ఎంతప్రమాదం !

బావగారిమీద కోప్పడ్డాడు బసవరాజా. ఏమిటీ? యాభైవేలా? పరువు లేనోడా! ఎవడిక్కావాలి నీ ముష్టి యాభైవేలు? తీసుకో పారేస్తాను!... కన్నాడట కూతుర్ని !...నీ కసలు తెలివి వుందా? అహ—వుందా అంటా?...' అంటూ గబగబా మేడ మెట్లు దిగాడు. 'డాక్టరుగారూ! ఇలా రండి!' అని పైనున్న డాక్టర్ని కేకేశాడు కిందినుంచి.

కిందగదిలో కూర్చుని డాక్టరూ, బసవరాజా ఐదు నిమిషాల సేపు ఏమిటో మాట్లాడుకున్నారు. తరవాత పిల్లతండ్రిని గదిలోకి పిలిపించారు.

'బావగారూ! ఆ యాభైవేలూ పట్టుకుపోతానంటే నా అభ్యంతరం ఏమీ లేదు. అయితే మీలాగా నేనూ తొందరపడితే, మన యిద్దరి పరువూ ఏం కావాలి చెప్పండి? ఇలా ఒక్కసారిగా యింత పెద్ద షాక్ తగిలితే, నేను ఊపిరి తిప్పుకోవాలా, వద్దా?' మాకు మీ అమ్మాయి ఒకటి కాదు, మా అమ్మాయి ఒకటి కాదు. మీ బిడ్డ ఎప్పుడైతే మా కోడలయిందో, అప్పుడే మా బిడ్డయిపోయింది. ఏదో పొరపాటున అమ్మాయి కాలు జారింది. అందులో మీ తప్పేముంది?...జరిగిందేదో జరిగిపోయింది. అమ్మాయికి ఆ కడుపు తీయించేద్దాం. అబ్బాయిని ఒప్పించే పూచీ నాది! మంచీ చెడ్డా తెలిసిన వాళ్ళు మీరు. వాడి ప్రీతికోసం మరో పాతికవేలు సర్దేయండి!'

బావగారు ఎగిరి గంతేశారు. 'మీ దెంత గొప్ప మనసు బావా! మీలాంటి వాళ్ళు ప్రపంచంలో ఎక్కడా వుండరు!' అంటూ చేతులు జోడించాడు.

కొడుకును ఒప్పించేసరికి తల ప్రాణం తోక కొచ్చింది బసవరాజాకు!

'ఒరే! చదువుకుంటే చాలదు. తెలివితేట లుండాలి. కాదూ కూడదూ అంటే ఎవరికి నష్టం? మనకే! ఇంతమంచి సంబంధం మళ్లీ మనకు దొరకదు. అమ్మాయికేం లోటుందని? చదువులేదా? చక్కదనం లేదా? ఆస్తిలేదా? అంతస్తు లేదా? ఆ కడుపుందనేగా? కడుపుతో నీకేం పని? తీయించేద్దాం! ఎవ్వరికీ తెలియద్దు. పరు వేమీ పోదు. ఈ పిల్ల ఒక్కతేనా లోకంలో తప్పు చేసిందీ? మన అదృష్టం బాగుంది కాబట్టి యిప్పుడు బయటపడింది. ఆ పిల్ల ముందే వాళ్ళవాళ్ళతో చెప్పివుంటే, పెళ్ళికి ముందే కడుపు తీయిం చేసి వుండేవాళ్ళు. అలా జరగనందుకు సంతోషించాలి. ఈ గుట్టు మనచేతిలోకి రాకపోతే, యిప్పుడు మరో పాతికవేలూ వచ్చేదేనా? ఆ పిల్ల మన పాలిటి కల్పవృక్షంరా! పల్లెత్తుమాట అనకు! అంతా మరిచిపో!'

'సరే' అంటూ ముఖం తిప్పుకున్నాడు చపలకుమార్.

వైద్యలింగం గారి డిస్పెన్సరీలో కల్పలతకు గుట్టుగా గర్భ స్రావం చేయించటానికే ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు.

ఆ పుణ్యకార్యం ఎప్పుడు?

'కుర్రవాళ్ళు వేడిమీద వుంటారు పాపం! ఆదిలోనే హంస పాదెందుకు చెప్పండి? రెండురోజులు బెడ్‌లోనే వుండాల్సొస్తుంది. ఈ రోజు వద్దు. బయటకి పొక్కుతుంది. ఎల్లుండి పని పూర్తి చేద్దాం. అప్పటికి ఈ సందడంతా వుండదు' అని, వైద్యలింగం గారు సెలవు తీసుకుని, పెరటిదారినే వెళ్ళిపోయారు.

అందరి ముఖాలూ మళ్ళీ కలకలలాడాయి.

మూర్ఛపోయిన కల్పలత లేచి కూర్చుంది.

ఆమెను ముఖం కడుక్కోమన్నారు. చేసుకున్న ముస్తాబు లన్నీ మళ్ళీ సవరించారు. గదిలోకి పంపారు.

లోపల కాస్సేపు మౌనం! ఆ తర్వాత నవ్వులు! ఆ వెంటనే ముద్దులు! ... ఆమె బంగారు కడుపుమీద చపలకుమార్ ముద్దులు కురిపిస్తున్నాడేమో !

ఈ వ్యవహారాన్ని యిలా ఓ కొలిక్కి లాక్కొచ్చేసరికి బసవ రాజా తల బట్టకట్టిపోయింది. ముఖాన కమ్మిన చెమట తుడుచు కుంటూ, అలసిపోయిన శరీరాన్ని మళ్ళీ పందిట్లోకి చేరవేశాడు.

హరికథ యింకా పూర్తి కాలేదు. పందిట్లో జనం పలచ బడి పోయారు. కథను గాలికొదిలేసి, కొందరు నేలకొరిగి నిద్ర పోతున్నారు. లేచి ఒళ్ళు విరుచుకొంటూ ఆవులిస్తూన్న ఒకరిద్దర్ని వెళ్ళిపోకుండా వారిస్తున్నాడు దేవముని. 'సోదరులారా! నేను మీ అమూల్యమైన నిద్రను పాడుచేయదలచుకోలేదు. ఇంకో అర గంటలో కథ పూర్తి చేస్తాను. దయచేసి అంతవరకూ సావధా నంగా కూర్చోవలసింది. శ్రీమద్రమారమణ గోవిందా!...'

'గో...విందా!'

'అయ్యో! మీరు పెట్టిన గోవింద — యింత దగ్గర్లోవున్న నాకే వినిపించలేదే; ఇక అక్కడెక్కడో వైకుంఠపురంలో వుండే ఆ మహావిష్ణువుకేం వినబడుతుంది? మీ పక్కన ఒళ్లు మరిచి నిద్ర పోతున్న వాళ్లకేం వినబడుతుంది ? ఏదీ, ఇంకొక్కసారి, అందరికీ వినిపించేలా, గట్టిగా...శ్రీ ఆంజనేయవరద గోవిందా!...'

'గో...వింద!'

కథ వినడానికి బుద్ధికాలేదు బసవరాజాకు. తలనొప్పితో కణ తలు జివ్వుమంటున్నాయి. మనసును మురిపించేదీ, మైమరపించేదీ ఏదైనా కావాలి! ఖుషీతో కాస్సేపు ఒళ్ళు మరిచిపోవాలి!

అతడి తలపుల్లో శయనసుందరి తళుక్కుమంది.

ఔను సుమా! ఈరోజు వాడు క్లబ్బులో వుంటాడుకదా? ఇకనేం? దాని దగ్గరికి వెడితే ఈ తుప్పలన్నీ ఒదిలిపోతాయి.

బసవరాజా మెల్లమెల్లగా నీడల్లోకి తప్పుకుని, అక్కణ్నుంచి గబగబా శేషఫణి యింటివైపు నడిచాడు.

నడవలోనే పడుకునివున్న చక్రపాణి గేటు చప్పుడువిని లేచి కూర్చుంటూ 'ఎవరదీ?' అన్నాడు.

బసవరాజా నడవలోకి వచ్చాడు. వాడి ముఖంలోకి తొంగి చూచి, 'నువ్వట్రా సెకరట్రీ? ఇక్కడ పడుకున్నావేం?' అన్నాడు.

అతన్ని చూచి ఆశ్చర్యపోయాడు చక్రపాణి. శయనసుందరి కబురంపితేనే వచ్చేవాడు కానీ, తనంతట తాను ఎప్పుడూ రాలేదు. ఇవాళే వొచ్చాడు.

'క్లబ్బు కెళ్ళలేదూ?

'రాణీగారు వెళ్ళనిస్తేకదా కింగూ! కిళ్ళీలుతే అని ఒకసారి, అరటిపళ్ళు కొనుక్కురా అని ఒకసారి, సిగరెట్లు పట్రా అని ఒక సారి...అబ్బబ్బబ్బ, తిరగలేక చస్తున్నాను...'

'ఫణిగాడు లోపలున్నాడా ఏమిటీ?'

క్లబ్బులో చచ్చాడు.'

'అయితే అవన్నీ ఎందుకు?'

తినబోతూ రుచి అడగటం ఎందుకు కింగూ? ఆవిడ కోస మేగా వచ్చావు? ఆవిణ్ణే అడుగు!'

బసవరాజా మెల్లగా తలుపు తట్టాడు. తలుపు తెరుచు కోలేదు. ఇంకాస్త గట్టిగా తట్టాడు.

రెండు నిమిషాల తర్వాత తలుపు తెరుచుకుంది, ఓరవాకిలిగా. శయనసుందరి తలుపు పట్టుకుని నిలబడింది, మత్తెక్కిన కళ్ళతో. అప్పటి కప్పుడే ఆదరాబాదరా చీర చుట్టుకుని వచ్చిన ట్లుంది. రవిక లేదు.

'ఎవరూ?...ఓ...నువ్వా? ఇప్పుడొచ్చావేం?...నిద్ర!' అంటూ నవ్వింది.

బసవరాజా ఆమెను తొలగదీసుకుని లోపలికి వెళ్ళాడు. ఆమె తలుపు దగ్గిరే నిలబడి పోయింది.

లోపల పడకటింట్లోంచి అకిలాలీ నవ్వు తెరలు తెరలుగా వినిపిస్తోంది. 'అరే, నువ్వా భాయ్! భలే తమాషాగా వుందే యిది! రా, రా!...తీస్కో!'

బసవరాజా నవ్వుతూ వుండటం సన్నగా వినిపించింది.

మరో నిమిషం తర్వాత అతడు గుమ్మం వైపు కదిలి వచ్చాడు. ఆమె పిరుదులమీద మెత్తగా ఓ చరుపు చరిచి నడవలోకి వచ్చాడు.

'ఒరే సెకరెట్రీ! బ్రాందీ షాపు దాకా వెళ్ళిరారా!

శయనసుందరి పెదాలమీద చిరునవ్వు వెలిగింది.

డబ్బు అందుకుని గేటుదాటుకో బోతున్న చక్రపాణితో 'ఇప్పుడే, ఇక్కడున్నట్టే రావాలొరేయ్' అన్నాడు బసవరాజా. లోపలికి వెళ్ళి తలుపు దగ్గరగా వేసి శయనసుందరి నడుంమీద చెయ్యి వేసి పడకటింటి వైపు నడిచాడు.

కాగితపు కవర్‌లో రెండు సీసాలు పెట్టుకుని పదినిమిషాల్లో తిరిగివచ్చాడు చక్రపాణి. తలుపు దగ్గిర నిలబడి, మెల్లగా తలుపు తట్టాడు.

లోపలినుంచి బసవరాజా గొంతు వినిపించింది.

'లోపలికి పట్రారా!'

తలుపు తోసుకుని లోపలికి నడిచాడు. పడగ్గదిలో మంచం మీద ముగ్గురూ కూర్చుని వున్నారు. మధ్యలో శయనసుందరి!

క్రమాన్పడి నిలబడి పోయాడు చక్రపాణి.

'అక్కడ పెట్టూ!' అన్నాడు బసవరాజా.

వాటిని టీపాయ్ మీద పెట్టాడు చక్రపాణి.

'నువ్వూ కాస్త వేసుకోరా సెకరట్రీ!'

'థాంక్స్! మీరు కానివ్వండి! నేనిక వెళ్ళొస్తాను. గుడ్ నైట్!' అంటూ వీధివాకిలివైపు నడిచాడు.

'గుడ్‌నైట్!'

'ఒరే చక్రం! లోపల గొళ్ళెం పెట్టి వెళ్ళు!' అన్నాడు అకిలాలీ.

'ఔనౌను!' అన్నాడు బసవరాజా.

'ఔనౌను!...నిండినిండి పొర్లిపోయే కొళాయి నీళ్లలా, కిలకిలా నవ్వింది శయన సుందరి.

'అలాగే!' అన్నాడు చక్రపాణి.

బయట గొళ్ళెం పెట్టాడు.

(ఇంకా వుంది)



మనిషి కట్టిన గోడలు
మనిషే పడగొట్టాలి

గంగడు ఏటిగట్టు కావల పూరిగుడిసెలో ప్రకృతి ఒడిలో పెరుగుతూ చేపలు పట్టడంలో తండ్రికి చేదోడు వాదోడుగా వుంటాడు. ఇవతలి ఒడ్డున సరుగు-చెట్ల నీడలో నిటారుగా నిలిచిన రెండంతస్థుల మేడలో చలమయ్య ముద్దుల కొడుకు గోపీ గోలీ కాయలాడుతూ గోల చేస్తుంటాడు. కాలం యీ యిద్దరినీ వూరి బళ్లో కలిపింది.

మనిషికీ మనిషికీ మధ్య యీ అంతరాలెందుకు? ఎవరు కల్పించారు. యీ మురికినీటి ఏటిని?

వెనుకబడిన తనమా యీ ఏటి పేరు?

అట్టడుగున ఉన్న వాడికి ఆర్థిక సహాయం అందజేస్తే అతని వృద్ధికి ఆకాశమే హద్దు.

సమాజంలోని వెనుకబడిన వర్గాలవారి జీవితాలను పూల బాటలుగా మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మనిషి నిర్మించిన అడ్డుగోడలు మనిషే పడగొట్టుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ షెడ్యూలు కులాల సహకార ఆర్థిక సహాయ సంస్థ, ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సహాయకసంస్థ, మహిళా సహకార ఆర్థిక సహాయక సంస్థ బడుగు వర్గాల భవిష్యత్తును తీర్చి దిద్దుతున్నాయి. కృషి చేస్తున్నాయి.

జీవితాలు మళ్లీ మనసారా నవ్వుతున్నాయి.

సమాచార పౌరసంబంధ శాఖ, హైదరాబాదు.

శ్రీ ఐ. సత్యసుందరం

బోనసుపై కొన్ని ఆలోచనలు

బోనసుకు సంబంధించిన అనేక అంశాలపై ఏకాభిప్రాయం లేనందువలన పారిశ్రామిక రంగంలో అశాంతి ఏర్పడినది. పారిశ్రామిక యూనియన్లు మాత్రము వేతనం లాగానే బోనసును కూడ పొందుటలో శ్రామికులకు పూర్తి హక్కు వున్నదని భావించుట జరుగుచున్నది. అయితే ప్రస్తుతపు ప్రభుత్వ ఆలోచన ప్రకారం, బోనసు అన్ని పరిస్థితులలోను ఇచ్చుట సాధ్యంకాదు, న్యాయంకాదు కూడాను. సామ్యవాద దేశాలలో కూడ బోనసు అన్ని పరిస్థితులలోను ఇచ్చుట జరుగుటలేదు. అయితే, బోనసు విషయంలో మాత్రం శ్రామికులకు యజమానులతోను, ప్రభుత్వంతోను ఏకీభవించలేకపోవుచున్నారు. ఈ కారణంగా, —బోనసు కారణంగా— ఏర్పడిన పారిశ్రామికా అశాంతి పెరుగుతునే వున్నది. ఈ విషయం ఈ దిగువ పట్టికలో గమనించవచ్చును.

సంవత్సరం	సమ్మెలు/మూసివేతల మొత్తం సంఖ్య	బోనసు కారణంగా ఏర్పడిన సమ్మెలు/మూసివేతల శాతం
1950	814	9. 0
1955	1166	9. 9
1960	1583	10. 5
1965	1835	9. 9
1970	2839	10. 6
1971	2751	14.10
1972	3243	8. 4

బోనసుకు సంబంధించిన ఒక ముఖ్యమైన వివాదం ఏమిటంటె సంస్థ నష్టాలు పొందుచున్నప్పటికి లేక సామాన్య లాభాలు పొందుచున్నప్పటికి శ్రామికులకు బోనసు ఇవ్వవలెనా అన్నది. అలా ఇచ్చుట ఎంతవరకు సమంజసము అన్నది, మిగులు సమయాలలో బోనసు ఇవ్వవలసిన ఆవశ్యకత లేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినది. అయితే, బోనసుకు సంబంధించిన విషయాలను పరిష్కరించుటకు రాష్ట్రపతి సెప్టెంబరు 25, 1975న ఒక ఆర్డినెన్సు జారీ చేయుట జరిగినది. ఈ ఆర్డినెన్సు ప్రకారం 1974లో ఏ రోజు నుండి మొదలైన సంవత్సరంలో శ్రామికులకు 1965 బోనసు చట్టంలోవలె 4 శాతం కనీస బోనసు ఇవ్వవలెను. (సంస్థకు కేవలం సామాన్య లాభాలు వచ్చుచున్నప్పటికి) ఈ శాతం ఇప్పటి వరకు $8\frac{1}{3}$గా ఉంటూ వచ్చినది. ఉత్పత్తి విషయంలో శ్రామికుల కీలక పాత్రకు ప్రాధాన్యత ఇస్తూ, శ్రామికుల అతి తక్కువ ఆర్థిక స్తోమతను దృష్టిలో వుంచుకుని కనీస బోనసు 4 శాతంను సమర్థించుట జరిగినది. అయితే అన్ని పరిస్థితులలోను ఈ పద్ధతిని అవలంభించుట సాధ్యంకాదు. అందువలన, ఒకసంస్థ నష్టాలు పొందినా, వరసగా నష్టాలు పొందుతూ వస్తున్నా ఈ కనీస బోనసు ఇవ్వనక్కరలేదని ఆర్డినెన్సు చెప్పినది. మన ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి వ్యయాలు పెరుగుచూవున్నవి. ధరల పెరుగుదల, తక్కువ ఆర్థికాభివృద్ధి రేటు, పెరుగుతూవున్న నిరుద్యోగం మన సమస్యలు. ఇటువంటి పరిస్థితులలో కనీస బోనసును అమలుపరచుట దేశానికి, చివరకు శ్రామికులకు కూడ మంచిదికాదని అభిప్రాయమున్నది. కారణ మేమిటంటే, ఒక సంస్థ బోనసు ఇవ్వలేని స్థితిలో బలవంతంగా బోనసు ఇప్పించుటవలన శ్రామికులే నష్టపోవచ్చు. (ఆ సంస్థ మూసివేసినపుడు ఏర్పడే నిరుద్యోగ కారణంగా).

ఇటీవల కాలంలో నష్టాలు వస్తున్న పరిస్థితులలో కూడ బోనసు (ఒక నెల వేతనానికి సమానంగా) ఇచ్చుట జరిగినది. ఈ కారణంగా ప్రభుత్వరంగంలో లోటులు, ప్రైవేటు రంగంలో ధరలు ఖర్చులు విపరీతంగా పెరిగినవి. ధరలు పెరుగుదల నిరుద్యోగం పెరుగుదల ముఖ్యంగా శ్రామికులకి హానికరము. ప్రభుత్వ రంగంలోవున్న సంస్థలే లోటులతో తికమకపడుతూవుంటె, ప్రైవేటు రంగములోవున్న సంస్థలు మూసివేతకు సిద్ధంగా వున్న వాటిని ప్రభుత్వం తీసికొనుట సాధ్యపడదు. బోనసుకు సంబంధించిన విషయాలను ఖచ్చితంగా, న్యాయంగా నిర్దేశించక పోయినచో ఆర్థిక వ్యవస్థలో పొదుపు, పెట్టుబడి మొత్తాలు తగ్గి, నిరుద్యోగం ఏర్పడి శ్రామికుల పరిస్థితులను మరింతగా దిగజార్చును. మన దేశంలో ఒక జాతీయ వేతనా విధానం అంటు ఏర్పడలేదు. వేతనాలు ఇప్పటికి కొన్ని సంస్థలలో శ్రామికుల, యాజమాన్యుల బలాబలాలకు వదిలివేయుట జరిగినది. ఈ కారణంగా ప్రభుత్వ కంట్రోలు వున్న రంగాలలో శ్రామికుల జీవన ప్రమాణం హెచ్చుగావున్న (ధరలు పెరిగినా కరువుభత్యము పెరుగుటవలన) ప్రభుత్వాజోక్యం తక్కువగా వున్న సంస్థలలోని శ్రామికుల పరిస్థితులలో మార్పు కనబడదు. అయితే ఇక్కడ వేరొక సమస్య వున్నది. బేసిక్ వేతనం కరువుభత్యం పెరిగినపుడు బోనసుకూడ పెంచవలసి వున్నది. కారణం, బోనసు వాటిలో శాతంగా చెప్పుట వలన.

సంస్థ పొందుచున్న లాభాలలో, ముఖ్యంగా ఉత్పాదకత **(productivity)** పెరుగుటవలన పొందే లాభాలలో, శ్రామికులకు కూడ వాటా వుండుననుటలో ఎటువంటి సందేహం లేదు. సంస్థ అంతా లాభం పొందునపుడు, సంస్థలో పనిచేసే శ్రామికులకు

ఆ లాభంలో వాటా లేకపోవుట అన్యాయంకదా. అయితే బోనసును నిర్ణయించు అంశాలను నిర్ణయించుట అవసరం. ఆర్డినెన్సు ప్రకారం 1974లో లాభం పొందిన సంస్థయొక్క కనీస బోనసు 4 శాతం. తక్కువ వేతనం పొందే శ్రామికులకు లాభదాయకంగా వుండేందుకు అత్యధిక కనీస బోనసు 60 రూపాయలు మరియు 25 రూపాయలనుండి 100 రూపాయలు మరియు 60 రూపాయలకు పెంచుట జరిగినది.

కనీస బోనసు నిర్ణయించుటేకాక గరిష్ఠ బోనసుకూడ నిర్ణయించవలసి వున్నది. లాభాలతో సంబంధము లేకుండా ఇచ్చే గరిష్ఠ బోనసుకు కనీస బోనసుకు సంబంధం వున్నది. లాభాలతో సంబంధం లేకుండా కనీస బోనసు ఇచ్చుటవలన శ్రామికులు పొందే లాభం, అత్యధిక లాభాలున్నా బోనసుపై గరిష్ఠ పరిమాణం నిర్ణయించుట వలన వచ్చే ఇబ్బంది : ఈ రెంటిని శ్రామికులు సమానంగా చూడవలెను అంటే, ఈరెండింటిలో ఏది తమకు హానికరమని భావించరాదు. లాభాలతో సంబంధం లేకుండా గరిష్ఠ బోనసును నిర్ణయించినపుడు, కనిష్ఠ బోనసునుకూడ నిర్ణయించవలెనని బోనసు కమీషన్ అభిప్రాయపడెను. కనిష్ఠ బోనసు నిర్ణయించకుండ, గరిష్ఠ బోనసును నిర్ణయించుట శ్రామికులకు ఆమోదయోగ్యంగా వుండదని కమీషన్ అభిప్రాయపడెను. కొన్ని సంవత్సరాలలో అసలు బోనసు లేకుండా, మరికొన్ని సంవత్సరాలలో అత్యధిక బోనసు పొందుటకంటె, కనీస, గరిష్ఠ బోనసులను నిర్ణయించుటే మంచిదని బోనసు కమీషన్ అభిప్రాయపడెను. అయితే ఈ విషయంపై యజమానుల, శ్రామికుల అభిప్రాయాలు పరస్పర విరుద్ధంగా వున్నవి. యజమానులు గరిష్ఠ బోనసును వుంచి, కనీస బోనసును తీసివేయమంటే, శ్రామికులు కనీసబోనసును వుంచి గరిష్ఠబోనసును తీసివేయమనటం జరిగినది.

శ్రామికుల ఉత్పాదకత (Productivity) ను బట్టి బోనసును ఇచ్చుటలోకూడ అనేక ఇబ్బందులు లేకపోలేదు. అసలు శ్రామిక ఉత్పాదకతను లెక్కకట్టుట ఎలా అనునది సమస్య. శ్రామిక ఉత్పాదకత సంస్థను నడిపే తీరుపైకూడ ఆధారపడి వుండును. ఉత్పత్తి పద్ధతులు పరిశ్రమకు పరిశ్రమకు, ఒకే, పరిశ్రమలో సంస్థకు సంస్థకు మారుచుండును. అంతే కాకుండ ఒక పరిశ్రమ యొక్క వస్తువులన్ని ఒకే రకంగా లేకపోవుటచే అనేక శ్రామికుల ఉత్పాదకతలను లెక్క కట్టుట చాల కష్టమని 1948 లోనే లాభ విభజన కమిటి (Profit Sharing Committee) అభిప్రాయపడెను. ఉత్పాదకత శ్రామికుల పైనే కాకుండా అనేక ఇతర అంశములపై (సంస్థకున్న సదుపాయాలు, ఉత్పాదకాలు (inputs) పర్యవేక్షణ మొదలయినవి) ఆధారపడును.

...పై కారణంగా బోనసును ఉత్పత్తితోగాని, ఉత్పాదకతతోగాని ముడిపెట్టుట మంచిదికాదని యజమానులు, శ్రామిక సంఘాలు అభిప్రాయపడినట్లు బోనసు కమీషన్ తెలిపెను. లాభాలను బట్టి బోనసు ఇచ్చుటకు బదులుగా, ఉత్పత్తి, ఉత్పాదకతను బట్టి బోనసు నిచ్చుట సాధ్యం కాదని బోనసు కమీషన్ అభిప్రాయపడెను. శ్రామికులు ఎక్కువ కష్టపడే పరిస్థితులు ఏర్పరచి, వారికి ఎక్కువ పారితోషికం ముట్టచెప్పవచ్చును. అయితే ఇవన్నీ లాభాలలో ప్రతియేటా పొందే బోనసుకు బదులుగా కాకూడదని బోనసు కమీషన్ అభిప్రాయం.

బోనసు విపరీతంగా మారకుండా స్థిరీకరణ చేయటం అవసరమని బోనసు కమీషన్ అభిప్రాయము. ఇటీవల జారీచేసిన ఆర్డినెన్సు బోనసు చట్టంలోని 34(3) సెక్షనును నిర్మూలించినది. ఈ సెక్షన్ ప్రకారం చట్టంతో వున్న సదుపాయానికి విభిన్నంగా కూడ బోనసు ఏర్పరచుకునే అవకాశం యజమానులకు శ్రామికులకు వున్నది. ఈ కారణంగా, శ్రామికులు యజమానులపై ఒత్తిడి తెచ్చి ఎక్కువ బోనసు పొందుటకు ప్రయత్నాలు జరిగినవి. ఇటీవల జారీ చేసిన ఆర్డినెన్సు ప్రకారం, బోనసు చట్టానికి విరుద్ధంగా బోనసు చెల్లించినచో ఆదాయపు పన్ను విషయంలో దానిని లెక్కలోనికి తీసికొనరు. అంటే, ఇవ్వవలసిన (చట్ట ప్రకారం) బోనసుకంటె ఎక్కువ ఇచ్చి దానిని ఖర్చుగా చూపెట్టుట సాధ్యపడదు.

బోనసు సమీక్ష కమిటి (Bonus Review Committee) గరిష్ఠ బోనసును 20 నుండి 25కు పెంచమని సూచించెను. అయితే, ఆర్డినెన్సు ప్రస్తుతంవున్న 20 గరిష్ఠ పరిమాణమునే స్థిరపరచినది. బోనసు చట్టం కొన్ని సంస్థలకు (జీవిత భీమాసంస్థ, తంతి తపాలా మరియు పోటీలేని ప్రభుత్వ పారిశ్రామిక సంస్థలు) వర్తించదు. అయితే అందులో పనిచేసే వారికి కూడ సరియైన ప్రోత్సాహం కల్పించుటకు బోనసు వున్నది. అటువంటి గరిష్ఠ బోనసు ప్రతివాని సంవత్సర సంపాదనలో 10 శాతం.

బోనసు పుచ్చుకొనుటకంటె ముఖ్యమైనది సంస్థ భవిష్యత్తులో అభివృద్ధి చెందుట. ఇది అందరూ అంగీకరించినదే. ఈ కారణంగా, బోనసు సంస్థ చెల్లించే శక్తిపై ఆధారపడవలెనని కొందరి అభిప్రాయము. అటువంటి సంస్థ అభివృద్ధికి కావలసిన ప్రోత్సాహకరమైన పరిస్థితులను గాని, ఇటు శ్రామికుల న్యాయమైన కోర్కె (బోనసు విషయంలో) గాని నిర్లక్ష్యము చేయకూడదు.

ఇటీవల జారీచేసిన ఆర్డినెన్సు ప్రకారం బోనసు సాధ్యమైనంతవరకు ఉత్పాదకతపై ఆధారపడవలెను. అట్లు కుదరని పక్షంలో లాభాలపై ఆధారపడవలెను. అయితే జాతీయ శ్రామిక కమీషన్ (The National labour Commission) మాత్రం వేతనాలను పూర్తిగా ఉత్పాదకతతో ముడిపెట్టుట కుదరదని అయితే ఒక స్థాయి తరువాత వేతనాల పెరుగుదల ఉత్పాదకత పెరుగుదలపై ఆధారపడవలెనని అభిప్రాయపడెను.

అంతేకాదు, సంస్థ చెల్లించే శక్తినిబట్టి బోనసును నిర్ణయించుట న్యాయంగా కనపడినప్పటికి, అనేక ఇబ్బందులతో కూడుకొని వున్నది. ఉదాహరణకు, ఒక సంస్థ ధరలను విపరీతంగా పెంచి, ఎక్కువ బోనసును ఇచ్చినచో ఆ పనిని మనము హర్షించలేము. పైగా అటువంటి పని సంఘానికి వ్యతిరేకంగా (anti-social) భావిస్తాము. ఉత్పత్తిని పెంచే ప్రోత్సాహ పరిస్థితులు ముఖ్యంగా ఉత్పాదకతను లెక్కకట్టగల సంస్థలలో ప్రవేశ పెట్టవలెనని జాతీయ శ్రామిక కమీషన్ అభిప్రాయం. వస్తు నాణ్యతపై కూడ మనకు కొంత స్వాధీనం వుండే సంస్థలలో ఆ పద్ధతి అవలంభించవచ్చును. బోనసు కమీషన్ ఉత్పత్తి పెరుగుదలకు కావలసిన ప్రోత్సాహ పరిస్థితుల ఆవశ్యకతను తెలుపుతూ లాభంకి సంబంధించిన బోనసు పద్ధతిని తొలగించుట సాధ్యపడదని చెప్పెను. సంస్థ లాభాలను నిర్ణయించే అంశాలు పూర్తిగా యజమానుల లేక శ్రామికుల స్వాధీనంలో లేవు. లాభంకి సంబంధించిన బోనసు శ్రామికులకు ప్రోత్సాహం కల్పించే బోనసుకు తేడా వున్నది. వేతనాన్ని ఉత్పాదకతకు ముడిపెట్టగల పరిస్థితులలోనే శ్రామికులకు ప్రోత్సాహం కల్గించగల బోనసు (Incentive Bonous)ను అమలు పరచుట సాధ్యపడును.

అయితే, కనీస బోనసును ఉత్పాదకతతో ముడిపెట్టవచ్చునా అనునది బోనసు కమిటీ పరిశీలించెను. అయితే ఉత్పాదకతను లెక్కకట్టుట కష్టం గనుక బోనసును ఉత్పాదకతతో ముడివేయుటకు శ్రామికులు యజమానులు అంగీకరించుటలేదని కమిటీ అభిప్రాయపడెను. సంస్థ లాభాలు ఆధారంగా చెల్లించే బోనసును తొలగించుట ప్రస్తుత పరిస్థితులలో సాధ్యపడదు. స్వల్పకాల వ్యవధిలో ఉత్పాదకతను లెక్కకట్టుటకు అవకాశం వున్నచో బోనసును ఉత్పాదకతతో ముడిపెట్టుట సాధ్యపడును. అంతేకాకుండా అసలు బోనసును ఉత్పాదకతకు ముడిపెట్టవలసిన అవసరం వున్నది అని పరిశీలించవలెను. ప్రభుత్వ యాజమాన్యపువున్న చాల సంస్థలలో బోనసు కాకుండా కొన్ని ఇతర ప్రోత్సాహ పరిస్థితులుండుటచే, బోనసును ఉత్పాదకతతో ముడిపెట్టవలసిన అవసరం లేదని కొందరి అభిప్రాయం. లాభాలను ఆధారంగా చేసికొని సంవత్సరి బోనసు వుంచుట న్యాయంగా తోచుచున్నది. కారణం, సంస్థ లాభాలకు శ్రామికులు కూడ తోడ్పడుచున్నారు కాబట్టి.

ఇటీవల కాలంలో శ్రామికులకు వచ్చే బోనసు వారి ఉత్పాదకతపై ఆధారపడవలెనని అనేకమంది వాదించుచున్నారు. మా ప్రధానికూడ అదే అభిప్రాయమును వెలిబుచ్చెను. ఉత్పత్తి పెరుగుట వలన వచ్చేలాభాలలో వారికికూడ వాటా వున్నదని తెలిసినపుడు శ్రామికులు ఉత్పత్తిని పెంచుటకు ఎక్కువకృషి చేయుదురు. అయితే ఉత్పత్తి అయిన వాటికి తగిన గిరాకీ వుండేటట్లు చూచుట కూడ ముఖ్యమే. లేకపోతే గిరాకికంటే సప్లయి పెరిగి, ఉత్పత్తి తగ్గి నిరుద్యోగము పెరుగును. అయితే, బోనసును ఉత్పాదకతతో ముడిపెట్టుట వలన కొన్ని సమస్యలుండుటచే, ఉత్పత్తి పెంచుటకు తోడ్పడిన శ్రామికులకు నెలలు వారిగా అదనపు పారితోషికం ఇవ్వవచ్చునేగాని ఉత్పాదకతను సంవత్సరపు బోనసుతో ముడిపెట్టరాదని కొందరి అభిప్రాయము. ఒక్కొక్కప్పుడు ఉత్పాదకత పెరుగుట వలన ఉత్పత్తి పెరిగినా లాభాలు పెరగకపోవచ్చును. అటువంటప్పుడు ఉత్పాదకతతో బోనసును ముడిపెట్టినచో యజమానులు నష్టపోవుదురు కదా.

బోనసును లాభాలతో ముడిపెట్టుటలో కూడ కొన్ని ఇబ్బందులు వున్నవి. ఒక సంస్థ లాభాలు పొందితే ఆ సంస్థలోని శ్రామికులు బోనసు పొందుచున్నారు. ఇంకో సంస్థ నష్టం పొందితే ఆ సంస్థలోని శ్రామికులకు బోనసు వుండదు. ఈ విషయంలో యాజమాన్యం సరిగా లేక ఒక సంస్థ నష్టపోతే, శ్రామికులకు బోనసులేకుండా పోయినది. ఇది అన్యాయంగా కనపడుచున్నది. ఈ పరిస్థితిని నిర్మూలించుటకు కనీస బోనసును అమలు పరచిరి. సంస్థ నష్టపోతున్నా కనీస బోనసు ఇచ్చుకోవలసినమాట. అయితే ఇది కూడ అన్యాయమే అని కొందరి అభిప్రాయం. కాని కొందరు దీనిని సమర్ధించిరి. కనీస బోనసు చెల్లించవలసిన భాద్యత యాజమాన్యంపై వున్నప్పుడు ఆ యాజమాన్యము ఎక్కువ సమర్ధవంతంగా పనిచేయునని వీరి అభిప్రాయము.

కేవలం సంవత్సరపు బోనసుద్వారానే యాజమాన్యంనకు, శ్రామికులకు ప్రోత్సాహం కల్పించుకొనుట పొరపాటు. అధికంగా కష్టపడి సంస్థ ఉత్పత్తి, లాభాలు అభివృద్ధికి తోడ్పడిన శ్రామికులకు నెలనెలా అదనపు వేతనాలను సమకూర్చుటలో తప్పులేదు. అన్నిటికంటె ముఖ్యం సంస్థ భవిష్యత్తు. బోనసు విషయంలో సంస్థ భవిష్యత్తుకు ప్రమాదం లేకుండా యాజమాన్యము, శ్రామికులు ఒక న్యాయమైన అంగీకారమునకు రావచ్చును.

సెప్టెంబరు 1975లో జారీచేసిన ఆర్డినెన్సుతోపాటు ప్రభుత్వం కూడ కొన్ని ఉత్తర్వులను జారీచేసినది. అనవసరంగా పారిశ్రామిక యూనిట్లను మూసివేయుట, శ్రామికులను ఉద్యోగం నుండి తొలగించుట మొదలగు చర్యలను అరికట్టుటకు ప్రభుత్వం చట్టాన్ని ఉపయోగించదలచినది. యాజమాన్యులుగాని, శ్రామికులుగాని ఎక్కువ కష్టపడి ఎక్కువ పారితోషికం (వేతనం రూపంలోగాని, బోనసు రూపంలోగాని) పొందాలి. అది పారిశ్రామిక రంగంలో శాశ్వత శాంతిని నెలకొల్పుటకు తోడ్పడుతుంది.

బోనసు చట్టాన్ని 1975లో సవరించుట జరిగినది. ఈ సవరణ ప్రకారం ఒక సంస్థకు పంపకపు మిగులు (Allocable Surplus) ను బట్టి బోనసు ఇవ్వవలసి వుంటుంది. పెట్టుబడి మీద, అంటే, పన్ను కట్టగా మిగిలిన లాభాలపై (After-tax Profits) 8.5 శాతం లాభం వసూలు చేసిన మూలధనం పైనను (Paid-up-Capital) మరియు రిజర్వులపై 6 శాతం లాభం తీసివేయగా పంపకపు మిగులు వచ్చును. అయితే ఈ పద్ధతిలోను కొన్ని లోపములు లేకపోలేదు. ఒక కంపెనీకి పన్ను కట్టగా మిగిలిన లాభాలు బాగా వుండుటచే డివిడెంటులపై 20 శాతం లాభం చూపించినా, పంపకపు మిగులు లేదని బోనసు ఇవ్వక పోవచ్చును. అంటే, సంస్థ అభివృద్ధి వాటాదారులకే (Share holders) గాని, శ్రామికులకు లాభాలను చేకూర్చదనమాట. బోనసును పూర్తిగా ఎగగొట్టుటకో లేక దానిని తగ్గించుటకో ఒక సంస్థ ఖర్చులను ఎక్కువగా చూపించి లేక నిల్వలను తక్కువగా చూపించి శ్రామికులకు అన్యాయం చేయగలదు. కేవలం యాజమాన్యులు చూపించిన లాభాల ఆధారంగా బోనసును నిర్ణయించుటలో ఈ ప్రమాదం లేక పోలేదు. ఉదాహరణకు, 1975–76లో 32 కేంద్రప్రభుత్వ సంస్థలు (మొత్తం 136 సంస్థలలో) మాత్రమే బోనసు చెల్లించవలసిన అవసరం ఏర్పడినది. నిజంగా ఆ సంవత్సరంలో ప్రభుత్వ రంగంలో పారిశ్రామికాభివృద్ధి 14 శాతంవున్నా, ప్రైవేటు రంగంలో శ్రామికుల పరిస్థితి సంస్థలమూసివేత, ఉద్యోగాల నుండి తొలగించుట (lay-offs and retrenchments) వలన ఏమాత్రం బాగుండలేదు.

1977 జనవరి 18వ తారీఖున కాంగ్రెస్ ప్రభుత్వం బోనసుపై తన అభిప్రాయాన్ని వెలిబుచ్చినది. బోనసు చట్టము 1965, సరిగా పనిచేయుట లేదని ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగినా బోనసు తమకు రావటం లేదని శ్రామికులు అభిప్రాయపడుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించినది. ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుదలను కొలచుటకు కొన్ని నిర్దిష్టమైన ప్రమాణాలు అవసరమని ప్రభుత్వము అభిప్రాయపడినది. అటువంటప్పుడు మాత్రమే బోనసును ఉత్పాదకతతో ముడిపెట్టుట సాధ్యము, సమంజసనీయము అని ప్రభుత్వ అభిప్రాయము.

బోనసుకు సంబంధించిన తగాదాలను ఒకే ట్రిబునల్ (Tribunal) పరిశీలించునని తెలిపెను. లాభాలను చూపుటలో అన్యాయం జరిగినట్లయితే, లెక్కలను పరిశీలించే హక్కు ఆ ట్రిబునల్‌కు వున్నట్లు కూడా తెలిపెను. అంతే కాకుండా, కంపెనీ అకౌంట్ ఆడిట్ చేసే నిమిత్తం ట్రిబునల్ వేరొక ఆడిటర్‌ను కూడా నియమించే అధికారం వున్నట్లు ప్రభుత్వం ప్రకటించినది. చాలా పరిశ్రమల విషయంలో నికర లాభాలు (Net Profits) వున్నా పంపకపు మిగులు (Allocable Surplus) లేదన్న సాకుతో బోనసు ఇచ్చుట జరుగలేదని ప్రభుత్వం తెలిపినది. ఈ కారణంగా 1976లో ఏ రోజునుండైనా ఒక సంస్థకు పంపకపు మిగులు లేకపోయినా నికరలాభం ఏమాత్రం వున్నా శ్రామికునికి ఆ సంవత్సరమునకు 100 రూపాయలు fiate rate చొప్పున ఇవ్వవలసి వుంటుందని ఆదేశించినది. అయితే, ఇటువంటి ఏర్పాటు పెద్ద సంస్థలు అక్రమంగా ప్రవర్తించుటను అరికట్టుటకు తోడ్పడును గాని, చిన్న సంస్థలకు కొంత ఇబ్బందిని కలుగజేయును. మరి చిన్న సంస్థలు ఎదుర్కొనే ఇబ్బందులను, ముఖ్యంగా విపరీతంగా ఖర్చులు పెరుగుచున్న పరిస్థితిని తొలగించినపుడే చిన్న సంస్థలుకూడా బోనసును చెల్లించుటలో ఎటువంటి ఇబ్బందులను ఎదుర్కొనవు.

కేంద్రంలో ఇటీవల జనతా ప్రభుత్వం ఏర్పడినది. శ్రామికుల విషయంలో ఎటువంటి పద్ధతులను అవలంబించాలో తెలుపలేదు. అయితే జనతాపార్టీ మేనిఫెస్టో (Manifesto) లో మాత్రం బోనసును నిలిపివేయబడిన వేతనము (Deferred Wage) గా పరిగణించుట జరిగినది. అంటే శ్రామికులకు ఎంతోకొంత బోనసు హక్కుగా రావలసి వున్నదన్నమాట. ఈ ఏర్పాటు శ్రామికులకు, యజమానులకు ఎక్కువ సమర్థవంతంగా పనిచేయుటకు సహకరించినా, ప్రభుత్వం బోనసు విషయంలో ఎంత శ్రద్ధ చూపుచున్నదో, పరిశ్రమల సమస్యలను పరిష్కరించుటలోగూడా అంతే శ్రద్ధ చూపవలసి వున్నది.

శ్రీ విరించి

ప్రాంతీయ భాషా రచయితలు - వారి సమస్యలు

జీవితములోని అన్ని రంగములలోవలెనే, రచయితలకూ సమస్యలు వున్నాయి. సృజనాత్మకమయిన రచనలు చేయ బూనుకున్న వారికి మరిన్ని సమస్యలు. సృజనాత్మకత, ప్రయోజనము అనేవి బహు విస్తృతమయిన మాటలు. కాని యీ సమస్యలు యేమి, వీటిని గడిచి గట్టెక్కడం ఎలాగు అన్నది అంత తేలికయిన విషయము కాదు. భారతదేశములోని రచయితలందరకూవున్న సామాన్య సమస్యలు కాక, ప్రాంతీయ భాషలలో రచనలు చేసేవారికి ప్రత్యేకమయిన సమస్యలు వున్నాయి. ప్రధానమయిన సమస్య వారికి వున్న 'పరిమిత పాఠకులు.' భారతదేశము బహువిశాల మయినదీ, అనేక భాషలతో విలసిల్లుతున్న దీని. ఎన్నో భాషలు, మాండలికాలు ప్రచారంలో వున్నాయి. జనాభాలో చదువుకొన్నవారి సంఖ్య నూటికి ముప్పయి మటుకే. ఇంగ్లీషు ప్రధానమయిన భాషగా యింకా చెలామణి అవుతూనే వున్నది. భారతీయ భాషలకు విస్తృతమయిన పాఠకుల సంఖ్యలేదు. ఆధునిక మానవునకు జీవనోపాధి కోసము పనిచేయడములోనే ఎక్కువసమయము గడిచిపోతోంది. ఏదోకొంత సమయ విరామము దొరికినప్పటికీ ఉద్రేకపూరితమయిన రచనలు, రాగభావములతోకూడిన రచనలు అతని దృష్టిని ఎక్కువ ఆకర్షిస్తాయి. ఈ పరిస్థితి రచయితలకు, ప్రచురణ కర్తలకు కూడా సమమయిన యిబ్బందిని కూర్చేది. భారతీయ భాషలలో, సాధారణముగా వేయిప్రతులు ప్రచురిస్తారు. ఒక్కొక్కపుస్తకము అనేక పుస్తకములు పునర్ముద్రణ భాగ్యము పొందకపోగా, మొదటి వేయి ప్రతులు అమ్ముకోవడమే అతి కష్టమయిన విషయమయిపోతుంది.

భారతీయ భాషలలో రచనలుచేసే రచయితల సమస్యలను స్థూలముగా యిలా రూపొందించవచ్చును :

(1) తమ భాషలో—తమ పాఠక వర్గమును రూపొందించు కొనడము.

(2) ఇతర భాషలలో తమ పాఠక వర్గమును రూపొందించు కొనడము.

(3) పాఠకులతో నేరుగా సంబంధము యేర్పరచుకొని—క్రమముగా పుస్తక పంపిణీ విధానములోని అవ్యవస్తలను తొలగించుకొనడము.

(4) యావత్ భారతదేశము — ప్రపంచముతో సమరసముగా తమ రచనా మూర్తిని తీర్చిదిద్దుకొనడము.

(5) తమ రచనలలో సృజనాత్మకతను పెంపొందించుకొని—తమ సాహిత్య కృషికి న్యాయము చేకూర్చుకొనడము.

భారతీయ భాషలలోని రచయితలకు పాఠకుల సంఖ్య బహు తక్కువ. ప్రపంచ భాషలమాట దేవుడెరుగును, భారతదేశములోని యితర భాషల—ప్రాంతాల ప్రజలుసైతం, ఒక భాషలోని రచనలను చదువలేరు. ఆంగ్లమునకో, హిందీలోనికో అనువధించబడితే తప్ప, ఒక భారతీయ భాషారచయితయొక్క కృషి విస్తృత పరిధికి పాకి అందరి దృష్టికీ రాజాలదు. సృజనాత్మకమయిన రచనలను యితర భారతీయ భాషలలోనికి అనువదింపజేసే ప్రయత్నము కేంద్ర సాహిత్య ఎకాడమీ, ప్రాంతీయ సాహిత్య ఎకాడమీలు చేపట్టినారు. నేషనల్ బుక్ ట్రస్ట్వారు తమ ఆదాన్ ప్రదాన్ పథకమును చూపించినారు. అయితే యీ పని బహు మందకొడిగా స్వల్పముగా జరుగుతోంది. ప్రతి భాషలోను ఉత్తమ సాహిత్యమును ఎంచి, యితర భాషలలోనికి అనువదింపచేయు కార్యక్రమము అనవరతము, నిరవధికముగా జరగవలసి వున్నది. ఇది ఎప్పుడో అయిదారు సంవత్సరములకు ఒకమారు మొక్కు తీర్చుకున్నట్లుగా జరగవలసినదికాదు. ఈ కృషి మూలరచనతోపాటు — యేకకాలమందే జరిగినప్పుడే ఒక ప్రాంతపు రచయితలు, యితర ప్రాంతీయులు యేమి రాస్తున్నారనిగాని, ఒక ప్రాంతపు పాఠకులు యితర ప్రాంత రచయితల కృషియేమనిగాని—తెలుసుకుందుకు అవకాశము యేర్పడుతుంది. అంతేగాక—భారతీయ భాషలలోని రచనా వ్యక్తిత్వము పరిపుష్టముగా గోచరించటానికి యిటువంటి కృషి అవసరము. భారతీయ సాహిత్యములో భాషారచయితలకు సముచితమయిన స్థానము యేర్పడటానికి యిది వొక్కటే మార్గము.

తెలుగులో రచనచేసే ఒక కవి తన పుస్తకమును తెలుగు, ఇంగ్లీషు భాషలలో యేకకాలమందు అచ్చువేయుట యీ వ్యాసకర్త గమనించినాడు. ఈ కవి పుస్తకము తెరవడముతోటే, పాఠకునకు ఒక వయిపు పుటలో తెలుగు రచన, మరొక వయిపు పుటలో ఆంగ్ల అనువాద రచన అగుపిస్తాయి. ఈ కవి తన రచనలను తానే ప్రచురించుకుంటాడు. ఆంగ్లానువాదమూ ఆయనే చేసుకోగలడు.

అయితే యిటువంటి సదుపాయము ఎందరు రచయితలకు, ప్రచురణకర్తలకు వుంటుంది? నిజము చెప్పవలెనంటే, భాషారచయితలలో చాలామందికి ఆంగ్లభాషా పరిజ్ఞానమే తక్కువ. తమ రచనలను ఆంగ్లము, హిందీలలోనికి అనువదించుకుందుకు వారు యితరులను ఆశ్రయించవలసివుంటుంది. ప్రచురణకర్తలు యీ పరిశ్రమ అంతా అంత అభిరుచిదాయకముగా భావించకపోవచ్చును. ఇది అనేక సదుపాయములు, యేర్పాట్లు వున్నప్పుడు మాత్రమే జరుగగల పని.

భారతీయ భాషలలోని మంచి పుస్తకాలను యెన్నిక చేసేందుకు 'నిపుణుల సలహా సంఘాలు' వున్నాయి ఎకాడమీల వారికి. అయితే యీ నిపుణులు సమకాలీన సాహితీ రీతులను, గ్రంథాలను గురించి అంతగా యెరిగినవారు కాకపోవటము దురదృష్టము. సృజనాత్మకము, ప్రయోజనకరము అయిన రచనలు చేసే యువ రచయితలు వీరి దృష్టినుంచి తరుచుగా తప్పించుకుపోతారు. ఈ నిపుణుల దృష్టి చాలవరకు—స్వాతంత్ర్య పూర్వము వెలువడిన సాహిత్యముతోనే ఆగిపోతుంది. ఇటీవలి పరిణామాలు వారికి అంతగా అవగాహన కాకపోవడమో, రచించకపోవడమో, ప్రతి భాషా విషయములోనూ యదార్థము. అందుచేత వారు తమ 'ఎన్నిక'లలో 'ఎంపిక' లలో సమ దృష్టి, యదార్థదృష్టి కలిగివుండలేరు. ఉదాహరణకు, యీ సంవత్సరము కేంద్ర సాహిత్య ఎకాడమీవారికి 'తెలుగు' భాషలో ఎన్నిక చేయదగిన పుస్తకమే దొరకలేదు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడమీ వారికి 'మంచి' నవల అన్నదే దొరకలేదు. ఇవి సూచనాత్మకమయిన ఉదాహరణములు. పరిపుష్టమయిన విమర్శన, సాహిత్య సమీక్ష లేనందువల్ల సాహిత్యమునకు—అనుకోకుండానే,—నిరుద్దేశ పూర్వకముగానే — ఎంతో అన్యాయము జరుగుతుంది.

ఇటువంటి లోపములు రాకుండా, ప్రతి భాషలోను రచయితల/విమర్శకుల సమాఖ్యలు నెలకొల్పవచ్చును. సాహిత్యములోని వివిధ శాఖలలో నిష్ణాతులయినవారు యీ సమాఖ్యలలో సభ్యులుగా వుండి తమ సమయమంతను పుస్తకముల పరిశీలనకే వినియోగించు అవకాశము యేర్పడవలెను. అప్పుడు ఆ యా భాషలలో గ్రంథాల ఎంపికకు, అన్ని భారతీయ భాషలలోను జరుగుతున్న కృషి సమరసముగా నుండుటకు మార్గము యేర్పడుతుంది.

పుస్తకముల ప్రచురణ, పంపిణీలకు యెన్నో అంశములు మార్గదర్శకము అవుతున్నాయిగాని—పుస్తకముల మేలుజాతి, రచనా పాటవములోని ఉన్నతి, ప్రయోజనము లెక్కలోనికి రావడము లేదు. పుస్తకములకు ప్రధాన కొనుగోలుదారు 'పబ్లిక్ లైబ్రరీ'. దీనికి 'గ్రాంటులు' యిచ్చేది ప్రభుత్వము. పుస్తకముల పంపిణీ యే కొద్దిమంది చేతులలోనో యిరుక్కొని పోయి వున్నది. పాఠకులు తమంత తాముగా కొనుక్కొని చదివే పుస్తకముల సంఖ్య బహు తక్కువ. దాదాపు లేదనే చెప్పవచ్చును. ప్రచురణకర్త తాను యివ్వగల హెచ్చు పర్సంటేజి కమీషన్లను యెరగాచూపి, తన పుస్తకములను లైబ్రరీలకు అమ్ముకుంటారు. మామూలు పాఠకుడు, ఒకవేళ యేదయినా పుస్తకాన్ని కొనుక్కుందామని అనుకున్నా, దాని ధర అతనికి శక్తికి మీరినదిగా వుంటుంది. పుస్తక దుకాణంలో కొనుగోలు చేయడం, పాఠకునకు అసాధ్యం. అందుచేత అతడు ఆ మంచి పుస్తకము లైబ్రరీలో వుంటేనే చదువుకో గలుగుతున్నాడు. పుస్తకాల ధరలు పై చూపులకు చాల యెక్కువగ వున్నట్లు కనిపిస్తాయి. అయితే పుస్తకం తయారు చేయటానికి అయిన ఖర్చు ప్రకటించిన ధరలో నాలుగవ వంతు మాత్రమే. ప్రకటిత ధరలోని మూడువంతుల భాగము కమీషను యేజంట్లు, మధ్య వర్తులు, దుకాణదారులు, పబ్లిషరు పంచుకుంటారు. చివరకు—పబ్లిషరుకు సైతం తాము ప్రచురించిన అన్ని ప్రతులు అమ్ముడు పోయేసరికి పదిహేను శాతం మాత్రమే నికరాదాయంగా మిగులుతుంది. అంటే పుస్తకం ప్రకటిత ధరలో నూటికి అరవై వంతులు పుస్తక పంపిణీదారులు, లైబ్రరీలు, మధ్యవర్తులు అనుభవిస్తున్నారన్న మాట. ఈ రకమయిన 'మధ్యవర్తిత్వం' లేక పోయి నట్లయితే ప్రతిపుస్తకాన్ని దాని ప్రస్తుత ప్రకటిత ధరలో నలభై శాతమునకు మాత్రమే విక్రయించే వీలువున్నది. పుస్తకముల ప్రతులు అన్నీ అమ్ముడు పోతాయని గ్యారంటీ వున్నప్పుడు, యీరకంగా అతి తక్కువ వెలకే చదువరులకు పుస్తకాల పంపిణీ చేయగల అవకాశం వుంది. అయితే పుస్తక ప్రచురణ, పంపిణీ, యిటువంటివన్నీ, అనారోగ్యమయిన విధానాలలో చిక్కుకు పోయినందువల్ల — యీ చిక్కులను విడదీయడం ఒకంతట సాధ్యం కాదుగనుక—రచయితకు తన పాఠక వర్గాన్ని యేర్పరుచుకుందుకు వారికి నేరుగా తన పుస్తకాలను అందచేయ గలందులకు ఆటంకం యేర్పడుతోంది. రచనలోని విశిష్టత తప్ప యితరకారణాలు యేవో పుస్తక ప్రచారానికి దోహదం చేస్తూ వుండి పోతున్నాయి. ఈ కారణాలవల్ల రచయితలు కూడ తమకు యిష్టం లేకపోయిన చౌకబారు పుస్తకాలు, అప్రయోజనకరమయిన పుస్తకాలు వ్రాయవలసివస్తుంది. మేలు జాతి రచయిత అంటరానివాడుగా, ముట్టరానివాడుగా మిగిలిపోవలసి వస్తోంది. వరదలో కొట్టుకుపోకుండా మిగిలిపోవడం అసాధ్యం అయిపోతోంది. పాఠకుల దృష్టిని ఆకట్టుకోవడం, సమాజపరంగా తన బాధ్యతను నిర్వర్తించుకోవడం రచయితకు అసాధ్యం అయిపోతున్నాయి. సెక్సు, క్రైమ్ పుస్తకాలకు వున్న గిరాకీ సామాజిక సమస్యలనుకథావస్తువుగా తీసుకు వ్రాసిన నవలలకు లేదు. పాఠకులు తప్పనిసరిగా చదువవలసిన పుస్తకాలు—ప్రచురణకర్తల బీరువాలలోనే వుండిపోతున్నాయి. లేక రచయిత దగ్గరే వ్రాత ప్రతి రూపంలో మురిగిపోతున్నాయి. రచయిత, ప్రచురణకర్త తమ సాంఘిక బాధ్యతలను మరింత నిక్కచ్చిగా గుర్తించి అవలంబించదలచుకుంటే తప్ప మరొక మార్గం లేదు, యీ పరిస్థితినుంచి బయట పడటానికి.

సాహిత్య ఎకాడమీలు, నేషనల్ బుక్‌ట్రస్ట్, పబ్లికేషన్ డివిజన్ యిటువంటి సంస్థలు ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి—సాధికారంగా తయారుచేసిన పుస్తకాలు లక్షల విలువలుకలవి అమ్ముడు కాకుండా బీరువాలలోనే వుండిపోతున్నాయని, ప్రతి సంవత్సరమూ—'పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ' లేక 'ఆడిట్ కమిటీ'ల విమర్శ మనను వార్తా పత్రికలలో చూస్తూనే వుంటాము. ప్రభుత్వ పరమయిన

గ్రంథాలయాలు, కాలేజీ, హైస్కూలు గ్రంథాలయాలు 'మంచి' పుస్తకాలు మాత్రమే కొనడానికి నిర్ణయం తీసుకుంటే యిటువంటి విపత్కరపరిస్థితి యెందుకు కొనసాగాలో అర్థంకాదు. ప్రతి గ్రంథాలయము యేవో పుస్తకాలు కొంటూనే వుంటుంది. కాని యీ పుస్తకాల ఎంపిక సక్రమమయిన పద్ధతిలో వున్నదో లేదో అనుమానము. ప్రభుత్వ సహాయ సహకారాలతో ప్రచురిత మయ్యే పుస్తకాల సంగతే యిలా వుండగా, ప్రయివేట్ రంగంలోని ప్రచురణ కర్తలు తమ 'మంచి' పుస్తకాలు అమ్ముకుందుకు యెంత శ్రమపడవలసి వస్తుందో, వారి యిక్కట్లు యింకెన్ని విధాలుగా వుంటాయో ఊహించవచ్చును.

'చదువ దగిన పుస్తకం' అని నిపుణులు ముద్ర వేసిన తర్వాత, ఆ పుస్తకం అమ్మకం విషయంలో ప్రచురణ కర్త గ్రంథకర్తలకు యేమీ యిబ్బందిలేకుండా యేర్పాటు జరిగి పోవాలి. విపరీతమయిన లాభాలు అవసరం లేదుగాని అచ్చయిన ప్రతులనయినా సునాయాసంగా త్వరితగతిని అమ్ముకుందుకు యేదోమార్గం వుండి తీరాలి. మంచి పుస్తకాలు కేవలం వ్రాతప్రతి రూపంలోనే వుండిపోకుండా యేదో పద్ధతి కనిపెట్టాలి.

భారతీయ భాషలలోని రచయితలకు తరుచుగా యిబ్బంది కలిగించే పరిస్థితి మరొకటి వుంది. పుస్తకముయొక్క ప్రమాణము, మంచితనము, ప్రయోజనము నిర్ణయించే కొలతబద్ద లేదు. బాగ డబ్బులు చేసుకున్న పుస్తకమే మంచి పుస్తకం అని పేరు పడిపోతుంది. 'పుస్తక సమీక్ష', 'సాహిత్య విమర్శనము' పకడ్బందీ అయిన పద్ధతిలో లేవు. రచయితకు, ప్రచురణకర్తకు పాఠకునకు మధ్యవర్తిగా — పరిచయకర్తగా — రూపొందవలసిన 'పుస్తక సమీక్ష' యింకా అదృశ్యరూపంలోనే వున్నది. భారతీయ భాషలలోని పత్రికలు ఎక్కువ జాగాను సమీక్షలకు వినియోగించ లేకపోతున్నాయి. పుస్తక ప్రచురణ అయిన ఆరునెలలకు సమీక్ష జరుగుతుంది. లేక అసలు జరగనే జరగదు. పుస్తక సమీక్షలకే పరిమితమయిన పత్రికలు అసలు లేనేలేవు. ఇటీవల హిందీలో ఒకటి, ఆంగ్లంలో ఒకటి—యిటువంటి పత్రికలను యీ వ్యాసకర్త గమనించగలిగాడు. భారతీయ భాషలలో యిటువంటి పత్రికల అవసరం, ప్రయోజనం ఎంతయినా వున్నది.

అంతేగాక, భారతీయ భాషలలో రచయితల (వర్ధమాన) సౌకర్యార్థం వర్క్‌షాపులు, ప్రయోగశాలలు, శిక్షణ కేంద్రాలు లేవు. పుస్తకాలు ఎడిట్ చేయడం, ఇండెక్స్ తయారుచేయడం, సంగ్రహప్రతులు తయారుచేయడం—యిటువంటి అనుబంధ ప్రక్రియలలో ప్రతి రచయితకూ తగినంత శిక్షణ అవసరం. వీటితో పరిచయంలేని రచయిత ఎక్కువ ప్రయోజనకారి కాజాలడు.

సాహిత్యము మానవాళియొక్క ఉన్నతికి ఉపయోగపడవలసి వున్నది. రచయితకు తన పాఠకులపట్ల, సంఘముపట్ల బాధ్యత ఉన్నాయి. సాహిత్యములోని అనేక శాఖలు ఒక దానికొకటి ఒదిగి సమరసముగా పనిచేయాలి. ప్రస్తుతము యీ శాఖలకు వైరుధ్యమే యెక్కువగా ప్రచారములో వున్నది. ఉదాహరణకు ప్రబంధ కవిత, వచన కవిత. రచయిత తన భావములను ప్రకటించటానికి తగిన ప్రక్రియను అవలంబించి అందులో కృతకృత్యుడవుతాడు. ప్రక్రియ యేదయిన దానికి సమాన గౌరవము యివ్వవలె. సాహిత్య ప్రక్రియలలో ముఖ్యమయినదిగా ఎక్కువ ప్రయోజనాత్మకమయినదిగా రూపొందిన 'కథానిక'ను గురించి యింకను అనేక రచయితలకు చిన్నచూపు వున్నట్లే కనిపిస్తుంది. ఈ సాహిత్య రూపాల నన్నిటినీ సమదృష్టితో చూడగలిగి—వాటికన్నిటికీ సమగ్రమయిన రూపకల్పన చేసేందుకు రచయిత దోహదం చేయవలసి వున్నది., ఇది రచయితయొక్క ప్రధానమయిన బాధ్యత. దీనిని గుర్తించని రచయిత తన పాత్రను చక్కగా నిర్వహించినాడని చెప్పలేము. ఈ బాధ్యత కేవలము మాటలలో వ్యక్తము చేసినందువల్ల తీరిపోయేదికాదు. తన రచనలలో ప్రతిబింబము కానలెను. రచయితకు ఒకవిధమయిన కట్టుబాటు అవసరము. పైవారు నియమించిన కట్టుబాటు కాదుయిది. రాజకీయ పరమయిన నిబంధన కాదు. తనకు తానే సామాజికముగా నియమించుకున్న తీరు యిది. రచయిత తన కృషిలో క్రమముగా ఎదుగుతాడు. తన సమాజముతో పాటు పైకి ఎదుగుతాడు. ఏది ఏమయినా, రచయిత తన తోటి మానవులకు చెప్పవలసినది, తెలివిడి చేయవలసినది యేదో వున్నది. దీనిని సరళమయిన హుందా అయిన మార్గములో చెప్పగల అవకాశమును అతనికి యివ్వవలసి వున్నది.

(ఆథర్స్ గిల్డ్ ఆఫ్ యిండియా—న్యూఢిల్లీ ఆధ్వర్యమున జరిగిన మూడవ కన్వెన్షన్‌లో 12—3—77న చదువబడినది)



కేఎస్వీ

క్షోభ (అధివాస్తవికవితా నరకం)

నన్ను నేను రాసుకుంటున్నా
బంతిలా భూగోళంలా గిరగిరా గిరగిరా
చండప్రచండంగా తిరిగిపోతూ
రగిలిపోతూ ఊహల చుక్కల ఆకాశ పొట్లాలు పిగిలిపోతూ
దిగులు దిగులుగా చూస్తున్నాయి
చిన్నప్పుడు నే చూసిన చెట్లు
హార్స్లీ హిల్స్ యూకలిప్టస్ మంచు వెలిబూదిలా తెల్లగా
దిగుతూ దిగుతూ సాగుతూ
హాయ్ ఏదీ ఎర్రస్వెట్టర్? ప్రేమించకు
జగమేమాయలు చచ్చిపోతాయి
డ్రామాలకు తెరలు దిగిపోతాయి
చప్పట్లు చరిచే చేతులకూ రైల్వేలైన్లు దాటే కాళ్ళకూ
అనుభూతి తెలుస్తుందని గుర్తుంచుకుంటే చాలు
విన్నావా విన్నావా మహమ్మదీయుడిలా
ఒకచేత వృద్ధగ్రంథం మరోచేత విచ్చుకత్తి—
ఇది నా హృదయం ఇది నీ మరణం
హృదయమా మరణమా ఏది కావాలి నీకు
మతాన్నిలా అలా ప్రేమను ప్రేమిస్తే
ప్రేమించు అంతేగాని
జగమే మాయలు ప్రేమించకు
వెచ్చీ వెచ్చనీ పచ్చనీ ప్రకృతీరాళ్ళు బర్న్ట్ సియెన్నా
వియెన్నాలోనన్నా కలుద్దామా
వియెన్నా వియల్లోకమే అయితే
చావు మూర్ఖుడా చావు డెన్మార్క్ యువరాజు చేతిలో
అడ్డొచ్చే విదూషకుడా!
మైకంగా మైయ్‌కొయ్‌వ్‌స్కీలా శ్రీస్కీలా రేగిన దువ్వని
జుత్తుతో
సీసామీద సీసా మీదసీసా
ఘోరంగా దూరంగా హత్య—జీవహత్య
టైరుకింద పువ్వునలిగి మూల్గే వాసనల రక్తం
ఆ రక్తం పసుపు పసుపు పసుపు పచ్చగా
పువ్వుల రక్తం! తండ్రీ—రక్షించు—
నవ్వే నవ్వుకునే నవ్వించే భావుకుల్ని వురి తియ్యండి
హంసల వేషాలేసుకుని డేగలెగిరొస్తాయి జాగ్రత్త
కరెన్సీ నోట్ల సవ్వడికే మువ్వలు మ్రోగుతాయి జాగ్రత్త
కాని
కరెన్సీ నోట్ల సవ్వడికి సువ్వాలు పలకవు కిలకిల మనవు
జాగ్రత్త జాగ్రత్త జాగ్రత్త

* * *

మ్రోగే గంటకీ గంటకీ మధ్య
రేగే మంటల్లోంచి నిమిషాల పొగలూ క్షణాల సెగలూ
ఆవిరైపోతోంది రక్తంలో జీవశక్తి
రక్షించే వారెవరూ లేరు
మము బ్రోచేవారెవరూ రారు
తులసి కోటలనుకుంటే అవి సమాధులు
గుడ్లగూబలైనా లేవు దిక్కుమాలిన శ్మశానంలో
మల్లెలలాగూ వుండవు జిల్లేళ్ళూ లేవు
వరిపరకల అంచులపై మెరిసే హిమబిందువేది?
లేదు లేదు ఏమీలేదు
అసందర్భం
అబ్సర్డ్
వెర్రిగా
గ్రహ గోళాల ఈ తిరుగుడు
నవ్వే పుర్రెగా
జాజి సీసా నిండుగా గాజురేకులు దట్టించి
ప్రసాదులో బల్లిమాంసం భోగట్టా విని
నమ్మకస్థుడైన మా నౌకరు చచ్చిపోయాడని నమ్ముతా
రేగే మంటకీ మంటకీ మధ్య
మ్రోగే మంటలు
చావూ బ్రతుకూ చావూ బ్రతుకూ అంటూ
గంటలా మంటలా అవి నా
గుండెలే అనుకుంటూ
(రేగేట్టూ మ్రోగేట్టూ కొట్టుకుంటూ)

* *

నడిస్తే నలిగిపోయే నడుముల్లో
రేపటి పాపలు నలిగిపోతున్నారు
రేపటి పాపల పాపల పాపలు కదిలిపోతున్నారు
ఆ పాపల ఏ రేపుల్లోనో విచ్చుకోబోయే కనుపాప
చూడబోయే పాపాలు
చేయబోయే పాపాల చేతులు
విచ్చుకుంటాయిలే అని వణికిపోతున్నాను పారవశ్యంతో

పికాసో బెలూన్ల వేళ్ళు
కదలవు ముడుచుకోవు బిగించవు పిడికిలి
ఆముదపు దీపాల ఆత్మశాంతి ఎక్కడ ?
అంతా విద్యుత్తు జగమంతా జలవిద్యుత్తు
రేపటి పాపల బొడ్డులో తామరల్లేవు అంతా బురద
బురదే
పుట్ట పొట్టలోంచి గడ్డంవాడు ధ్యానించాడా భావించాడా
మానిషాదం
సామగానం లౌడ్ స్పీకర్లలోంచి వికృతాతి వికృతంగా
సినీతార లాడుతున్నారు స్టేజిమీద
కృష్ణదేవరాయల సార్వభౌమత్వం గోదాదేవి తలవెంట్రుకలమీద
దాయిదాయిదా యశోదా నందనా
గిరజాల శాకూరు సుమిత్రా నందనా
వానా వల్లప్పా వానలో నవ్వేది వేదనా
అంత్యప్రాసల్లో సత్యశోధనా ఇది వినా
వినాశం వేషం వేసిన ఉన్మాదం
వికారుణ్ణి ప్రేమించిన డెస్టిమోనా
పాపలు పాకి ఎదుగుతారు పాపాల్లోకి
జలపాతాల సంగీతం దూకుతుంది లోయల్లోకి
ఎవర్‌గ్రీన్ హీరోలంతా ఒకాసా వాడతారు
కాళిదాసు శాకుంతలంలో షేక్స్పియర్ దుష్యంతుడివేషం
వేస్తాడు
నడిచే నలిగిపోయే నడుములు తీగలు కానేకావు అవి
చింత మొక్కలు
చింతింపజేసే మొక్కలు

★ ★ ★

పుచ్చిన బియ్యంలా రాలుతున్న వెన్నెల్లో లిప్‌స్టిక్ పెదవుల్లా పువ్వులు పేడెడ్ బ్రాలు తొడుక్కున్న కొండలు పరుగెత్తు పారిపో పారిపో అల్పుడికి ఐశ్వర్యం వొస్తే అర్ధరాత్రి గాగుల్స్ తెమ్మంటుంది నీ గుండెలు తరిగి లోలక్కులు చేయించుకుంటుంది అల్పుడికి ఐశ్వర్యం—రాబోతుందని తెలియగానే— లోకంలో అందగత్తెల సౌందర్యాన్ని ముద్దజేసి అండర్‌వేర్‌తో కప్పాలనుకుంటాడు ఒకటిలో మూడు పోయాయి ముక్కాలిపీటలు కాలు విరిగి పదండి ముందుకు అన్లేకపోతాయి వాతాయనం అంటే వాత్స్యాయనుడు తొంగిచూసే రంధ్రం శిలీంధ్రం అంటే తెలీక విశాలాంధ్రలో చూసి కొడవలి తెగి హాస్పిటల్‌కి ఎగిరిపోయాడు.

మబ్బుల్లో దర్బార్లో
వాడే నవాబు
వాడొక్కడే పథికుడు

ఇంద్రుడిదా ఖర్మ—వాళ్ళంతా పీడీలే—బీడీలు కాల్చని తిలక్ నశ్యం పీల్చాడు పాపం—బిగుతైన దిండు గలీబులు మగువలకెంతో హాయిగొల్పును

దాయి దాయిదా
మళ్ళీ వెయ్యొద్దు వాయిదా
అంత్య ప్రాసతో ఏం ప్రాయిదా
కామపురానికి బిలమార్గం అదా యిదా

★ ★

మాటలు నేర్వకే కన్నుమూసిన శిశువు
చూడలేకపోయిన లోకమెంత? పొందలేని
ఆనందమెంత? కార్చలేని
కన్నీళ్ళెన్ని?
ఆటవికంగా బ్రతికేదాం
తేనెలు తాగుతూ అమాయకత్వంతో వూగుతూ
వస్త్రాల బిగింపులు తెలియని పొలిండ్లలో!
సృష్టి మమతాను రాగాల్ని తిలకిస్తూ
గడిపేద్దాం నరుగుడు చెట్లకింద
నడుస్తూనో అరుస్తూనో పొర్లుతూనో దొర్లుతూనో
బెజవాడ కనకదుర్గ కళ్ళలో
అభయముంది భయపెడుతూ
కొండవెనుక సూర్యాస్తమయాలు
కృష్ణలో ముఖం చూసుకుంటూ
జంటగా నువ్వుంటే కృష్ణలోకైనా సరే
—జంటలమధ్య బారేజీ వ్యారేజీ
వొద్దులెద్దూ
కనకదుర్గ సాక్షిగా అన్నాగా—
ఫ్రయారిటీ డైనేమిజ్ కృష్ణా
ఎన్ని రంగుల్ని ఎంత వెలుతుర్ని
అలల చేతులమీద ఎత్తెత్తి అవతల పారేసిందో
కలవుగదా జీబ్రా క్రాసులు బెజవాడనందు
శంతనవుడు భీష్ముండు ప్రశాంతుడు తత్క్రతువు
జూచి సంతుష్టుండై
కాఫీహోటెల్‌లో కిచెన్‌మాత్రం చూడకు
చచ్చిపోయి పుట్టిన శిశువు చూడని లోకం
ఉచ్చరింపబడని రుషి శాపం

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

వ్లాడిమర్ నబొకొఫ్

రష్యాలో జన్మించి, ఇంగ్లండులో ఫ్రెంచి సాహిత్యాన్ని అధ్యయనం చేసి, జర్మనీలో 15 సంవత్సరాలు గడిపి, చివరకు అమెరికాలో స్థిరనివాస మేర్పరచుకొని అమెరికన్ నవలా రచయితగా ప్రఖ్యాతి చెందిన 'వ్లాడిమర్ నబొకొఫ్' 1977 జూలై నెల రెండవతేదీ స్విట్జర్లండ్‌లో 78వ ఏట అస్తమించాడు. ఆంగ్లభాషలో ఆధునిక నవలా రచయితల్లో అగ్రశ్రేణికి చెందిన 'నబొకొఫ్' ఆస్థానాన్ని ఆక్రమించడం 1955లో 'లొలిత' (Lolita) నవలను ప్రచురించిన తర్వాతే జరిగింది. 'లొలిత' విమర్శకుల్లో, సాహితీవరుల్లో వాద ప్రతివాదాలు రేపింది. లయొనెల్ ట్రిల్లింగ్ వంటి అగ్రశ్రేణి విమర్శకుడు 'లొలిత'ను కళాసృష్టిగా అంగీకరించి, సమర్థించడంతో అది అసభ్య సాహిత్యంగా బహిష్కరింపబడే ప్రమాదంనుంచీ తప్పించుకున్నది. దూషణ భూషణ తిరస్కారాదులు ఎలా చెలరేగినా 'లొలిత' అమెరికన్ జీవన సరళిని ప్రతిఫలించడంలేదనిగాని, అమెరికన్ జీవితాన్నీ అమెరికనులనూ దుమ్మెత్తిపోస్తున్న రచన అని గాని ఎవరూ నిందారోపణ చెయ్యలేదు. 'లొలిత' అచ్చమైన అమెరికన్ నవల కావడమూ, అమెరికన్ జీవన వద్ధతిలోని కొన్ని అప్రశుతులను ప్రతిభావంతంగా ఎత్తిచూపడమూ, భాషలో, శిల్పంలో, కథాసంవిధానంలో రచయిత సాధించిన కళాపరిపూర్ణత, ధ్వనించిన మానవతా దృక్పథమూ సాహిత్యాభినివేశంగల సహృదయుల నందరినీ ముగ్ధులను చేసింది. 'లొలిత' తర్వాత 'నబొకొఫ్' ఎన్నదగిన నవలలు వ్రాశాడు. ఆయన శిల్పంలో ప్రయోగాలుచేసి చాల గడుసు పోకడలు పోయాడు. ప్రపంచ నవలా రచయితల్లో తన స్థానాన్ని శాశ్వతం చేసుకున్నాడు; కాని 'నబొకొఫ్' ఎప్పటికీ 'లొలిత' సృష్టికర్తగానే పాఠకుల స్మృతిలో మెదలుతాడు.

'నబొకొఫ్' 1899 ఏప్రిల్ 23వ తేదీ సెంట్ పీటర్స్‌బర్గ్‌లో కులీన కుటుంబంలో జన్మించాడు. భోగభాగ్యాలతో, చదువు సంస్కారాలతో పూర్వంనుంచీ రాజ్యవ్యవహారాల్లో ప్రముఖపాత్ర వహించిన కుటుంబం కావడంతో 'నబొకొఫ్' బాల్యంనుంచీ పాశ్చాత్య (ఇంగ్లీషు, ఫ్రెంచి) సంస్కృతి ప్రభావంలో పెరిగాడు. ఇటలీ, స్విట్జర్లండు, ఫ్రాన్సు, ఇంగ్లండు దేశాల్లో తల్లిదండ్రులతో విలాసయాత్రలు చేసి వస్తూండటమే కాదు, చిన్నతనంనుంచీ ఇంగ్లీషు నర్సులూ, గవర్నెస్‌లూ, (ఇంట్లో ఉండి పిల్లలకు చదువు చెప్పే పంతులమ్మలు) 'నబొకొఫ్'కు ఇంగ్లీషు నేర్పేవారు. ఫ్రెంచి, రష్యన్ భాషలు నేర్పేపంతులమ్మలు వేరుగా ఉండేవారు. 'నబొకొఫ్'కు ఇద్దరు తమ్ముళ్ళూ, ఇద్దరు చెల్లెళ్ళూ. ఆదర్శప్రాయులైన తల్లిదండ్రులు. 'ఆదర్శ ప్రాయు' లని అనడం ఎందుకంటే 'నబొకొఫ్' వ్రాసిన స్వీయచరిత్ర (స్పీక్, మెమొరీ) పుస్తకంలో తన బాల్యాన్నీ, యౌవన ప్రథమావస్థ అనుభవాల్నీ విపులంగా చిత్రించడంలో ఆ తల్లి దండ్రుల చిత్రణ స్పష్టంగా ఉండటమేకాక, 'నబొకొఫ్' ఎంతటి స్వేచ్ఛాపూరితమైన వాతావరణంలో పెరిగాడో మనకు చక్కగా అవగతమౌతుంది. వనాల్లో అడవుల్లో సీతాకోక చిలుకల్ని వెంటాడి పట్టుకొని రకరకాల జాతుల్నీ సేకరించడం 'నబొకొఫ్' చిన్నతనంనుంచీ జీవితాంతం కొనసాగించిన హాబీ. చివరకాయన అందులో అపారమైన శాస్త్రజ్ఞానం సంపాయించాడు. అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో జీవశాస్త్రంలో సీతాకోక చిలుకల్ని గూర్చిన ప్రత్యేక విభాగపు ప్రొఫెసర్‌గా పని చేశారు. ఆయన సేకరించిన రెండు అపూర్వమైన కీటక రకాలకు ఆయనపేరు కూడా పెట్టారు. అవి అమెరికా ప్రకృతి శాస్త్ర ప్రదర్శనాలయంలో భద్రపరువబడ్డాయి కూడా. అటువంటి స్వేచ్ఛా వనవిహారి 'నబొకొఫ్' యించుమించు పదకొండవ ఏటనుంచే ఆడపిల్లలతో స్నేహం చెయ్యడమూ, వారిపట్ల ప్రత్యేక ఆకర్షణా అనురాగం పెంపొందించుకోవడమూ జరిగింది. లూయిజా, పోలెంకా అనే బాలికలు మొదటివారు. పదిహేనవయేట కవిత్వం, యింగ్లీషు కవిత్వం అల్లడం ప్రారంభించాడు. అదంతా ప్రేమ కవిత్వమే. **(My elegy dealt with the loss of a beloved Mistress– Delia, Tamara or Lenore - whom I had never lost, never loved, never met but was all set to meet, love, lose)**[1] పదహారవఏట 'తమారా'అనే పదిహేనేళ్ళఅమ్మాయి ప్రేమలో పడ్డాడు నిజంగానే. **(I took my adorable girl to all those secret spots in the woods, where I had day dreamed so ardently of meeting her, of creating her. In one particular pine grove every thing fell into place, I parted the fabrice of fancy, I tasted reality.)**[2] ఇక్కడ గమనించవలసిం దేమిటంటే, ఆ రోజుల్లో 'నబొకొఫ్' తన ప్రేమ కవిత్వాన్ని తల్లి దగ్గరకు పరుగెత్తికెళ్ళి, వేళాపాళా లేకుండా, వినిపించేవాడు. ఒకనాటి రాత్రి ప్రొద్దుపోయి షికారునుంచీ తిరిగివచ్చి అప్పటికప్పుడు తను అల్లిన పద్యాలను తల్లికి నివేదించడానికి వెళ్ళడమూ, ఆమె కొనసాగా 'భేష్, చక్కగా ఉంది, బావుంది' అంటూ విని, చివర అతని చేతికి అద్దం ఇవ్వడమూ, అందులో తన బుగ్గమీద దోమ చచ్చిన రక్తపు మరకా, పాలిపోయిన ముఖమూ వగైరా చూచుకొని 'నబొకొఫ్' సిగ్గుపడటమూ విపులంగా వర్ణించాడు. తల్లికి 'నబొకొఫ్' చేష్టలు సర్వమూ తెలుసు. కాని ఎక్కడ ఎప్పుడు మందలింపు అవసరమో కూడా తెలుసు. అందుకే ఆమె 'ఆదర్శ మాతృమూర్తి'

అని భావించడం. ఇక తండ్రి సంగతి. ఆయన జార్ చక్రవర్తి నిరంకుశ పరిపాలనలో లిబరల్ మేధావి వర్గానికి ప్రాతినిధ్యం వహించిన న్యాయవాదీ, రచయితా. న్యాయశాస్త్రంలో లెక్చరరుగాఉంటూ జారిస్ట్ పోలీసులను విమర్శిస్తూ వ్రాసిన వ్యాసానికి ప్రభుత్వ ఆగ్రహానికి గురై, న్యాయశాస్త్రపు పట్టా ప్రభుత్వం రద్దు చేయగా, నిరంకుశత్వాన్ని ఎదిరించే రాజకీయ నాయకుడుగా రూపొందిన ఈ స్వాతంత్ర్య ప్రియుడు 1906 లో మొదటి రష్యన్ పార్లమెంటుకు ఎన్నికై, జార్ పార్లమెంటును రద్దు పరచినప్పుడు 1908 లో జైలు శిక్ష అనుభవించాడు. 1914 ప్రపంచ యుద్ధంలో సైన్యంలోచేరి 1917–18 లో రాజ్యాంగ సభకు ఎన్నుకోబడి, బోల్షెవిక్ విప్లవకారులచే అరెస్టు చెయ్యబడి, లిబరల్ అయినా భూస్వామ్య వర్గానికి చెందినవాడు కావడంవల్ల 1919లో ప్రవాసియై, 1922లో బెర్లిన్‌లో ఉపన్యసిస్తూ యిద్దరు రష్యన్ ఫాసిస్టుల చేత హత్య చెయ్య బడ్డాడు. తండ్రి స్వచ్ఛంద ప్రవృత్తీ, సచ్ఛీలమూ, స్వేచ్ఛాప్రియత్వమూ 'నబొకొఫ్' మీద చెరగని ముద్ర వేశాయి. నిందారోపణము చెయ్యడమూ, తెగనాడటమూ, జీవితంలో పడ్డ కష్టాలకూ, పోగొట్టుకున్న భోగభాగ్యాలకూ మనః ప్రవృత్తిలో 'చేదు' నింపుకుని దాన్ని నిరంతరం అభివ్యక్తం చేస్తూ ఉండటమూ తండ్రికొడుకుల ప్రకృతిలో మచ్చుకైనా కానరాదు.

1918లో 'నబొకొఫ్' పందొమ్మిదేళ్ల నవయౌవనంలో, ప్రకృతి–ప్రేమ –కవిత్వం అనే మూడింటి ప్రభావంలో, స్వప్నం వంటి జీవితానుభూతి పొందుతున్న సమయంలో ఆ స్వప్నం తటాలున ముగిసింది. **(That summer of 1918, a poor little Oasis of miraged youth)** [3] రష్యానుంచి 'నబొకొఫ్' కుటుంబం అన్నీ వదలుకుని దేశాంతర గతులయ్యారు. అన్నీ వదలుకోవడంలో ఆస్తిపాస్తులూ వగైరాకంటె అమూల్యమైనవి ఏవో, 'నబొకొఫ్' యిలా అంటాడు: "తమారా (ప్రియురాలు), రష్యా, ఆ అడవులూ వనాలూ, బర్చ్, ఫర్ చెట్లూ, మా అమ్మ కాళ్ల చేతులావంగి భూమిని ముద్దెట్టుకునే దృశ్యం, వీటిని విధి ఒకనాడు ఆదరా బాదరా మూటకట్టి సముద్రంలోకి గిరవాటు వెయ్యడంతో, నేను నా బాల్యంనుంచీ ఖండింప **(Severed)** బడ్డాను."

తన 48వ ఏట వ్రాసిన 'స్వీయ చరిత్ర స్మృతులు'**(Speak Memory Biography Revisited)** గ్రంథంలో ఆయన ఒక ఆశను వ్యక్తం చేశాడు. "మళ్ళీ ఆ పరిసరాలను ఇప్పుడు దర్శిస్తే ఎట్లా వుంటుందో నేనూహించుకో లేక పోతున్నాను. దొంగ పాస్‌పోర్టుతో వెళ్దామా అనిపిస్తూంటుంది ఒక్కోసారి. మారుపేరుతో అలాచెయ్యడం సాధ్యమే. కాని నే నెప్పటికీ ఆలా చెయ్యలేనను కుంటాను"[4] 'నబొకొఫ్' వ్యక్తివైశిష్ట్యమూ, జీవిత విషాదమూ ఇందులోనే ఉన్నాయి.

వలయాంతర్గత వలయాలుగా చుట్టుకొని పైకి లేచే స్వభావంగల 'స్ప్రింగు' తో జీవితాన్ని ఉపమించాడు 'నబొకొఫ్'. అందులో వ్యక్తి ఆజన్మ వాసనల్లోగతానుగతికంగా పరిభ్రమిస్తూనే విముక్తి పొంది పైకివెళ్ళే అవకాశంకూడా ద్యోతక మౌతున్నది అంటాడు. **(The spiral is a spiritualized circle. In the spiral form, the circle, uncoiled, unwound, has ceased to be vicious, it has been set free)**[5]. 'నబొకొఫ్' తన అరవైఏళ్ళ జీవితాన్ని హెగెల్ పద్ధతిలో గతి తార్కికంగా **(dialectical)** విశ్లేషించి — మొదట, రష్యాలో గడిపిన ఇరవై ఏళ్ళూ 'థెసిస్' గానూ, పశ్చిమ యూరప్‌లో గడిపిన ఇరవై ఏళ్ళూ 'ఆంటి థెసిస్' గానూ, అమెరికాలో గడిపిన చివరి ఇరవై ఏళ్ళూ 'సింథెసిస్' గానూ పేర్కొన్నాడు. ఇవి మూడు వలయాలు. **(A colored spiral in a small ball of glass, this is how I see my own life. The twenty years I spent in my native Russia (1899-1919) take care of the thetic arc. Twenty-one years of voluntary exile in England, Germany and France (1919-40) supply the obvious antithesis. The peried spent in my adopted counry (1940-60) forms a synthesis — and a new theesis.)**[6] 'లోలిత' మొదలైన నవలలు చివరి యిరవై ఏళ్ళ కాలానికి (సింథెసిస్) చెందినవి. వీటిలో పరిణతి చెందిన 'నబొకొఫ్' రసానుభూతి, మేధాప్రవృత్తీ ఆయన వ్యక్తివైశిష్ట్యపు ముద్రతో కళా స్వరూపాన్ని పొందాయి. 'లోలిత' లో రసానుభూతి ద్వారానూ, 'పినిన్' **(Pnin)** 'పేల్ ఫైర్' **(Pale fire)** నవలల్లో మేధాప్రధానమైన ప్రహేళికా రచన ద్వారానూ 'నబొకొఫ్' వాసనా పరంపరనుంచీ విముక్తి మార్గాన్ని అన్వేషించి, లక్ష్యసిద్ధి పొందాడనడం సత్యదూరం కాదు.

1935 ప్రాంతాల బెర్లిన్‌లో ఉంటూ నాజీ వ్యవస్థ రూపొందుతున్న సమయంలో వ్రాసిన నవల పేరు 'శిరచ్ఛేదానికి పిలుపు' **(Invitation to a Beheading)** 'నబొకొఫ్'సాహిత్యం ద్వారా సాగించిన అన్వేషణకు ఇది ఒక తార్కాణ. ఆ అన్వేషణ బాల్యంనుంచీ ఒకటే—సౌందర్యము, ప్రేమ, స్వేచ్ఛ. మొదటి యిరవై ఏళ్ల జీవితంలో వీటిని పుష్కలంగా అనుభవించి, తరువాతి యిర్వై ఏళ్ళ ప్రవాసంలో వీటికి కరవై అన్వేషించి, చివరియిరవై ఏళ్ళలో సాహిత్య తపస్విగా వాటినే రసానుభూతి రూపంలో పొందగలిగాడు 'నబొకొఫ్'. ప్రవాసకాలానికి చెందిన ఈ 'శిరచ్ఛేదం' నవలలో ఎంతో వ్యంగ్యం దాగివున్నది. కథ స్వల్పం. సిన్‌సిన్నాటస్ అనే వ్యక్తికి ఉరిశిక్ష విధించారు. కారణం అస్పష్టం. సంఘానికి ప్రమాదకరమైన వ్యక్తిగా తేల్చారు. అంతే.[7] సిన్‌సిన్నాటస్ అందుకు విచారపడడు. ఏ రోజున శిరచ్ఛేదమో తెలీకపోవడం అనే అనిశ్చిత పరిస్థితిలో ఉండే అతని దుర్భర ఆవేదనని చిత్రిస్తుందీ నవల[8]. ఇందులోని శిల్పం కాఫ్కానవలల్ని జ్ఞప్తికి తెస్తుంది. సిన్‌సిన్నాటస్ పరిస్థితి మౌలికంగా ప్రతి మానవుని పరిస్థితినీ ప్రతిబింబిస్తుంది. చావు అనేది ఎప్పుడు వస్తుందో తెలిసినట్లయితే చాల వ్యవహారాలూ జీవితాలూ యింత అసంగతంగా, అయోమయంగా, అర్థ రహితంగా ఉండవేమో! నవల ముగింపు గొప్పగ ఉన్నది. కొన్ని దేశాల్లో ఈ శిక్షను బహిరంగంగా అమలు జరుపుతారు. దాన్ని చూడటానికి జనం తిరునాలకుమల్లె వస్తారు.

అందుకే నవల పేరు పిలుపు లేక ఆహ్వానము అని. అంటే చోద్యం చూడటానికి. గుంపులు గుంపులుగా జనం నిలబడి చూస్తుంటారు. శిక్షితుని వధ్య శిలపై బోరగిల పడుకొమ్మని, పదిదాకా లెక్కపెట్టమంటారు. "లెక్కపెడుతూండగానే ఉన్నట్లుండి అతనికి విముక్తి లభిస్తుంది. ఒక్క క్షణం బాధ, తర్వాత ఆనందం. నే నెందుకిక్కడున్నాను? ఎందుకిలా పడుకున్నాను? అని ప్రశ్నించుకుంటూ లేచి ముందుకు నడుస్తాడు. ఎదురుగా లైబ్రేరియన్ (జైల్లో పుస్తకాలు సరఫరా చేసినవాడు) గొంతుక్కూచుని డోక్కుంటున్నాడు. జనం నీటిమీద చిత్తరువుల్లాగ తేలిపోతూ చెదరిపోతూ ఉన్నారు. ఆ 'చెత్త'ని (Debris) వదిలించుకుని అతను సాగిపోతూ వుంటే లోకం ఎక్కడి కక్కడ పెచ్చులు ఊడిపోతున్నదానిలా విడిపోయి కూలి క్రుంగి పోతున్నది. ఒక సుడిగాలి ఈ చెత్త చెదారాన్ని ఎక్కడికో తీసుకు పోతున్నది. వీటిని దాటి అతడు వెళ్తుండగా, ఏవో కంఠ ధ్వనులు వినిపించాయి; తనలాంటి వాళ్ళే ఉన్న ఆ వైపుగా అతను సాగిపోయాడు. ఇక్కడ 'నబొకొఫ్' సాధించిన విముక్తి లోకాంతర విముక్తి. జీవితంలో దగాపడినవాడు కోరేవిముక్తి. సిన్‌సిన్నాటిన్. భయపడుతూ ఎదురుచూచినశిక్ష అతనికి 'శిక్ష' కాదు; జీవితమనే శిక్ష నుంచీ విముక్తి. అతను జీవితంలో దగా పడ్డాడు. జీవితంలో సాఫల్యం అన్వేషించడం పొరపాటు అనే నిర్ణయానికి ముందే వచ్చాడు.[9] అందువల్ల మరణమే అతనికి విముక్తీ, సాఫల్యమూ అయింది. ప్రతిమనిషికీ అంతేనా? ఈ నవల 'నబొకొఫ్' జీవిత మధ్యకాలంలో అతని ఆవేదననూ దృక్పథాన్నీ సూచిస్తుంది. ఆయనే అన్నట్లు—మొదటి ఇరవైఏళ్ళ 'థెసిస్'కి యిది 'ఆంటి థెసిస్.' ఈ కాలంలోనే వ్రాసిన మరో నవల 'నిస్పృహ' (Despair). అందులోని నాయకుడు ఒక వ్యాపారస్థుడు. అద్దంలో తన ముఖం తను చూచుకునేందుకు భయపడే ఈ వ్యక్తి మరో వ్యక్తి (దిక్కులేని పేదవాడు) తనకు ప్రతిబింబమని నమ్మి, వాడికి డబ్బు ఆశచూపి, వాణ్ణిహత్యచేసి, తను వాడుగా మారిపోవడం ద్వారా తన సమస్యల నుంచీ విముక్తి పొందే ప్రయత్నము చేస్తాడు. 'శిరచ్ఛేదం' నవల లాగానే యిదికూడా 1932లో రష్యను భాషలో వ్రాయబడింది. తర్వాత ఈ రెండు నవలలూ ఇంగ్లీషులోనికి అనువదింపబడ్డాయి. కాని 'నిస్పృహ' నవలను 1965లో ఇంగ్లీషులోకి తెచ్చినప్పుడు 'నబొకొఫ్' దాన్నే చాలా భాగం మార్చి వ్రాశాడు. నవల ధోరణిలోనూ, వ్యంజకత్వంలోనూ చాలమారిపోయింది. ఇప్పుడీ నవల ఒక ప్రహేళిక లాగ ఉన్నది. ఇది ఒక పిచ్చివాని కథా? ఒక నేరస్థుడి కథా? ఆత్మ ప్రత్యాఖ్యానం (Self-alienation) పొందిన వ్యక్తి తాత్త్వికమైన అన్వేషణా? లేక మధ్య తరగతి దాంపత్య జీవనాన్ని అపహాస్యం చేసే వ్యంగ్య రచనా? ఇలా ఎన్ని విధాలనైనా పరామర్శించవచ్చు. ఇది 1965 నాటికి మేధాపరంగా 'నబొకొఫ్' నవలా శిల్పంలో సాధించిన 'ప్రహేళికా' రచనకొక తార్కాణ. కాని వస్తువు రీత్యా 1930–35 కాలం నాటిదే. ప్రహేళికా రచనలుగా పేర్కొన దగిన నవలలు 1960 ప్రాంతాల ఇంగ్లీషులో వ్రాసినవి పినిన్, పేల్‌ఫైర్. 'పేల్ ఫైర్' లో ఒక పద్యకావ్యం దానికి వ్యాఖ్య మాత్రమే ఉంటాయి. పాఠకుడు, పద్యభాగాన్ని చదువుతూ వ్యాఖ్య చదవాలి. తద్వారా ఆ పద్యకావ్య రచయిత జీవిత రహస్యాన్నీ, వ్యాఖ్యాతకూ, కవికీ మధ్య జరిగిన ఉదంతాన్నీ ఊహించి పట్టుకోవాలి. పుస్తకాన్ని ప్రచురిస్తూ 'నబొకొఫ్' దీన్ని పాఠకుడు రెండు కాపీలు కొంటే పద్యభాగమూ వ్యాఖ్యానమూ ఎదురెదురుగా పెట్టుకుని చదువుకోవడానికి సౌకర్యంగా ఉంటుందనే సూచన చేశాడు కూడా. నవలా ప్రక్రియను ఇలా పద్యకావ్యమూ వ్యాఖ్యానము అనే మరో ప్రక్రియ రూపంలో అంతర్గతంగా యిముడ్చడమనే ప్రయోగం, తెలుగులో ఒకానొక కాలంలో గర్భకవిత్వం, బంధకవిత్వం, అంటూ చెయ్యబడిన ప్రయోగాలను జ్ఞాపకం తెస్తుంది.

'నబొకొఫ్' వ్రాసిన ప్రహేళికా నవలలు చదవడం సులభం కాదు. అందుకే వాటికి ప్రాచుర్యం తక్కువ. నబొకొఫ్‌కి సీతాకోక చిలుకల వేటలోఉన్న అభినివేశంలాంటిదే 'చెస్' (చదరంగం) ఆడటంలోనూ ఉన్నది. 'చెస్'లో అతని మేధాప్రవృత్తి పోయే పోకడల వంటివే ప్రహేళికా నవలల రచనలోనూ చూపించాడు. 'నిస్పృహ' నవల కొరకరాని కొయ్యకాదు. కాని అక్కడక్కడ 'నబొకొఫ్' మేధా ప్రవృత్తి పోయే విచిత్రపు పోకడలు ఈ నవలలోనూ మనం చూడవచ్చు కథానాయకుడు తన భార్య ఎదుర్కొనే సమస్యలను గూర్చి చెబుతూ యిలా అంటాడు:

(She would search for the telephone number which she had jotted down on one of the pages of a library book, borrowed by the very person whom she wished to ring up) ఎవరికో ఫోన్ చెయ్యాలి, ఆ ఫోన్ నెంబరు ఒక లైబ్రరీ పుస్తకంలో వ్రాసుకున్నదామె. కాని ఆ పుస్తకం యిప్పుడా ఫోన్ చెయ్యవలసిన వ్యక్తిదగ్గరే ఉన్నది. నెంబరు దొరికితేగాని పుస్తకంరాదు, పుస్తకం వస్తేగాని నెంబరు దొరకదు! పిచ్చి కుదిరితేగాని పెళ్లికాదు, పెళ్లి అయితేగాని పిచ్చి కుదరదు. తికమకపెట్టే సమస్య లిలాంటివి ఊహించడమేకాదు, చాలా పెద్ద ఎత్తున పద్మవ్యూహాల్లా ప్రహేళికా నిర్మాణం చెయ్యడంలో దిట్ట 'నబొకొఫ్'.

'లోలిత' నబొకొఫ్ జీవితాన్వేషణనూ, లక్ష్యసిద్ధినీ నిర్దేశించి చూపుతున్న నవల. 'లోలిత' అన్నపేరులోనే 'లౌల్యా'న్ని అద్వితీయంగా వ్యక్తం చేశాడు రచయిత. నవల యిలా ప్రారంభం అవుతుంది :

"Lolita, light of my life, fire of my loins, My sin; my soul, Lo-lee-ta : the tip of the tongue taking a trip of three steps down the palate to tap, at three, on the teeth. Lo, Lee, Ta." ఈ మొదటి వాక్యాలలోనే శబ్దానువృత్తి భావస్ఫూర్తితో తాదాత్మ్యం చెంది 'లౌల్యా'న్ని అక్షరబద్ధం చేస్తున్నది. అంతేకాదు, నవల సారాంశం—అఘమూ, ఆత్మా (my sin, my soul) రెండూ పేర్కొనబడ్డాయి అందులో.

విషయ లౌల్యం ఈనాటిదికాదు. కాని జీవిత సరళి మారడంతో దాని స్వరూపమూ మారుతూ ఉంటుంది. లౌల్యానికీ,

రసానుభూతికి చాల దగ్గర సంబంధం. యౌవనారంభంలో ముగ్ధత్వంతో ప్రారంభమయ్యే సౌందర్యాకాంక్ష ప్రేమగా రూపొందడానికి బదులు, లౌల్యంగా రూపొందడంలోఉన్న రహస్యాన్నీ, ఆ లౌల్యం పశ్చాత్తాపంతో, ఆత్మక్షాళనంతో ప్రేమగామారే అద్భుత పరివర్తననూ హంబర్ట్ అనే కథానాయకుని చిత్రణలో నిరూపించాడు 'నబొకొవ్'. నిష్కృతిలేని లౌల్యం ఎటువంటిదో దాన్ని చిత్రించాడు.

హంబర్ట్ పారిస్‌లో జన్మించాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు మరణించగా పెత్తల్లి పోషణలో పెరిగాడు. పదమూడవ ఏట అనబెల్ అనే తన యీడు అమ్మాయితో స్నేహం కలిసి, యిద్దరూ పిచ్చిగా ప్రేమించుకున్నారు. కాని ఏకాంతంగా కలుసుకునే అవకాశాలు తక్కువ. నాలుగు నెలలు తిరక్కుండానే అనబెల్ చనిపోవడంతో ఆ అమ్మాయి స్మృతి హంబర్ట్‌లో శాశ్వతంగా నిలిచిపోయింది. తర్వాత ఏ స్త్రీ కూడా అతని ప్రేమను చూరగొనలేకపోయింది. అతనికి ముప్ఫై ఏడు సంవత్సరాల వయసు వచ్చేవ్పటికి జీవితంలో స్త్రీలతో తన కేర్పడిన సంబంధాలని కేవలం 'ఆరోగ్య విధులని పాటించడం'గానే **(Sanitary relations)** వర్ణిస్తాడు హంబర్ట్. ముప్ఫై ఏడో ఏట అమెరికా వెళ్ళాడు హంబర్ట్. వయసు పెరిగే కొద్దీ హంబర్ట్‌కి స్త్రీలమీద కాకుండా తొమ్మిదీ పధ్నాలుగేళ్ల మధ్య వయస్కులైన బాలికలమీద ఆకర్షణా, కాంక్షా తీవ్రం కాసాగింది. దీన్ని గూర్చి అతనొక సిద్ధాంతం చేశాడు. ఆ వయసు బాలికలు 'నింఫేట్స్' **(Nymphets)** (దేవకన్యలు) అనీ, వారిలోని ఒకానొక అప్సరా లక్షణము మధ్యవయస్కులైన తనవంటి వారికి కొద్దిమందికే గోచరమూ, ఆస్వాదయోగ్యమూ అవుతూ ఉంటుందనీ సిద్ధాంతం చేశాడు. అమెరికాలో హంబర్ట్ వయసులో ఉన్న వితంతువు యింట్లో బసచేశాడు. ఆమె పన్నెండేళ్ల కొమార్తె డాలీని (లోలిత) చూడగానే అనబెల్ తిరిగి వచ్చినట్లు తోచి, యిక అక్కడే ఉండిపోవాలని నిశ్చయించుకొన్నాడు. యౌవనంలో ఉన్న తల్లికీ, లోలితకూ మధ్య హంబర్ట్‌ను గూర్చి ఈర్ష్య అజ్ఞాతంగా ప్రవేశిస్తుంది. తల్లి లోలితను బోర్డింగ్ స్కూలుకి పంపించివేసి, హంబర్ట్‌ని తన్ను వివాహమాడవలసిందిగా కోరుతుంది. హంబర్ట్ పథకం కొంత తారుమారైనా కొమార్తె కోసం ఆ తల్లిని పెళ్లాడుతాడు. కాని ఒకనాడు ఆమె అతని డైరీ చదివి విషయం గ్రహించి తెగతెంపులు చేసుకునే ఆవేశంతో ఏవో ఉత్తరాలు వ్రాసి, స్వయంగా పోస్టు చెయ్యడానికి వీధిలోకి వెళ్లి, వెళ్లినట్లుగానే కారుక్రిందపడి మరణిస్తుంది. హంబర్ట్‌కి యిక ఏ హద్దూ లేదు! బోర్డింగ్ స్కూలుకివెళ్లి లోలితను తీసుకుని కారులో అమెరికా పర్యటనకు బయలుదేరుతాడు. ఇంతవరకూ జరిగిన కథలో హంబర్ట్ యొక్క వాంఛా స్వరూపాన్నీ, దాని కాల్పనికతా **(romantic)** లక్షణాలనూ, చాల సున్నితంగా స్పష్టంగా అభివ్యక్తం చేశాడు రచయిత. అనబెల్ తాలూకు గత స్మృతీ, రసవిహీనమైన యౌవనకాలం జారిపోవడం, హంబర్ట్‌లో నింఫేట్స్‌మీద నెలకొన్న వ్యామోహం, దాన్ని లోకం ఆమోదించదు అనే ఎరుక, హంబర్ట్ ప్రవర్తనను ఎలా దిద్దితీర్చుతున్నవో మనం గమనించాలి. హంబర్ట్ ఉద్దేశం: ఎంతసేపూ లోలితకు తెలియకుండా ఆమెను స్పృశించి ఆనందం పొందాలనే. **(I felt proud of myself. I had stolen the honey of a spasm without impairing the morals of a minor. Absolutely no harm done... What I had madly possessed was not she, but my own creation, another fanciful Lolita.)** ఇంతవరకు హంబర్ట్ ఆ అమ్మాయిలో చూస్తున్నదీ, అనుభవిస్తున్నదీ ఒక స్వప్నాన్నే. అతని లౌల్యం ఆ హద్దుల్లోనే ఉన్నది. కాని తల్లి చనిపోయి, అవరోధం తీరిపోగానే, కారులో ప్రక్కన లోలిత కూర్చోగానే రెండవ అధ్యాయం ప్రారంభమవుతుంది. స్వప్నం వాస్తవికతలో మరో స్వరూపాన్ని దాలుస్తుంది. హంబర్ట్ అమ్మాయిని ముద్దెట్టుకుంటాడు. 'నీకు ముద్దెట్టుకోవడంరాదు' అంటుంది అరిందా లాగ. 'నువ్వు నేర్పు' అంటాడు కొంటెగా. 'అలాగే క్రమంగా' అంటుందామె! హంబర్ట్ ఆ అమ్మాయికి నిద్రమాత్రలిచ్చి నిద్రపోయాక ఆమెను స్పృశించి ఆనందించాలని అనుకుంటాడు. కాని జరిగిన పొరపాటువల్ల లోలిత నిద్రపోదు. స్పృశించే ప్రయత్నంలో వేచి వేసారిపోతాడు. చివరకు తెల్లవారుతూండగా దొంగనిద్ర నటిస్తున్న లోలిత అతణ్ణి స్వయంగా లొంగదీసుకుంటుంది! **(I had thought that months, perhaps Years would elapse...but by six she was wide awake, and by six fifteen we were technically lovers. I am going to tell you something very strange: it was she who seduced me)** అమెరికన్ స్కూలు జీవితంలో ఆడ మగ పిల్లలు స్వేచ్ఛగా పార్టీలనీ, క్యాంపులనీ కలిసి మెలిసి ఉండటంయొక్క ఈ ఫలితాన్ని గుర్తించి విస్తుపోతాడు హంబర్ట్! అంతేకాదు. స్త్రీ పురుష సంయోగం కేవలం రహస్యంగా పెద్దవాళ్ళకు తెలీకుండా చేసే ఏదో కొంటెతనపు చేష్టగానే తప్ప, దాని రసానుభూతీ లేక ధర్మం తాలూకు విలువా ఏవీ తెలీవు లోలితకు. **(She saw the stark act merely as part of a young ster's furtive world, unknown to adults)** ఇది ఈ నాటి నాగరకత లక్షణం. తరాలమధ్య భేదం. బహుశా యూరప్ (హంబర్ట్) అమెరికా (లోలిత)ల సంస్కృతుల భిన్నత్వం. ఇలా ఊహించే అవకాశం ఉండబట్టే కొంతమంది విమర్శకులు 'లోలిత' నవలని **('Young America debauching old Europe' 'Old Europe debauching young America')** అమెరికా యూరప్‌ని చెడుస్తున్నట్లూ, యూరప్ అమెరికాను చెడుస్తున్నట్లూ అభివర్ణించే నవలగా పేర్కొన్నారు. ఏది ఏమైనా కథలో హంబర్ట్ ఈ పట్టున స్వప్నంలోనుంచి వాస్తవికతలోకి జారుకోవడంతో కాల్పనికమైన రసలోలుపత స్థాయిలో ఉండిన అతని ప్రవృత్తి కేవలం జాంతవమైన విషయలౌల్యంగా పరివర్తన చెందుతుంది. ఇక్కడినుంచీ నవల రెండవభాగం ప్రారంభమౌతుంది.

అరిందా లాగ సరదా పడుతూ హంబర్ట్ లౌల్యానికి లొంగిన లోలిత కొంతకాలానికే బాగా విసిగిపోతుంది. **(She had entered my world with rash curiosity...she surveyed it with**

a shrug of amused distaste...now she was ready to turn away from it with plain distaste) పర్యటనముగించి లోలితను ఒక మంచి స్కూల్లో చేర్చుతాడు హంబర్ట్. మగపిల్లలతో తిరగనివ్వడు. పార్టీలకు వెళ్ళనివ్వడు. కాని స్కూలు వాళ్ళ సలహామీద ఒక నాటకంలో లోలిత నటించేందుకు అంగీకరిస్తాడు. లోలిత ఒకసారి ఆ నాటకం వ్రాసిన ప్రసిద్ధ రచయితనూ, అతని బృందాన్నీ కలుసుకోవడంతో ఆమెకు ఆ రచయిత మీద ఆరాధనా భావం ఉదయిస్తుంది. దీన్ని పసికట్టిన హంబర్ట్ లోలితను తీసుకుని మళ్లీ పర్యటన ప్రారంభిస్తాడు. ఎవరో తమని వెంబడిస్తున్నట్లు అనుమానిస్తాడు. చివరకు ఒక మజిలీలో లోలిత తప్పించుకుని అదృశ్యమై పోతుంది.

లోలిత చేయిజారి పోవడంతో హంబర్ట్ గతాన్ని నెమరవేసుకుంటూ లోలితకోసమే అన్వేషిస్తూ గడుపుతాడు. అతనిలో వచ్చిన మార్పు—పూర్వపు కాల్పనిక భావాలు నశించిపోవడం. అప్పుడే 'రీటా'అనే దిక్కులేని యువతి సాహచర్యం లభిస్తుంది. హంబర్ట్‌లో మానవత్వం మేల్కోవడం సున్నితంగా చిత్రింపబడింది ఈ పట్టున. ఒకనాడు అతని లెటర్‌బాక్స్‌లో లోలిత నుంచీ వచ్చిన ఉత్తరం కనిపిస్తుంది. లోలిత పెళ్ళి చేసుకున్నది. ఆర్థికంగా చాల కష్టాల్లో ఉంటూ డబ్బు పంపమని అతణ్ణి అర్థించింది. డబ్బూ, రివాల్వరూ తీసుకుని వెడతాడు హంబర్ట్.

లోలిత ఒక మెకానిక్‌ను వివాహం చేసుకున్నది! ఎందుకలా జరిగిందో లోలిత క్రమంగా చెబుతుంది. లోలితను నాటక రచయిత హాలీవుడ్ ఆశపెట్టి తీసుకువెళ్ళాడు. లోలిత అతణ్ణి పెళ్ళి చేసుకోవాలనుకున్నది. కాని వాడు నపుంసకుడు. ఆడపిల్లలతో అసభ్యంగా ఆడుకోవడమే వాడి సరదా. లోలిత ఏవో చిన్న ఉద్యోగాలు చేసిచివరకు ఈ యువకుణ్ణి పెళ్ళాడింది. ఆమెకు తగినవాడు కాదు. కాని మంచివాడు. హంబర్ట్ లోలిత వైపు చూస్తాడు. అయిదేళ్ళల్లో ఆమె ఎంతో మారిపోయింది. నింఫెట్ లోలిత యికలేదు! కానీ, ఏ ఆకర్షణా లేకపోయినా, లోలితను తను అప్పటికీ యిప్పటికీ ప్రేమిస్తున్నాడు. (She was only the faint violet whiff and dead leaf echo] of the nymphe... I will shout my poor truth. I insist the world know how much I love my] Lolita, this Lolita, pale and polluted, and big with another's child. but......still mine) ఆమెను తనతో వచ్చివెయ్యమంటాడు. లోలిత నిరాకరిస్తుంది. ఆమె అడిగిన డబ్బు నాలుగు వందలు బదులు నాలుగు వేలు యిస్తాడు. కారు కూడా ఆమెకే వదిలిపెట్టి బయటికి నడుస్తాడు. లోలిత 'జీవితాన్ని' తను భగ్నం చేశాడు, కాని లోలిత 'హృదయాన్ని' వాడు (నాటక రచయిత) భగ్నం చేశాడు అన్న భావం అతణ్ణి రెచ్చగొట్టుతున్నది. హంబర్ట్‌లో పశ్చాత్తాపము (లోలిత బాల్యాన్నీ ముగ్ధత్వాన్నీ తను అపహరించాడని) ప్రేమకూ లౌల్యానికీ గల భేదాన్ని దర్శించేలాగ చేస్తుంది. ఆప్యాయతకు బొత్తిగా నోచుకోని పసివాళ్ళ హృదయాల్లోని నిస్పృహనూ, ఒంటరితనాన్నీ, పూర్వం లోలితలో తను గుర్తించలేకపోయినవాటిని, గడచిన రోజుల దృశ్యాలు జ్ఞాపకం రావడంద్వారా, గుర్తించడంతో, హంబర్ట్ లోలితకు జరిగిన అన్యాయానికి పరితపించిపోతాడు. తను లోలిత శరీరాన్ని వలవేసి పొందగలిగాడే కాని ఆమె హృదయాన్ని కాదు. (There was in her a garden and a twilight and a palace gate—. forbidden to me, in my polluted rags and miserable convulsions.) అయినా ఆ లౌల్యం యిప్పుడు హంబర్ట్‌లో ప్రేమగానే మిగిలింది. (I loved you, I was a pentapod monster, but I loved you) పశ్చాత్తాపమూ ప్రేమా పురికొల్పగా హంబర్ట్ హుటాహుటిగా వెళ్ళి, నాటక రచయిత క్విల్టీని కసిదీరా కాల్చి చంపుతాడు! ఈ ముగింపు మనకు విచిత్రంగా కనిపిస్తుంది. ఆలోచిస్తే దాని ఔచిత్యమూ బోధపడుతుంది. ఆ విధంగా హంబర్ట్ తనకు తనే శిక్ష విధించుకుంటాడు! నాటక రచయిత లోలితను అపహరించుకుని పోయాడనే కాదు, నపుంసకుడూ విలాస ప్రియుడూ అయిన అతని దౌష్ట్యము, హంబర్ట్ చేసిన పాపానికంటె ఎన్నో రెట్లు పెద్దది. హంబర్ట్‌కు నిష్కృతి ఉన్నది. వాడికి లేదు. ఇలా లౌల్యంలో కూడా హంబర్ట్‌కూ నాటక రచయిత క్విల్టీకి తారతమ్యం చూపడంలో మూలవస్తువుకు మరింత మెరుగు పెట్టాడు 'నబొకొఫ్'. హంబర్ట్ వాణ్ణి చంపడంలో కసి తీరడమే కాదు, లోలితకోసం హంబర్ట్‌చేసిన ఆత్మార్పణ త్యాగంకూడా అతనికి నిష్కృతి కలిగిస్తున్నాయి. క్విల్టీ హంబర్ట్‌తో రాజీపడటానికి ప్రయత్నిస్తాడు. డబ్బిస్తానంటాడు. లోలితవంటి అమ్మాయిలు వందమందిని సమకూర్చుతానంటాడు. పగ, కసి అనవసరమంటాడు. 'సివిలైజ్డ్'గా సమస్యని పరిష్కారం చేసుకోవచ్చునంటాడు. చంపవద్దని కాళ్ళు పట్టుకుంటాడు. ఈ సన్నివేశంలో క్విల్టీ మాటల్లో ఎంతో వ్యంగ్యాన్ని నబొకొఫ్ వ్యక్తం చేశాడు. నేటి నాగరకత చేస్తున్నదేమిటి? చిన్నపిల్లలకు ఆప్యాయత, ప్రేమ, రక్షణ లేకుండా చెయ్యడమూ, తదుపరి జీవితంలో వాళ్ళని వక్రబుద్ధులుగా (perverts) లేక క్రుంగిపోయిన దైన్యజీవులుగా తయారు చెయ్యడమూ. నవలకు అన్యాపదేశంగా వ్రాసిన మున్నుడిలో నబొకొఫ్ ప్రస్తావించాడు ఈవిషయాన్ని: "In this poignant personal study there lurks a general lesson; the way ward child, the egotistic mother, the panting maniae — these are not only vivid charactres in a unique story : they warm us of dangerous trends; they point out potent evils." ఒక అమెరికన్ సామాజిక జీవితంలోనే కాదు, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ శిథిలమై, ఉద్యోగస్థులైన భార్యాభర్తలూ, వాళ్ల పిల్లలూ గల కుటుంబ వ్యవస్థ ఏర్పడుతున్న నేటి మన సమాజంలో కూడా 'లోలిత' నవలలో ప్రసక్తమైన దోషాలే, సమస్యలే యువతరాన్ని బాధించే అవకాశాలు కనిపిస్తున్నవి. ఈ సమస్యల పరిష్కారాన్ని రాజకీయాలకు వదలిపెట్టి ఊరుకుంటే సరిపోదు! ఈ దృష్ట్యా నబొకొఫ్ నవల 'లోలిత' ని మన సమాజానికి ఒక హెచ్చరికగానే గ్రహించవచ్చు. సామాజిక స్పృహ అంటే ఇదే!

(మిగతా 76 వ పేజీలో)

చర్చ

రొమాంటిసిజం

డిసెంబరు 1976 'భారతి'లో శ్రీ ఇస్మాయిల్‌గారు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి రొమాంటిసిజంపై వ్రాసారు. ఫిబ్రవరి 1977 'భారతి' లో నేను శ్రీ ఇస్మాయిల్‌గారి ప్రతిపాదనలను పరిశీలించినాను. జూను 1977 'భారతి'లో డా. గంటి శ్రీరామమూర్తిగారు నా వ్యాసాన్ని విమర్శించినారు. వారి ప్రతి విమర్శ ఆలోచనా ప్రేరకంగా ఉంది. ''రొమాంటిసిజం'' అనే ఉద్యమాన్ని అర్థం చేసికొనేందు కిది దోహదం అవుతుంది. కానీ శ్రీ గంటివారి వ్యాసంలో, కదన కుతూహలంచేత కాబోలు కొన్ని అసమంజసాలూ, పఠితలను తప్పుత్రోవ పట్టించేవీ, నా వ్యాసంలోని కొన్ని విషయాల అనవగాహనలూ ఉండడంచేత ఈ సమాధానం వ్రాయవలసి వచ్చుచున్నది.

1. నా వ్యాసంలో ముగింపు వాక్యాన్ని తీసికొని వ్యాసానికీ దానికీ ఏలాంటి సంబంధం లేదనీ, దానిని వ్రాసి నేను అభాసు పాలైనాననీ శ్రీ గంటి వారంటున్నారు. నా వాక్యం ఇది :

''రాజకీయాల్లో పాల్గొనే కృష్ణశాస్త్రులు కంటె కవిత్వం వ్రాసే కృష్ణశాస్త్రి మనకు కావలె.''

ఇది అమాంతం పూర్వాపరాలు గమనించకుండా వ్రాసిన వాక్యం కాదనుమండీ. శ్రీ గంటివారే నా వాక్యాన్ని సంగతి సందర్భాలు చెప్పకుండా ఉద్ధరించి ''అభాసు'' పదాన్ని అంటకట్టుతున్నారు. ''బొంకవచ్చు నధిప పొందదడఘము''ను ఉద్ధరించి పోతనను అభాసుపాలుచేయ ప్రయత్నించినట్లు! శ్రీ ఇస్మాయిల్‌గారు తమ వ్యాసం ముగింపులో కృష్ణశాస్త్రి మున్నగు రొమాంటిక్ కవులు సాంఘిక, రాజకీయ ఉద్యమాలకు దూరమై ఉండిరన్న అపోహలను ఖండిస్తూ వ్రాసిన వాక్యాలకు సమర్థనగా నా వ్యాసాన్ని ఇలా ముగించినాను —

> ''కృష్ణశాస్త్రి ప్రభృతి భావకవులు సమకాలీన రాజకీయ
> సమస్యలను పట్టించుకొనలేదనీ, భూమికి ఎత్తుగా
> భావ వీధుల్లో విహరించే వాళ్లనడానికి మూలం
> దిగిరాను దిగిరాను దివినుండి భువికి వంటి
> వి...రాజకీయాల్లో పాల్గొనే కృష్ణశాస్త్రులుకంటె...''

కృష్ణశాస్త్రి రాజకీయాల్లో పాల్గొనకపోతే పీడాపాయ, రాజకీయాల్లో పాల్గొనే కృష్ణశాస్త్రులు సవాలక్ష ఉంటారు. మనకు కావలసింది రాజకీయాల్లో పాల్గొనే కృష్ణశాస్త్రులు (బహువచనం) కాదు. కవిత్వంవ్రాసే కృష్ణశాస్త్రే మనకు కావలె అని దీనిఅర్థం.

ఇప్పుడు చెప్పండి సహృదయులు! శ్రీ గంటివారి ఆరోపణ ఎంత వరకు సమంజసమూ అని !

2. డా. గంటివారికి వైయక్తికాభిప్రాయ ప్రకటన అంటే చాలా భయం ఉంది అనిపిస్తుంది. ''కేవల వైయక్తికాభిప్రాయాలను సిద్ధాంతీకరించడం కూడా కన్పిస్తోంది. అందుచేత ఈ (అంటే నా యొక్క) వ్యాసానికి ప్రామాణికత లోపిస్తోంది''అని ఒకచోటా, ''ఈ వైయక్తికాభిప్రాయం (అంటే నా వ్యాసం ముగింపు వాక్యం) ప్రకటనవల్ల వ్యాసకర్త (అంటే నేను) సాధించిన ప్రయోజనం మృగ్యం'' అని ఇంకోచోటా, నా వ్యాసాన్ని తీసివేసినారు. ఎవరి అభిప్రాయాలను వారు ప్రకటించకూడదా? సిద్ధాంతీకరణాన్ని చేసేవి వైయక్తికాభిప్రాయాలే కాని రాళ్ళూ రప్పలు కావు. ఒకరి అభిప్రాయం ఇంకొకరికి నచ్చనంత మాత్రాన దాని ప్రామాణికత లోపిస్తుందా? అందరికీ ప్రమాణభూతమైన ఒక సిద్ధాంతాన్ని శ్రీ గంటిగారు పేర్కొనగలరా? ప్రతి సిద్ధాంతమూ ఒక వైయక్తికాభిప్రాయమే కదా? డిసెంబరు 1974 'భారతి'లో నాపై శ్రీగంటివారే (అప్పటికి డాక్టరు కాదు) వ్రాసిన ''సమ్యక్ దృష్టి విమర్శక ధర్మం'' అనే ప్రతి విమర్శనను మననం చేసికొనండని మనవి చేస్తున్నాను.

3. కృష్ణశాస్త్రిని ఎ. ఇ. హవుస్‌మాన్‌తో పోల్చినది క్లుప్తతలో. క్లుప్తత, స్వచ్ఛత ఇరువురి కవితలలోని సమాన ధర్మం.

4. కృష్ణశాస్త్రి శ్రీ వైష్ణవం మోజులో పడ్డాక అంతా తారుమారైంది అని నేనంది; కృష్ణశాస్త్రి కవితలో ఉన్నదనుకొనే రొమాంటిసిజం గురించికాదు. తారుమారైయింది సెక్సు. కృష్ణశాస్త్రి వైష్ణవం మోజులో పడకపూర్వం వారి కవిత్వంలోని ''నేను'' పురుషుడు, తర్వాత స్త్రీ. సృష్టిలో కృష్ణుడొక్కడే పురుషుడు. తక్కినవాళ్ళంతా స్త్రీలే అని మీరాబాయి ప్రవచనం ప్రకారం ఈ సెక్సుమార్పిడి జరిగింది. వైష్ణవప్రభావం విశేషంగా ఉన్న టాగోరు కవిత్వాన్ని 'రొమాంటిక్'' కవితగానే గుర్తిస్తున్నామని శ్రీ గంటిగారు మనవి చేస్తున్నారు. ''గీతాంజలి'' టాగోరు కవిత్వానికి ప్రాతినిధ్యం వహించేదని ఒప్పుకొంటే అందులో వైష్ణవ ప్రభావం ఉన్నట్లు లేదు. టాగోరు కవిత్వం

(మిగతా 71వ పేజీలో)

చ ర్చ

చెమట బిందువూ – కాంతి బిందువూ

ఏప్రిల్ నెల 'భారతి'లో ప్రచురింపబడ్డ శ్రీ యన్నంరెడ్డి వెంకట రెడ్డిగారి లేఖ నేనీ రచన చేయడానికి కారణం.

మొదటిసారిగా శ్రీ సోమసుందర్‌గారు, "ఇరవయ్యోకటో శతాబ్దపు ఉషస్సార"లో నేను, శ్రీ శేషేంద్రశర్మగారిని అనుకరించా ననీ, వారి కవితా ప్రభావం నామీద ఉన్నదనీ ఒక అభిప్రాయాన్ని ప్రకటించారు.

తర్వాత ఈ విషయాన్ని ఖండిస్తూ కొన్ని లేఖలు రావడం జరిగింది. తిరిగి ఇప్పుడీ యన్నంరెడ్డిగారి లేఖ!

"ఎవ్వడో అనుకరించిన నాయని కృష్ణకుమారీ దాకా యెందుకు..." అన్న వారి వాక్యాన్ని చూస్తుంటే నాయని కృష్ణ కుమారి శర్మగారి కవిత్వాన్ని అనుకరించిందన్నది ఒక స్థిరీభూత సత్యం లాగా (**Established fact**) ధ్వనిస్తోంది. ఇప్పుడిక జవాబు చెప్పకుండా ఊరుకోవడం నా కవిత్వానికి నేనే 'అన్యాయం' చేసు కోవడం!

ఈ ఉత్తరం చూచాక శర్మగారి 'మండేసూర్యుణ్ణి', నా 'తిమిరంతో సమరాన్ని' దగ్గర పెట్టుకుని చదివాను. శ్రీ సోమ సుందర్‌గానీ, శ్రీ వెంకటరెడ్డి గానీ ఒక బహిరంగ ప్రకటన చేయ డానికి కావలసిన అనుకరణ నాకు దొరకలేదు. అయినా శర్మగారి కవిత్వానికీ, నా కవిత్వానికీ పోలికలేమిటి?

శ్రీ శర్మగారు భావుకుడు. ఆయన కవిత్వం నిండా అంతస్సూత్రత లేని భావచిత్రాలు! తీసుకున్నది అభ్యుదయ సూచకమైన భౌతిక వస్తువయినాసరే, భావుకత్వమే ప్రతిపాదం లోనూ తరుము కుంటూ వచ్చేస్తుంటుంది. ఆయన వాడే ప్రతీకలూ, ఉపమానాలూ, ఏ పాశ్చాత్య, సాహిత్యారామంలోనో గుబాళించవలసినవి.

ఇక నా కవిత్వంలో ఇంద్రజాలాలు ఉండవు. తీసుకున్న విష యాన్ని, పరిస్థితుల కనుగుణంగా క్రమపరిణామాన్ని చెందించి పరాకాష్ఠను పొందించడం మాత్రమే నేను చేస్తాను. నా కవిత్వంలో అయోమయ లక్షణానికి తావులేదు. నాదిఉత్త 'దేశిబ్రర'. నా కవితా సామగ్రి శుద్ధ దేశి సామగ్రి మరి. ఇప్పుడు నా 'తిమి రంతో సమరం' చదవండి —

నేను
కాంతి బిందువును
అశాంతికి ఆత్మబంధువును!
వంతెనకింది నీటి పొరలాగా
కదలికలు కోరని
కాలం గుండెల్ని
గాలంలా గుచ్చే నేను
కిరణ శరాన్ని
ఈ తరానికి చెందిన
అద్భుత వరాన్ని!
ఎందరి మనసుల్లోనో
చిందర వందరై
దిక్కు తెలియని ఒంటరి పక్షిలాగా
చిక్కుకుపోయిన వ్యగ్ర భావానికి
రెక్కలిచ్చి ఎగరమనే నేను
ఉగ్రమైన ఊర్పును!
మార్పును కోరుకునే
మనుషుల ఖచ్చితమైన
తీర్పును!

నవ్వుల బంతిలా
కనపడడం మానేసిన
ఈ లోకం నాకు లోకువ

నలుగడలా
చీకటి కమ్ముకుని కబళించే
ఈ లోకంమీద
నాకు జాలి తక్కువ

చీకటిని చేజేతుల్లా
చెంతకు చేర్చుకునే
కశ్మలాన్ని కాల్చడానికి
నాలుకలుకోసే అగ్నిని నేను!
అన్యాయ శతఘ్నిని!

నాకు విశ్రాంతి లేదు
తెరుచుకున్న ఈ కళ్ళమీదికి
తేలికగా కునుకురాదు
గుప్పెడు ఎముకలమీద
కప్పిన తిత్తిలాంటి లోకం
అందంగా అచ్చరలాగా
నా ముందుకు వచ్చేవరకూ
నాకు నిద్రలేదు.
ఇదుగో,
ఆ రాకలో లోకం
వెనకడుగు వేసింది

జుట్టు పట్టుకు ఈడ్చుకొచ్చే
అపరశక్తివి నేను
ఆదిశక్తిని!
లోకం చుట్టూ
ఇంతగా పేరిన తిమిరంమీద
సమరం చాటిస్తున్న నేను
కాంతి బిందువును
విక్రాంతికి ఆత్మబంధువును!

ఇక్కడ నన్ను నేను కొన్ని రకాలుగా ఆవిష్కరించుకున్నాను. (1) నేను అశాంతిని సూచించే చకచ్చకితమైన కాంతిబిందువునయ్యాను. (2) కిరణ శరాన్నై మార్పుకోరని కాలం గుండెలో గుచ్చుకున్నాను. (3) ఒక వ్యగ్రభావం పక్షిలా ఎగరడానికి ఊర్పునయ్యాను. (4) మనుషులు కోరుకునే ఖచ్చితమైన తీర్పునయ్యాను. (5) కశ్మలాన్ని కాల్చే అగ్నినీ, అన్యాయాన్ని కూల్చే శతఘ్నినీ అయ్యాను. (6) ఇంత అశాంతితో కూడుకున్న ఆ కాంతి బిందువునే, చివరకు తిమిరంమీద సమరం చాటిస్తూ విక్రాంతిని పొదువుకున్న కాంతి బిందువుగా పరిణామం చెందాను— ఇన్ని రకాల రూపచిత్రణలూ నా ఖండికలో స్పష్టంగా ఉన్నై. వాటి కొక్కొక్కదానికి నిర్ణీతమైన ధ్యేయం ఉంది. వీటిల్లో ఎక్కడా అయోమయ లక్షణం లేదు. పులుముడు గుణంలేదు. అతి మేధావికి మాత్రమే అర్థమౌతుంది కాబోలు, అని సరిపుచ్చుకునే భావక్లిష్టత ఎక్కడాలేదు. చుట్టూ ఉన్న లోకానికి సంబంధించిన రచనలో ఈ భావ క్లిష్టతను నేను కోరుకోను. లోకానికి నన్ను తెలిసీ తెలియకుండా చెయ్యాలనే తుంటరి ప్రయత్నం చేసినప్పుడు మాత్రమే అటువంటి గుణాన్ని ప్రవేశపెడతాను. అటువంటివి చదవగోరినవారు పాత 'భారతు'లు తిరగవెయ్యవచ్చు.

ఇక పై ఖండికలో శర్మగారిని నేను అనుకరించానని శ్రీ సోమసుందర్ తలపోసిన 'మండే సూర్యుణ్ణి' విశ్లేషించడం ఇక్కడ నాకు అవసరమే. అలా చెయ్యడంలో ఆయన కవన పద్ధతీ, నా పద్ధతీ, ఒకటి కాదని స్థాపించడం మాత్రమే నా ముఖ్య లక్ష్యం. శర్మగారి 'మండే సూర్యుడి' ఎత్తుగడ ఇలా ఉంది :

"నేను చెమట బిందువుని
కండల కొండల్లో ఉదయించే లోక బంధువుని!"...

కండలు కొండల్లా ఉన్నాయి కాబట్టి చెమట బిందువే లోక బంధువుగా ఉపమానత్వాన్ని సాధించుకుంది — ఈ చెమట బిందువుకు గుండెలతో దోస్తీ. ఇది ఉండేది బాధల బస్తీలో. దీని పిడికిలిలో సింధువంత చరిత్ర ఉంది. అయినా ఇది శిల్పిగా మారి మనిషిని చెక్కేటప్పుడు, ఆ చరిత్రను ఆ మనిషికి తెలియ నివ్వదు.

ఇక్కడనుండి మొదలు భావక్లిష్టత. నిజానికి చెమట బిందువు దేనికి ప్రతీక? శ్రమకా ? కవి తాను చెమట బిందువుగా మారి లోకానికి ఏం చేస్తున్నట్లు ! తన పిడికిట్లో ఉన్న సింధువంత చరిత్రను తాను మలిచే మనిషికి తెలియనివ్వకపోవడం ఎందువల్ల? అంటే తాను తయారుచేసే భవిష్యన్నరుడికి గత చరిత్ర తెలియకూడదని కవిగారి ఉద్దేశ్యమా ! — ఇక్కడ సింధు ప్రతీక ఔచిత్య మేమిటి ? కేవలం బిందువూ సింధువూ ఒకదానితో ఒకటి శబ్దసామ్యం కోసం సఖ్యం నెరుపుతున్నట్లు మనం అనుకోవచ్చా?

"వెళ్ళిన పక్షుల గుంపులు వెనక్కిరాలేదని
ఆక్రోశిస్తున్న అడవుల్లో
చిక్కటి నక్షత్రాలు కలుపుకుని
చీకట్లు ఆస్వాదిస్తున్నా !
స్మృతులతో అల్లిన పైట చెరగు పట్టుకుని
నా దేశం పాదాలు పెనవేసుకుంటున్నా !"

ఇక్కడి 'అడవుల్ని' నిక్సలైట్ ఉద్యమ ప్రతీకగా భావిస్తున్నాను నేను. మరి వెళ్ళిన పక్షులు వెనక్కు రాలేదని అడవి ఆక్రోశిస్తుంటే,- కండలకొండల్లో ఉదయించే చెమటబిందువైన కవి, నిమ్మకు నీరెత్తినట్లు, ఆ అడవిలోనే నక్షత్రాల్ని కలుపుకుని చిక్కని చీకట్లను ఆస్వాదిస్తూ కూర్చోవడ మేమిటి? కనీసం చిక్కని చీకట్లను ఛేదిస్తూ అయినా కాదు. కేవలం ఆస్వాదిస్తూ. ఆస్వాదించడం అన్నది స్వాదిష్టమైన వస్తువుకూ, మనసుకు నచ్చిన వాతావరణానికీ అన్వయించేదిగానే ఉంటుంది. అనగా కవి చీకట్లను అనుభవిస్తూ, ఏడుస్తున్న అడవిలో ఉన్నట్లనేనా అర్థం?— ఈ చీకటినీ, నక్షత్రాలనూ, ఏడ్చే అడవినీ, చెమట బిందువుగా మారిన కవినీ, కవియొక్క ఆస్వాదన క్రియనూ ఒక దారానికి కలిపి పొందికగా కట్టడం ఎట్లా ?

తర్వాత, చెమట బిందువుగా మారిన కవి స్మృతులు ! ఆ స్మృతులతో అల్లిన పైటచెంగు పట్టుకుని ఆయన దేశం పాదాలను పెనవేసుకు పోతున్నాడు. ఈ పైట చెంగు ఎవరిది? దేశానిదా? అయితే కవి తన స్మృతులతో అల్లిన చెరగును దేశానికి ధరింపజేశాడనాలా? లేక ఈ పైటచెంగు తన స్మృతులతో అల్లుకుని తాను వేసుకున్నదేనా! ఇంతకూ పైట చెరగు సవరించుకోవడానికి చెమట బిందువు ఆడా, మగా? ఇక్కడ అడవి దేనికీ ప్రతీక కాదని ఎవరన్నా అంటే మరి ఈ ఉత్త అడవిగోల కండల కొండల్లో ఉదయించే చెమట బిందువు కెందుకట? ఇంతకూ, అడవుల్లో కూర్చుని, నక్షత్రాలు కలుపుకుని, చీకట్లు ఆస్వాదించే కవి, ఒక్కసారిగా దేశం పాదాలను పెనవేసుకుపోవడ మెందుకో !

నిజమే! దేశంలో చాలా జరిగింది. "చెట్లకు వేలాడిన శిరసులు కొమ్మల్లో పూలై పూస్తున్నయ్. గుడిలో గంటలై, గోళీ దూరిన గుండెలు కదులుతున్నయ్". ఇంత వరకూ బాగానే ఉంది.

"ఎందరు ఎన్నిరాత్రుల రక్తం పిండి యిచ్చారో
ఈ దినం కోసం
మసి పంచల మంచు బిందువులై
వ్రేలాడుతున్నారు!"

ఇక్కడ రాత్రి దేనికి ప్రతీక? రాత్రుల రక్తం పిండడ మేమిటి ? పోనీ పిండిన రక్తం రాత్రులదైతే, మధ్యన పిండిన వాళ్ళు మంచు బిందువులై మన చూర్లు పట్టుకు వ్రేలాడడ

మెందుకు! అసలు 'మన' మెవరు? కవి తనతోపాటు ఎవర్ని కలుపుకుంటున్నట్లు ? లోకాన్నా! అయితే (నేలాడేవాళ్ళెవరు? వాళ్ళు లోకంలో వాళ్ళు కారా? తీరా మంచు బిందువులై (వేసి ఆ 'వాళ్ళె'వరో 'మనకు' ఒరిగించేదేమిటి? అసలీ భావం తెలుగు భావమా? ఒక తెలుగు గుండె రూపు కట్టించే భావమేనా ఇది?

''ఇదిగో నాది ఇనప పిడికిలి
కాలపు కఠిన శిలల్లోంచి కాంతి జ్వాల
తవ్వి తీస్తా !
ఎదిరించే శతాబ్దాల నిదురకు
నిప్పంటిస్తా !'' —

పిడికిలితో మోదుతారుకాని ఎవరూ తవ్వరు. అయినా రాళ్ళు తవ్వుతుంటే నిప్పురవ్వలు చెదురుతాయేమో కానీ, కాంతి జ్వాలలు పైకి రావు. ఇక నిద్రా, ఎదిరించడమూ రెండూ పరస్పర విరుద్ధ విషయాలు. నిద్రించే శతాబ్దాలు అసలు ఎదిరించగలగడ మేమిటి?

ఇవిలా ఉంచి, మధ్య మధ్య చెప్పే విషయంతో నాకు ప్రమేయం లేదన్నట్లు భావుకత ప్రత్యక్షమౌతుంటుంది.

''సముద్రాలమీద విరహంతో పరుగులెత్తే నదుల్ని
ఆగండని కేక లేస్తా''—

నదులతో, రంగులేని బంజర్లకు ఆకుపచ్చరంగు పులిమించడానికి సముద్రాలమీది విరహాన్ని కవి ఊహించ నక్కరలేదు. ఇందులో మళ్లీ చిన్న పిడకలవేట. మన సంప్రదాయం నదుల్ని బహువచనంలో చెప్పి, సముద్రాన్ని ఏకవచనంలో చెప్తుంది. సముద్రానికి ఈ సందర్భంలో బహువచన మక్కర లేదు.

''పువ్వు కోసం వెతుక్కుంటున్న
సీతాకోక చిలక్కి ఒక
పూలతోట యిస్తా!
పిల్లల్ని రాత్రిముక్కలు
వెన్నెట్లో ముంచుకుని
కొరుక్కుంటూ తినమంటా !''

ఇక్కడ పువ్వెవరు? సీతాకోక చిలకేమిటి? పిల్లలు రాత్రి ముక్కల్ని తినడ మేమిటి? అంటే రాత్రిని అధిగమించడమనీ చీకటిని కష్టాలనూ దాటడమనీ, చెప్పడమా! అదే అయితే మళ్ళీ ఆ రాత్రిముక్కల్ని వెన్నెట్లో ముంచుకుని, ఏదో జామ్ పూసుకుని అతి ప్రియంగా బ్రెడ్ ముక్కలు తిన్నట్లు తినడమేమిటి? కష్టాన్ని అధిగమించడం అట్లాగే ఉంటుందా?

ఏదీ కాకపోతే, నదులూ, సముద్రాలూ, పువ్వులూ, సీతాకోక చిలుకలూ, రాత్రి ముక్కలూ, వెన్నెలా, ఈ సామగ్రి అంతా, కవిగారి భావుకత్వం వల్ల మెరిసే సామగ్రిగా మాత్రమే ఊహించాలనా! ఇది ఇతివృత్తానికి ఏ రకంగా పుష్టి నిస్తున్నట్లు ?

'నేను చెమట బిందువును' అంటూ మొదలు పెట్టిన కవి, చివరి కొచ్చేటప్పటికి, తన్ను తాను, ఆ ప్రతీకనుండి పూర్తిగా విదిలించేసుకున్నట్లు స్పష్టమౌతున్నది. మొదట కండల కొండల్లో ఉదయించే లోక బంధువులాంటి చెమట బిందువు, చివరికి వచ్చేసరికి చిత్రంగా ఎటు పారిపోయిందో తెలియదు. కాని కవిమాత్రం సూర్యుడికి మారుగా, ఈ దేశపు ప్రాచీ రేఖంమీద ఉంచడానికి, మండే తన గుండెను చీల్చుకుంటూ కనిపిస్తాడు. కండల కొండల తత్త్వం మాటుపడి, అవి యెర్రగా మారిపోయి ఎండలు కాయడానికి కవి దగ్గర హాజరు పలుకుతుంటాయి. నిస్సంశయంగా, ఈ గుండె ఉదయించే లోకబంధువు లాంటి చెమట బిందువూ కాదు. ఈ ఎర్రటి కండలు మొదట కవి అన్నట్లుగా ఆ చెమట బిందువుకు సంబంధించినవీ కావు.

అయ్యా! అందుకని శర్మగారు కవిత్వం చెప్పేపద్ధతికీ, నేను కవిత్వం చెప్పేపద్ధతికీ ఏమీ సంబంధం లేదు. శర్మగారు ఒక ప్రతీక నుండి మరో ప్రతీకకూ, మధ్య మధ్య వి ప్రతీకల్తో సంబంధం లేని భావుకత్వానికీ, మండూకప్లుతి లాంటిది చేసుకుంటూ పోతారు. మరి కావాలనే చేస్తారో, అలవాటుగా చేస్తారోగావి, భావక్లిష్టతను పోషించుకుంటూ ఉంటారు. నేనుత్త సాదా సీదామనిషిని. కవిత్వం చెప్పేటప్పుడైనా నేల విడిచి సాము చెయ్యడం నాకు చేతకాదు.

అయితే, ఈ రెండు ఖండికల ఎత్తుగడ మొదటి రెండు పాదాల్లో ఒక్కలాగా ఉన్నట్లు నాకూ అనిపించింది. బిందువూ, బంధువూ అనే రెండు పదాల్ని ఇద్దరమూ వచన పాదాల్లో వాడడం కారణ మనుకుంటాను. అయినా ఈ పదాలు అచ్చంగా శర్మగారి సొత్తుగానీ, నా సొత్తుగానీ కావు గదా! ఒకవేళ మేమిద్దరం కూడబలుక్కుని ఆ మాట అన్నా, శ్రీ సోమసుందర్ అందుకు ఒప్పుకుంటారా! ఆయన తాను కవిత్వం వ్రాసేటప్పుడు ఈ బిందువుల్నీ బంధువుల్నీ ఒదులుకుని వ్రాయగలరా మరి !

డాక్టరు నాయని కృష్ణకుమారి

రొమాంటిసిజం

(68 వ పేజీ తరువాయి)

రొమాంటిసిజం అనడంకూడా, ఆయన కవిత్వ పరిధిని సంకుచిత పరచడమే.

5. ''ఏ విధంగా చూచినా తిరుమలరావుగారి వ్యాసం అసంతృప్తికరంగా ఉంది. తెలుగు సాహిత్యంలో రొమాంటిసిజం గురించి ఇంకా లోతుగా పరిశీలన జరగాలి''అని డా. గంటిగారు తమ వ్యాసాన్ని ముగించినారు. రొమాంటి సిజంపై పాశ్చాత్యదేశాలలో గ్రంథాలయాలకు గ్రంథాలయాలే ఉన్నాయి కదా. అట్టిది తెలుగులో నా ఒక్కని ఒక్క వ్యాసం సంతృప్తికరంగా ఎట్లుంటుంది? డా.గంటి గారికి తమ వ్యాసం సంతృప్తి నిచ్చిందా? రొమాంటిసిజం గురించి తెలుగు పాఠకులకు కొంతైనా తెలియవలెననే గదా నేను వ్రాసింది! ఇంకా పరిశీలన జరగాలి అని ఇతరులను పురమాయించే బదులు డా. గంటిగారు ఆ పని తామేచేస్తే ఎంత బాగుంటుంది!

శ్రీ సర్దేశాయి తిరుమలరావు

క ల గూ ర గం ప

అకవితోద్యమం

హిందీ సాహిత్యంలో అకవితోద్యమానికి ఆద్యులుగా శ్యామ్ పర్మాల్ జగదీష్ చతుర్వేది కవులను పేర్కొనాలి. నూతన యుగారంభమైనప్పటికీ సాంస్కృతికరంగంలో స్వాతంత్ర్యం సిద్ధించలేదు. అరిగి చెరిగిన ప్రణయ గాథలు, పురాణ పాండిత్యం సాహిత్యం నుంచి తొలగిపోలేదు. పంత్, బచ్చన్, ధిన్‌కర్ ఆగ్నేయవంటి కవులు పౌరాణిక రీతిలో సుదీర్ఘ కావ్యాలను వెలయించారు. అనేక మంది యువకవులు ఉత్తమ కవిత్వాన్ని రాయగలిగారు. 1940 ప్రాంతాల్లో రాసిన కవిత్వంలో ఆధునికతలేదు. శైలిలో మాత్రమే భేదం కనిపిస్తుంది. వాస్తవికమైన మార్పు. 1943లో ఆగ్నేయ సంకలనం చేసిన తార్ సప్తక్ కవితా గ్రంథంతోనే ఆరంభమయింది తెలుగులో కూడా. శ్రీ శ్రీ మహాప్రస్థాన కవిత్వం ఒక ఉద్యమరూపాన దేశంలో ప్రవర్తించింది 1943లోనే నంటున్నారు డా. కోవెల సుప్రసన్నాచార్యులుగారు. తరువాత నిరాలా 1946లో నయేపత్తే కవితా గ్రంథాన్ని పేర్కొనాలి. తార్ సప్తక్‌లో ప్రయోగవాది అయిన ఆగ్నేయ ప్రగతివాద కవితోద్యమ నాయకుడయిన రామవిలాస్‌శర్మ వీరిరువురు కమ్యూనిస్టు ఉద్యమంనుంచీ ప్రాభావితులయ్యారు. ప్రగతివాద కవిత్వానికి ప్రయోగవాద కవిత్వానికీ మధ్యే మార్గాన్ని అనుసరించాడు ముక్తిబోధ్. ముక్తిబోధ్ కవిత్వం నిశిత కళాత్మకదృష్టి, సహజ సాంఘిక చేతనల సమ్మేళనం. ఆ నాటికి దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించలేదు. ఆధునికత అనేది ఆంగ్లభాషద్వారా ప్రవేశించింది. ప్రగతివాద కవులకు ప్రేరణ రష్యా విప్లవం. శ్రీ శ్రీ కూడా తన రచనలకు రష్యా విప్లవమే ప్రేరణగా చెప్పుకొన్నాడు. ప్రగతివాద కవిత్వానికి వేళ్ళు రష్యాలో వున్నాయి. ఆడెన్ స్పెండర్‌వంటి కవులలో కనిపించే ఇనోసెన్సు, ఉత్సాహశక్తి దేశీయ కవులలోను కనిపిస్తుంది. ఇదే లక్షణం ప్రేమచంద్ కర్మభూమిలో దర్శించవచ్చు. అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీ పరిణామాల ప్రభావం అన్ని దేశాల ప్రగతివాద కవులమీద ప్రతిఫలించింది. పాశ్చాత్య దేశాల్లో స్టాలిన్ దురంతాలు, సోవియట్ జర్మనీల ఒడంబడిక కాలంలో ఎందరో కవులు మేధావులు కమ్యూనిస్టు పార్టీని విడిచారు. కొన్ని దేశాలు అంతర్జాతీయ కమ్యూనిస్టు పోకడలను విస్మరించి దేశానుగుణంగా మార్పు చేసుకున్నాయి. ఆగ్నేయలో ఈ మార్పు ప్రస్ఫుటంగా గోచరించింది. తెలుగులో ఆరుద్ర, కుటుంబరావు, నారాయణబాబువంటి రచయితలు కమ్యూనిస్టు వ్యతిరేకులయ్యారు. ప్రగతివాద కవుల కవితా ప్రతిధ్వనులు సరిగా వినిపించలేదు. భాషా యోషా ఘలం ఘలలు వినిపించాయి. ' శుష్కనినాదాలే అయినాయి. ప్రయోగవాదులు ఈ అపవాదుకు గురికాలేదు. యజమాని అడుగుజాడల్లో నడవడం తప్పిదంగా భావించారు. ఆగ్నేయ ఒక కవితలో అంటాడు— 'నగర ప్రజల నాలుకమీద సబ్బులా జారిపోతున్న అతి వాచాలత్వమే గాని దయ శూన్యం అని.' ఇది మార్క్సిస్టు దృక్పథానికి భిన్నమైన భావ వ్యక్తీకరణ. నిరాలా తత్వం దేశీయం. సంప్రదాయాన్ని త్యజించకుండా రాడికల్ పర్పస్‌కోసం సంప్రదాయాన్ని జానపదాన్ని ఉపయోగించుకున్నాడు. ఇక్కడి దొకరాయి అక్కడి దొక పెంకు పోగుచేసి గుట్ట నిర్మించాడంటాడు నిరాలా ఒక కవితలో. నిరాలా రాసిన కుకుర్‌ముత్త (1942), తార్‌సప్తక్ (1943) కవితా గ్రంథాలు సమకాలీనాలు. నిరాలా కవిత్వంలోని అయోమయం యాదృచ్ఛికం కాదు. బుద్ధి పూర్వకమే. ఛాయావాద కవిత్వపు ముసుగునుంచి తొలగి నెహ్రూ చారిస్మా (సమ్మోహనం) లో పడి, గాంధేయతత్వానికి కవిత్వాన్ని లోబరిచాడు నిరాలా. ఒక కొత్త పరిష్కార మార్గం కనిపెట్టడం కోసం ప్రజల మధ్య వారి సంస్కృతిలోకి చొచ్చుకు పోయాడు. పూర్వ ఛాయావాద కవుల సాంస్కృతిక శైలికి వ్యావహారిక భాషను అంటు తొక్కాడు. వాస్తవికత, స్పష్టత పూర్ణంగా దర్శనమిచ్చాయి. హిందీ సాహిత్యంలో ప్రథమ అకవితా గ్రంథంగా నిరాలా 'కుకుర్ ముత్త' కావ్యాన్ని పరిగణించాలి. అకవితాకవుల సంకలన గ్రంథం 'విజప్' గతాన్ని నెమరువేసిందేగాని భవిష్యద్దర్శనాన్ని నిర్దేశించలేకపోయింది. ప్రగతివాది అయిన కవి కూడా అరిగిపోయిన పాత పదాలనే ప్రయోగించాడు. కవిత్వవాణినికి ప్రగతివాదులు ప్రయోగవాదులు బొమ్మాబొరుసు అయ్యారు. మావోయిస్టు, లెనినిస్టు కావాలంటే సాహసం అవసరం. అలాగే రాజకీయాల్లో మితవాది, మతంలో మార్మికవాది, సంస్కృతిలో సంప్రదాయవాది కావడంకూడా అద్భుతమయిన సాహసమే మరి. తెలుగులో అనిశెట్టిలో ఈ లక్షణాలు గోచరిస్తాయి. ప్రపంచ సాహిత్యంలో యువతరం తిరుగుబాటు కవితోద్యమాలలో ప్రతిబింబించే శైలి, శిల్పం, వస్తువు, దేశీయ కవిత్వంలోనూ ప్రతిఫలించింది. అందుకే అంతర్జాతీయ దృక్పథం కలిగిన అకవితా వాదులను అనుకరణ వాదులుగా విమర్శించడం జరిగింది. అకవితావాది రాజకీయాలకు రాజకీయ పార్టీలకు దూరుడైనా వెలిగాలేదు. 'అనేక రాజకీయ సిద్ధాంతాల ఒరిపిడికి నలిగిపోతున్న కారణంగా వర్తమాన కవి కార్యదక్షుడు, నిశిత పరిశీలకుడు కావాలన్నాడు జగదీష్ చతుర్వేది. కవిత్వంలో రాజకీయాలుండవచ్చుకాని రాజకీయాలే కవిత్వం కారాదు. రాజకీయ దృక్పథం వాస్తవాన్ని కప్పిపుచ్చకూడదు. ఉదాహరణకు చైనా దురాక్రమణ చేసినపుడు కమ్యూనిస్టు కవులు దురాక్రమణ కాదని బొంకారు. వారికి స్వదేశం కన్నా పరదేశాభిమానం మెండు. చైనాకు వారు దాసులు. పరప్రత్యయనేయ బుద్ధులు.

యంత్రాలనుచూచి మనం ఉద్రేకపడలేం. కవిత చిన్న లేక పెద్ద పదాల యంత్రం. ఈయంత్రం వ్యక్తిత్వసారాన్ని వెలిగదీస్తుందంటాడు శ్యామ్ పర్మార్.

అకవితోద్యమం కాల్పనికతకూ, ప్రయోగవాదుల క్లాసిజానికి వారి నాగరిక శైలికి (**Sophisticated style**) వ్యతిరేకంగా నిలిచింది. ప్రగతివాదులు స్వీకరించి జానపదసూక్తులు కృత్రిమ జాతి రత్నాలయ్యాయి. రాజకీయాల ముసుగుతన్ని కాల్పనిక విప్లవాన్ని కాలరాచి తన వ్యక్తిత్వాన్ని అన్వేషిస్తూ ప్రపంచానికి ఎదురొడ్డ ప్రథమంగా కవి నిటారుగా నిలబడగలిగేడు. చతుర్వేది కవిత్వంలో అశ్లీలత, అయోమయత్వం అక్కడక్కడా కనిపిస్తుంది. ఈ లక్షణాలు అ కవితా లక్షణాలకు విరుద్ధం.

వామ పక్ష కమ్యూనిస్టు కవుల ఉన్మత్తత ప్రయోగవాదుల మార్మికతనూ విడనాడి ఒక నూతన తేజస్సునూ ఓజస్సును హిందీ కవిత్వానికి సమకూర్చిపెట్టింది అకవితోద్యమం.

శ్రీ శివకుమార్

‘భావ’ కవిత్వం-రాయప్రోలు లేఖ

ఏదియొ అపూర్వ మధుర
రక్తి స్ఫురియించుగాని అర్థమ్ముకాని
బావగీతమ్ము లవి......

అంటూ ‘ఊర్వశి’ లో కృష్ణశాస్త్రి చేసిన ఒకానొక వర్ణనను ఆధారం చేసుకుని, విమర్శకు లనబడేవారు ‘భావ’ కవిత్వాన్ని నిర్వచించబూనుకున్నారు. అలాంటి నిర్వచనాలు బుద్ధి అలసత్వాన్నే సూచిస్తాయి. అందుచేత అలనాటి ‘భావ’ కవులలో ఒకరిద్దరిని సమీపించి ‘భావ’ కవిత్వమనబడే దాని విలక్షణతను తామే విధంగా బోధ పరచుకున్నారో తెలుసుకోదలిచాను. వేదుల సత్యనారాయణ శాస్త్రి నాకు క్రితంలో రాసి పంపిన లేఖ ‘భావ’ కవిత్వంమీద విశేషమైన వెలుగును ప్రసరించదు. రాయప్రోలు సుబ్బారావు లేఖ మరింత సహాయకారి. అందుచేతనే దాన్ని ఇక్కడ పునరుల్లేఖించడం. చరిత్ర పత్రంగా నైనా ఇది పనికి రాగలదని అనుకుంటున్నాను.

‘బసవరాజు అప్పారావు మధురస్మృతి’ శీర్షికతో కృష్ణశాస్త్రి “బసవరాజు అప్పారావు గీతాలు” కు రాసిన ఉపోద్ఘాతం చూస్తే “మొట్ట మొదటి భావకవి”గా బసవరాజు అప్పారావునే ఆయన ఎంచినట్టు తెలుస్తుంది. తానే ఇలా వివరించారు కూడా:

“...మొట్టమొదటి భావకవి. అంటే భావ కవిత్వానికి త్రోవ చూపినవాడనేకాదు; తరువాత వచ్చిన భావకావ్య జగత్తుకు ప్రవేశికవంటివాడు.”

కావచ్చు. కాని, రాయప్రోలు సుబ్బారావును కాలాన్నిబట్టి మొదటి ‘నవ్య’ కవిగా కురుగంటి సీతారామయ్యవంటివారు ఎంచి ఉన్నారు. కాబట్టి ఆయన ఇందుగురించి ఏమి రాశారో లోకానికి తెలియాలి.

“శ్రీ రమ్యాత్ రాయప్రోలు
6-5-1965

శ్రీ రమణారెడ్డిగారికి. మీ గ్రంథము[1] అందింది. రామిరెడ్డి మళ్ళీ హృదయములో భాసించాడు...

...భావ కవిత్వమనే పదము నాది కాదు. నేను పెట్టిన పేరు అభినవ కవిత. హరిసర్వోత్తమరావు అది కాదన్నాడు. ఖండ కవిత్వమనే పదం సూచించాడు. ఖండమంటే పటిక బెల్లపుముక్క. అది నమలరు. మెల్లగా కరుగుతుంది. రూపములో చిన్నది. అదీ ఒప్పుకోలేదు. భావకవిత్వమని—తృణ కంకణ ప్రథమ పీఠికలో వ్రాసిరి. వారిపేరు లేదు. ఊరకే ప్రకాశకులు అని వేశాను. వారు ఆ మాటను ‘**Subjetive poetry**’ అనే అర్థములో వాడిరి. తరువాత ఆ పద చర్చ వచ్చింది. వేటూరివారేదో చెప్పారు. పంచాగ్నుల వారు తేల్చివేశారు.

“ఇక్కడ భావపదం కవిత్వమనే దానితో కూడి వున్నది. కాగా కవిత్వములో భావ, విభావ, అనుభావ, వ్యభిచారీభావాదులకు సంబంధించినదని వ్యాఖ్యానం. రాయప్రోలు ముఖ్యంగా శృంగార భావాలను శృంగార భావమును—తత్ప్రాతిపదిక అయిన మానవాను రాగమును రాజనాగరక విద్వాంసుల ఆవరణములోనుంచి బయటికి లాగాడు. జాతి కులాలు అడ్డుకోని సహృదయ సామాజిక వీధుల లోకి తెచ్చారు. మొట్ట మొదటనే దేవతల నందరినీ విసర్జించి ‘మనోహరపు వాగర్థ ప్రణయము’ను కీర్తించాడు కాబట్టి—నుఊొక పక్షములో — శబ్దముకాక అర్థద్యోతకమయ్యే భావమే ప్రధానంగా కలది అని ఫలితం సిద్ధిస్తుంది. నాకు ఇష్టార్థంకూడా ఇదే. కాబట్టి భావకవిత్వమనే తరువాత నేను వాడితిని. ‘పాడవమ్మ గీతా సఖీ! భావపదము’ అని ‘తెలుగుతోట’ లో ధ్రువంచేశాను. అయితే ఇదీ కేవలం రాయప్రోలు సృష్టికాదు. మహిమ్న స్తోత్రమని ఒక రచన ఉన్నది. అది దుర్వాస మహర్షి ప్రణీతమని పండిత సంప్రదాయం.

అందులోనే మొట్టమొదట ‘జ్యోతిర్మయం వాఙ్మయం’ అనే భోధ ఉన్నది. ‘మాతృకాక్షర సఖీం—సౌభాగ్య విద్యాం’ అనే పదాలు కూడా అందులోనివే. నన్నయ్య ‘అక్షరరమ్యత’ను తడివి చూడండి. సౌభాగ్యవిద్య అంటే కావ్యం—సాహిత్యం—అని నేను సంభావించుకొన్నాను. పైగా, శబ్దము దాని వర్ణ సముచ్చయము నశిస్తుందనీ, అర్థమే బావబోధక మవుతుందనీ పూర్వ వ్యాఖ్యాతలు. ఈ విషయమునే—మామిడిపండు రసము త్రావి, దాని తోలునూ, లోని విత్తునూ కూడా త్యజిస్తామని రమ్యా లోకములో చెప్పితిని. శబ్దానికి ఉత్తరపదం—ప్రకరణం — కూడా కావాలె. అవసరం. గీతలో యోగ, ధర్మ, కర్మాది శబ్దాలు అనేకార్థాలలో ప్రయుక్తములు. కాగా, భావములేని అభావకవిత్వముంటుందా అన్న ఆక్షేపకులకు సమాధాన మేమిటి? ‘శబ్దాను కల్పన’ విధానం వారికి తెలియదనాలె. అంతే. తృణకంకణం సమీక్షిస్తూ ముట్నూరివారు కృ. ప.[2] 5, 6 కాలముల వ్యాసము వ్రాశారు. దానిలో భావ కవిత్వమనే పదం వాడారు. ఆ సమీక్షతోటే ‘తృణం’. —ఆ యేడే మూడు ముద్రణలయింది. అంటే వైరాగ్యవిద్య కాక, సౌభాగ్య

మయిన విద్యాభావమును ప్రకటించే కవిత్వమని సిద్ధిస్తుంది. ఇదీ భావ కవిత.

"వాగర్థంబుల బాంధవంబు చిగిరింపన్, ప్రాణి సంతాన చేతో గోపాయిత రక్తసిక్తమగు స్వాదు స్థాయి గుర్తించి, తద్యోగానంద ఫలావతీర్ణ రస మాధుర్యంబుపాసించిరే వాగర్థ్యర్యులు వారికెత్తెద నమోవాకంబు నమ్రముండనై" అని తరువాత వ్రాసితిని.

'అస్పష్టత' అనేది అర్థంలేని మాట. శబ్దక్లిష్టతవల్ల అస్పష్టత రావచ్చు. ఆముక్తమాల్యదలో అస్పష్టత వున్నదా స్పష్టత వున్నదా(?) వ్యాఖ్యాతలు చెప్పినతరువాత ఈ అస్పష్టత—స్పష్టత అవుతుంది.

"భావ కవిత్వములో నూటికి తొంబది పాళ్ళు అగపడి భ్రమ పెట్టేది అస్పష్టత కాదు. శబ్దద్వారబంధము వదిలిపెట్టి అర్థ కవాటములు తెరుస్తాడు. స్వచ్ఛందంగా ఇష్టార్థ వీధిలో విహరిస్తాడు. ఇది వ్యంజనావృత్తికి సహజం. భావించిన ఇష్టార్థము అనిష్టార్థంగా పరిణమిస్తే, అప్పుడు దోషమవుతుంది. 'కలువల నిద్రలేపి' అంటే, కలువలూ లేవు—అవి నిద్రపోవడమూ లేదు — చంద్రోదయ మయిందని భావము. విరహాల బాధ — ప్రణయుల రిరంసా — ఇవన్నీ భావ ద్యోతకములు. ఇవి పరిచితం కాబట్టి సెబాసంటారు. నవీన కల్పనలంటే ఈటపటాయిస్తారు. శేషం కోపేన పూరయేత్.

"సుభగ భావం సౌభాగ్యమైనట్లే, స + హిత + భావము సాహిత్యమయింది. అందువల్ల సాహిత్య రచనలో బ (sic) బ్దం (శబ్దం) కూడా మంగళమూ మధురమూ మసృణమూ అయిన రూపాలంకారమును పొందుతుంది. దానికి ఆనంద మొక్కటేలక్ష్యం. 'కావు కన్నె చెక్కిళ్ళ నవకంబు లేదె' నేను అన్నది ఆదే దృష్టితో. తరువాత ప్రకృతి ఆలంబన ఉద్దీపనలకు కారకం. అది పెండ్లిల్లు వంటిది. అచట ప్రధానంగా సంనివేశము environment మందరంగా సుస్మితంగా, సుశోభితంగా వుంటుంది. అంటే, వికారమూ విషాదమూ విఘాత (మూ) ఇత్యాదులకు తెనకాశం తక్కువ. అమంగళం అనడానికి 'శివేతర క్షతయే' అంటాడు. ఇది శబ్ద శబలత కాదు. కవ్యకు (sic) పరిశీల కట్టుతుంది. పదిమూళ్ళ కోక కట్టదు. ఇది environment లో ఉన్న సుతారం. అది సున్నితం. పైగా నేను ప్రకృతిని కళ్యాణినిగా దర్శిస్తాను. **Nature is not a temptress but a kind Mother** అన్నది అవిబిపెంటు. అందువల్లనే మాతలవంటి సరస్వతీత్యాది దేవతల కచ కుచాలు వర్ణించటము (sic) అనౌచిత్యంగా పాటించాను.

"కాంత లేనిది కావ్యము లేదు. అసలు లోకమే లేదు. కాని ఈ కాంతను పూర్వ సాహిత్యములో అధికాధికంగా — తపోదయ ప్రకరణములో—పడకటింటి పాన్పునుంచి బయటకు రానీయలేదు. సంభోగమే అవధిగా పాటించారు. నేను దానిని వదలిపెట్టాను. కచకుచాది వర్ణన లేకుండా కాంతా సౌందర్యం ప్రతీయమానము కాదా? సంభోగ ప్రసక్తి లేకుండా or దానికి ఆవలగా—నర నారీ సంబంధం—ఇదే అసలు నేను వైతాలిగి (sic), అభినవ కవితకు ప్రయాణించడానికి కారణం. అది సాధ్యమయిందని నాడు కట్టమంచి, ముట్నూరి రసవేత్తలు నన్ను ప్రోత్సహించారు. క్షమించండి, వారిరువురి కంటె సాహిత్యావలోకనం చేయ [గలి]గిన, చేసిన 'సంమర్శకు'లు నాకు కాన రాలేదు. పచ్చి ముత్యాల తమ్మి పూబల్లెరమున పద్మ[ము] వంటి ముఖం మీద ముత్యాల వంటి చెమట చుక్కలు తళుకు లరమోడ్పు గొమ జంట కలువ లమర (వాల బడ్డ కాటుక కండ్లతో) జాఱు లతతల (వ్రేలాడబడ్డ చేతులతో) విశద మంజరులతోడ (పైట తొలగిన పాలిండ్లతో) చెలియ తోచె భోగార్చన సలిపినట్లు—ఇది సురతాంత వర్ణన — ఆ భోగమును కూడా ఒక అర్చనా విధానంగా భావించాను. అస్పష్టత అంటే ఏమి యేడవవలెనో తెలియదు. బిడ్డల సయ్యాట తల్లికివలె మిధునక్రీడ ప్రకృతికిని ఇష్టార్థమే. అలాగే అన్నా చెల్లెండ్లు—జనక పుత్రకులు—అమలిన వ్యాసక్తులయిన యువతీ యువకులు—వీరి సాహచర్యముకూడా...నా కావ్య రచనయందంతటనూ అంతర్లీనంగా వుంటుంది.. ఇక వారి కంఠం [3] పట్టేది నా సమాసాలు.

"అర్థవత్ సమాసవ్." ఇష్టార్థవ్యక్తివ్యంగా కావ్య వాక్యమును విహితోపచార గుణానుసారంగా సమాసమును విగ్రహించుకోవాలె. పద్మ నయనంబుల వాడు వారి మామూలు ధోరణి. పద్మముల యొక్క కన్నులని విగ్రహం. పద్మ ఇవ నయన అంటే ఇష్టార్థం వస్తుంది. ఇది తెనుగులో సాధ్యమేనా? చిగురుమోవి—చిగురువంటి మోవి. దీనిని తత్సమించితే—పల్లవాధరము అవుతుంది. అప్పుడు వారి కంఠం పట్టుకొంటుంది. ఇది దీనితత్వం. ఇది కూడా భావ కవిత్వం కాదు. 'ముఖ నాసికా వచనామ స్యాతః' అనే సూత్రములో ద్వంద్వ సమాసం మామూలుగా చెప్పవద్దని—ముఖ సహ నాసిక...అని తత్పురుష చేయమంటాడు భట్టోజీ. (పుస్తకం దగ్గర లేదు) మీరు పరిశీలించండి. ఇంత యెందుకు? మీది శాసనాన్ని అనుసరిస్తే తెనుగులో మహాకవుల సమాసములు అనేకములు దుష్టము లవుతవి. 'నల్లని చిన్నవాడు, చరణంబుల గజ్జెలు మ్రోగువాడు—జాబిల్లి మొగంబువాడు—' అని నేను వ్రాస్తే—నాకు సమాస ప్రకరణం తెలియదన్నారు. వీరితో యేమి వాదం — దొమ్మలాట తప్ప —

"...ఏవో ఈ ఉదయుల కూర్చొని మనసుకు [?] తగిలిన ప్రకాశన వాక్యాలు వ్రాశారు. మీరు అడిగితే చెప్పబుద్ధి పుట్టింది. లేకపోతే—యథా ప్రకారం మౌనమే నా వ్రతం. శుభం.

భవదీయుడు

రా॥ సుబ్బారావు

శ్రీ కె. వి. రమణారెడ్డి

నోట్సు :

(1) నేను రచించిన 'కవి కోకిల'.

(2) కృష్ణాపత్రిక

(3) 'అస్పష్టతా' దోషం గురించి చేసిన విమర్శలకు సమాధానంగా రాయప్రోలు సుబ్బారావుగారి వాక్యం ఒకటి, అక్షరాలు పోల్చుకోలే నంతగా పెన్సిలురాత మూలాన చెరిగిపోయింది. చుక్కలు వీన్నిసూచిస్తాయి.

లేఖలు

శ్రీ నిడదవోలువారి విచిత్ర సమాధానం

శ్రీ బంగోరె బాంబు శ్రీ నిడదవోలు వెంకటరావుగారు చిన్నయసూరి బోగస్ బొమ్మ ప్రచురించి ప్రజలను అపమార్గ గాములు గావించిన విషయం 22–5–77 "ఆంధ్రజ్యోతి" దిన పత్రికలో ప్రచురించారు. వెంటనే నావద్ద మరొక బలమైన సాక్ష్యం ఉండటంవల్ల 25–5–77 "ఆంధ్రజ్యోతి"లో నేను దానిని బలపరుస్తూ వ్రాసాను (చిన్నయసూరి బంధువులే స్వయంగా చిన్నయసూరి జీవితంలో ఫోటో లేదని నాతోను, శ్రీ తల్లావఝుల శివశంకరశాస్త్రి గారితోను అన్నమాటలు వివరించాను). కాని నిడదవోలు వారు సమాధానం ఇవ్వలేదు. చేసింది తప్పు కనుక మౌనంవహించారు.

అయితే జూన్ 77 "భారతి"లో శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం ప్రచురించిన బంగోరెగారి "బ్రౌన్ లేఖలు"ను శ్రీ నిడదవోలు వారు తీవ్రంగా విమర్శిస్తూ సమీక్షించారు. దానికి బంగోరె సమాధానం, తిరిగి నిడదవోలు వారిచ్చిన 16 అంశాల తీర్మానం ఆగస్టు 77 "భారతి"లో ప్రచురించారు. పుట్టలో పాము బయటకు వచ్చినట్లు చివరకు నిడదవోలువారు 16వ అంశంలో చిన్నయసూరి బోగస్ బొమ్మ విషయమై తప్పు ఒప్పుకోక తప్పిందికాదు. కాని ఆయన ఇదేదో చిన్న విషయంలాగా దాటెయ్యటానికి ప్రయత్నించారే గాని మనస్ఫూర్తిగా క్షమాపణ చెప్పలేదు.

శ్రీ నిడదవోలువారు "చిన్నయసూరి విషయంలో నా కందిన వివరాలను అందించాను. చిన్నయసూరి చిత్రం ఊహించి వేసిందే. నన్ను ముద్దాయిగా బోనులోకి ఎక్కించారు" అని మూడు ముక్కల్లో విషయం దాటేయటానికి ప్రయత్నించారు.

చిన్నయసూరి చిత్రం ఊహించి వేసిందా? అది అసలు ఫోటోగాని ఊహాచిత్రంకాదే! అనాటి ప్రముఖ పుస్తక ప్రచురణ కర్త శ్రీ వేపప్పెరుమాళ్ళయ్యగారి ఫోటోను చిన్నయసూరి ఫోటోగా నిడదవోలువారు ప్రచురించారు. ఫోటోకు, ఊహాచిత్రానికి తేడా ఉందనే విషయం నిడదవోలు వారికి తెలియదా? ఏమైతేనేం తాము చిన్నయసూరి బొమ్మగా ప్రచురించినది నిజమైన బొమ్మ కాదని నిడదవోలువారు ఒప్పుకున్నందుకు ఆయనకు అభినందనలు.

పెద్దలైనవారు ఇలాంటి పనులు చేయకూడదని "ఎవ్వడు బుద్ధిమంతుడో వాడు వృద్ధుడుగాని ఏండ్లు మీరినవాడా వృద్ధుడు!" అన్న చిన్నయసూరి వాక్యాన్ని పేర్కొంటూ, ఇలాంటి సాహసాలు ఎవ్వరూ ముందు ముందు చేయకుండా ఈ లేఖ వ్రాసాను. అంతే!

డా మల్లిప్రియ "నాగరాజు"

మలేషియా ఆంధ్రసంఘం విజ్ఞప్తి

మలేషియా ఆంధ్ర సంఘంవారు తాము వెలువరించే "తెలుగుతల్లి" (తెలుగు, ఇంగ్లీషు భాషలలో) మాసపత్రికకు కథలు, గేయాలు, వ్యాసాలు, కార్టూన్లు మొదలైనవి పంపగోరు తున్నారు. పారితోషికం యిచ్చి రచనలు వేసుకునే స్థితిలో లేమని, రచనలు తెలుగు, ఇంగ్లీషు భాషలలో పంపవచ్చని, మలేషియా దేశ చట్టాలకు అనుగుణంగా ఉన్నవాటిని, తెలుగుభాషకోసం పాటుపడ్డ వారిని గురించి వ్రాయగోరుతున్నారు. కథలు పంపేవారు దానికితగ్గ బొమ్మగీసి పంపితే వేస్తామని, రచయితల ఫోటోలని కూడా పంప మని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. రచనలను ఈ క్రింది చిరు నామాకు పంపాలి:

MANAGING EDITOR, TELUGUTHALLI,
291-JALAN 9-A, TAN YEW LAI GARDEN OFF
PUCHONG ROAD, PETALING-KUALAMPUR
MALAYSIA.

ప్రజాసాహిత్యం అభ్యర్థన:

ప్రజాసాహిత్యం సంస్థనుంచి "గోరంతదీపాలు" అనుపేర కవితా సంకలనం ప్రచురణకు సంకల్పించారు.

కవులందరూ తమ కవితన్ని కార్యదర్శి, ప్రజాసాహిత్యం, జగిత్యాల–505327 అను చిరునామాకు వీలయింత తొందరగ పంపవలసినదిగా కోరుచున్నారు.

"టన్ను ముడిఖనిజంలో గ్రాము నిజంకూడా లేని సమీక్ష"

ఏప్రిల్ '77 'భారతి'లో "ఒక టన్ను ముడి ఖనిజంలో ఐదు గ్రాముల బంగారం" అన్న "తరం తరం" గురించిన సమీక్షా వ్యాసం చదివిం తర్వాత ఈ లేఖ రాయక తప్పడంలేదు. ఒక సంకల నానికి సమీక్ష రాస్తూ, అంతకుపూర్వపు సంకలనాల చరిత్రల పూర్వా పర్వాలూ సమీక్షాత్మకంగా వివరిస్తూ అంత లంబా చౌడాగ రాయడం అప్రస్తుతం. 'తరం తరం' ఎలాంటి దృక్పథంగల రచ యితల రచనలను గ్రహించామని సంపాదకవర్గం తెలుపుకున్నదో ఆ మార్గానికి వ్యతిరేకమైన ఉదాహరణలను సూచించడం సమీ క్షకుడు కావాలని రాస్తున్న లక్షణాన్ని తెలుపుతుంది. తాను పేర్కొన్న కవితల్లోనే ఉత్తమ కవితా నిలువ లున్నవనే దృష్టిగల సమీక్షకుని వింతలక్షణానికి విచారం కలుగుతుంది. అసలు విషయ మేదో మనసులో ఉంచుకుని అది నెరవేరలేదనే భావంతో చేసిన విమర్శవలె కన్పిస్తుంది. ఇదివరకు వెలువడిన సంకలనాలన్నింటి కన్నా విశేష లక్షణాలతో ఈ సంకలనాన్ని వెలువరించిన సంపాదక వర్గాన్ని తప్పక అభినందించాలి. అభ్యుదయ దృక్పథంతో వచన కవితా ప్రక్రియతో వెలువడిన సమగ్ర సంకలనం "తరం తరం".

శ్రీ చొప్పకట్ల చంద్రమౌళి

బ్రౌన్ లేక బ్రౌను లేఖల పుస్తకం గురించి చెలరేగిన ఉత్తర ప్రత్యుత్తరాలని చదవగా తోచినది.

1. శ్రీ నిడుదవోలు వెంకటరావుగారు బ్రౌనుని రాజరాజ నరేంద్రుడు, శ్రీ కృష్ణరాయలుతో పోల్చారు.

'ఆధునిక యుగమున నాంధ్ర భాషోద్ధారకుడైన 'మహ నీయుడు' అని అన్నారు. ఇంతకన్నా పొగడ్త ఉంటుందా ?

2. విశ్వ విద్యాలయాలికి సంబంధించిన పరిశోధనలో అంకెల విషయంలో అనిశ్చితంగా రాయవచ్చునా! ఈ కారణంగా రిసెర్చి థీసెస్‌లు తిరిగి వస్తూ ఉండటమూ అందరికి తెలిసిన విషయమే.

3. ఎందరిలాగో నేను 'రావ్', బ్రహ్మ హ' అని పలుకుతూ రావు, బ్రహ్మ అని రాస్తాను. తప్పొప్పులు తేల్చటం కష్టమే అనిపిస్తుంది.

4. విశేషణాలు రచయిత మానసిక పరిస్థితిని సూచిస్తాయని కొందరంటారు. ఇదే నిజమయితే శ్రీ బంగోరెగారి మాటలు కొన్ని, ఈ కిందివి గమనించ దగినవి.

1) చచ్చినట్లు వ్రాశాడు.

2) మొండిగోల చేస్తున్నాడు.

3) మూర్ఖ విమర్శకు దిగడం ఈయనకు రివాజు.

4) యెంగిలి లెక్కలు ఇచ్చుకుంటూ...

5) ఎవరండీ ఈ సూ. ని. స్వాములు?

6) వాళ్ళకేమయినా కొమ్ములు వచ్చాయా ?

7) నిడదవోలు వెంకట్రావుగారి అబ్బ సొమ్మేంపోయిందో మరి.

8) దిక్కుమాలిన శుష్కమైన కాలులాగ్ పాండిత్యాన్ని.

9) అవక తవక వ్రాతలతో అక్కసు వెళ్ళబోసుకుని, పాక్షిక విమర్శలతో బ్రతుకుతూ, వొకప్పుడు విశ్వ విద్యాలయాలను పావనం చేసిన రా ప్ర బుద్ధుడికి.

వీటిని చదివిన తరువాత నాకు జాలివేసింది.

5. కీహోల్‌వ్యూ ఆఫ్ హిస్టరీ అని అంటారు కొందరు. అలాగే 'కీహోల్ ఆప్ రిసర్చి ఉంటుందా?

శ్రీ భుజంగరావు

వ్లా డి మ ర్ న బొ కొ ఫ్

(67వ పేజీ తరువాయి)

'లోలిత' నవలలోని హంబర్ట్‌ద్వారా నబొకొఫ్ తన వ్యక్తిగత మైన సమస్య లెన్నింటినో పరిష్కరించుకున్నాడని ఊహించడం అసమంజసమేమీ కాదు. పందొమ్మిదోఏట రష్యానూ, 'తమారా'ను వదలి, యూరప్‌లో ప్రవాసిగా ఇరవై ఏళ్ళు గడిపి, అమెరికా చేరుకున్న నబొకొఫ్ తనలోని లౌల్యాన్నీ గతస్మృతుల్నీ అధిగమించి, రసానుభూతిద్వారా ప్రేమనూ ఆనందాన్నీ విముక్తియొక్క పరమావధులుగా, గమ్యం చేరుకో గలిగాడనే తెలుస్తున్నది. అదే 'శిరచ్ఛేదం' నవలకూ 'లోలిత'కూ మధ్యగల దృక్పథభేదం. 'లోలిత' తర్వాత వ్రాసిన నవలల్లో కేవలం మేధావిన్యాసం, పాఠకులతో 'చదరంగం' ఆడటమే కనిపిస్తుంది మనకు. సమస్యలు తీర్చుకున్న వ్యక్తికి చదరంగమే మంచి వ్యాపకం కదా!

అ థో జ్ఞా పి క లు

1, Speak, Memory (penguim) Page 175.
2. Speak, Memory. Page 179.
3. Speak, Memory. Page 191.
4. Speak, Memory, Page 193.
5, 6. Speak, Memory, Page 211.
7, 8. Invitation to a Beheding (Gest Book) Page 70.

"Accused of the most terrible of crimes, gnostic turpitude, so rare and so unutterable that it was necessary to use circumlocutions like 'impenetra. bility', 'opacity', 'occlusion', Sentenced for that crime to death by beheading; emprisoned in the fortress in expectation of the unknown but near and inexorable date; standing now in the prison corridor with a sinking heart — still alive, still unimpaired, still Cincinnatic — Cincinnatus felt a fierce longing for freedom..."

9, "...Every thing has duped me—all of this theatrical, pathctic stuff—the promises of a vola - tile maiden, a mother's moist gaze, the knocking on the wall, a neighbour's friendliness, and finally those hills which broke out in a deadly rash. Every thing has duped me ... this is the dead end of this life, and I should not have sought salvation within' its confines..."

(Page 203 .204) "Invitation to Beheading')

గ్రంథ విమర్శలు

ఆంధ్రహరికథా వాఙ్మయము

[రచయిత : శ్రీ వాడరేవు సీతారామాంజనేయభాగవతార్, బి. ఏ. డోర్ నెం. 20–91. స్టీలు ఫ్యాక్టరీవద్ద, బాలాజీనగరు, నెల్లూరు–2. క్రౌన్ సైజు 13+214 పుటలు. వెల : 10 రూపాయలు.]

తెలుగులో వివిధ వాఙ్మయ శాఖలకు పరిశోధన గ్రంథాలు చాలా ఉన్నవి. కాని హరికథా వాఙ్మయాన్ని గురించిన విమర్శ గ్రంథం ఇంతవరకూ వెలువడినట్లు లేదు. ఆ లోపాన్ని తీర్చడానికి స్వయంగా హరిదాసులూ, రచయితలూ అయిన ఈ గ్రంథకర్త దీనిని రచించి ప్రకటించినట్లు తెలుస్తున్నది.

రమా రమీ ఒక శతాబ్దం నుంచీ హరికథా కాలక్షేపాలు జరుగుతున్నవి. భక్త ప్రహ్లాద, అంబరీష, రుక్మిణీకల్యాణాదుల కథల కాలక్షేపాలు జరిగినపుడు పోతన్నగారి భాగవతంలోని పద్యాలను కూడా స్వీకరించడం పరిపాటి. కాని మొత్తం కథారచన ఎవరిదో తెలియదు. హరిదాసులలో కవులైన వారు తమ స్వంత రచనలను వినిపిస్తారు. కవులు కానివారు ఇతరుల రచనలను స్వీకరిస్తారు. హరి కథా పితామహ, పుంభావ సరస్వతి ఆదిభట్ల నారాయణ దాసుగారు ఒక దినంలోనే ఒక హరికథను రచించి, కాలక్షేపం చేశేవారట! ఆయన రచించిన రామాయణ కథాభాగాలనే ఆయన శిష్యులూ, తదితరులూ ఉపయోగించుకునే వారు. బి. బాలాజీ దాసు మున్నగువారు స్వయంగా వ్రాసుకునేవారు. ఇవన్నీ చాలావరకూ ముద్రితమయాయి. చాలా హరికథల ప్రతులు ఇప్పుడు ప్రయత్నించినా లభించడంలేదు. ఈ వాఙ్మయశాఖను గురించి తెలుసుకొనుటకు తగిన అవకాశం యింతవరకూ లేకుండా పోయింది.

సీతారామాంజనేయ భాగవతార్‌గారు సంగీత సాహిత్యాలలో సమర్థులు. బి. ఏ. పట్టాన్ని సంపాదించినవారు. ఉపాధ్యాయులుగా ఉంటూ అనుబంధ వృత్తిగా హరికథలు చెప్తూ ఉంటారు. హరికథలతోను, హరిదాసులతోనూ తమకుగల పరిచయాన్నీ, అనుభవాన్నీ పురస్కరించుకొని ఈ విమర్శగ్రంథం వ్రాశారు. ఇందులో హరి కథలు ఎలా ప్రారంభమయినదీ, రచనా పద్ధతి ఏ రీతిగా ఉండవలసినదీ, వర్ణన లెలా ఉండేదీ తెలుపబడింది. హరికథా యక్షగానాలకు గల సామ్య భేదాలను వివరించారు. తర్వాత ప్రసిద్ధులైన హరిదాసులను గురించీ, వారి రచనలను గురించీ తెలియజేశారు.

రచయిత 20 యక్షగానాలనూ, 101 హరికథలనూ పరిశోధించి యీ గ్రంథాన్ని రచించారు. చాలా విషయాన్ని సేకరించారు. దాన్ని క్రమబద్ధంచేసి ఆ యా శీర్షికలలో ఇచ్చినట్లయితే పాఠకులకు ఎంతో ఉపయోగంగా ఉండేది. వీరు చెప్పిన విషయాలుకొన్ని నిశ్చితాభిప్రాయాన్ని స్పష్టం చెయ్యడం లేదు. ప్రారంభంలోనే హరి కథ అంటే ఏమిటో తెలుపుతూ 'మానవుని పాపము హరింప జేయునట్టి కథ' హరి కథగా భావింపవచ్చునన్నారు. మరొకచోట (పుట 20) పరబ్రహ్మరూపుడైన సచ్చిదానందమూర్తి సద్గుణ గణ సంకీర్తనమే హరికథ అన్నారు. ఇంకా వేర్వేరు వ్యక్తుల అభిప్రాయాలు తెలియజేశారు. వారి వారి అభిప్రాయా లీ రీతిగా ఉన్నాయంటూ వాటిని క్రోడీకరిస్తే బాగుండేది. ఆ యా హరికథలను గురించి చెప్పినపుడు వాటిలోని కీర్తనలను కొన్నిటిని ఉదాహరించారు. ఇది సముచితంగా ఉన్నది.

'హరిదాసు' అనే దానికి మనవారు వాడుకుంటున్న — తమిళాన్ననుసరించి వచ్చిన 'భాగవతార్' పదాన్నిబట్టి హరిదాసురాలికి 'భాగవతారిణి' అనే వికృతమైన విచిత్రనామం ఇందులో కానవస్తుంది. రచయితకు పద్యరచనలో ఆసక్తి ఉన్నదే కాని సామర్థ్యం లేదు. ఈ విషయం 'విన్నపము, స్వీయ చరిత్ర' ల వల్లనే తెలుస్తున్నది.

... ...

'సాహిత్యకాడమి సరిభువన విజయం
ఔడు దానికి మన రెడ్డిగారె !

గీ. కనుక బ్రహ్మయు విష్ణువు కాళిభర్త
కలిసి తమ తమ భార్యల కరుణతోడ
జేని బెజవాడ గోపాల రెడ్డిగార్ని
వేయి కన్నుల గావ నే వేడువాడ.

క. సాహిత్యకాడమికి నే
వాహినివలె సాగిలబడి ప్రార్థన జేతున్
'దేహీ' యన నా గ్రంథము
మోహముతో వెల్వరించె ముచ్చట దీరన్.''

(విన్నపమునుండి)

ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు ఆర్థిక సహాయం చేయడంవల్ల పై రీతిని కృతజ్ఞత వెల్లడింపబడింది.

'' ... ...
అయవారినైనంత హరిదాసు నే నైతి
పట్టి భద్రుండనై పండిటయితి'

'గీ. గోత్రమో భరద్వాజస కుదిరె మాకు
సూత్రమో ఆపస్తంబను చూడ మాది;
శాఖయో యజుశ్శాఖయె సరిగ యమరె
ఉర్వి సీత రామాంజనేయుండ నౌదు.'

(స్వీయ చరిత్రనుండి)

తాము పండితులమని చెప్పకొంటూ, రచయిత ఇలాటి కవిత్వం చెపితే విద్యార్థులకూ, వాఙ్మయాభిమానులకూ సదభిప్రాయాన్ని కలిగించడం సాధ్యం కాదు.

తెలుగులో ఉన్న హరికథా వాఙ్మయాన్నిగురించి తెలుసుకొన దలచినవారికి ఈ పుస్తకం కొంతవరకూ ఉపయోగిస్తుంది.

"ఆంగీరస"

నిజాయితీ ఇతని ఊపిరి

[సాహిత్యావలోకనం : సొదుం రామ్మోహన్, ప్రచురణ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్: విజయవాడ. పేజీలు: 198; వెల : రు. 6–00.]

"సమాజ అధ్యయనానికి మెదడు, సారస్వత రసగ్రహణకు హృదయం ప్రధానమని" తెలియజేసే రాచమల్లు రామచంద్రారెడ్డిని అన్నగా భావించి, ఆయనకే తన పుస్తకాన్ని అంకితం ఇచ్చిన సొదుం రామ్మోహన్, ప్రకాశకుల మాటల్లో "ఆకు అలజడికే గుండె రెప రెప లాడే భావ తీవ్రత, అక్రమాన్ని సహించలేని విమర్శనా తీక్షణతతో పాఠకుడిపై ప్రభంజనం ప్రసరిస్తారు."

శ్రీ రామ్మోహన్ విశాలాంధ్రలో సామాన్యుడి డైరీ, ఆనంద భైరవి—అసావేరి మొదలైన శీర్షికల్ని నిర్వహించే సాహితీవ్యక్తి. ఆ పత్రిక ఉపసంపాదకులు. బడిపంతులు ఉద్యోగం మానేసి, నిరంతరాధ్యయనంతో, అంతర్మథనంతో, మనిషిలోని ఔన్నత్యాన్ని ప్రకటించడానికీ, సమకాలీన ఎడారితనాన్నీ, నిరాశావాదాన్నీ, మనిషిలోని వెనుక చూపునూ విశ్లేషించడానికీ కలాన్ని వాడుకుంటున్న జాతీయవాది.

ఈ పుస్తకం ఇరవై ఎనిమిది వ్యాసాల సంకలనం. అన్ని వ్యాసాలు సాహిత్యం గురించే కాదు. అయితే అన్ని వ్యాసాల్లోనూ సాహిత్య సంబంధమైన స్ఫురణ, చర్చ ఎక్కడో అక్కడ చేయబడకపోలేదు. ఏ వ్యాసంలోను నానుడుతనం లేదు. ఏ విషయం చెప్పడానికి భయంలేదు. తను చెప్పదల్చుకున్న విషయంపై నిర్దుష్టమైన అభిప్రాయాలు రచయితకున్నాయి. ఆ చెప్పేతీరులో సూటితనం, స్పష్టత వున్నాయి. ఇవి ప్లస్ పాయింట్స్.

ఇంక వివరణల్లోకి వస్తే, పుస్తకం పేరు 'సాహిత్యావలోకనం.' అంటే శ్రీ రామ్మోహన్ ఈ గ్రంథంలో, సాహిత్యాన్ని 'దర్శిస్తున్నారు: పరిశీలిస్తున్నారు,' అన్న అర్థ స్ఫురణ కలుగుతుంది పాఠకుడికి. ఇక్కడ ఆ సాహిత్యం దేశీయమైనదా, విదేశీయమైనదా, ప్రాచీనమైనదా, అర్వాచీనమైనదా; విమర్శకుని దృష్టి సంప్రదాయబద్ధమైనదా, ఆధునికమైనదా, ఆ అవలోకనం శిల్పాన్ని గురించా, శైలిని గురించా, వస్తువును గురించా, భాషను గురించా లేక భావాన్ని గురించా మొదలైన అన్నిరకాల ప్రశ్నలూ పాఠకుణ్ణి ఆలోచనా తత్పరుణ్ణి చేస్తాయి. కొంచెం వోపికపట్టి పుస్తకం లోపలి పుటలు తెరవగానే విమర్శకుని 'కామన్ సెన్స్' దృష్టి, సర్వసాహిత్య సృష్టి జనశ్రేయానికీ, కార్మికవర్గ విజయానికీ అనుగుణంగా సాగి తీరవలసిందనే ఆయన దృఢవైఖరీ, బూర్జువా మనస్తత్వంలో వ్రాసే రచయితలు రానున్న మంచికాలానికి ప్రబల శత్రువులన్న ఆ విమర్శకుని గాఢ నమ్మకమూ మనకు అడుగడుగునా కనిపిస్తాయి. మార్క్సిస్ట్ దృక్పథం లేనివాడు, రామాయణ భారతాల్ని మాత్రమే పట్టుకు ప్రాకులాడేవాడు, రష్యన్ సాహిత్యాధ్యయనం చేయనివాడు, తాను చేసే రచనను తన జీవితానికే అన్వయించుకోలేనివాడు, వర్గ దృక్పథం లేనివాడు, వాస్తవికతా పరిపోషణం చేయనివాడు, విప్లవం అంటే ఎరగనివాడు, సామాజిక వ్యత్యాసం గమనించనివాడు, సాహిత్యం కూడా ప్రచారమేనన్న సంగతి తెలియనివాడు, రాడార్ దృష్టి లేనివాడు, రాజకీయాలకుదూరంగా పారిపోయేవాడు, అహంకారంతో విర్రవీగేవాడు, చరిత్ర తెలియనివాడు, బ్రతుకు భయంలో అధికారానికి దాస్యం చేసేవాడు, రచయిత కాలేడన్నది, అథవా అయినా అతడు సంఘ విద్రోహి అన్నది రామ్మోహన్‌గారు కుండబద్దలు కొట్టినట్టు చెబుతారు.

అయితే వచ్చిన ఇబ్బందల్లా ఎక్కడ అంటే, అనేకానేక సందర్భాల్లో తనకొక ప్రత్యర్థిని ఊహించుకుని, ఆ ప్రత్యర్థికి కొన్ని అభిప్రాయాలను అంటగట్టి, ఆ తర్వాత ఆ ఊహాప్రత్యర్థి కల్పితాభిప్రాయాలు ఏవిధంగా తర్కబద్ధం కావో బుజువు పర్చడానికి నానా యాతనా పడతారు శ్రీ రామ్మోహన్. ఉదాహరణకు "క్షమిస్తే రెండు మాటలు" అన్న మొదటి వ్యాసంలో, "అయ్యా నువ్వు ఎవరికోసం రాస్తున్నావు ?" అని ఏ రచయితనైనా నిలబెట్టి ప్రశ్నిస్తే, తప్పకుండా వెంటనే "ప్రజల కోసం" అని జవాబిస్తాడు. కానీ నువ్వు మళ్ళీ "ఏ ప్రజలకోసం" అని ప్రశ్నించావో? నిన్నో మూర్ఖుని కింద జమకట్టి "ఏ ప్రజలేమిటి? వెర్రి ప్రశ్న. ప్రజలందరికి. ప్రజల్లో మళ్ళీ తేడాలుంటాయేమిటి? అందరిలో వుండేది ఆ రక్తమాంసాలేనాయె" అంటాడు అన్నది మొట్ట మొదటి పేరాగ్రాఫ్.


ఇందులో ఏ రచయిత అయినా ప్రజలకోసమే రాస్తున్నానని జవాబిస్తాడన్నదిమొదటి 'ప్రెమిస్'. రెండవది ప్రతిరచయితా తాను ప్రజలందరికోసమూ రాస్తున్నట్లు భావిస్తాడన్నది రెండవ 'ప్రెమిస్.' ఆ ప్రజల్లో తేడాలు లేనట్లు అతగాడనుకుంటాడన్నది మూడో 'ప్రెమిస్'. అతను ప్రజల్లోవున్న రక్తమాంసాలనే చూస్తాడుగాని మేధనూ, హృదయాన్నీ పరిగణనలోకి తీసుకోడన్నది నాలుగో ప్రెమిస్. ఇందులో ఒక ప్రెమిస్‌కూ, మరో ప్రెమిస్‌కూ సంబంధంలేదు. ప్రెమిస్‌ల మధ్య కనెక్షన్ లేకపోవడంతో అంగీకృత నిర్ణయం సాధ్యపడదు. ఇంకో విషయం ఇక్కడ గమనార్హం. ఒక ఊహా రచయితను, రచయితల కందరకూ ప్రతినిధిగా తీసుకొని అతనికి కొన్ని ప్రశ్నలువేసి, జవాబులు ఫలానా విధంగా ఉండగలవని ఊహించి, తన సిద్ధాంతానికి అనుగుణంగా ఒకానొక ఉపపత్తిని తయారుచేసుకునే లోపునే, శ్రీ రామ్మోహన్‌కు, తన 'జనరలైజేషన్'మీద అపనమ్మకం కలిగి, రెండో పేరాగ్రాఫులో ఇట్లా వ్రాస్తారు :

''రచయితలందర్నీ ఈ కోవలోకే జమకట్టలేంకానీ మొత్తం మీద మెజారిటీ రచయితలు ఇలాంటివాళ్ళే ఉన్నారు ఈ నాడు.'' అంటే రచయితలందరూ ఈ విమర్శకుడు ఆరోపించినట్లుగా భావించరన్నది ఆయనే వొప్పుకుంటున్నాడు. మళ్ళీ గుడ్డిగా మరో రిమార్కు. కానీ మొత్తం మీద మెజారిటీ రచయితలు ఇలాంటి వాళ్ళే వున్నారు ఈనాడు. మెజారిటీ, మైనారిటీలను ఏ ప్రాతిపదికపై ఈయన నిర్ణయం చేసినట్లు ? సాహిత్య విమర్శనంలో 'సబ్‌జెక్టివ్'' గానే ఆలోచించి ఆవేశంతో, కలం ఎట్లా నడిపిస్తే అట్లా నడిపిస్తే, అది సత్య దర్శనం చేసినట్లా ? రామ్మోహన్ గారికి మరో విచిత్రమైన అభిప్రాయంకూడా వుంది. ఎవరిని గురించి రాయాలనుకొన్నా, వారినిగురించి ''రచయిత ప్రాక్టికల్‌గా థీరిటికల్‌గా క్షుణ్ణంగా తెలుసుకోవాలి!'—అంటారాయన. థియరిటికల్ వరకూ బాగానే వుంది. ప్రాక్టికల్‌గా తెలుసుకోడం దగ్గరే వస్తుంది చిక్కు. సాహిత్య సృష్టిలో పాత్ర చిత్రణంలో ఆయా భావాల మనోభావాలతో తాదాత్మ్యం వుండాలేకాని, రచయితకు ఆ పాత్రలతో నిజ జీవితంలో సమైకం అనేక సందర్భాల్లోసాధ్యం కాదు. వ్యభిచార గృహాలు దర్శించక పోతే వ్యభిచారం గురించి వ్రాయలేమనడం, హంతకులతో దోస్తీ కట్టకపోతే హత్యోదంతాల ఆంతర్యం చెప్పలేమనడం, దగుల్బాజీలతో, సంఘవ్యతిరేక శక్తులతో చెలిమి చేయకపోతే వారి ఆంతరిక జీవన చిత్రణం అసాధ్యమనడం, చిలిపిగా వుంది. చిన్నపిల్లలు తెలిసీ తెలియనివారు మేళమాడినట్లుంది. మహా రచయిత అయినవాడు రాముణ్ణీ సృష్టించగలడు, రావణుణ్ణీ సృష్టించగలడు, కానీ, అందుకు రామభక్తుడో రావణ మిత్రుడో అయివుండనక్కరలేదు. పైగా ''పై మేడలో ఈజీ చైర్‌లో కూచుని పూరిపాకల్లోని వ్యక్తుల జీవితాలను ఊహించి రచనలు చేస్తే ఒక విధంగా నేరమే అవుతుంది'' అని వ్రాయడం బాధ్యతారహితంగా రాయడమే ! బాలగంగాధర తిలక్, కొనకళ్ళ వెంకటరత్నం, మంజుశ్రీ సమాజ పరిశీలనంచేసి, ఆ అవలోకనంలో తమకు నచ్చిన వారినీ, తాము మెచ్చిన భావాలనూ, ఊహించుకున్న సంఘటనలనూ కళోన్మీలితం చేసినవారేకానీ, తమకు తామై ఆ పాత్రల మూల స్వరూపాలతో (ఒక వేళ వారు ఉంటే, గింటే) చెట్టపట్టాలేసుకుని, నిట్ట నిలువున ఊబిలో దిగబడిపోయినవారు కారే! దాశరథి రంగాచార్య అట్లా చెయ్యడు. చాసో కూడా అలా చేసినట్లు లేదు. దీనికితోడు మరో విషయాన్ని కూడా రామ్మోహన్ గుర్తుంచుకోవలసింది. ఈ నాటి సమాజం వర్గ సంభరితమే అయినా, వర్గ సంక్లిష్టం కూడానూ. మనిషికీ మనిషికీ మధ్యదూరం పెరుగుతూనూవుంది, అంతరం తరుగుతూనూ వుంది. అందుచేతనే చూసేచూపు వుంటే, గ్రహించే మెదడు వుంటే, సద్‌హృదయమూ, సహృదయమూ వుంటే, ఏ వర్గం రచయిత అయినా, ఏ వర్గాన్ని గురించైనా నిస్సంకోచంగా వ్రాయవచ్చు. కాకపోతే కౌంట్‌లియో టాల్‌స్టాయ్‌కూ, శ్రీకృష్ణ దేవరాయలకూ అంతపేరు వచ్చి వుండేదే కాదు. ''సాహిత్యంలోవర్గ దృక్పథం' అన్న వ్యాసంలో 'రచయిత లన్నవారు అటు ఉన్నవాళ్ళ పక్షపాతులైనా కావాలి, లేక లేనివాళ్ళ పక్షపాతులైనా కావాలి !'' అంటూ నిర్ధారిస్తారీ రచయిత. ఈ రకమైనదృష్టితో కాకుండా, సౌందర్య పక్షపాతం, మంచితనం. పక్షపాతం, పీడనకు వ్యతిరేకత, దుష్టత్వమంటే క్రోధం ఇలాంటి గుణాలతో రచయితలు వుండి, మంచితనం కలిమిగలవాడిలో వున్నా, లేమి గలవాడిలోవున్నా దాన్ని హర్షిస్తూ, చీకటి తప్పులు చేసేవారు, ఇతరుల స్వేదం దోచుకునేవారు ఎవరైనా వారిని ఖండిస్తూ రచనలు చేయడం వర్గ వివక్షా రహితంగా సాధ్యం కాదా? రాక్ ఫెల్లర్లు, తాతాలువున్న వారైనంత మాత్రానచెడ్డవారనీ,కర్షకకార్మికులందరూగుణవంతులనీభావించడం తర్కబద్ధమౌతుందా? అయితే ఈ రకం గుణాలు వ్యష్టిగతమైనవనీ, వీటికి సాంఘిక వ్యవస్థకూ అంతగా ముడిబెట్ట కూడదనీ, 'చరిత్రలోని ఒక దశ'లో మానవులందరూ స్వార్థ, ద్వేషాది దుర్గుణ రహితులనీ అంటారు వీరు. ఇది నమ్మని రచయితలుండడం ''మనం చేసుకున్న దౌర్భాగ్యం'' అంటూ ప్రతికకులపై విరుచుకుపడడంకన్నా, చరిత్రలోని ఏ దశలో ప్రాత రాతియుగంలోనా, క్రొత్త రాతియుగంలోనా, కంచుకాలంలోనా, వేదాల రోజుల్లోనా, ఏ వోల్గా పరిసరాల, ఏ నైలునదీ ప్రాంతాల, ఏ గంగాసైకతాల్లో అది వివరిస్తే సరిపోయేదికదా! విమర్శకు ఆధారం 'ఫాక్ట్స్' కావాలి కాని, ఆవేశ కావేషాలు కాదు. 'సాహిత్యంలో సామాజిక దృక్పథం' అన్న వ్యాసం రవంత మెరుగు. వాస్తవిక దృక్పథంవేరు, సామాజిక దృక్పథంవేరు అన్న భావనతో కూడా విప్రతిపత్తి లేదు. 'సాహిత్యంలో వాస్తవికత'ను గురించి వ్రాస్తూ, ''వాస్తవికత పేరిట కళాస్థాయిని త్రోసి రాజనడం కూడా తగదు'' అని చెప్పడం బావుంది. ఏ రాగం పాడినా, పాడడంలో ఏ టెక్నిక్ ఉపయోగించినా, దాని ప్రయోజనం శ్రోతల్ని ముగ్ధుల్ని చేయడం అని చెప్పడం కళాప్రయోజనాన్ని అంగీకరించడం. అదేవిధంగా వాస్తవిక రచన చదివిం తర్వాత, దాని ప్రయోజనం అవాంఛనీయమైన వాస్తవాలను జీవితరంగంనుండి పరిహరించడం అని ముదలకించడం కూడా ఆమోదయోగ్యంగానే వుంది. అయితే అవాంఛనీయమైన వాస్తవాలు నైతికదృష్ట్యా, రాజకీయంగా, ఆర్థిక రంగంలో, సామాజికంగా భిన్న భిన్న పరిస్థితుల్లో భిన్నం భిన్నంగా వుంటుంటాయి. ఈ మార్క్సిస్టు రచయితకు పిడుగుకూ, బియ్యానికీ ఒకటే మంత్రమన్నదే సిద్ధాంతం. సాహిత్యంలో విప్ల

వానికి ఆనుషంగికమే నంటాడీయన, "సాహిత్యం—విప్లవం" అన్న మరో వ్యాసంలో, అది యధార్థ విషయమే కదా. ఒక్కొక్కచోట యధార్థాన్ని శక్తిమంతంగా ప్రకటించే ఈ రచయిత, పత్రికల వారిపై విరుచుకుపడుతూ." మంచికథలు అచ్చుకావడం కానీ, మంచి సాహిత్యంపట్ల పాఠకులకు అభిరుచి కలగడంకానీ పత్రికలకు నిజంగా పెద్ద నష్టం అనడం అన్యాయమేకాదు, అబద్ధం కూడాను. ఈనాడు తెలుగుదేశంలో సామాజికస్పృహవున్న రచయిత లెందరో తమ కథలనూ, నవలలనూ తొలుతొల్తగా పత్రికల ద్వారానే ధారావాహికంగా ప్రచురించుకొన్న సంగతిని రామ్మోహన్ గారు కూడా కాదనలేరు. సమకాలీన తెనుగునాట ఏ కొద్దిగా చైతన్యంవున్నా, అందుకు దోహదక్రియను జరిపినవీ, ప్రాచుర్యాన్ని కల్గించినవీ మన పత్రికలే!

'సొంత ఆస్తి—దాని కథా కమామిషు' అన్న వ్యాసంలో వర్గ పోరాటాన్నీ, ఆస్తి కలవారి మనస్తత్వాన్ని వ్యాఖ్యానిస్తూ, ఆ తత్వం భారతంలో, రోమన్ కాథలిక్ మతగురువుల్లో ఎల్లా ప్రకటిత మైందీ చెప్పి, కొడవటిగంటి, సాదుం జయరామ్, ముప్పాళ, సుంకర—వాసిరెడ్డి గారలలో ఎలా సాహితీరూపం దాల్చిందీ వివరించారు. ఆయనకు బావుందనిపించిన విషయాన్ని ప్రశంసాత్మకంగా ప్రకటించారు. ఆ ప్రశంస విమర్శనాత్మకంగాదు. "కథల్లో సామాజిక వ్యత్యాసం" గురించి చెబుతూ జంపెన పెద్దిరాజు కథ "ఫౌల్...ఫౌల్"నూ, రావిశాస్త్రి "గొల్లెముక్క" కథనూ, చాసో "కుంకుడాకు" కథనూ తులనాత్మక పరిశీలనం చేశారు. ఈ సంకలనంలో ఇదో మంచివ్యాసం. వీటిమధ్య కటువుగా, కరకుగా వున్న వ్యాసాలూ లేకపోలేదు. "మా నిర్ణయాలు" అటువంటి కటువైన వ్యాసాల్లో ఒకటి. "సాహితీ రంగంలో తటస్థ రచయితలు అంటూ ఎవ్వరూ లేరు. వర్గాలకు అతీతంగా రాసే రచయితల్ని మేము నమ్మం. దుష్టబుద్ధితో వర్గాతీత సిద్ధాంతాలు వల్లించే రచయితలు మాకు పరోక్ష ప్రథమ శత్రువులు." రామ్మోహన్ గారు ఒకానొక రాజకీయ సిద్ధాంతానికి కట్టుబడి కొందరిని శత్రువుల్ని చేసుకున్నా, "నిజాయితీ ఊపిరి" గా బ్రతికే ఆయననుమాత్రం నిష్పక్షపాత బుద్ధిగల ఏ రచయితా శత్రువుగా భావించడానికి వీల్లేదు. ఆయన నమ్మకాలు, సిద్ధాంతాలు ఆయనవి. ఆయన మరి కొంత ఎదిగితే, మరికొంత విశాలభావ మనస్కుడైతే, ప్రపంచ పురోగమనాన్ని మరికొన్ని కోణాలనుండి కూడా పరిశీలనం చేస్తే, అప్పుడు ఈ వాక్యాల్ని ఆయనంతట ఆయనే ఉపసంహరించుకుంటాడు. "కుటుంబరావుగారు ఒప్పుకోని నిజం"లో ఒక వ్యంగాత్మక సూచన చేస్తాడు రచయిత. కొడవటిగంటి మంచి కథకుడని, ప్రతి పద ప్రాణ రహస్య మెరిగిన భాషాకోవిదుడని సన్నివేశ కల్పనాధురీణుడని, పాత్రౌచితీ చతురుడని, ప్రశంసిస్తాడు. "ఆయన పుట్టి ఉండకపోతే, మంచి కథలకూ కరువుండేది." చాలా చక్కని మాట! మిగిలిన విషయాలు వ్యాసాలు ఎక్కువ భాగం సాహిత్యానికి రాజకీయానికి గల సంబంధాన్నే వర్ణిస్తున్నా, నయాపాల్ పుస్తకం "యాన్ ఏరియా ఆఫ్ డార్క్‌నెస్" పై విమర్శా, చార్లి చాప్లిన్ ఆత్మకథ అన్న రెండు వ్యాసాలూ, అహం గురించీ, బ్రతుకు భయం గురించి వ్యాసాలూ ఈ గ్రంథంలో చేర్చడం అనవసరం. నయాపాల్ పుస్తకం పాక్షిక దృక్పథంతో వ్రాసింది. చెత్తా—చెదారం పోగుచేసే మునిసిపాలిటీ వారి బండివంటిది. చార్లి చాప్లిన్ ఆత్మకథ ఆసక్తికరమే అయినా, సాహితీగ్రంథంకాదు. ఇటువంటి దృక్పథాన్ని ప్రదర్శించినందుకే రామ్మోహన్ పుస్తకం ఉడికీ వుడకని అన్నంలా తయారైంది. ముద్రణం ముచ్చటగా వున్నా, పంటికింది రాళ్ళు పదే పదే బాధిస్తాయ్!

శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి



Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.